
# విజయపథం

మూల శాసనాల నుంచి మౌలిక విజయసూత్రాలు




సంకలనం-వ్యాఖ్యానం
బి.ఎస్.శర్మ

సభక్తికంగా సమర్పిస్తున్న వారు :
శాంతా వసంతా ట్రస్టు
హైదరాబాద్

# విజయపథం



# Vijaya Patham

**B.S. Sarma**

# విజయపథం

మూల శాసనాల నుంచి మౌలిక విజయసూత్రాలు

సంస్కృత సాహిత్యం అందించిన
నాయకత్వ లక్షణాలు, పాలనా ధర్మాలు,
విజయానికి మార్గాలు.

సంకలనం - వ్యాఖ్యానం
బి.యస్. శర్మ

2020

# VIJAYA PATHAM

***(Principles of Success from Principal Scriptures)***


Compilation & Commentary

**Bhamidipalli Subrahmanya Sarma**
**(B.S. Sarma)**



| | | |
|---|---|---|
| Price | : | **Rs. 150/-** |
| First Edition | : | August 2020 |
| Designing | | Ramu.P |
| Cover page | : | BNIM |
| D T P | : | Y. Lakshmi, T. Praveena Lakshman |
| Address for communication | **:** | **B.S. Sarma**<br>12-11-448, Warasiguda,<br>Secunderabad-500061<br>bssarma56@gmail.com<br>Mobile : 92461 01884 |
| Published by | **:** | **Shanta Vasantha Trust**<br>Flat No:16 & 17, Green Walk Ways<br>Budvel, Rajendra Nagar, Hyderabad<br>email: svcthyd@gmail.com<br>www.shanthavasanthatrust.org |
| Printed at | **:** | **Samhita graphics, Hyderabad** |
| Copies Available @ | : | **Sahitya Niketan**<br>3-4-852, Barkatpura, Hyderabad-500027.<br>Ph : 040-27563236.<br>Navodaya Book House, Hyderabad. |



**కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్ ।**
**ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్ ॥**



**వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥**

# అంకితం

భారతీయ సంస్కృతికీ, సాహిత్యానికి మూలకందాలైన
శ్రీమద్రామాయణ, మహాభారత ఇతిహాసాలను తమ కృపతో మానవాళికి
అందించిన ఆదికవి **శ్రీ వాల్మీకి మహర్షికీ, శ్రీవ్యాసభగవానునికీ**
ఈ **'విజయపథం'** పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

**-భ.సు.శర్మ.**

# నా మాట

పాఠకులకు నమస్కారం!

సంస్కృత భాష ఒక సుధాస్రవంతి, ఒక అమృత ప్రవాహం! ఆరోగ్యశాస్త్రం నుంచి అంతరిక్ష విజ్ఞానం దాకా, మనిషి మానవత్వంతో జీవిస్తూ దివ్యత్వం సాధించే మార్గాలదాకా–సంస్కృత వాఙ్మయంలో లభిస్తాయి. వేదమంత్రాలను అందుకోలేని సామాన్య ప్రజల కోసం నిర్మించిన పురాణ ఇతిహాసాలు, వివిధ సాహిత్య ప్రక్రియల ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సంస్కృత భాషలో ఋషులు మనకు అందించారు.

ఆదికవి వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణ మహాకావ్యాన్నీ, వ్యాస ప్రణీతమైన 'పంచమవేదం' మహాభారతాన్ని, ఆచార్య చాణక్యుడు అందించిన అర్థశాస్త్రాన్నీ తేటతేట తెలుగులోకి అనువదించి అందించినవారు ఆధునిక మహర్షి 'మహామహోపాధ్యాయ' ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు (1927–2015).

నాబోటి లక్షలాది పాఠకులకు ఆ మహద్గ్రంథాలను అర్థం చేసుకొనే అవకాశం వారు కల్పించారు. ఈ పుస్తక సంకలనానికి వారే స్ఫూర్తి! వారు వ్రాసిన 'యాజ్ఞవల్క్య స్మృతి' లో వారి ప్రస్తావన (ముందుమాట) ఈ పుస్తక ప్రయోజనాన్ని తెలిపే నాందీ వాక్యం. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు నాకు గురుతుల్యులు, నిత్య స్మరణీయులు.

కవిత్రయం అనుగ్రహించిన శ్రీమదాంధ్ర మహాభారతంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి విశ్లేషణాత్మక దివ్యప్రసంగాలు నాకు మూలగ్రంథ పఠనానికి ప్రేరణ అయ్యాయి. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలి.

రామాయణంలో శ్రీరాముడు తన తమ్ముడైన భరతునికి చెప్పిన పాలనాధర్మాలు (అయోధ్యా కాండలో), మహాభారతంలో ధర్మరాజుకి నారదమహర్షి, భీష్ముడు బోధించిన రాజధర్మాలు (సభా, శాంతి పర్వాలలో), నాయకత్వ లక్షణాలు, నాయకుల విధి నిషేధాలు చదువుతూంటే ఇవన్నీ అన్ని యుగాలకు వర్తించేవి, అన్ని వర్గాలవారు ఆచరించదగినవి అని స్పష్టమవుతుంది.

అటువంటి అమృతబిందువుల్ని ఒకటిగా చేర్చి, ఇప్పటి కాలానికి అన్వయిస్తూ, అనుసంధానం చేసే ప్రయత్నమే ఈ 'విజయపథం'. ఈ పుస్తకాన్ని ఆద్యంతం పరిశీలించిన సంస్కృత భారతీ తెలంగాణా అధ్యక్షులు, ఋగ్వేద పండితులు, బ్రహ్మశ్రీ నరేంద్ర కాప్రేగారు సుపాలనకి వలసిన ఎంతో విలువైన సమాచారాన్ని జోడించి తన మనసులో మాట(హృద్గమం)ను గీర్వాణ భాషలో అందించారు. వారికి నా నమస్సులు.

పుస్తకం తయారవుతున్నప్పుడు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారికి తెలియజేసాను. వారు నాపై ఉన్న వాత్సల్యంతో నన్ను ప్రోత్సహించారు. ముందుమాటలో ఆశీర్వాక్యాలు

ప్రసాదించారు. వారికి నా నమోవాక్కులు.

తన పూర్వాశ్రమంలో నాకు మిత్రులైన శ్రీ చిద్రూపానంద స్వామి (చిన్మయామిషన్, నోయిడా) ఈ పుస్తకాన్ని చదివి, తన అభిప్రాయాన్ని పంపించారు. వారికి కూడా నా కృతజ్ఞతాభివందనాలు!

ఈ నా ప్రయత్నాన్ని హర్షించిన డా॥ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి గారు తమ శాంతా వసంతా ట్రస్టు ద్వారా ఈ విజయపథం పుస్తకాన్ని ప్రచురించారు.

ఆ వదాన్యులకు నా సాదరాభివందనాలు! లోగడ నాచే వ్రాయబడిన స్ఫూర్తిపథం పుస్తకాన్ని కూడ వారే ప్రచురించారు. సంస్కృతమాత వైభవాన్ని తెలియజేయటం, ఋషిఋణం తీర్చుకోవడం ఈ ప్రయత్నం వెనుకవున్న ప్రధాన ఉద్దేశ్యం.


పుస్తకం చదివే ముందు.. మరో మాట

సంస్కృత వాఙ్మయంలో ప్రధానంగా రామాయణ, భారత ఇతిహాసాలను ఆధారంగా చేసుకొని వ్రాసిన వ్యాసాలు ఇవన్నీ... త్రేతాయుగం, ద్వాపర యుగంలో చెప్పబడిన అంశాలు! రాజు ఎలా ప్రవర్తించాలో చెప్పిన విషయాలు. ఆదికవి వాల్మీకి, విదురుడు, లోక సంచారి లోక హితైషి నారద మహర్షి, సకల సుగుణాభిరాముడైన శ్రీరామచంద్రుడు, మహాభారత కర్త వేదవ్యాసుడు, అర్థశాస్త్ర ప్రవర్తకుడు ఆచార్య చాణక్యుడు, కవికుల గురువు మహా కాళిదాసు మొదలైన వారు చేసిన ఉపదేశాలు ఇందులో ఇచ్చాను. రాజులున్న ఆ కాలంలోని పాలనా ధర్మాలు ఈ కలియుగానికి వర్తిస్తాయా? అన్న ప్రశ్న రావటం సహజం! పైగా మనం ప్రజాస్వామ్య కాలంలో ఉన్నాం! వర్తమానంలో వీటిని ఎలా అన్వయించుకోవాలి?

'రాజు' అంటే ఓ పాలకుడు.. ఓ కంపెనీకి యజమాని.. ఒక పార్టీ నాయకుడు, ఓ కుటుంబానికి పెద్ద.. స్కూలుకి ప్రధాన అధ్యాపకుడు.. ఇలా ఒక బృందాన్నే కానక్కర్లేదు, కనీసం ఒక వ్యక్తిని ప్రభావితం చేయగలవారంతా రాజులే. వారందరికీ ఈ పాలనాసూత్రాలు వర్తిస్తాయి. సంస్కృత భాషలో ఉన్న శ్లోకాలు, వాటి భావాలు, అవి ఏ గ్రంథాల నుంచి గ్రహించబడ్డాయన్న వివరాలు ఇవ్వడం వల్ల ఆయా గ్రంథాలను ఆసక్తి గలవారు మరింత నిశితంగా, విస్తృతంగా పరిశీలించటానికి అనువుగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు కూడా ఇచ్చాను.

పుస్తకం చదువుతూంటే మరికొన్ని ఉదాహరణలు మీకు స్ఫురించవచ్చు. ఈ పుస్తకం గురించి పాఠకులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు, విమర్శలను తెలియజేయగలరని విన్నవించుకుంటున్నాను.

**–భమిడిపల్లి సుబ్రహ్మణ్య శర్మ**
సంకలనకర్త
bssarma56@gmail.com



## ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు
## (1927 - 2015)

# "భారతీయత్వాన్ని సార్థకం చేసుకోవాలి"

**"ప్రా**చీన భారతీయులకు పరిపాలనావిధానం తెలియనే తెలియదు. ఇదంతా విదేశీయులు ఇక్కడికి వచ్చిన తరువాత వాళ్ల దగ్గర నేర్చుకొన్నది మాత్రమే". "ప్రాచీనులకు సామాజిక స్పృహ అనేది లేదు; ఇది ఆధునికులలోనే కనబడుతుంది" ఇలాంటి మాటలు చాల మంది నుంచి మనం రోజూ వింటూంటాం.

ఇలా అనేవారు పామరులు కారు; ఆధునిక విద్యలలో గొప్ప ప్రావీణ్యం సంపాదించి ఉన్నతపదవులను అలంకరిస్తూన్న మేధావంతులే వీరిలో చాలామంది. ఇలాంటివాళ్లు కూడా ఈ అభిప్రాయాలతో ఉన్నారంటే అది వాళ్ల దోషం కాదు.

"షేర్‌షాహ్ అనే పరిపాలకుడు భూముల కొలతలు, భూమిపై పన్నులు ఒక క్రమబద్ధమైన పద్ధతిలో వసూలుచేయడం వంటి విధానాలు ప్రవేశపెట్టాడు; ఫలానా వైస్రాయి పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టాడు", ఇత్యాది రీతులలో ఎలిమెంటరీ స్కూలు నుంచి మొదలు పెట్టి విశ్వవిద్యాలయాలవరకు నూరిపోస్తూ, అవకాశం వచ్చినప్పుడల్లా ప్రాచీనభారతదేశానికి సంబంధించిన ప్రతీ విషయాన్నీ అవహేళనచేస్తూ నడిపిస్తూన్న విద్యావిధానంలో విద్యలు నేర్చినవాళ్లకు, ప్రాచీనవాఙ్మయంలో ఏముందో స్థూలంగానైనా తెలుసుకొనడానికి అవకాశం లభించనివాళ్లకు, ఇలాంటి అభిప్రాయాలు ఉన్నాయంటే ఏ మాత్రం ఆశ్చర్య పడవలసిన పని లేదు.

అయితే ప్రయత్నపూర్వకంగా కల్పించిన ఇలాంటి సత్యాపలాపక (disinformation) వాతావరణంలోనే పెరిగినా, పెరుగుతూన్నా కూడ – "కొన్ని వేల సంవత్సరాలనుంచి అవిచ్ఛిన్న మైన అత్యున్నతమైన నాగరికతకు నిలయంగా ఉన్న ఈ సువిశాల భారతదేశంలోని సమాజం విదేశీయులెవరో వచ్చి నేర్పే వరకు ఒక పద్ధతీ, నీతీ, నియమమూ అనేది లేకుండా ఇన్నాళ్లూ గాలిలో పెరుగుతూ వచ్చింది; ఇంత కాలానికి ఈ మహాపురుషులు వచ్చి నాగరికత అంటే ఏమిటో వీళ్లకు బోధించారు–అనడం సమంజసం కాదేమో; వీళ్లకు కూడ కొన్ని పరిపాలనా పద్ధతులు మొదలైనవి తెలిసే ఉంటాయి; అవేమిటో పరిశీలిద్దాం" అనుకొనేవారు కూడా నేటి మేధావులలో కొందరుండడం ముదావహం.

ఇలాంటివారి సంఖ్య అత్యల్పంగానే కనబడుతుంది. అందుచేత చాలామంది భారతీయులలో ఉన్న ఈ భ్రాంతిని తొలగించడానికి, వివిధరంగాలలో భారతదేశం గర్వించదగిన వైశిష్ట్యాలను వెలికి తీయవలసిన బాధ్యత వీటితో పరిచయం ఉన్న ప్రతీ ఒక్కరిమీదా ఉంది. కావాలని తెచ్చుకొని కప్పుకొన్న అజ్ఞానపు పొరలను తొలగించుకొని భారతదేశనాగరికతా సంస్కృతుల యథార్థస్వరూపాన్ని తెలుసుకొని తమ భారతీయత్వాన్ని సార్థకం చేసికొనవలసిన అవసరం ప్రతీ భారతీయునికి ఉంది.

ఒక మహామేధావి ఎన్నో సంవత్సరాలు శ్రమపడి ప్రాణరక్షకాలైన కొన్ని ఔషధాలు తయారు చేసి జాగ్రత్త చేసికొన్నాడు. వాటిని ఉపయోగించి ఎవరినో ప్రాణాపాయస్థితినుంచి కాపాడ వలసిన అవసరం ఒకనాడు ఏర్పడింది. ఆ ఔషధాల కోసం వెదికితే కనబడలేదు. ఇంతలో వాటినేనాడో అపహరించిన ఒక వ్యక్తి వాటిని మొదట కనుగొన్నవాడే గుర్తుపట్టజాలని విధంగా రూపం మార్చి క్రొత్త గొట్టాలలో నింపి తీసికొనివచ్చి, “నువ్వు ఏమీ తెలియని మందబుద్ధివి, ఇదిగో ఈ మందు వాడుకో” అని అంటూ వానికి అందిస్తాడు.

లౌకికజీవనానికి సంబంధించిన ఎన్నో విషయాలను, వైజ్ఞానిక – తాత్త్విక విషయాలనూ బోధించే ప్రాచీనభారతవాఙ్మయానికీ, ఇవే విషయాలకు సంబంధించిన అన్యదేశీయ వాఙ్మయాలకీ ఉన్న కాలభేదాన్ని బట్టి చూస్తే ఏ మాత్రం విజ్ఞత ఉన్నవానికైనా పై కథ మనస్సులో స్ఫురించకుండా ఉండదు.

కౌటిల్యాదుల అర్థశాస్త్రాదులు, అపారమైన ధర్మశాస్త్రవాఙ్మయం, ఈ విషయాలను పొందు పరచుకొన్న ఇతిహాసపురాణాలు పరిశీలిస్తే భారతీయుల పరిపాలనా వ్యవహారజ్ఞానాదుల విషయంలోను, వీరికున్న సామాజికస్పృహ వంటి ఇతర విషయాలలోను కొందరు ఆధునికుల అభిప్రాయాలు ఎంత సత్యదూరమైనవో స్పష్టం అవుతుంది.

మహా మహోపాధ్యాయ

**ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు**

(యాజ్ఞవల్క్య స్మృతిలో వారు వ్రాసిన ప్రస్తావన భాగం నుంచి)



బ్రహ్మశ్రీః నరేంద్ర కాప్రే
అధ్యక్షః, శ్రౌత-సంవర్ధినీ-సభా
సంస్కృతభారతీ, తెలంగాణ

# హృద్గతమ్

ఆర్యాః ! అద్యాహం తదా మహత్సమాధానం మనశ్శాంతిం చ అన్వభవం, యదా శ్రీమాన్ భమిడిపల్లి సుబ్రహ్మణ్య శర్మా స్వసంకలితం 'విజయపథమ్' ఇతి పుస్తకం విలిఖ్య, దర్శయిత్వా అభిప్రాయమ్ లిఖతు ఇత్యసూచయత్ । యతోహి భారతీయవాఙ్మయార్ణవే యాన్యసంఖ్యాతాని జ్ఞానరత్నాని నిగూఢాని విద్యంతే । తేభ్యః కేషాఞ్చన రత్నానాం అపి యది ఏవం నవ్యప్రాచ్యవిజ్ఞాః నూతనయా శైల్యా ప్రకాశనం కుర్వంతి । తర్హి తేన అజ్ఞానానాం దిఙ్మూఢానాం భ్రాంతినివారణం పథప్రదర్శనం భవిష్యజ్జీవనే కార్యాచరణే నిష్ప్రకంప-ప్రవృత్తిం చ నిశ్చయేన జనయంతి । అతః తాదృశోస్మిన్‌సందర్భే మహోదయస్యాస్య కార్యస్య వైశిష్ట్యపూర్ణం మహత్వం సమ్యగవగమ్య ప్రవృత్తో-స్మి లేఖనప్రపంచే ।

**శ్లో ॥ స్వామ్యమాత్యం చ రాష్ట్రం చ దుర్గం కోశోబలమ్ సుహృత్ ।**
**సప్తాంగముచ్యతే రాజ్యం "సత్త్వబుద్ధి వ్యపాశ్రయమ్" ॥**

శ్లోకస్య అస్య పూర్వార్ధే నిగదితానాం సమ్యక్ సంస్కృతానాం సప్తానామ్ ఉత్తమాం గానాం సమవాయః సమైక్యభావః ఏవ శ్రేష్ఠం, బలిష్ఠం, సుసంరక్షితం, దుర్భిక్షం, రాజ్యం (లోకజీవనమ్) భవతి । తత్రైవ సర్వేషాం జీవనమ్ దుర్భిక్షమరణ భయవర్జితమ్ సుస్థిరమ్, సుదీర్ఘమ్ చ భవిష్యతి ।

కించ, ఏవం రామరాజ్యమివ సమృద్ధమ్ శాంతమ్ సర్వజనాకాంక్షితం లోకపాలనం కదా సంభవతి?

అస్యైవ శ్లోకస్య అంతిమే చతుర్థే చరణే యత్ ఉపదిష్టమ్ "సత్త్వబుద్ధివ్యపాశ్రయమ్" తదనుసారం యదా శాస్త్రేషు ప్రామాణ్యబుద్ధిః, ఆస్తిక్యభావః, పరోపకారప్రవృత్తిః, సత్యనిష్ఠా ఇత్యాది అనేకైః సద్గుణైః యత్ర నేతృణాం సుస్థిరాబుద్ధిః భవతి, తయా సుబుద్ధ్యా చ రాజ్యం పాల్యతే, వస్తుతః తత్ రాజ్యం ఏవ సుపాలితమ్ సత్ రామరాజ్యమితి లోకైః అనుభూయతే కీర్త్యతే చ ।

యత్ర చ శాస్త్రాణామ్ అనభ్యాసః, దూషితా శ్రద్ధా, సంశయభూయిష్ఠా బుద్ధిః, స్వార్థలిప్తమ్ మనః, పాపే రతిః ఏవమాదయః దోషాః నేతృషు ఉద్భవంతి నిశ్చయేన తస్మిన్ రాష్ట్రే అధోగమనం, అన్యాయః, దుర్భిక్ష-మరణజన్యభయమ్, సుఖనాశః, చింతా, ప్రజాక్రోశః, పరాభవః ఏతవమాదీని భవిష్యంతి ।

పరన్తు తత్రైవ విచారణీయం యత్ ఏతత్ సర్వం తు స్వాభావికమ్ ప్రాకృతికం చ । తర్హి కథం ఏవమాదీని కులక్షణాని దుర్గుణాః అవాంఛితభావాః పరిహరణీయాః, యదార్థమ్ ఆధునికమ్ (సభ్యమ్ సమృద్ధమ్ ?) విశ్వమ్ సర్వథా చింతాగ్రస్తమివ భాతి, తదత్ర ప్రాచీనభారతీయవాఙ్మయే కీదృశమ్

చింతనమ్  ఉపాయశ్చ సంతీతి.

పరిశీలనే శ్లోకోఽయమ్ స్మర్యతే । యత్ర ఏవం సిద్ధాంతితమ్, అనుష్టానేన సమ్యగనుభూతం చ దృశ్యతే -

**శ్లో ॥ ఆహారేష్వథ యోనౌ చ బీజే కర్మణి చాఽపి యః ।**
**శుచిః కృచ్ఛ్రగతస్యాపి న పాపే రమతేఽస్య ధీః ॥**

యస్య చత్వారీమాని విశుద్ధాని భవంతి, స ఏవ పాపాని న కరోతి। అతః యః బీజతః (పితృతః) యోనితః (మాతృతః) కర్మతః, ఆహారతశ్చ శుచిర్భవతి, సః పూతో భవతి । యస్య చ సాత్వికీ బుద్ధిః భవతి స ఏవ సుపాలనం కర్తుం సమర్థో భవతి । స ఏవ జనానురాగీ గుణసంపన్నః సశ్రద్ధః, సుమతిః ధర్మ-లోక-రాష్ట్రరక్షకః, ధీరః, ఆస్తికః, శాస్త్రజ్ఞః । సః సత్యం న త్యజతి । సత్యాత్ న చ్యవతే । సత్యసంధో భవతి ।

సత్యధైర్యఆస్తిక్యభావేన శాస్త్రనిష్ఠా, దేవభక్తిః, ఇత్యాది గుణైః సత్త్వం వర్ధతే। శనైః రజసః తమసశ్చ ప్రభావః క్షీయతే । తతః ఉత్తమం జ్ఞానం ధర్మభక్తిః సత్త్వం సుస్థిరం సత్ శ్రేష్ఠం వివేకం జనయతి । యేన వివేకేన రాజా సుపాలనాపథి, సుప్రతిష్ఠితో భవతి ।

యథా ద్విజానాం సర్వేషాం గృహస్థానాం పంచయజ్ఞాః వేదే నిత్య కర్మత్వేన బోధితాః సంతి, తే చ శాస్త్రేషు (1) దేవయజ్ఞః (2) భూతయజ్ఞః (3) పితృయజ్ఞః (4) మనుష్యయజ్ఞః (5) స్వాధ్యాయయజ్ఞః ఇతి ప్రసిద్ధాః ।

శిష్టానాం నిత్యాచరణే దృశ్యంతే । ఏ తే వేద ప్రతిపాదిత సద్ధర్మానుష్ఠానేన ఏవ శిష్టాః అభ్యుదయనిః శ్రేయసీః లభంతే । తద్వత్ మూర్ధాభిషిక్తస్య లోకరంజనైకదీక్షితస్య సుపాలనాపథి ప్రతిష్ఠితస్య రాజ్ఞః నిత్యం పంచయజ్ఞాః అనుష్ఠేయాః భవంతి ।

తే చ నీతిశాస్త్రే ఏవం సముపదిష్టాః సంతి।

**శ్లో ॥ దుష్టస్య దండః సుజనస్య పూజా న్యాయేన కోషస్య చ సంప్రవృద్ధిః ।**
**అపక్షపాతోఽర్థిషు రాష్ట్రరక్షా పంచైవ యజ్ఞాః కథితాః నృపాణాం ॥** ఇతి.

**1) దండవిధానమ్ :** యథాశాస్త్రం సమ్యక్ పరిషన్నిర్ణీతదండవిధానం పక్షపాతం అకృత్వా అపరాధినే దుష్టాయ పాపినే దండదానం  విదధాతి, యతోహి దండేన లోకః సురక్షితః భవతి । నిర్భయాః ప్రజాః చ భవంతి। దండస్య తీక్ష్ణత్వం మృదుత్వం చ నైవ యుక్తం భవతి । కించ యుక్త దండః ఏవ ప్రథమో యజ్ఞః భవతి ।

**2) సుజనపూజనం :** ద్వితీయయజ్ఞః-స్వరాష్ట్రే జీవతాం సర్వేషాం గుణవిద్యా-కౌశల, పాటవ-ప్రభావసామర్థ్య-శౌర్య-తపః ఇత్యాది గుణాన్, సమ్యక్ పరిశీల్య యథాయోగ్యం తదుచితకార్యేషు యోజనం, సత్కారః, వేతానాదిభిః పూజనం।

**3) న్యాయ్యేన మార్గేణ కోశపూరణం :** పూర్ణస్య రక్షణం రక్షితస్య ధనస్య చ ఉత్తమోపాయైః అభివృద్ధిసంపాదనం ఇత్యేషః తృతీయః యజ్ఞః కథ్యతే ।

**4) అర్థిషు అపక్షపాతః :** ఏషః చతుర్థః యజ్ఞః । ఇష్టకర్మసు (నదీ, తీర్థ, క్షేత్ర, ఆశ్రమ, మఠ, శాలా,

దేవమందిర, ధర్మ యజ్ఞాది) శ్రద్ధయా, ఔదార్యేణ చ ద్రవ్య త్యాగః, తథా పూర్తకర్మసు (చికిత్సా, శిక్షా ధర్మశాలా కళాకారసన్మానః, కుశలానాం తంత్రజ్ఞానాం, గౌరవః లోకక్షేమార్థం సేతుబంధనః, గోసంరక్షణం, యాత్రోత్సవ నిర్వహణం, అన్నసత్రపోషణం, ప్రపా-పుష్కరిణీ నిర్మాణాదికం) పక్షపాతం కార్యేషు అకృత్వా ద్రవ్యార్పణం ఇత్యాదికం ।

**5) రాష్ట్రరక్షా ఇతి పంచమో యజ్ఞః :** రాష్ట్రసీమానాం నగరాణాం, గ్రామాణాం, వనానాం, దేశానాం చ సర్వతః అత్యంతం జాగరూకతయా సతతం సంరక్షణమ్ కరణీయమ్ । తథైవ ప్రజానాం, పశూనాం, పక్షిణాం, జలచరాణామ్ సస్యానాం, ఔషధీనాం చ సంరక్షణం విశేషతః ప్రాణస్య, ధనస్య, ధర్మస్య, గౌరవస్య చ నిత్యం సమ్యక్ పరిపాలనం। ఏవమ్ ఏతేషాం పంచమహాయజ్ఞానామ్ యః అనుష్ఠాతా స ఏవ । "రంజనాత్ రాజా" ఇత్యుక్త్యనుసారం రాజేతి కథ్యతే । ఏవం ధర్మిష్ఠాః, శూరాః, జ్ఞానినః, రాజర్షయః అఖండభారతే అసంఖ్యాకాః ఆసన్ । తే చ షడంగవిదః, సత్యసంధయః, ధర్మాత్మానః, ప్రజావత్సలాః, నీతిమంతః, గుణినః, గుణగ్రాహిణః, వివేకినః, ఆత్మవంతః, దేవభక్తాః, మదమాత్సర్యాది శూన్యాః శూరాః, ధీరాః, వీరాః, స్వర్గమార్గాః, యోగినః, దేవసహాయాః, యుధిష్ఠిరాః, ప్రాజ్ఞాః, త్యాగధనాః, యాజకాః, వేదవిదః, న్యాయకర్తారః, మర్యాదా ప్రతిపాలకాః, మృదు మధుర, సత్య ప్రియభాషిణః, స్వధర్మపాలనదక్షాః, సద్వృత్తాః యోగాభ్యాస నిపుణః, ఇత్యాద్యనేకోత్తమగుణధనాః రాజానః ఏవ సనాతనధర్మం రక్షితవంతః । రక్షంతి, రక్షిష్యంతి చ ।

ఏషాం స్వరాష్ట్ర ప్రజావిషయే నిశ్చితా బుద్ధిః ఈదృశీ భవతి ।

**శ్లో ॥ న మే జనపదేస్తేనో న కదర్యో న మద్యపః ।**
**నానాహితాగ్నిః ర్నాయజ్వా న స్వైరీ స్వైరిణీ కుతః ॥**

ఏవం గుణాలంకృత రాజ్ఞాం విషయే ప్రజాః భగవంతం ప్రార్థయంతే । "సామ్రాజ్యం భోజ్యం - స్వారాజ్యం వైరాజ్యం పారమేష్ట్యం రాజ్యం మహారాజ్యమాధిపత్యం సమంత పర్యాయీస్యాత్ సార్వభౌమః సార్వాయుషః, ఆన్తాదాపరర్ధాత్ పృథివ్యైః సముద్ర పర్యంతాయా ఏకరాట్ ।"
తథా చ విశస్త్వా సేవ సర్వా వాంఛంతు మా త్వద్ రాష్ట్రం అధిభృశత్ । రాజానోపి ప్రజానాం పితృవత్ పాలనం కుర్వంతః, అశ్వమేధాది యజ్ఞేషు, భగవంతం ఏవం ప్రార్థయంతే ।

"ఆ బ్రహ్మన్ బ్రాహ్మణో ........" యోగక్షేమో నః కల్పతాం । ఏవం పితృ-మాతృ-పుత్ర-మిత్ర-కళత్ర- బంధు రక్షక-వత్ పరస్పరం లోకజీవనం, విశ్వజీవనం చ సాధయంతి స్మ ।

ఏష ఏవ సుపాలనాపంథాః, ఇతి సుస్పష్టం భావం ప్రకటయితుం, బోధయితుం చ శ్రీమతః భమిడిపల్లి సుబ్రహ్మణ్యశర్మణా సంస్కృత సాహిత్యం సమ్యక్ పరిశీల్య వర్తమానం లోకజీవనం విచింత్య సుష్టు మనో-బుద్ధి-స్వభావాది మథనేన సముత్పాదితం నవనీతమేవ ।

విజయపథం - ఇతి తెలుగు పుస్తకం । లేఖకస్యాస్య చింతనం, లేఖనం, వర్ణనం, పరిశీలనం నిష్కర్షః ఏతత్ సర్వం నూతనానాం యూనాం చ లాభప్రదం స్యాత్ - ఇతి విశ్వసిమి ॥

జయతు సంస్కృతమ్ - జయతు భారతం ! **-నరేంద్ర కాప్రే**

భాగ్యనగరమ్,
15-8-2020.



## బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

వ్యవస్థాపక సంపాదకులు

భారత ఋషిపీఠం – భారతీయ మానసపత్రిక

# సంస్కార ఉద్దీపనకు మాధ్యమం

**ఋ**షివాక్యసముదాయం సుధా[స్రవంతి. అంటే అమృత ప్రవాహమే. ఇది సంస్కృత భాషకి మరోపేరా! ఋషివాక్యమ్ సంస్కృతం కదా! సుష్ఠు ధార్యతే – సుధా. చక్కగా ధరించునది. అమృతానికి పర్యాయమే అయినా ఈ అర్థం అన్వర్థమే. ధరించేదే ధర్మం – ధారణాత్ ధర్మం. అన్వయిస్తే ధర్మమే సుధ. అది సుధవలెనే స్వచ్ఛమైనది. అమృత శబ్దానికి కూడా శాశ్వతం, ఆనందం, దివ్యత్వం అనే అర్థాలున్నాయి.


ఇన్ని అర్థాలూ ఉన్న సంస్కృతవాఙ్మయ సరిత్తు నుండి ఒక స్రవంతి ఈ 'విజయపథం' పుస్తకంగా ప్రత్యక్షమయింది. దేశం–ధర్మం–సంస్కృతి... ఒకటిగా ఉన్న భారతీయత ఎంతటి సార్వకాలిక–సార్వజనీన సత్యమో ఈ పుస్తకం మరోమారు ఋజువు చేస్తోంది. – వాల్మీకి వ్యాస చాణక్యాదుల మాటలు నేటి తరానికి కూడా ఎలా ప్రయోజనకరాలో తెలియజేస్తూ సమకాలీన ఉదాహరణలతో, చారిత్రకాంశాలతో అన్వయిస్తూ చెప్పిన తీరు అభినందనీయం.

అనర్ఘరత్నాలవంటి భారత భారతీ సూక్తాలను గతంలో మంచి పుస్తకాలుగా అందించిన మిత్రులు శ్రీ బి.ఎస్. శర్మగారు ఈ పుస్తకం ద్వారా మరో మహోపకారం చేశారు. 'సంకలనకర్త' అని తాను ప్రకటీకరించుకున్నా ఇది కేవలం సంకలనం కాదు. సమన్వయానుసంధానాలతో సమ్యగ్వీక్షణం, వ్యక్తిత్వ నిర్మాణగ్రంథం, నాయకతా లక్షణ శిక్షణ శాస్త్రం అనడం అతిశయోక్తి అనిపించదు.

ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారి మాటని ముందుమాటగా, ఊతంగా గ్రహించడం అభినందనీయం. యువత అవశ్యం పఠించాల్సిన ఈ గ్రంథం వారి వ్యక్తిత్వాన్ని పదును పెట్టడమేకాక, భారతీయతలోని ఔన్నత్యాన్ని గ్రహించడానికి దోహదపడుతుంది. అధ్యాయ విభజన, విషయ సమీకరణ–వర్గీకరణ చక్కని స్థాయి కలిగి ఉన్నాయి. ఈ మంచి పుస్తకానికి మనసా నమస్కరిస్తూ –

బుధజనవిధేయుడు

**సామవేదం షణ్ముఖ శర్మ**



**Swami Chidrupananda**
Acharya Chinmaya Mission
Noida

## GREAT LEARNING THROUGH THIS TREASURE

A person with inspiration stands like Himalayas and remains unshaken in his commitment in the midst of all challenges. Only when life is full of inspiration, it is "living". A life without inspiration is a burden to the family, society, and country, as well as the whole world. Such a person consumes all the planet's resources and gives back nothing positive but only pain to the people around. *Therefore, inspiration is the key to lead a quality life.*

I have gone through VIJAYA PATHAM which is compiled by Shri B S Sarma Ji in a very thoughtful manner. He has given practical examples for every aspect of vital leadership qualities. The reader can gain immense knowledge by reading this text, which is sourced from our ancient scripts, as mentioned by the author. Each aspect of leadership is itself a vast subject to deal with adequately. However, Shri Sarma Ji has beautifully collected all the thoughts in a book form. Readers can get a glimpse into the wealth of knowledge in our scriptures. This book is a beautiful collection of brilliant traits that a leader must inculcate into his life. I appreciate Shri Sarma Ji for this idea of bringing ancient thoughts in the form of a book.

Many books on leadership are available, where the authors have tried to put some facets of leadership. However, it is a secret and sacred science. Secret because it is not known unless it is learned, either from an external teacher or an internal teacher called experience. There are two characteristics of a leader. First, to live

for the vision and carry the team with him or her. Second, to demonstrate whatever he or she expects from the team and lead from the front. In Shrimad Bhagawad Geeta Shri Krishna says to Arjuna that (see chapter 3.21), 'Whatever actions great persons perform, common people follow. Whatever standards they set, all the world pursues.' Remember! Everyone is a role model to someone, either in the house or in society. Hence, all of us are carrying the responsibility to demonstrate noble virtues in our lives.

There are two kinds of qualities that a leader should master in his or her field. The first quality is to live as a great human being exhibiting all humane qualities. Remember! A leader is a human being, and so are his/her followers. So, this quality of humanity forms the basis and paves the way for a spontaneous flow of the second quality of leadership, which is professional knowledge. Such a leader and the team together will enjoy the flow of progress and develop individual special skills such as courage to face challenges and stay together in bad times.

For a leader, there could be a variety of challenges that he or she needs to face in his/her lifetime. Often many such typical challenges are enumerated in the books. However, I would like to mention two episodes from the Mahabharata with their short analysis. These excerpts are from the part where Shri Dronacharya was teaching his students, Kauravas and Pandavas. (Pandavas are also from the same tree of Kuru dynasty).

**Known but unexpected challenges:-**

One day, Guru Dronacharya went along with his disciples to take a bath in the Ganges. Suddenly one crocodile had caught the calf of Dronacharya's leg. Even though he could free himself, he shouted for help. All of his students got stunned and did not know what to do. It was Arjuna, who shot five arrows at the crocodile under the water and killed it. Arjuna did not panic in that situation, which made

Drona incredibly happy. Arjuna had demonstrated his leadership qualities here when no one else could help their Guru.

We may know about things, but we are not prepared. Although all the others knew how to kill an animal, they were also capable but could not rise to the occasion. A leader must be prepared to face any challenge anytime. A leader has skill but may not be prepared to face a situation. So 'be prepared' is the mantra to face unexpected situations efficiently.

**Unknown and unexpected challenges: -**

Once Drona had put all his students to another test. They were all blindfolded. No one could see anything. He made a mud doll and said - "I will drop this mud doll in the waters. Shoot it before it dissolves into the water." Remember, all of them were blindfolded.

The moment the mud doll would fall in the waters was unexpected. The target was also unknown since they could not see it.

Arjuna hit the target before it dissolved by listening to the small sounds made by the doll and the water, while the doll was sinking and dissolving. Guru was incredibly happy to see Arjuna's skill. A leader should develop the capacity to identify such faintly visible problems and shoot them before they melt and run into the system. Please think about this.

I wish this book finds a place in many houses and stands as a ready-made guide to the present and future leaders. I wish every reader a great learning experience through this treasure.

*With best wishes*
**Swami Chidrupananda**
Acharya Chinmaya Mission, Noida

## కృతజ్ఞతలు

విజయపథం పుస్తక నిర్మాణంలో ఎందరో సన్మిత్ర బాంధవులు, సంస్కృతజ్ఞులు సహకరించారు.

✦ పఠనాసక్తిని పెంచేలా మెరుగులు దిద్దిన సీనియర్ జర్నలిస్టు, గురుతుల్యులైన శ్రీగుండువల్లీశ్వర్‌గారికి నా ధన్యవాదాలు. ఈ పుస్తకంలో ఇచ్చిన అనేక సంఘటనలు ఆయన ఉల్లేఖించినవి,

✦ న్యాయపరమైన ఉదాహరణలు, చారిత్రక సంఘటనలు అందించిన మిత్రులు, సీనియర్ అడ్వకేటు, రాజకీయ విశ్లేషకులు శ్రీ గోసాల శ్రీనివాస కళ్యాణ్ గారికి,

✦ ప్రొఫెసర్ దర్భా శ్రీరామ్ (బెంగళూరు)గారికి,

✦ పుస్తకాన్ని ఆద్యంతం పరిశీలించి, సవరించి, సలహాలనిచ్చిన మిత్రులు శ్రీ తంగేడుకుంట హెబ్బార్ నాగేశ్వరరావు గారికి (ప్రముఖ పత్రికా రచయిత, జర్నలిస్టు),

✦ డా.జె.ఎస్.ఆర్.ప్రసాద్ గారికి (ప్రొఫెసర్, సంస్కృత అధ్యయన విభాగం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం),

✦ శ్రీ హెచ్.ఎస్.గోవింద గారికి (ఆర్.ఎస్.ఎస్.క్షేత్ర సహ బౌద్ధిక్ ప్రముఖ్),

✦ సోదరుడు శ్రీ భ.నారాయణ శాస్త్రి, సోదరి శ్రీమతి శ్రీదేవి గారలకు,

✦ మిత్రులు శ్రీ మణిభూషణ్ గారికి,

✦ శ్రీ రామ్‌నారాయణ్ గారికి (శాస్త్రవేత్త, సంగీత, సంస్కృత పండితులు),

✦ శ్రీ సంజీవ కుమార్ గారికి (సంస్కృత భారతీ, తెలంగాణ),

✦ ఓర్పుతో అక్షరాలంకరణ (డిటిపి) చేసిపెట్టిన సోదరి శ్రీమతి వై.లక్ష్మిగారు, సోదరి శ్రీమతి ప్రవీణ్ లక్ష్మణ్ గారు, శ్రీ కాంతారావు గారలకు,

✦ ముఖచిత్రాలంకరణ చేసిన సోదరుడు 'బ్నిం' గారికి,

✦ పుస్తకాలంకరణ గావించిన మిత్రులు శ్రీరాము (హాస్యానందం) గారికి,

ఇంకా ఎందరో..

**అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు !!**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఆలోచన ఎలా చెయ్యాలి? | –20 |
| 2. | జట్టులో ఎవరున్నారు? | –25 |
| 3. | యోగ్యులెవరో పరీక్షించాకే... | –31 |
| 4. | రాజ్యానికి చెవులు... కళ్లు... | –36 |
| 5. | కార్యాచరణలో కాలహరణం కూడదు | –43 |
| 6. | దూత ఎలా ఉండాలి ! | –47 |
| 7. | కాలమే పరిష్కారం | –49 |
| 8. | అవసరాన్నిబట్టి నాయకుడు అణిగి వుండాలి | –54 |
| 9. | దండః సుగుణః భవేత్ | –56 |
| 10. | సంపదకు సార్థకత | –68 |
| 11. | నాయకత్వం – ప్రజాసంబంధాలు | –73 |
| 12. | ఉద్యోగులపై అపేక్ష ఉండాలి | –79 |
| 13. | ముందుచూపు అనివార్యం | –83 |
| 14. | విజయపథంలో జారుడు మెట్లు | –85 |
| 15. | విడగొట్టే వారుంటారు జాగ్రత్త! | –89 |
| 16. | మాటల నేర్పరి కావాలి! | –93 |
| 17. | మంచివాళ్లను ఆకర్షించాలి | –102 |
| 18. | వినయం... విజయ రహస్యం | –105 |

19. సముచిత – సహచర మండలి –110

20. ఇలా ఉండాలి – అలా కాదు.. –116

21. కార్యసాధనకు సజీవ స్ఫూర్తి –121

22. ఆరోగ్యం కాపాడుకోవాలి! –127

23. రామరాజ్యం –130

24. 'సన్' స్ట్రోక్ –133

25. బంగారు గంట –136

26. నిద్రను జోకొడితేనే... –140

27. నాయకునికి గీతాపాఠం –142

28. ఋగ్వేదం అందించిన విజయ రహస్యం –145

29. కోపానికి బ్రేకులు ఉండాలి –148

30. వీర సైనికుడా! విజయోస్తు –153

31. స్వధర్మం –157

32. ఈ పుస్తక రచనలో ఉపకరించిన ప్రధాన గ్రంథాలు –157

33. శాంతి మంత్రం –158




Strategy

## 1. ఆలోచన ఎలా చెయ్యాలి?

**ఒక్కరే ఆలోచించటం వల్ల సమగ్రమైన యోజన చేయలేము. "ముఖే ముఖే సరస్వతీ" అని అన్నట్లు ఒక్కొక్కరి తెలివి ఒక్కో తీరు. నలుగురు కలసి, కూర్చొని సమాలోచన చేస్తుంటే ఉపయోగకరమైన ఆలోచనలు వస్తాయి.**

**హి**మాలయ పర్వతాలలో నాలుగువేల అడుగుల ఎత్తులోనున్న అమరనాథ క్షేత్రంలో ఒక గుహలో ఏటా అవతరించే మంచులింగంలో ఈశ్వరుడి దర్శనానికి దారులు తెరిచారు. దేశదేశాల నుంచి వస్తున్న లక్షలాది భక్తులు క్యూ కడుతున్నారు. కర్రలు పట్టుకొని యువత నడుస్తున్నారు. అసలు అడుగే వేయలేని పిల్లల్ని వాళ్ల తల్లిదండ్రులు నడుముకి కట్టుకుని తీసుకెళ్తున్నారు. నడవలేని వృద్ధుల్ని వాళ్ల పిల్లలు భుజాలమీద మోస్తున్నారు.

'భోలేనాథ్‌కీ జయ్' 'శంభో శంకర హర హర మహా దేవ్' అంటూ భక్తులు చేస్తున్న నినాదాలతో అమరనాథ్ కొండ ప్రతిధ్వనిస్తోంది. అంతా భక్తి పారవశ్యంతో ఊగిపోతూ సాగిపోతున్నారు.

అకస్మాత్తుగా....!

"యాత్రా బంద్ కరో" – అని ఆదేశాలు వచ్చాయి.

యాత్ర స్తంభించిపోయింది. పైకి ఎక్కినంతవరకూ భక్తులు దర్శనం చేసుకున్నారు.

అంతే!

బయటి ఊళ్లనుంచి వచ్చి, కాశ్మీరంలో చదువుకుంటున్న పిల్లలకి హఠాత్తుగా సెలవులు ప్రకటించారు. స్థానికులు తప్ప ఎవ్వరూ లోయలో లేకుండా జాగ్రత్త పడ్డారు. మామూలుకన్నా ఎక్కువ మంది సైనికులు ప్రాంతమంతా మోహరించారు. దుండగుల్ని (ట్రబుల్ మేకర్స్‌ని) గృహనిర్బంధం చేసారు, ఫోన్ల నోళ్లు కట్టేసారు.

ఏం జరగబోతోందో ఎవరికీ తెలియటం లేదు.

క్రీ॥శ॥ 2019 ఆగష్టు ఐదవ తేదీన భారత రాజ్యాంగపు 'ఆర్టికల్ 370' అధికరణాన్ని రద్దు చేయటానికి చాలా ముందుగా జరిగిన మంత్రాంగం అది. మూడోకంటికి తెలియకుండా అత్యంత రహస్యంగా జరిగిపోయింది.

భద్రతా ప్రణాళిక అధ్యాదేశం (ఆర్డినెన్స్) ద్వారా అప్పటివరకూ జమ్మూ కశ్మీర్‌ని భారత్‌లోని ఇతర రాష్ట్రాలకంటే ప్రత్యేకంగా చూపిస్తూ కట్టబెట్టిన ప్రతిపత్తిని రద్దుచేసింది.

"జమ్మూ కాశ్మీర్ ప్రాంతం పూర్తిగా భారత్‌లోని ఇతర ప్రాంతాలతో సమానమన్న వాస్తవాన్ని స్పష్టం చేసింది. అంతే !

అవును! రాజకీయ భీష్ములు, పాత్రికేయ దిగ్గజాలు, ప్రతిపక్ష మేధావులు కూడా ఊహించలేనంత వేగంగా, ఆర్భాటం లేకుండా ఒక అద్భుతం జరిగిపోయింది. దేశానికి గొప్ప మేలు జరిగింది.

✦✦✦

2016వ సంవత్సరంలో నవంబర్ ఎనిమిదవ తేదీ మంగళవారం... ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకు ప్రధాని నరేంద్రమోదీ రేడియోలో మాట్లాడతారని ప్రకటన వెలువడింది. ఎందుకో ఎవరికీ తెలీదు. అందరూ టీవీల ముందు గుమిగూడారు. ఆ రాత్రి మోదీ చేసిన ప్రకటన ఎందరినో 'షాక్'కు గురి చేసింది – అదే 'డీమానిటైజేషన్'.

రాత్రికి రాత్రి వెయ్యి, ఐదువందల రూపాయల నోట్లను రద్దు చేయటం. ఇంత పెద్ద కార్యం 130 కోట్ల జనాభా ఉన్న మన భారతదేశంలో ఎలా సాధ్యమైంది? ఈ రహస్యాన్ని అమలయ్యేవరకు కాపాడిన అధికారులు ఎంత బాధ్యతాయుతులు!

✦✦✦

పాకిస్తాన్ దురాక్రమిత కశ్మీర్‌లోకి చొచ్చుకొనిపోయి, అక్కడి శత్రుస్థావరాల్ని

నాశనం చేసి క్షేమంగా వచ్చిన భారతీయ సైనికులు చేసిన సాయుధ చికిత్స – సర్జికల్ స్ట్రైక్స్ – ఓ చారిత్రక ఘట్టం. పాకిస్తాన్ మన దేశానికి వ్యతిరేకంగా కొనసాగించిన బీభత్సకాండకు ఇది గుణపాఠం. ఈ శిక్ష అమలు జరిపాకనే దాని గురించి దేశానికి, ప్రపంచానికి తెలిసింది. ఎంతమంది ఈ చర్య (ఆపరేషన్)కు వెనుక ఉండి పనిచేసి ఉంటారు? అయినా ఈ చర్యను ఎంతో గోప్యంగా, నిగూఢంగా అమలు చేసారు. ఈ వ్యూహాత్మక ప్రతిఘటన శత్రువులకు గట్టి గుణపాఠం నేర్పింది. 2016, సెప్టెంబర్ 29న మన ప్రభుత్వం చెప్పేదాకా ఈ విషయం ఎవ్వరికీ తెలియలేదు.

✦✦✦

"ఆలోచన ఎలా చేయాలి?" అన్న విషయాలపై భరతునితో శ్రీరాముడు చెప్పిన విషయాన్ని ఆదికవి వాల్మీకి మహాముని తన రామాయణంలో ఇలా వివరించాడు.

శ్లో॥ **కచ్చిన్మన్త్రయసే నైకః కచ్చిన్న బహుభిస్సహ ।**
**కచ్చిత్తే మంత్రితో మంత్రో, రాష్ట్రం న పరిధావతి ॥**

*(రామాయణం, అయోధ్యాకాండ – 100వ సర్గ – 18వ శ్లోకం)*

*దేశ హితానికి సంబంధించిన యోజనల విషయంలో నీవు ఒక్కడివే ఆలోచించటం లేదు కదా! (అలాగని) ఎక్కువ మందితో కలసి ఆలోచన చేయటం లేదు కదా! నీవు ప్రకటించటానికి ముందే ఆ ఆలోచన దేశం దాటిపోవటం లేదు కదా! (శత్రు రాజ్యానికి చేరిపోవటం లేదు కదా!)*

✦✦✦

**సమాలోచన – ప్రాముఖ్యత...**

ఒక్కరే ఆలోచించటం వల్ల సమగ్రమైన యోజన చేయలేము. "ముఖే ముఖే సరస్వతీ" అని అన్నట్లు ఒక్కొక్కరి తెలివి ఒక్కో తీరు. నలుగురు కలసి, కూర్చొని సమాలోచన చేస్తుంటే ఉపయోగకరమైన ఆలోచనలు వస్తాయి.

"రాజు ఒక్కడే కూర్చొని ఆలోచన చేస్తే విషయం సరిగ్గా నిర్ణయించడానికి శక్యం కాదు... అందువల్ల పరిణతమైన బుద్ధిగల వాళ్లతో, పరిపాలన శాస్త్రంలో పూర్తి పట్టు ఉన్నవారితో 'సమాలోచన' కోసం కూర్చోవాలి. అర్థశాస్త్రం అభ్యసించని వారిని రహస్య ఆలోచనలు చేసే మౌలిక బృందం (Core Team) లో ఉంచ

కూడదు" అని ఆచార్య చాణక్యుడు (అర్థశాస్త్రం - 11వ ప్రకరణం) చేసిన హెచ్చరిక ఇప్పటికీ నాయకులందరికీ శిరోధార్యమే!

తలపెట్టిన పనిలోని సాధ్యాసాధ్యాలు, లాభనష్టాలు గురించి నలుగురు కలసి కూర్చుని ఆలోచించటం శ్రేయస్కరం. అలాకాక మితిమీరిన జనం కూర్చుని ఆలోచిస్తే కూడా ఏమీ తేలదు. అందువల్ల పరిమిత బృందం చేసిన మంత్రాంగమే విజయాన్ని చేకూర్చుతుంది. ఈనాటి ప్రభుత్వాలలో మంత్రి వర్గం (కేబినెట్) అనేది ఈ ఆలోచనలనుండే ఏర్పడినది!

"సమాలోచనలను గోప్యంగా ఉంచగలిగిన శాస్త్ర పరిజ్ఞానం కలిగిన మంత్రి పరిషత్ ద్వారా మాత్రమే రాష్ట్రం (జాతి) సురక్షితంగా ఉంటుంది. అలావున్న రాజ్యాన్ని శత్రువులు ఎన్నటికీ నాశనం చేయలేరు" అని మహాభారతంలో వ్యాస మహర్షి తెలియచేశాడు.

అమలు అయ్యే ముందుగా పెద్దనోట్ల రద్దు, సర్జికల్ స్ట్రైక్స్ వంటి పనులు అవసరమైన కొద్ది మందికి మాత్రమే తెలిసి ఉండాలి. అటువంటి పరిమిత బృందం (చిన్న టీం) అద్భుతంగా సాధించే విజయాలెన్నో! అందుకే నాయకుడు ఒంటరిగా కాక చిన్న జట్టుతో ఆలోచించి, అమలుపరిచి విజయం సాధించాలి. ✦

## సనాతన ధర్మసారం

కం॥ **ఒరులేయవి యొనరించిన**
**నరవర! అప్రియము తన మనంబునకగు తా**
**నొరులకు నవి సేయకునికి**
**పరాయణము పరమ ధర్మపథములకెల్లన్.**

(ఆంధ్ర మహాభారతం, శాంతిపర్వం, 5/220)

✦ ✦ ✦

శ్లో ॥ **యద్యన్యైర్విహితం నేచ్ఛేద్ ఆత్మనః కర్మ పూరుషః ।**
**న తత్పరేషు కుర్వీత జానన్నప్రియమాత్మనః ॥**

(మహాభారతం, శాంతిపర్వం, 259/20)

*మనిషి తన విషయంలో ఇతరులు చేయకూడదని భావించిన పనిని ఇతరుల విషయంలో తాను కూడా చేయరాదు. తనకు అప్రియమైనది ఇతరులకు కూడా అప్రియమే కదా!*

సంకలనం, వ్యాఖ్యానం-**బి.ఎస్.శర్మ**

**దశరథుని కొలువులో...**

- రామాయణం (బాలకాండ)లో వాల్మీకి మహర్షి దశరథుని పాలన గురించి విస్తృతంగా తెలియజేసాడు.
- దశరథుని దగ్గర ధర్మపాలనలో సలహాలనిచ్చే ఎనిమిది మంది మహర్షులు ఉండేవారు. వీరంతా సర్వసంగ పరిత్యాగులు, దేనిపైనా ఆసక్తి గాని, వ్యామోహం గాని లేనివారు. రాజ్యకార్య నిర్వహణ కోసం దోషరహితులై, వ్యవహారశుద్ధి, శ్రద్ధ, ఆసక్తి ఉన్న ఎనిమిది మంది మంత్రులు ఉండేవారు.

**దశరథుడు**

| **ధర్మపాలనలో మార్గదర్శక మండలి** | | **సాధారణ పాలనామండలి** | |
|---|---|---|---|
| 1. వసిష్ఠుడు | 5. సుయజ్ఞుడు | 1. ధృష్టి | 5. అర్థసాధకుడు |
| 2. వామదేవుడు | 6. కాశ్యపుడు | 2. జయంతుడు | 6. అశోకుడు |
| 3. జాబాలి | 7. గౌతముడు | 3. సిద్ధార్థుడు | 7. మంత్రపాలుడు |
| 4. కాత్యాయనుడు | 8. విజయుడు | 4. విజయుడు | 8. సుమంత్రుడు |

**మంత్రులు ఎలాంటి వారు ? (బాలకాండ 7/5,6)**

- సమస్త విద్యలు నేర్చినవారు.
- తప్పుపని చేయటానికి సిగ్గుపడేవారు.
- నేర్పరితనం (పనులు చేయటంలో కుశలత్వం) ఉన్నవారు.
- ఇంద్రియ నిగ్రహం కలవారు.
- ఐశ్వర్యవంతులు.
- గొప్ప బుద్ధిమంతులు.
- సకల శాస్త్రాలు తెలిసినవారు.
- దృఢమైన పరాక్రమం కలవారు.
- మాట ఒకటి, చేత మరొకటి కాకుండా చెప్పిన విధంగా చేసేవారు.
- తేజస్సును, ఓర్పును, కీర్తిని పొందినవారు.
- అందరినీ చిరునవ్వుతో తామే ముందుగా పలకరించి మాట్లాడే స్నేహశీలురు.

Team Building

## 2. జట్టులో ఎవరున్నారు?

**దేశ భద్రతకు, పరిపాలనకు సంబంధించిన రహస్యాలెన్నో మనం ఎన్నుకున్న పాలకులకు మాత్రమే తెలుస్తాయి. వాటిని దేశభక్తులైన నాయకులు ఎన్నడూ బయటపెట్టరు.**

**'పో**ఖ్రాన్' రాజస్థాన్‌లోని జైసల్మార్ జిల్లాలో దాదాపు ఓ ముప్పై వేల జనాభా ఉన్న ఒక పల్లె. థార్ ఎడారి ప్రాంతంలో ఉన్న చిన్న గ్రామం. హఠాత్తుగా ఆ ఊరి పేరు ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తం అయ్యాయి.

మన దేశం నిర్వహించే అణు భూగర్భ పరీక్షలు పోఖ్రాన్‌లో జరగటమే ఇందుకు కారణం.

'స్మైలింగ్ బుద్ధ' పేరుతో ప్రారంభమైన పోఖ్రాన్-1 (1974) తరువాత, చాలా సంవత్సరాలు అణు పరీక్షలకు మన శాస్త్రజ్ఞులు ప్రయత్నించారు కానీ, అమెరికా గుప్త చర సంస్థ (సి.ఐ.ఏ) సైంధవుని వలె అడ్డు తగిలేది, బెదిరించేది. వారి రాడార్ల ద్వారా మనం చేయబోయే పరీక్షల గురించి ముందే అమెరికా పసిగట్టేది. మన శాస్త్రజ్ఞులకు రాజకీయ పరమైన ఒత్తిడి వచ్చి చివరి నిమిషంలో అణు పరీక్షలు ఆగిపోయిన సందర్భాలు లేకపోలేదు.

మన దేశానికి 10వ ప్రధానిగా వచ్చిన శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయి ఈ ఆటంకాలను అధిగమించి అత్యంత రహస్యంగా పోఖ్రాన్-2 పరీక్షలను నిర్వ

హింపచేసారు. డా॥ అబ్దుల్ కలాం (అప్పట్లో ప్రధానికి శాస్త్రీయ విషయాల సలహాదారు)తో పాటు మరో నలుగురు శాస్త్రవేత్తలు ప్రధాని నేతృత్వంలో 1998వ సంవత్సరం మే నెలలో పద్దెనిమిదవ తేదీన ఈ పరీక్షలు నిర్వహించాకనే ప్రపంచానికి ఈ విషయం తెలిసింది. ఇందులో పాల్గొన్న శాస్త్రజ్ఞులు అందరు సైనిక దుస్తులు ధరించి అత్యంత రహస్యంగా మారు పేర్లతో వ్యవహారాన్ని నడిపించారు. లక్ష్య సాధనకై జాగ్రత్తగా కృషి చేసారు. అమెరికా వారి రాడార్ కళ్లుగప్పి ఈ విజయాన్ని సాధించగలిగారు. పోఖ్రాన్ ప్రయోగంలో పాల్గొన్న వందలాది ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు ఎంతో సంయమనం పాటించారు! రహస్యాన్ని కాపాడారు. అందుకే విజయం సాధించగలిగారు.

✦✦✦

పార్టీపరంగానో, ప్రభుత్వపరం గానో అనేక రహస్య సమావేశాలు జరుగు తుంటాయి. ఎన్నికల సమయంలో అయితే చెప్పనే అక్కర్లేదు. అనేక ముఖ్య, రహస్య విషయాలపై చర్చ జరుగుతూ వుంటుంది. ఇలా చర్చించిన విషయాల్లో నాలుగు గోడలు దాటకూడనివి ఉతంటాయి. కుటుంబసభ్యుల చెవిలో కూడా పడకూడని తంత్రాలుంటాయి. ఇలా రహస్యాన్ని జాగ్రత్తగా కాపాడేవారే జట్టు (Team)సభ్యులుగా వుండాలి.

రాజకీయ పార్టీలో వేలల్లోనూ, లక్షలలోనూ సభ్యులుంటారు, ఏదైనా సంస్థలో వందలాదిమంది సభ్యులుంటారు. వీరంతా కూర్చుని ఆలోచన చేయరు కదా! వీరిలోని ముఖ్యులు మౌలికబృందం (Core Team) గా ఏర్పడి, నియమితంగా కలవాలి, ఆలోచనలను కొనసాగించాలి. ఈ విషయాన్ని శ్రీరామచంద్రుడు భరతునితో ఇలా అన్నాడు.

శ్లో॥ **మంత్రిభిస్త్వం యథోద్దిష్టైః చతుర్భిః త్రిభిరేవ వా ।**
**కచ్చిత్సమ సమస్తైః వ్యస్తైశ్చ మన్త్రం మన్త్రయసే మిథః ॥**

*(వాల్మీకి రామాయణం, అయోధ్యాకాండ-100/71)*

*నీవు శాస్త్రోక్త లక్షణాలుగల ముగ్గురు లేదా నలుగురు మంత్రులతో కలసిగాని, విడివిడిగా గానీ రహస్యంగా గానీ, ఆలోచన చేస్తున్నావు కదా!*

✦✦✦

"నాయకుడు తమ జట్టుతో కలసి రూపొందించిన ఉపాయాలను ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడాలి", అని అన్నాడు శ్రీరాముడు, భరతునితో.

ఈ సంగతి వాల్మీకి ఇలా వివరించాడు.

శ్లో॥ **కచ్చిన్న తర్కైర్యుక్త్యా వా యేచాప్యపరికీర్తితాః**
**త్వయా వా త్వదమాత్యైర్వా బుధ్యతే తాత మన్త్రితమ్॥**

*(రామాయణం, అయోధ్యాకాండ-100/21)*

*ఓ భరతా! నీ ఆలోచనలను, నీ మంత్రులు చేసిన ఆలోచనలను ఇతరులు ఊహతోగాని, యుక్తితోగాని, ఇతర ఉపాయాలచేతగాని, తెలుసుకోవటం లేదుకదా!*

**ఉష్ ! రహస్యం...**

మన రహస్య ఆలోచనలను గ్రహించటానికి ఎందరో ప్రయత్నం చేస్తుంటారు. శత్రురాజ్యం ఏమి చేయబోతుందో, శత్రురాజ్య పాలకులు తమ అంతరంగంలో ఏమి భావిస్తున్నారో తెలుసుకోవటానికి పాలకులు ప్రయత్నించాలి.

వాణిజ్య బృందం (మార్కెటింగ్ టీం) కూర్చొని వ్యాపార సంబంధ వ్యూహాలమీద కుస్తీ పట్టాక తీసుకొన్న నిర్ణయాలు ప్రత్యర్థి వర్గానికి (Commercial competitors) తెలియకుండా జాగ్రత్తపడాలి. ప్రస్తుత వ్యాపార ప్రపంచంలో ఒప్పందపు విలువ (Contract Quotation) ఎంత అన్న విషయాన్ని ప్రత్యర్థులకు రహస్యంగా వెల్లడించే (లీక్ చేసే) విద్రోహులకు కొదవలేదు. వాళ్లనుంచి రహస్యాలను 'కొనుగోలు' చేసే వ్యవస్థ కూడా పనిచేస్తోందంటే కొందరికి ఆశ్చర్యం కలగవచ్చు. ఇలా రహస్యాలు రాబట్టేందుకు నియుక్తులైనవారి (Coverts) వాసన పసిగట్టే నేర్పు నాయకునికి ఉండాలి.

**తస్మాన్నాస్యపరే విద్యుః కర్మ కించిచ్చికీర్షితమ్**
**ఆరబ్ధారస్తు జానీయురారబ్ధం కృతమేవ వా.**

*(అర్థశాస్త్రం, మంత్రాధికారః, 11వ ప్రకరణం)*

*రాజు చేయదలచుకున్న ఏ పని కూడా ఇతరులకు తెలియకూడదు. నిర్ణయం అయిన తరువాత, అమలు జరిపే అధికారులకే ఈ రహస్యం తెలియాలి. పని పూర్తి అయిన తర్వాతనే ఈ విషయం అందరికీ తెలియవచ్చు.*

ప్రజాస్వామ్యంలో ప్రధాని నుంచి మంత్రులవరకూ పదవీ ప్రమాణస్వీకారం చేయటం దేశ రహస్యాలను కాపాడటం కోసమే.

భారత రాజ్యాంగంలో మూడవ అధికరణంలో ప్రమాణ స్వీకారానికి సంబంధించిన విషయాలు పొందుపరచి వున్నాయి.

మన మంత్రులు ఇలా ప్రమాణం చేస్తారు.

***"ప్రధానమంత్రిగా (కేంద్ర మంత్రిగా...) నా పరిశీలనకు వచ్చిన, లేక నా దృష్టికి వచ్చిన ఏ విషయాన్నయినా, నా అధికార విధి నిర్వహణ కోసం తప్ప, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ, ఏ వ్యక్తికీ కానీ, ఏ వ్యక్తులకు కానీ వెల్లడించనని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను".***

దేశ భద్రతకు, పరిపాలనకు సంబంధించిన రహస్యాలెన్నో మనం ఎన్నుకున్న పాలకులకు మాత్రమే తెలుస్తాయి. వాటిని దేశభక్తులైన నాయకులు ఎన్నడూ బయటపెట్టరు.

మంత్రం – అంటే రహస్యమైన ఆలోచన. ఈ రహస్యాలు బయటికి పొక్కకుండా ఎలాంటి ప్రదేశాలలో ఈ సమాలోచన చెయ్యాలో అర్థశాస్త్రంలో, ఆచార్య చాణక్యుడు అద్భుతంగా వివరించాడు. కనీకనబడని చిత్రగ్రాహణ సాధనాలు (కెమెరాలు), ధ్వనిముద్రణ (రికార్డింగ్) సాధనాలు కలిగి ఉన్న దేశవిద్రోహులు పనిచేస్తున్న ఈ రోజుల్లో పాలకులు ఇంకెంత జాగ్రత్తగా ఉండాలో!

**దాదాపు 3500 సంవత్సరాల క్రితమే చాణక్యుడు ఏమి చెప్పాడో చూద్దాం–**

✦ పాలకులు ఆలోచనలు చేసే ప్రదేశం అన్ని వైపులా ఆచ్ఛాదింపబడి ఉండాలి – విషయాలు బయటకి వెళ్లకుండా కట్టుదిట్టం చేయాలి.

✦ పక్షులు, ఇతర జంతువులు కూడా ఆ స్థలాల్లో ఉండకూడదు.

✦ అపేక్షితులైన వారికి మాత్రమే ప్రవేశ అనుమతి ఉండాలి.

✦ ఈ రహస్య సమావేశంలో పాల్గొని బయటికి వచ్చాక వారి, వారి ముఖ కవళికలను బట్టి 'ఇతరులు' (ఇప్పుడు.... మీడియా అనుకోవచ్చు), పాలనతో సంబంధంలేని 'కుతూహలగ్రస్థులు', దేశవిద్రోహులు, తదితరులు గ్రహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

✦ సమావేశంలో పాల్గొన్నవారు పొరపాటునో, మద్యం మత్తులోనో, నిద్రలోనో

**రహస్యం బయటపడే ప్రమాద అవకాశాలు**

1. మదం, అత్యుత్సాహం, అతి నమ్మకం, 2. పగటి కలలు కనటం, కలవరింతలు, 3. నమ్మకద్రోహులైన మంత్రులు 4. విజ్ఞానం లేకపోవటం 5. సభ్యుల ముఖకవళికలు 6. నేర్పరితనం లేని దూత

*(మహాభారతం, ఉద్యోగపర్వం - 39/36,37)*

రహస్యాన్ని బయటపెడతారేమో.. జాగ్రత్త పడాలి.

రహస్యాన్ని పైకి చెప్పిన వారికి చాణక్యుడు విధించిన శిక్ష - మరణశిక్ష! (ఆచార్యచాణక్యుడు కలియుగం 16వ శతాబ్ది - క్రీస్తుకు పూర్వం 16వ శతాబ్దిలో జీవించాడు. ఈ చారిత్రక వాస్తవాన్ని ప్రముఖ చరిత్రకారుడు శ్రీ కోట వెంకటాచలం గారు నిర్ధారించారు.)

**పెద్దల విజ్ఞత...**

విజ్ఞులైన నాయకులు తమకు తెలిసిన దేశరక్షణకి సంబంధించిన రహస్యాలను తమలోనే ఉంచుకుంటారు. ఎప్పటికీ బహిర్గతం చేయరు. ఇలాంటి సంఘటన మాజీ ప్రధాని శ్రీ పి.వి.నరసింహారావు జీవితంలో చూస్తాము.

1995వ సంవత్సరంలో పోఖ్రాన్ పరీక్షకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక, హఠాత్తుగా ఆ ప్రయోగం ఆగిపోయింది. ఏ ఒత్తిడి కారణంగా ఆ ప్రయోగం అర్ధాంతరంగా ఆగిపోయిందో కారణాలు అన్నీ పి.వి.నరసింహారావుగారికి తెలుసు.

ఓ ఇంటర్వ్యూలో శేఖర్ గుప్తా అనే వరిష్ఠ పత్రికా రచయిత (సీనియర్ జర్నలిస్టు) దీనిపై ఆరా తీసే ప్రయత్నం చేసినప్పుడు అప్పటికి ప్రధానమంత్రి పదవిని ముందే విరమించి ఉన్న పి.వి.గారు ఇలా జవాబిచ్చారు:

“అరె భాయ్! కొన్ని రహస్యాలు నా చితితో పాటు కాలిపోనివ్వండి” అని. దేశ విదేశాలతో సంబంధాలు, దేశ రక్షణ భద్రతలకు సంబంధించిన రహస్యాలు బాధ్యతాయుతులైన నాయకులు ఎప్పటికీ బయటపెట్టరు.

కానీ... ఇందుకు భిన్నంగా మరో మాజీ ప్రధాని వి.పి.సింగ్ తన పదవీ కాలంలోనూ, పదవీకాలం పూర్తి అయ్యాక భారతీయ గూఢచార వ్యవస్థ (RAW) కి సంబంధించిన కొంత ముఖ్యమైన, సున్నితమైన, ప్రకటించకూడని సమాచారాన్ని

బయట పెట్టాడు. ఇలా బాధ్యతారాహిత్యంగా పదవీ ప్రమాణం రోజున చేసిన ప్రతిజ్ఞను వమ్ముచేస్తూ దేశభద్రతను, జాతి క్షేమాన్నీ క్షుద్ర రాజకీయాలకోసం పణంగా పెట్టటం కంటే మించిన రాజ్యాంగ వ్యతిరేక చర్య ఉండదు.

రాజ్యాంగబద్ధమైన పదవీ ప్రమాణ స్వీకారానికి ఇది భంగకరం. అందువల్ల రాజ్యాంగం పట్లా, జాతి పట్లా చేసిన ఘోరమైన ద్రోహమే ఇది. ✦

## లాక్‌డౌన్‌లో హల్వా విందు

*ఆర్థిక మంత్రి ఆధ్వర్యంలో వార్షిక ఆదాయ వ్యయ ప్రణాళిక (బడ్జెట్) తయారు చేయటానికి ఓ నమ్మకమైన బృందంలోని అధికార, అనధికార సభ్యులంతా కలసి సమాలోచన చేస్తారు.*

*దేశానికి బడ్జెట్ వండి వడ్డించేముందు వారంతా ఏం చేస్తారు? ఓ పెద్ద పాత్రలో హల్వాను తయారుచేసి, ఆనందంగా ఆరగిస్తారు.*

*ఆ 'హల్వా విందు' జరిగాక వారంతా 'లాక్-డౌన్'లో ఉండిపోతారు. రోజుల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటారు. రహస్యంగా టైపింగ్, ప్రింటింగ్ జరుగుతూ ఉంటుంది. మార్పులు, చేర్పులు జరుగుతాయి. పార్లమెంటులో బడ్జెట్ ప్రతిపాదించేవరకు ఇందులోని రహస్యాలు రహస్యాలుగానే ఉండాలి.*

*అందుకోసం ఇందులో పాల్గొనేవారిని తమ ఫోన్లు కూడా ఉపయోగించనీయరు.*

*ఇలా కుస్తీ పట్టి బడ్జెట్ తయారు చేశాక ప్రధానమంత్రి చూసి, సంతృప్తి చెందాక ఈ రహస్య పత్రాలు 'ప్రింట్' అవుతాయి.*

*అంతవరకూ ఆర్థికశాఖ అధికారులు, కార్యదర్శులు, నీతి అయోగ్‌లోని సభ్యులతో పాటు – కంప్యూటర్‌లోకి ఎక్కించేవారు, తప్పొప్పులు దిద్దేవారు – బడ్జెట్ ఉపన్యాసం లోకి ఎక్కించాల్సిన శ్లోకాలు, పద్యాలు, పెద్దల పలుకులు (Quotations) ఎంపిక చేసి ఆర్థికమంత్రికి అందించేవారు అందరూ ఉంటారు. అబ్బో అదో పెద్ద పని. అత్యంత రహస్యంగా, బయటకు పొక్కకుండా జరిగే పెద్ద ప్రక్రియ. బడ్జెట్ లీక్ అయితే ఇంకేమన్నా ఉందా?*

*బడ్జెట్ రహస్యం 1950లో ఒకసారి బయటకు పొక్కింది. అప్పట్లో రాష్ట్రపతి భవన్‌లో బడ్జెట్ కాగితాలు ప్రింట్ అయ్యేవి. అప్పటి సాంకేతిక పరిజ్ఞానం వేరను కోండి. 1980 నుంచి కేంద్ర సచివాలయం (సెక్రటేరియట్) భవనంలోని భూగర్భ గృహంలో ఈ పత్రాలు ముద్రించబడుతున్నాయి.*

*Talent Management*

## 3. యోగ్యులెవరో పరీక్షించాకే...

**ప్రధాన బాధ్యతలను స్వీకరించే వ్యక్తి ఉత్తమ లక్షణాలు కలిగి ఉంటే దేశానికి, సంస్థకి క్షేమం. ఎవరిని పడితే వారిని తీసుకొని పనిలో పెడితే ఎంతో నష్టం జరుగుతుంది. వారిని అనేక విధాలుగా పరీక్షించాకే పనిలోకి తీసుకోవాలి.**

**భా**రతదేశంలో ఒక యోగ్యతా పరీక్ష పది రోజుల పాటు నడుస్తుంది. వ్రాత పరీక్షలో ఎంపికయిన వాళ్లనే ఈ పరీక్షకు పిలుస్తారు.

ఆ పది రోజులలో...

ఒక రోజు చదరంగంలాంటి పలు రంగుల గళ్లున్న గచ్చుమీద ఒక ఇరవై మీటర్ల దూరాన్ని ముప్ఫయి సెకన్లలో దాదాపు ప్రతి అడుగు ఆచితూచి, ఎంపిక చేసిన ఒకే రంగు గడిలో వేస్తూ వెళ్లాలి.

✦✦✦

దేశ సరిహద్దులో యుద్ధం కోసం పరుగెడుతూ ఉంటే, దారిలో ఒక గ్రామంలో బందిపోట్లు దాడిచేసి దోచు కుంటున్నారు. స్త్రీలపై అఘాయిత్యాలు చేస్తున్నారు. కేకలు, అరుపులు, మంటలతో గగ్గోలుగా ఉంది. అలాంటి సందర్భంలో 'నా పని కాదంటూ' యుద్ధం కోసం ముందుకే వెళ్తావా? బందిపోట్ల పని పడతావా? ఏది నీ ప్రాధాన్యము?

ఎందువల్ల ?

ఇలాంటి రెండు డజన్ల దాకా పరీక్షలను సేవావరణ

మండలి (Service Selection Board) వారు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు అయ్యాక మానసిక, శారీరక, సృజనాత్మక, దేశరక్షణ, తత్త్వశక్తి పరీక్ష వంటివి పది రోజులు పాటు జరుగుతాయి. ఇంత కఠోరమైన పరీక్షల్లోంచి ఎంపికయిన వాళ్లే దేశ రక్షణ వ్యవస్థలో అధికారులుగా నియమితులవుతారు. ప్రతి బాధ్యతా నిర్వహణ కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు తగిన పరీక్షలుంటాయి. ఉండాలి.

✦✦✦

ఏ ఉద్యోగానికైనా ముఖాముఖి పరీక్ష (ఇంటర్వ్యూ) ఉంటోంది కదా!

ఉద్యోగం ఏది అయినా, దానికోసం వేలాదిమంది పోటీ పడటం వింటూంటాం. సరైనవారిని ఎంపికజేయటం ఎలా సాధ్యం?

అవసరంలేని వాళ్లని వెనక్కి పంపించి, మనకి కావల్సినవాళ్లని ఎలా తీసుకోవాలి? వ్రాతపరీక్ష, సామూహిక చర్చ నిర్వహించి పరీక్షించి, వడపోసి (Filter) సత్తా ఉన్న పదిమందిని మాత్రమే తీసుకొంటారు కదా!

నాయకుని దగ్గర పనిచేసేవారందరికీ సామర్థ్యం ఒకే రకంగా ఉండదు. అన్ని పనులు అందరూ చేయలేరు. వాళ్ల నేర్పరితనం, నెమ్మదిగా అర్థం చేసుకున్న నాయకుడు వారివారి అభిరుచినిబట్టి, సామర్థ్యాన్నిబట్టి, నేర్పరితనాన్నిబట్టి ఆయా పనులు అప్పగించాలి. ఏ సంస్థకైనా బౌద్ధికంగా, శారీరకంగా పనిచేసేవాళ్లు అవసరం. బుర్ర ఎక్కువ ఉపయోగించనక్కర్లేని పనిని ఓ మేధావికి అప్పగిస్తే – ఇంతే సంగతులు!! ఎక్కువ రోజులు చేయడు, చేయలేడు.

వాల్మీకి రామాయణంలోని ఈ శ్లోకం ఈ విషయాన్ని చెబుతోంది.

శ్లో॥ **కచ్చిన్ముఖ్యా మహత్స్వేవ మధ్యమేషు చ మధ్యమాః**
**జఘన్యాశ్చ జఘన్యేషు భృత్యాః కర్మసు యోజితాః ॥**

*(వాల్మీకి రామాయణం, అయోధ్యాకాండ – 100/25)*

*మహత్తరమైన పనులు చేయటానికి ముఖ్యులను వినియోగిస్తున్నావా? మధ్యమస్థాయి పనులకు సామాన్య సామర్థ్యం ఉన్నవారిని వినియోగిస్తున్నావు కదా! తక్కువ సామర్థ్యం ఉన్నవారికి తక్కువ స్థాయి పనులు అప్పగిస్తున్నావు కదా!*

**ప్రలోభాలకు లొంగకు..**

ప్రధానమైన పదవులకు వ్యక్తులను ఎంపిక చేసేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలి. పూర్వకాలంలో ఓ మంత్రిని నియమించేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొనేవారు. ఎంతో బుద్ధిబలం, శరీర బలం ఉన్నవాళ్ళకు సహితం వాళ్లకు తెలియకుండా ప్రలోభాల పరీక్షలు పెట్టేవారు. ఈ ప్రలోభాలలో కాంతాకనకాలను కూడా ప్రయోగించేవారు.

ఎవరైతే ఈ ప్రలోభాలకు తట్టుకొని దేశభక్తి పరాయణులుగా నిలుస్తారో, వాళ్లనే ఎంపిక చేసేవారు. విజ్ఞులైన రాజులు ఈ విధానాన్నే పాటించేవారు. శ్రీరాముడు భరతునికి చెప్పిన ఈ విషయం చాలా ఆసక్తికరంగా ఉంది.

శ్లో॥ **అమాత్యానుపధాతీతాన్ పితృపైతామహాన్ శుచీన్,**
**శ్రేష్ఠాన్ శ్రేష్ఠేషు కచ్చిత్త్వం నియోజయసి కర్మసు ॥**

(వాల్మీకిరామాయణం – అయోధ్యాకాండ 100/26)

*"గుణవంతులైన తాతల, తండ్రుల పరంపరకు చెందినవారికి ప్రాముఖ్యము ఇవ్వాలి. ఇలా మంచి నడవడిక గలవారు, శ్రేష్ఠులు అయిన వ్యక్తులను 'అమాత్యునిగా' ఎంపిక జేస్తున్నావు కదా?" అని శ్రీరాముడు భరతుడిని అడిగాడు.*

కొన్ని రహస్యమైన పరీక్షలకు నిలిచి నిగ్గుతేరినవారిని మాత్రమే నాయకుడు ఉద్యోగులుగా నియమించాలి.

✦✦✦

**FINE TEAM**

జట్టులోని సహచరులకు - FINE – అనే నాలుగు లక్షణాలు ఉండాలని పెద్దలు చెప్పారు.

| | | |
|---|---|---|
| **F**inance | – | ఆర్థిక వనరులను సమకూర్చటం |
| **I**ntellectual Inputs | - | జ్ఞాన సహకారం |
| **N**etworking | – | కార్యకర్తల సమీకరణ |
| **E**vent Management | – | కార్యనిర్వహణ |

ఈ నాలుగు రకాల వ్యక్తులున్న బృందం విజయం సాధిస్తుంది.

ఉన్నత పదవులలోకి నియమించటానికి పూర్వకాలంలో ఎన్నో పరీక్షలు పెట్టేవారు. ఇవి చాణక్యుని అర్థశాస్త్రంలో విస్తారంగా ఇవ్వబడ్డాయి.

కీలకమైన పదవులకు, ఉద్యోగాలకూ సరైన వ్యక్తిని ఎంపికజేసే ఇంటర్వ్యూలలో ఏమేమి ప్రశ్నలు వేయాలి? ఏయే అంశాలలో ప్రావీణ్యమున్నవారిని ఎంపిక చేయాలి? అనే విషయాలు ఎంత ముఖ్యమో, వారి ప్రవర్తనపై నిఘా కూడా అంతే అవసరం.

అలా పరీక్షలకు నిలచినవారినే నాయకుడు చేరదీయాలి!

సేనాపతి పదవి ప్రాచీన భారత రాజ్యాంగ వ్యవస్థలో చాలా ప్రధానమైనది. (అది ఈనాటి ఆర్మీ చీఫ్‌తో సమానం). మహాభారతంలో నారదమహర్షి ధర్మరాజుకు ఎలాంటి లక్షణాలున్నవారు సేనాపతిగా ఉండటానికి అర్హులో ఈ విధంగా చెప్పాడు.

శ్లో॥ **కచ్చిద్ ధృష్టశ్చ శూరశ్చ మతిమాన్ ధృతిమాన్ శుచః ।**
**కులీనశ్చానురక్తశ్చ దక్షః సేనాపతిస్తథా॥**

*(మహాభారతం - సభాపర్వం - 5/47)*

*సేనాధిపతిగా వచ్చే వ్యక్తి మంచి కుటుంబంలో జన్మించినవాడై, ధైర్య శాలిగాను, పరాక్రమవంతుడుగాను, బుద్ధిశాలిగాను సంతోషంతోను, ఉత్సాహం తోనూ, రాజుయందు అనురాగంతోనూ ఉండి నేర్పరిగా ఉన్నాడా?*

ఇటువంటి ప్రధాన బాధ్యతలను స్వీకరించే వ్యక్తి ఉత్తమ లక్షణాలు కలిగి ఉంటే దేశానికి, సంస్థకి క్షేమం. ఎవరిని పడితే వారిని తీసుకొని పనిలో పెడితే ఎంతో నష్టం జరుగుతుంది. వారిని అనేక విధాలుగా పరీక్షించాకే పనిలోకి తీసుకోవాలి.

వారికి ఉండవలసిన అర్హతలను నారదమహర్షి మహాభారతంలో ఇంకా ఇలా వివరించాడు. సర్వకాలాలకు వర్తించే లక్షణాలివి..

1. దేశం ప్రథమం అని భావించేవారు
2. తనతో సమానమైన సామర్థ్యం, తెలివి ఉన్నవారు
3. పనిలో అనుభవం ఉన్నవారు
4. నిష్కల్మష హృదయులు
5. మంచి కుటుంబంలో జన్మించినవారు

6. సమర్ధవంతంగా అనేక విషయాలను ప్రతిపాదించే సామర్థ్యం, విశ్లేషణా జ్ఞానం ఉన్నవారు

ఇలాంటి కార్యసమర్థులను, సమాజ హితైషులను తనవద్ద సహాయకులుగా ఎంపిక చేసుకోగలగటం ఉత్తమ నాయకుని లక్షణం. తన వద్ద ఉన్న ఉద్యోగుల గురించిన సమాచారం యజమానికి తెలియాలి. వారివారి సామర్థ్యాన్ని బట్టి సంస్థలలో పనులు కేటాయించాలి.

✦✦✦

ఒక వ్యక్తి ఒక పనిని ప్రారంభించవచ్చు, కానీ దాన్ని పూర్తి చేయగలిగేది ఒక సమూహం (టీం) మాత్రమే. మామూలుగా నాయకులందరూ తమకు అనుకూలంగా ఉండేవారు, తమ కులస్థులు, తమ వర్గానికి చెందిన వారు, తమను ఆశ్రయించిన వారితో సమూహాన్ని తయారు చేస్తారు. దానివల్ల సాధించాల్సిన పనిని సాధించలేరు. అలాంటి సంకుచిత ధోరణితో ఏర్పడిన బంధాలు కేవలం ఆ నాయకుడి అహంకారాన్ని పెంచుతాయి. అవి ఎలాంటి ఫలితాలనూ సాధించలేవు. ఆ బృంద సభ్యులు తమ నేతపై పొగడ్తలు, ప్రశంసలు కురిపించడం తప్ప మరేమీ చేయరు. వారికి దేశం కోసం, ప్రజల కోసం పనిచేయడం తెలియదు. అందుకు కావలసిన సామర్థ్యం వారికి ఉండదు.

మంచి నాయకుడు – మంచి యోజకుడు కావాలి. ఎవరిని ఎక్కడ, ఎలా ఉపయోగించుకోవాలో ఎరిగినవాడే సమర్థమైన నాయకుడు. అటువంటి యోజకుడు చాలా అరుదుగా ఉంటాడని చెప్పే ప్రసిద్ధమైన శ్లోకం ఇది.

శ్లో॥ **అమంత్రం అక్షరం నాస్తి నాస్తి మూలమ్ అనౌషధమ్ ।**
**అయోగ్యః పురుషో నాస్తి యోజకస్తత్ర దుర్లభః ॥**

*మంత్రంగా పనికిరాని అక్షరం లేదు. ఔషధంగా పనికిరాని మూలిక ఉండదు. (సృష్టిలో) పనికిరాని మనిషి ఉండదు. ఏ అక్షరాలను జోడిస్తే ఏమి మంత్రం ఆవిర్భవిస్తుందో చెప్పే ఋషి; ఏ మొక్క ఏ మందుకు పనికి వస్తుందో చెప్పే ఆయుర్వేద శాస్త్రవేత్త, ఏ మనిషి ఏ బాధ్యతా నిర్వహణకు పనికి వస్తాడో గుర్తించే 'యోజకుడు' అరుదుగా ఉంటారు.*

✦

Strategy

## 4. రాజ్యానికి చెవులు... కళ్లు...

ఏ దేశమైనా సురక్షితంగా ఉండాలంటే, సరిహద్దుల దగ్గర రక్షించే సైన్యం ఎంత ముఖ్యమో, దేశమంతటా, దేశం బయటా విస్తరించిన 'గూఢచారి వ్యవస్థ' కూడా అంత ముఖ్యం.

పాకిస్తాన్‌లోని లాహోర్‌లో 1980 దశకంలో పెద్ద ఉత్సవం జరుగుతోంది. జనం పోటెత్తి ఉన్నారు.

ఓ యువకుడు జనాన్ని తప్పించుకొని నడుస్తున్నాడు.

ఓ పెద్దమనిషి అక్కడ నిలుచుని ఉత్సవాన్ని తిలకిస్తున్నాడు. ఆకర్షణీయమైన రూపంతో ఉన్నాడు ఆ యువకుడు.

తెల్లగడ్డంతో ఉన్న ఆ పెద్దమనిషి దూరంగా ఉన్న యువకుణ్ణి తన దగ్గరగా రమ్మని సైగ చేశాడు.

యువకుడు ఆ పెద్ద మనిషి దగ్గరకు సమీపించాడు.

"నువ్వు హిందువువా?" అని అడిగాడు ఆ పెద్ద మనిషి.

"అబ్బే.. కాదు" అని అన్నాడు ఆ యువకుడు ఏమీ తడుముకోకుండా.

ఆ పెద్దమనిషి చిన్నగా నవ్వాడు.

ఆ నవ్వుకి యువకుడు తన నవ్వు కలిపాడు.

పెద్దమనిషి తెల్లగడ్డాన్ని సవరించుకొంటూ ఆ యువకుడి భుజంపై చెయ్యి వేశాడు.

"నాతో రా!" అన్నాడు. రెండు మూడు గల్లీలు తిప్పి

ఓ ఇంటి తలుపు తాళం తీశాడు. యువకుణ్ణి లోపలికి రమ్మని తలుపు వేశాడు.

"నాకు తెలుసు నీవు హిందువువి. నేనూ హిందువునే.

నా కుటుంబం అంతా నాశనమై నేను మిగిలాను.

ఇదిగో నేను పూజించుకునే దేవుడు" అంటూ గూట్లో ఉన్న శివలింగాన్ని ఆ పెద్దమనిషి చూపించాడు. ఇంకా ఇలా అన్నాడు.

"నీలాంటి యువకులను చూస్తే నాకు ఆనందం. నీ చెవికి ఉన్న రంధ్రాలను బట్టి నిన్ను హిందువుగా గుర్తు పట్టాను. చిన్నతనంలో చెవులు కుట్టించే ఆచారం ముస్లిములకు లేదు. వెంటనే వాటిని ప్లాస్టిక్ సర్జరీతో పూడ్పించుకో" అని సలహా ఇచ్చాడు.

ఆ పెద్దమనిషి నిశిత దృష్టికి యువకుడు ఆశ్చర్యపడ్డాడు.

ఆ యువకుడు అజిత్ దోవల్. ఈయన తన ప్రాణానికి తెగించి శత్రుదేశమైన పాకిస్థాన్‌లో అనేక మారువేషాలతో ఏడు సంవత్సరాలు భారతీయ గూఢచారిగా పనిచేశాడు. ఇండియన్ జేమ్స్‌బాండుగా ప్రేమతో పిలుచుకొనే ఈ వీరుడిని భారతప్రభుత్వం 'కీర్తిచక్ర'తో గౌరవించింది.

ప్రస్తుతం అజిత్ దోవల్ కేంద్ర ప్రభుత్వ భద్రతా సలహాదారునిగా వ్యవహరి స్తున్నారు. ఎన్నో విజయాలను సాధిస్తున్నారు. ప్రధాని మోదీ-దోవల్ జోడీ శత్రు దేశాలకి వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

✦✦✦

భారత ప్రభుత్వ గూఢచారి వ్యవస్థ ఇప్పుడున్నంత సమర్థవంతంగా పనిచేసి ఉన్నట్లయితే క్రీ.శ.1962లో భారత్‌పై చైనా దాడిని ముందుగానే పసిగట్టి ఉండేవారం. చైనా దురాక్రమణను నిరోధించటం సాధ్యమయ్యేది.

ప్రభుత్వానికి చెవులు, కళ్ళు ఈ 'చారులు'. చారుల ద్వారా పాలకుడు విషయ సేకరణ చేస్తాడు. పూర్వకాలంలో పాలకులు మారువేషంలో ప్రజల్లోకి వెళ్ళి, స్వయంగా నిజాన్ని గ్రహించి తీర్పు చెప్పేవారు. పంచతంత్రంలోని ఈ శ్లోకం గూఢచారుల ప్రాముఖ్యమును తెలియజేస్తున్నది.

శ్లో॥ **గంధేన గావః పశ్యంతి వేదైః పశ్యంతి బ్రాహ్మణాః।**

**చారైః పశ్యంతి రాజానః చక్షుర్భ్యామితరే జనాః॥** *(పంచతంత్ర 3-68)*

*పశువులు వాసనతో గ్రహిస్తాయి. బ్రాహ్మణులు వేదాలద్వారా తెలుసుకొంటారు. రాజులకి దేశవ్యాప్తంగా విస్తరించివున్న గూఢచారులే నేత్రాలు. మిగతా సాధారణ జనులు కేవలం వారి కళ్లకి కనిపించినవే గ్రహిస్తారు.*

**అంతఃశత్రువులు ఉంటారు జాగ్రత్త !**

శత్రురాజ్యం ఏం చేయబోతోందో, అంతరంగంలో ఆ శత్రురాజ్య పాలకులు ఏమి భావిస్తున్నారో తెలుసుకోవటానికి ప్రతి దేశంలోనూ గూఢచారి వ్యవస్థ ప్రయత్నం చేయటం సహజం.

ఇలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం అనేది తెలివైన ప్రభుత్వాలు చేసే పని. శత్రు రాజ్యం నుంచి రహస్యాలు రాబట్టేందుకు నియమించబడినవారు మాతృదేశ వర్గాలకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, రహస్యంగా జీవిస్తూ, ప్రతిఫలం పొందుతూ ఉంటారు.

కొన్ని దేశాలు తాము నియమించుకున్న ప్రతినిధుల ద్వారా తమకు అనుకూల మైన పనులు చేయించుకొంటూ ఉంటారు. ఆ ప్రతినిధులకు సహితం తాము 'ప్రతినిధులమని' తెలియకుండా ఈ నియామకాలు జరుగుతాయి అంటే ఆశ్చర్యం కలుగుతుంది. తమకు ఉపయోగపడతారనుకున్నవారికి 'సర్' బిరుదులు, 'రావుబహద్దూర్' బిరుదులు ఇచ్చి బ్రిటన్ దురాక్రమణదారులు ఎందరో భారతీయ మేధావులను, సంపన్నులను లోబరచుకొన్నారు.

వారిలో కొందరు బ్రిటన్ ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేశారు. వర్తమానకాలంలో కూడా 'కొన్ని విదేశీయ విశ్వవిద్యాలయాలు, వారు 'గుర్తించిన' వారిని ఏదో వంకతో తమ దేశానికి పిలవటం, గౌరవ డాక్ట'రేటు'లు ఇవ్వటం, 'భారత వ్యతి రేకంగా' దళారీల (గ్రూప్‌ల) ను నడిపించటం చేస్తున్నారు. 'బౌద్ధిక బీభత్సకారుల' (అర్బన్ నక్సల్స్) ఆగడాలు కొన్ని కథలు కథలుగా బయటపడుతున్నాయి. అయితే అన్నీ ఎప్పటికీ బయటపడవు. (రాజీవ్ మల్హోత్రా, అరవిందన్ నీలకందన్ వ్రాసిన "భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు" (Breaking India) పుస్తకంలో ఇటువంటి వివరాలు ఎన్నో లభిస్తాయి.)

ప్రభుత్వాలు, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు ఇటువంటి బౌద్ధిక బీభత్స కారులతో, నయవంచకులతో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

దూరదృష్టిగల నాయకుడు జాతీయ హితాన్ని నీరుగార్చిన వాళ్లపై, ప్రచ్ఛన్న విద్రోహులపై ఓ కన్నువేసి వుంచాలి.

**అంతర్గత అరక్షత**

ఏ దేశమైనా సురక్షితంగా ఉండాలంటే, సరిహద్దుల దగ్గర రక్షించే సైన్యం ఎంత ముఖ్యమో, దేశమంతటా, దేశం బయటా విస్తరించిన 'గూఢచారి వ్యవస్థ' కూడా అంత ముఖ్యం. ప్రభుత్వ ఉద్యోగులలో 'దేశద్రోహు'లుంటే ఎంత ప్రమాదమో! అటువంటివారిని ఏరివేయాలంటే గూఢచర్య వ్యవస్థ అవసరం. 'ఉపధ' పేరిట చాణక్యుడు వివరించిన గూఢచారి వ్యవస్థ అర్థశాస్త్రంలో ఓ పెద్ద అధ్యాయము! అంతర్గత సురక్షకై ఉపాయం 'ఉపధ'.

'ఉపధ' అంటే ప్రలోభాలు పెట్టి పరీక్షించడం (రహస్య పరీక్ష) అని అర్థం. ప్రభుత్వం నియమించిన, నియమించదలచిన ప్రధాన వ్యక్తులపై ఈ నిఘా ఉండాలని చాణక్యుడు నిర్దేశించాడు. వాళ్లను ఎప్పటికప్పుడు రకరకాల పరీక్షలకు గురిచేసి వారిని ఆ పదవిలో ఉంచాలో లేదో తేల్చేవి ఇటువంటి రహస్య వ్యవస్థలు. రాజు, పురోహితుడూ కలిసి నిర్వహించే వ్యవస్థ ఉపధ.

చాణక్యుడు ఈ ఉపధను నాలుగు తరగతులుగా విభజించాడు. అవి–

***ఆ**ధునిక యుగంలో మన భారత గూఢచారి సంస్థలు మన దేశానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను గుర్తించడానికి చాలా కష్టాలు పడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా దీని దుష్ఫలితాలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి, ప్రపంచవ్యాప్తంగా కూడా గూఢచర్య వైఫల్యం వల్ల చాలా ప్రమాదకరమైన పరిణామాలు సంభవిస్తున్నాయి. రెండు దశాబ్దాల కాలంలో జరిగిన అనేక బాంబు దాడులు, పార్లమెంటుపై దాడి, యూరి సైనిక స్థావరంపై దాడి ఇందుకు ప్రబల ఉదాహరణలు. డిసెంబర్ 1941లో అమెరికాకు చెందిన పెరల్ హార్బర్‌పై జపాన్ దాడి, బంగ్లాదేశ్ అధ్యక్షుడు షేక్ ముజీబుర్ రహ్మాన్ హత్య, మన ప్రధానమంత్రులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల హత్యలు, అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై జరిగిన విమానబాంబుల దాడి మొదలైనవి గూఢచర్య వ్యవస్థ పూర్తి వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనాలు.*

1. **ధర్మోపథ :** ధర్మం పేరిట – రాజుకు వ్యతిరేకులెవరో గుర్తించటం.
2. **అర్థోపథ :** ధనం –ఆశ చూపించి చేసే పరీక్ష – ఎవరు ఈ పరీక్షకి నిలబడితే వారు డబ్బు ఆశకు లొంగని 'శుచి' స్వభావులు. అంటే నిజాయితీపరులు.
3. **కామోపథ:** లైంగిక ప్రలోభాలకు లోబడుతున్నాడా లేదా అని చేసే పరీక్ష. వర్తమాన కాలంలో దీన్ని 'హనీ ట్రాప్' (Honey Trap) అంటున్నారు.

ఈ ప్రలోభాలకు లొంగని వారిని మాత్రమే విధి నిర్వహణలో వినియోగించాలి.

4. **భయోపథ :** ప్రభుత్వ వ్యతిరేక విద్రోహకాండను సమర్థించాలని కోరుతూ ప్రలోభాలను చూపించటం అనేది భయోపథ. ఇలాంటి ప్రలోభాలకు కూడ దేశభక్తి, రాజ్యాంగ నిష్ఠ ఉన్నవారు లొంగరు.

పై నాలుగు ఉపథలను అమలుపరచటానికి కావలసిన గూఢచారులను చాణక్యుడు తొమ్మిది రకాలుగా విభజించాడు.

అందరిదీ ఒక్కటే లక్ష్యం! పాలకులకు చెవులుగా, కళ్లుగా వ్యవహరించటం, దేశపరిస్థితులని వివరించటం ఈ గూఢచారుల కార్యక్రమం.

మంచి పాలనకు తూట్లు పొడిచే అవినీతిపరుల భరతం పట్టడం, రాజ్య వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే (ఇప్పటి నక్సల్స్‌లాంటి, ఐ.ఎస్.ఐ.ఏజెంట్లులాంటి) వ్యక్తులను, ముఠాలను పసిగట్టి పట్టుకోవడం ఈ గూఢచర్య వ్యవస్థ లక్ష్యం.

### సుపరిపాలన

*సుపరిపాలనను కచ్చితంగా నిర్వచించడం కష్టం. సుపరిపాలన అంటే న్యాయం చేయడం, సాధికారతను ఇవ్వడం, ఉపాధి కల్పించడం, సామాజిక ఆర్థిక సేవలందించడం. సుపరిపాలన అంటే న్యాయాన్ని చట్టాన్ని గౌరవించడం, జవాబుదారీతనం, పారదర్శకత, సమానత, మానవ హక్కులు, గౌరవపూరిత వ్యవహారం అని కూడా నిర్వచించవచ్చు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సుపరిపాలనలో నాలుగు ప్రధాన అంశాలుంటాయని పేర్కొంది.*

*అవి – జవాబుదారీతనం; పారదర్శకత; రానున్న విషయాలను ముందస్తుగా ఊహించగలగడం; దేశ భద్రత, ఆర్థిక ప్రగతి, సంక్షేమ పథకాల రూపకల్పన, వాటి నిర్వహణలో ప్రజలను భాగస్వాములను చేయటం.*

## నమ్మకద్రోహం

**దౌ**త్య కార్యాలయమనేది దేశాల మధ్య స్నేహ సంబంధాలను సుదృఢం చేసుకోవడానికి కల్పించుకున్న ఒక వ్యవస్థ. కానీ.. పాకిస్తాన్ దౌత్య కార్యాలయం దీని అర్థాన్ని పూర్తిగా మార్చేసింది. ఢిల్లీలోని పాక్ దౌత్య కార్యాలయాన్ని పాక్ గూఢచారి వ్యవస్థ (ఐ.ఎస్.ఐ) కు ఆలవాలంగా మార్చేసింది. భారత్ నిఘా వర్గాలకు (జూన్ 1వ తేది, 2020 నాడు) ఐఎస్ఐ ఏజెంట్లు పట్టుబడ్డారు.

పాకిస్తాన్ హైకమిషనర్ కార్యాలయంలో వీసాలు జారీ చేసే అధికారులుగా పనిచేస్తున్న తహీర్‌ఖాన్, అబీద్‌హుస్సేన్ అనే ఇద్దరు పైకి పాక్ దౌత్యకార్యాలయ అధికారులుగా నటిస్తూ భారతదేశ సైన్య రహస్యాలను సేకరించటమే లక్ష్యంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని భారత్ నిఘా వర్గాలు గుర్తించాయి.

ఢిల్లీలోని ఒక రెస్టారెంటులో వీరిద్దరూ పాకిస్తాన్ గూఢచారి సంస్థ (ఐ.ఎస్.ఐ.)కు చెందిన మరొక వ్యక్తికి, కొన్ని రహస్య పత్రాలను ఇస్తుండగా మన అధికారులు వలవేసి పట్టుకున్నారు. వీరి నుంచి కీలక పత్రాలను ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మన ప్రభుత్వం విచారించి అబీద్ హుస్సేన్, తాహీర్ ఖాన్‌లకు పది సంవత్సరాలపాటు దేశ బహిష్కరణ శిక్ష విధించింది. ✦

### 'రా'మరాజ్యానికి రక్ష

**మ**హాభారతంలో సుప్రసిద్ధమైన 'యక్ష ప్రశ్నల ఘట్టం'లో యక్షుడు అడిగిన ఓ ప్రశ్నకు ధర్మరాజు ఇలా జవాబు చెప్పాడు-

Research and Analysis Wing

धर्मो रक्षति रक्षित

శ్లో॥ **ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః**
**తస్మాద్ధర్మం న త్యజామి మానో ధర్మోహతోஉ వధీత్**
(మహాభారతం, వనపర్వం, 313/128)

ధర్మాన్ని అణగదొక్కితే అది దానిని అణచి వేస్తుంది. ధర్మాన్ని రక్షిస్తే అది రక్షిస్తుంది. అందుచేత నేను(ధర్మరాజు) ధర్మాన్ని త్యజించను. ఎందువల్లనంటే నేను ధర్మాన్ని నాశనం చేస్తే అది మ్రింగి వేస్తుంది.

ఈ శ్లోకంలో ఉన్న **'ధర్మో రక్షతి రక్షితః'** అన్న శ్లోక భావాన్ని ధ్యేయ వాక్యంగా స్వీకరించిన వ్యవస్థ మన దేశ రక్షణ నిఘా-విశ్లేషణ విభాగం **'రా'.**

RAW అంటే రీసెర్చ్ & అనాలసిస్ వింగ్. శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో ఈ వ్యవస్థ ప్రారంభించబడింది.(21-9-1968)

ప్రధాన మంత్రి, జాతీయ సురక్ష సలహాదారుల పర్యవేక్షణలో ఈ విభాగం పని చేస్తుంది. ఎందరో విశ్లేషకుల ప్రశంసలు పొందిన సంస్థ 'రా'.

**మనల్ని మనం గమనించుకోవలసిన విషయాలు**

మహాభారతంలో ఉద్యోగ పర్వంలో విదురుడు "పండితులెవరు? మూఢులు ఎవరు?" అనే విషయాన్ని చాలా విస్తారంగా వివరించాడు. (మహాభారతం - ఉద్యోగపర్వం - 33) ఇది మనకో స్వచ్ఛంద పరీక్ష.

## పండితుడు

✦ దుఃఖాలు ఓర్చుకొనే శక్తి కలిగినవాడు.
✦ మంచి పనులు చేసేవాడు.
✦ నాస్తిక ఆలోచనలు లేనివాడు.
✦ శ్రద్ధ కలిగినవాడు
✦ తన శక్తికి తగినట్లుగా ఏ పనైనా చెయ్యాలనుకునేవాడు.
✦ తన ఆలోచనను ఆర్భాటం లేకుండా అమలు చేసేవాడు.
✦ ఇతరులు అడిగితే తప్ప వాళ్ల విషయాల్లో జోక్యం చేసుకోనివాడు.
✦ పోయిన దానిని గురించి చింతించని ధీరుడు.
✦ ఆరంభించిన పనిని మధ్యలో వదలకుండా ఉండేవాడు.
✦ ఆపదలు వచ్చినప్పుడు కంగారు పడనివాడు.
✦ సత్కారాలకు లొంగిపోనివాడు. అవమానానికి క్రుంగిపోనివాడు.
✦ ఏ విషయాన్నయినా ఇట్టే గ్రహించేవాడు.
✦ సమయాన్ని వృథా చేసుకోనివాడు.
✦ పెద్దల మాటను గౌరవించేవాడు.
✦ సమయస్ఫూర్తి కలవాడు.
✦ దేనినీ చులకన చేయనివాడు.

## మూఢుడు ఎవడు?

✦ అవసరమైన పనిని నిర్లక్ష్యం చేసి అనవసరమైన పనిలో నిమగ్నమయ్యేవాడు.
✦ తనను ఇష్టపడేవారిని దూరం చేసుకొనేవాడు.
✦ తనకన్నా బలవంతునితో విరోధం పెట్టుకొనేవాడు.
✦ తాను చేయవలసిన పనిని ఇతరులకు పురమాయించేవాడు.
✦ పిలవని పేరంటానికి వెళ్లేవాడు.
✦ పని చేయకుండా ఫలితాన్ని పొందాలని ఆశపడేవాడు.
✦ శత్రువుని మిత్రుడిగా భ్రమించి - మిత్రుణ్ణి ద్వేషించేవాడు.
✦ పితృదేవతలకు శ్రాద్ధం పెట్టనివాడు, దేవతలను పూజించనివాడు. ✦

*Time Management*

## 5. కార్యాచరణలో కాలహరణం కూడదు

**దే**శహితం కోరుకునే నాయకునిలో సరైన సమయం లో సరియైన నిర్ణయాన్ని నాన్చకుండా తీసుకునే ధైర్యం, సమర్థత ఉండాలి.

'దీర్ఘసూత్రత' (పనులు వాయిదా వేసే గుణం) నాయకులకు ఉండరాదు.

'సకాలంలో ఒక కుట్టు వేస్తే ఆ తర్వాత తొమ్మిదిసార్లు కుట్టే ప్రమాదం తప్పుతుంది' (A stitch in time saves nine) అనేది ఆంగ్ల సామెత. గోరుతోపోయే దానికి గొడ్డలి అవసరం వచ్చేలా చేసుకోకూడదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత క్రీ.శ. 1951లో దేశంలో ఆరు లక్షల మంది చొరబాటు దారులున్నట్లు అప్పటి ప్రధాని నెహ్రూ పార్లమెంటులో ప్రకటించినా, వారిని తిప్పి పంపే విషయంలో చేసిన తాత్సారం దేశభద్రతకు చేటు తెచ్చింది.

**చాలా ఆలోచనలు నాయకత్వం లోపం వల్ల అటక ఎక్కేస్తాయి. సరైన పనిని సరైన సమయంలో చేయకపోవటం వల్ల దేశానికి అనేక నష్టాలు జరిగిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి.**

కశ్మీర్‌లో కొనసాగిన బీభత్సం వేలాది మంది సైనికులని బలికొంది. లక్షలాది మందిని మతోన్మాద సర్పం కాటేసింది.

సమర్థత లేని నాయకుల దీర్ఘసూత్రత వల్ల దేశం

కోలుకోలేనంత నష్టపోయింది.

తాత్కాలికం అని రాజ్యాంగం స్పష్టం చేసిన 370వ ఆర్టికల్ రద్దు, రాజ్యాంగం నిర్దేశించిన గోవధ నిషేధం, అధికార భాష అమలు మొదలగు ప్రధాన అంశాలను వాయిదావేస్తూ పదిహేడు సంవత్సరాలు నెహ్రూ గడిపాడు.

'దీర్ఘసూత్రత'కి జవహర్‌లాల్ నెహ్రూ నిలువెత్తు నిదర్శనం.

ఒక ఆలోచన చేయటానికీ – దాన్ని అమలు పరచటానికీ మధ్య జాప్యం లేకుండా రంగంలోకి దిగటం ఉత్తమ నాయకుని లక్షణం.

నాయకులకు ఉండాల్సిన లక్షణం – నిశ్చయించిన కార్యక్రమాన్ని జాప్యం లేకుండా ప్రారంభించటం.

రామాయణంలో ఇదే విషయాన్ని వాల్మీకి మహర్షి ప్రస్తావించాడు.

శ్రీరాముడు వనవాసానికి వెళ్లిపోయాడు – భరతుడు అన్నగారైన శ్రీరాముడిని వెతుక్కుంటూ వెళ్లి కలుసుకున్నాడు.

అప్పుడు శ్రీరాముడు తమ్ముణ్ణి ఇలా ప్రశ్నించాడు.

శ్లో॥ **కచ్చిదర్థం వినిశ్చిత్య లఘుమూలం మహోదయమ్ ।**
**క్షిప్రమారభసే కర్తుం న దీర్ఘయసి రాఘవ॥**

(రామాయణం, అయోధ్యాకాండం 100/19)

*భరతా! స్వల్పమైన ప్రయత్నంతో, అధికమైన ఫలితాన్ని పొందే నీ ఆలోచనకి, కార్యరూపం ఇచ్చి, అమలు పరచటానికి ఆలస్యం చేయటం లేదు కదా! వెంటనే ప్రారంభం చేస్తున్నావు కదా!*

చాలా ఆలోచనలు నాయకత్వం లోపం వల్ల అటక ఎక్కేస్తాయి. మనదేశంలో అనేకచోట్ల శంకుస్థాపనల శిథిలాలు దర్శనమిస్తాయి. ఆర్భాటంగా మొదలై ఆ తర్వాత గాలికి పోయిన పథకాలు (ప్రాజెక్టులు) ఆయా నాయకుల వైఫల్యానికి ఉదాహరణంగా నిలచి వున్నాయి. సరైన పనిని సరైన సమయంలో చేయకపోవటం వల్ల దేశానికి అనేక నష్టాలు జరిగిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం నియమించిన ఎన్నో అధ్యయన సంస్థలు (కమిషన్‌లు), నిర్వహించిన సర్వేక్షణలు (సర్వేలు), రూపొందించిన నివేదికలు (రిపోర్టులు) అమలుకు నోచుకోక చెదలు పట్టిపోయాయి.

✦✦✦

**గురూజీ హెచ్చరిక..**

"నీ తెలివి కన్నా నా పిచ్చితనం మిన్న" – My madness is better than your wisdom– అన్నారు శ్రీ మాధవరావు సదాశివరావు గోళ్వల్కర్ (శ్రీగురూజీ). వారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ద్వితీయ సర్ సంఘ్ చాలక్.

చైనా దురాక్రమణ తర్వాత జరిగిన ఓ పత్రికా సమావేశంలో, 'బ్లిట్జ్' పత్రికా ప్రతినిధిపై గురూజీ ఆ వ్యంగ్య బాణం వదిలారు.

నెహ్రూ ప్రధానిగా కల్పనా లోకంలో ప్రయాణిస్తున్న రోజులు అవి.

"హిందీ చీనీ–భాయి–భాయి" అంటూ నెహ్రూ నినదిస్తూ, పంచశీల సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న రోజుల్లో (క్రీ.శ. 1958 లోనే) గురూజీ అనేక సభలలో "మనం జాగరూకులమై ఉండాలి. చైనా మన సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణం చేస్తోంది. చైనా మనపై దండయాత్ర చేయటానికి ప్రయత్నిస్తోంది" అనిహెచ్చరించారు.

దానికి నెహ్రూ నుంచి, నెహ్రూ భక్త పత్రికల నుంచి చాలా వ్యతిరేకత వచ్చింది. కమ్యూనిస్టులు గురూజీని యుద్ధోన్మాది (War monger) గా వర్ణించారు.

"గోళ్వల్కర్‌కి యుద్ధోన్మాదం పట్టింది. మనం చేస్తున్న ఈ ఉత్సవాలు వీరికి కంటగింపుగా ఉన్నాయి" అని నెహ్రూ అన్నాడు.

బ్లిట్జ్ పత్రిక సంపాదకీయంలో "ఆర్.ఎస్.ఎస్. గురూజీకి పిచ్చి పట్టింది" (Guruji has gone mad) అని వ్రాసారు.

చైనా 1962లో మనదేశంపై దురాక్రమణ చేసింది. అప్పుడు బ్లిట్జ్ పత్రిక వ్రాసిన 'పిచ్చి' వ్రాతలకి గురూజీ చెప్పిన జవాబే "నీ తెలివి కన్నా నా పిచ్చితనం మిన్న".

గురూజీ చెప్పిన మాటలను కొట్టిపారేయకుండా అప్పటి ప్రధానమంత్రి తగు చర్యలు తీసుకొని ఉంటే చైనా మన దేశాన్ని దురాక్రమించగలిగి ఉండేది కాదు. నెహ్రూ అసంబద్ధతమైన దీర్ఘసూత్రత, అజాగ్రత్త వల్ల భారతదేశం భూభాగాలను, అనేకమంది వీర సైనికులను కోల్పోయింది.

✦✦✦

అఖండ భారత విభజన జరిగిన తరువాత మన ప్రధాని నెహ్రూకు, పాకిస్తాన్ ప్రధాని లియాఖత్‌కు మధ్య 1950వ సంవత్సరంలో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రెండు దేశాలలోని అల్పసంఖ్యాక (మైనారిటీ) ప్రజలకు పూర్తి

రక్షణ, పౌరసత్వపు హక్కులు కల్పించాలన్న నిబంధన ఏర్పడింది.

భారతదేశంలో ఉన్న మైనారిటీలకు పూర్తిరక్షణ, రాజ్యాంగ హక్కులు లభిస్తు న్నాయి. అంతేకాక వాళ్లను సంతృప్తి పరచటానికి ప్రత్యేక సౌకర్యాలు, హక్కులు కూడా భారత రాజ్యాంగంలో పొందుపరిచారు.

కానీ, ఈ ఒప్పందాన్ని పాకిస్తాన్‌లో అమలు జరిపించటానికి నెహ్రూ ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. అందువల్ల నేటి పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలోని మైనారిటీ ప్రజలైన హిందువులు భయంకర కష్టనష్టాలకు గురి అవుతున్నారు. ఆ ప్రాంతాల నుంచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వచ్చినవారికి మనదేశం లోనూ సరైన సదుపాయాలు కల్పించలేదు. నెహ్రూ దీర్ఘసూత్రతకు నిలువెత్తు ఉదాహరణ ఇది. ✦

### పరిఢవిల్లిన హిందూదేశం

**మె**కాలే గుడ్డితనానికి విరుద్ధంగా ఎడ్మండ్ బర్క్, ఈ దేశ ఔన్నత్యాన్ని, ఈ దేశ సంస్కృతినీ అర్థం చేసుకున్నాడు.

ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రొప్రయిటర్‌గా తనతోటి ఇంగ్లీషువారిని ఈ విధంగా మందలించాడు.

"ఈ దేశంలో (భారతదేశంలో) లోపాలుంటే ఉండవచ్చుగాక. కానీ మనం నిన్న పురుగులా పుట్టాం. వాళ్లు ఎప్పుడో శాసనాలనీ, సంస్థలనీ ఏర్పరచు కున్నారు. శత్రురాజులు రాజ్యాలు ఏలినంత కాలం, వారు ఒకే విధమైన నియమానికి కట్టుబడి ఉండటం వారి స్థైర్యాన్ని చెబుతోంది. వాళ్ళు– మహమ్మదీయుల,పోర్చుగీసుల మత దురభిమానాన్నీ; టార్టారులూ, అరబ్బీయుల క్రూరత్వాన్ని, ఇంగ్లీషు రాజ్య అత్యాశని చవి చూశారు. మనం మన ఆలోచనల ఇరుకు పరిధిలోకి వారిని లాగకూడదు. హిందూమతం విస్తరించిన చోట, దేశం పరిఢవిల్లుతోందనేది అన్నీ నొక్కి చెపుతున్నాయి. పౌర సంబంధమైన మతపర విధానాలు కలసిన విధానం వారి ప్రజలను ఆనందంగా ఉంచుతోంది, దేశాన్ని అభివృద్ధి పరుస్తోంది".

*Talent Management*

## 6. దూత ఎలా ఉండాలి !

**'దూత'** అనగానే మనకు మొదట గుర్తొచ్చేది శ్రీరామ దూత అయిన శ్రీఆంజనేయస్వామి.

శ్రీమద్రామాయణంలో దూతకు ఉండవలసిన లక్షణాలను ఇలా చెప్పారు.

ఇప్పటికీ అన్వయమవుతున్న లక్షణాలు ఇవి.

శ్లో॥ **అనురక్తః శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్।**
**వపుష్మాన్ వీతభీర్వాగ్మీ దూతో రాజ్ఞః ప్రశస్యతే॥**

*(మనుస్మృతి - 7.64)*

*ప్రభువు ఎడల గౌరవంతో కూడిన ప్రేమకలవాడు, పవిత్రత (నిజాయితీ) ఉన్నవాడు, సమర్థత కలవాడు, జ్ఞానవంతుడు, దేశకాలతత్త్వం, సమకాల ఔచిత్యం తెలిసినవాడు, భౌగోళిక పరిజ్ఞానం ఉన్నవాడు, మంచి రూపం కలిగినవాడు, భయం లేనివాడు, మంచి వాక్ పటుత్వం ఉన్నవాడు మంచిదూతగా పేరు తెచ్చు కొంటాడు.*

మనసు నిలకడలేని దూతలు, తాము చేస్తున్న ప్రదే శాన్ని, ఉన్న సమయం సందర్భాన్ని చూసుకోకుండా ప్రవర్తిస్తే చేయాల్సిన పనులు చెడిపోతాయి.

**మనసు నిలకడలేని దూతలు, తాము చేస్తున్న ప్రదేశాన్ని, ఉన్న సమయం సందర్భాన్ని చూసుకోకుండా ప్రవర్తిస్తే చేయాల్సిన పనులు చెడిపోతాయి.**

దూతకు ఉండాల్సిన మరో ఎనిమిది లక్షణాలను విదురుడు పేర్కొన్నట్లు మహాభారతంలో వివరించారు.

శ్లో॥ **అస్తబ్ధమక్లీబమదీర్ఘసూత్రం,**
**సానుక్రోశం శ్లక్ష్ణమహార్య మన్యైః**
**అరోగజాతీయముదారవాక్యం**
**దూతం వదంత్యష్టగుణోపపన్నమ్॥** *(మహాభారతం, ఉద్యోగపర్వం–37/27)*

*దూతగా నియమించదలచిన వ్యక్తులకు కావలసిన అర్హతలు :*

- ✦ *గర్వంలేని వ్యక్తులు.*
- ✦ *సమర్థత కలిగినవారు.*
- ✦ *పనిని సాగదీయకుండా, వాయిదా వేయకుండా చేసే వ్యక్తులు.*
- ✦ *పరోపకార లక్షణం, దయా గుణం ఉన్నవారు.*
- ✦ *అందరికీ ఇష్టమైనవారు.*
- ✦ *ధన కనక వస్తు వాహనాలకు, మిగతా ప్రలోభాలకు లొంగిపోకుండా ఉండేవారు.*
- ✦ *శరీర దృఢత్వం ఉన్న ఆరోగ్యవంతులైన వ్యక్తులు.*
- ✦ *మర్యాదపూర్వకంగా మాట్లాడేవారు.*

✦

శ్లో॥ **కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్ ।**
**పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తుమర్హతి ॥**

*(సుందరకాండ – 41/5)*

*(యజమాని ఆజ్ఞాపించిన) పని సాధించటంలో కొన్ని అనుబంధమైన పనులను సహితం చేసుకొనివచ్చి పనిని విజయవంతంగా పూర్తి చేసేవాడే సమర్థుడు, క్రియాశీలుడు.*

***"ఘాతయన్తి హి కార్యాణి దూతాః పండితమానినః ।"***

*(సుందరకాండ 2/40)*

*తామే తెలివైనవారమని అహంకరించే వారు దూతలు చేయాల్సిన పనిని చెడగొడతారు.*

Time Management

## 7. కాలమే పరిష్కారం

**చి**న్న కష్టం కలిగితే ఏ మాత్రము సహించలేక ఏ ఆత్మహత్యో చేసుకోవడం, లేదా ఇతరులను హత్య చేయడం వంటి ప్రవృత్తి ఈనాడు ఎక్కువ అవుతోంది. జీవితానికి ఉత్తమాదర్శం అనేది ఒకటి లేకపోవడమే దీనికి కారణం. కష్టాలు రాని మానవుడుండడు. వాటిని సహించే శక్తిని పెంపొందించుకోవడమే మానవుని గొప్పదనానికి నిదర్శనం. దశరథుని కుటుంబంలోని వారు, ధర్మరాజు కుటుంబంలో వారు ఎంత కష్టం అనుభవించారో! అయినా ఎంత ధైర్యంగా సహించారో చదివిన వాళ్ళు ఈ శక్తిని పెంపొందించుకో గలుగుతారు. ప్రతి ఒక్కరికి సీతాదేవి హనుమంతునితో చెప్పిన మాటలు అడుగడుగునా ధైర్యం ఇస్తాయి.

శ్లో॥ **ఐశ్వర్యే వా సువిస్తీర్ణే వ్యసనే వాతిదారుణే ।**
**రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాన్త: పరికర్షతి ॥**

(సుందరకాండ 37.3)

*ఒక్కోసారి అత్యధిక ఐశ్వర్యంలోకి, మరోసారి అతి భయంకరమైన కష్టాలలోకి మానవుణ్ణి, తాడు కట్టి ఈడ్చినట్లుగా విధి – దైవం – లాగుతూ ఉంటుంది.*

✦✦✦

**శిశిరంలో ఆకులన్నీ రాలిపోయిన రావిచెట్టు మోడువారుతుంది. దాని జీవితం అయిపోయిందా? అనిపిస్తుంది. కానీ కాలం మారగానే, మళ్లీ చిగుళ్లు తొడుగుతుంది. కష్టాలు శాశ్వతం కావు. కాలం మారుతుంది.**

కలియుగం నలభై ఏడవ శతాబ్ది – క్రీస్తుశకం పదహారవ శతాబ్దిలో ఈ భారత భూమి మీద ఒక మహా వీరుడుండేవాడు. అతని అండదండలతో అనేక మంది హిందూ రాజులు మొగలాయి అక్బర్‌ను ఎదిరించేవాళ్లు.

అక్బర్‌కు అతనంటే సింహస్వప్నం. తన బీభత్స సామ్రాజ్యాన్ని విస్తరించాలంటే, ఆ మహావీరుణ్ణి లొంగదీసుకోవాలి, లేదా అతని రాజ్యాన్ని గెలిచి తీరాలి లేదా అతన్ని వధించాలి – అన్నది అక్బర్ పన్నాగం.

అనేక ప్రయత్నాలు విఫలమయ్యాక, కొందరు వెన్నుపోటుదారుల సహాయంతో అక్బర్ సైన్యాలు ఆ వీరుడి రాజ్యం మీద మళ్లీ దాడి చేశాయి.

అతన్ని ఓడించాయి. కోట స్వాధీనం చేసుకున్నాయి.

ఆ మహావీరుడు రేపటిమీద నమ్మకంతో, అక్బర్ సైన్యాలకి చిక్కకుండా అరణ్యాల్లో అజ్ఞాతంగా తలదాచుకున్నాడు. అతడే రాణా ప్రతాపసింహుడు.

మహావీరుడైన మేవాడ్ రాజు రాణా ప్రతాపుడు, ఎల్లలు దాటి వచ్చిన మ్లేచ్ఛుల చేతిలో ఓటమి భరించి జీవించగలడా?

కాని, మహాభారతంలో అరణ్యపర్వంలోనూ, శాంతిపర్వంలోనూ ధర్మరాజుకు వ్యాసమహర్షి చేసిన బోధను ఆకళింపు చేసుకున్న జ్ఞాని రాణా ప్రతాపుడు.

అందుకే ధైర్యం కోల్పోకుండా వనవాసులైన భిల్లుల్ని చేరదీశాడు. సహజంగా దేశభక్తులైన భిల్లు గిరిజనులను తన సైనికులుగా తీర్చిదిద్దాడు. సమయం చూసి, మొఘల్ సైన్యాల మీద దాడిచేశాడు. చిత్తోడ్ మినహా మిగిలిన కోటలన్నీ తిరిగి దక్కించుకొన్నాడు.

ఆ పరిణామ క్రమం ఏం చెబుతోంది? రోజులన్నీ ఒకేరకంగా ఉండవని!

శిశిరంలో ఆకులన్నీ రాలిపోయిన రావిచెట్టు మోడువారుతుంది. దాని జీవితం అయిపోయిందా? అనిపిస్తుంది. కానీ కాలం మారగానే, వసంత ఋతువు రాగానే రావిచెట్టు మళ్లీ చిగుళ్లు తొడుగుతుంది. చూస్తూ చూస్తూండగానే పచ్చదనం పరచుకుంటుంది. కష్టాలు శాశ్వతం కావు. కాలం మారుతుంది.

“వాడిన బ్రతుకులు పచ్చబడతాయి” అనే సత్యం తెలుసుకొమ్మంటోంది రాణా ప్రతాపుని చరిత్ర.

✦✦✦

**ఏ నిమిషానికి ఏమి జరుగునో..?**

పి.వి. నరసింహారావుగారు ఢిల్లీనుంచి తన నివాసాన్ని హైదరాబాదుకు మార్చుకొని, రాజకీయ సన్న్యాసం చేద్దామనుకుంటున్న సమయం–

కొద్దికాలంలో కుర్తాళం పీఠానికి అధిపతిగా వెళ్ళటానికి అంటే సన్న్యాసం (నిజమైన) తీసుకొనే ప్రయత్నంలో ఉన్నారు. ఆయనకున్న ఆస్తి ఆయన పుస్తకాలు మాత్రమే. తన గ్రంథాలయాన్ని కూడా ఢిల్లీ నుంచి హైదరాబాదు పంపేశారు. ఢిల్లీకి వీడ్కోలు చెప్పేందుకు మానసికంగా సిద్ధమైన సమయంలో, రాజీవ్ గాంధీ హత్య జరిగింది. కాంగ్రెస్‌లో అనిశ్చిత పరిస్థితి ఉంది. ఎవరి వెనకాలా పదిమంది పార్లమెంటు సభ్యులు లేరు. పి.వి. నరసింహారావు గారి పరిస్థితి కూడా అదే. అంగ, అర్థ బలం లేదు. కానీ పి.వి. నరసింహారావు గారు అజాతశత్రువు. ఆయనకి 'పదవి ఇవ్వాలి' అని అడిగే వారెవరూ లేరు. ఆయనకు ఇస్తామంటే వద్దనేవాళ్లెవరూ కూడా లేరు.

"ఈయన అయితే నా మాట జవదాటరు" అని ఎవరికి వారే అనుకొని ఆయనను పార్టీ అధ్యక్ష పీఠం ఎక్కించారు. ఎన్నికలయ్యాక అల్పసంఖ్యాక ప్రభుత్వంలో ప్రధాన మంత్రి అయ్యారు. కాని, ప్రధాని అయ్యాక "ఇదిగో పోతాడు, అదిగో పోతాడు.. అసలే మైనారిటీ ప్రభుత్వం" అంటూ ఎదురు చూసినవాళ్లకు చాలా నిరాశ ఎదురయ్యింది. వ్యతిరేక పరిస్థితులను అనుకూల పరిస్థితులుగా మలచుకోగలగటమే నిజమైన నాయకుని లక్షణం. పి.వి. నరసింహారావు గారు అలాంటి నాయకులు. రెండేళ్లలో పార్టీపై, ప్రభుత్వంపై పట్టు సంపాదించారు. పూర్తికాలం ప్రధానిగా కొనసాగారు.

✦✦✦

**కాలేన సర్వం లభతే మనుష్యః**

"గ్రహస్థితి బాగుండక నీకు కష్టం వచ్చింది గానీ... ఇదిగో గ్రహాలు మారు తున్నాయి – మంచి రోజులు వచ్చేస్తున్నాయి (అచ్ఛే దిన్ ఆ రహే హై)" అన్న భరోసా ఎంత మానసిక బలం! అలా ధైర్యం ఇచ్చే నెచ్చెలి దొరకాలి!

"ఇంతలోనే పెళ్లి కుదిరిపోయింది" – "కోర్టుకేసు అనుకూలంగా వచ్చేసింది" – "ఆర్థిక సమస్యలు తీరిపోయాయి" – "చచ్చిపోతాడనుకున్నవాడు రోగం నుంచి బైటపడ్డాడు" – "కొడుక్కి ఉద్యోగం వచ్చేసింది" – ఇలా... కాలం... అనుకూలంగా

వుంటే అన్నీ మంచిగా జరిగిపోతాయి.

కాలానుసారంగా మానవుడు అన్నీ పొందుతూ ఉంటాడు (కాలేన సర్వం లభతే మనుష్యః). కాలం కలసి వచ్చినప్పుడు ఎలాంటి అర్హతలు లేనివాడు కూడా అందలం ఎక్కుతాడు, పదవులు పొందుతాడు. బుద్ధిబలం, ప్రతిభ ఉన్నవాడు కూడా కాలం అనుకూలించకపోతే చతికిలపడి ఉంటాడు. ఈ సత్యం తెలిస్తే మానవుడు చిన్నచిన్న కష్టాలకు సహితం దుఃఖించడు.

కాలాన్ని బట్టి చంద్రుడు పూర్ణబింబంతో కనిపిస్తాడు. అకాలంలో చెట్లు పూయవు, కాయవు. అకాలంలో ఎండిపోయిన నది, సకాలం రాగానే వరద నీటితో పరుగెడుతూ ఉంటుంది. ఈ ఆలోచన దుఃఖసమయంలో జ్ఞప్తికి వస్తే మనిషికి సాంత్వన లభిస్తుంది. విజయ విశ్వాసం వికసిస్తుంది. కాలం మహత్తు గురించి చెపుతూ వ్యాసమహర్షి ఇలా అన్నారు.

శ్లో॥ **నాఽకాలతో మ్రియతే జాయతే వా**
**నాఽకాలతో వ్యాహరతే చ బాలః ।**
**నాఽకాలతో యౌవనమభ్యుపైతి**
**నాఽకాలతో రోహతి బీజముప్తమ్॥** *(మహాభారతం, శాంతిపర్వం25/10)*

*అకాలంలో మానవుడు చావడు. పుట్టడు. కాలం రాకుండా శిశువుకి మాటలు రావు. కాలం రాకుండా బాలుడికి యౌవనం రాదు. కాలం రాకుండా నాటిన విత్తనం మొలకెత్తదు. జీవితంలో ఎదురయ్యే సుఖదుఃఖాలు కాలచక్ర పరిభ్రమణ పరిణామాలని వ్యాసమహర్షి ఇలా వర్ణించారు.*

శ్లో॥ **సుఖస్యానంతరం దుఃఖం, దుఃఖస్యానంతరం సుఖమ్**
**న నిత్యం లభతే దుఃఖం న నిత్యం లభతే సుఖమ్ ॥**

*(మహాభారతం, శాంతిపర్వం 25/23)*

*సుఖం తరువాత దుఃఖం, దుఃఖం వెంటనే సుఖం వస్తుంటాయి. ఎల్లప్పుడూ దుఃఖం కలగదు. నిత్యమూ సుఖం లభించదు. సుఖమైనా, దుఃఖమైనా, ప్రియమైనా, అప్రియమైనా, గెలిచినా, ఓడిపోయినా వచ్చిన దానిని వచ్చినట్లుగా స్వీకరించాలి. సుఖదుఃఖాలనే ద్వంద్వాలకు ధీరుడు పొంగిపోడు, క్రుంగిపోడు. అతడే స్థితప్రజ్ఞుడు.*

అందుకే...విజ్ఞుడైన నాయకుడు కష్టాలకు బెదిరిపోడు. వాటి నుంచి పారిపోడు. అతనికి తెలుసు – చీకటి తరువాత వెలుగు వస్తుందని! (సుఖదుఃఖాల కాలవ్యవధి,

పరిమితి కూడా సమానంగా ఉండవు).

కడగండ్లు, సవాళ్ల మధ్య నుంచే గొప్ప నేతలు పుట్టుకొస్తారు. శివాజీ విషయం లోనూ ఇదే నిజమైంది. సామాన్యంగా దాటలేని కష్టాలను అధిగమించడమే శివాజీ గొప్పదనానికి కారణం. పదహారేళ్ల పసి వయస్సులోనే ఆయన యుద్ధ రంగంలోకి దూకారు. తోరణ దుర్గాన్ని గెలుచుకున్నారు. ఈ విజయం ఆయన ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. ఆ తరువాత ఆయన అనేక కోటలను గెలుచుకున్నారు. ఆయన నాయకత్వంలో సైనికులు, నాయకులు తమ ప్రాణాలను మాతృభూమి కోసం స్వాతంత్ర్య వేదిక ముందు సమర్పించుకునేందుకు సిద్ధపడ్డారు.

“గెరిల్లా వార్ ఫేర్” ను కనిపెట్టి, అమలుపరచి, చాలా విజయాలను సాధించిన ఘనత శివాజీదే. శివాజీ మహోన్నత వ్యక్తిత్వమే సామాన్యులను అసామాన్య కార్యాలను చేసేందుకు ప్రేరేపించింది. వ్యక్తులలోని అంతర్నిహితమైన గుణాలను గుర్తించి, సామర్థ్యాలను బేరీజు వేసి, వారు అద్భుతాలు చేయగలిగేలా ప్రోత్సహించే నిరుపమానమైన నాయకత్వ లక్షణం ఛత్రపతి శివాజీలో ఉండేది.

ఒక వ్యక్తిలో ఎంత సామర్థ్యం ఉందో అన్ని కష్టాలు ఎదురవుతాయనిపిస్తుంది. ఆ కష్టాలను ఓడించి గెలిచేవారే గొప్పవారవుతారు. అధిగమించలేని కష్టాలను అధిగమించగలగడమే శివాజీ గొప్పదనానికి కారణం. ఒడిదుడుకులను అధిగమించి విజయం వైపుగా నడిపించగలిగిన వారే నిజమైన నాయకుడు.

**ఎందువలనా అంటే దైవ ఘటనా..**

కాలమహిమ కనుగొనడం ఎవరికైనా అసాధ్యమే.

✦ కురుక్షేత్ర యుద్ధానంతరం ధృతరాష్ట్ర గాంధారాదులకు కలిగిన దుఃఖం,

✦ చనిపోయినవారిని సహితం బ్రతికించగల శ్రీకృష్ణుడు తన వాళ్ళని కాపాడుకోలేకపోవటం, యాదవులు కొట్టుకుంటూంటే చూస్తూ ఊరుకోవటం,

✦ సమాధిస్థితిలో ఉన్న శ్రీకృష్ణుని కాలును చూసి ఓ వేటగాడు, జింకగా భ్రమించి బాణంతో కొట్టడం, తప్పు తెలుసుకొన్న వేటగాడిని కృష్ణుడు ఓదార్చిన తర్వాత శరీరం వదలటం,

✦ బాహుబలుడైన అర్జునుడు యాదవ స్త్రీలను, దొంగలబారి నుండి రక్షించలేక పోవటం, ఆతని దివ్యశక్తులన్నీ నశించటం కాలమహిమ! అన్నింటికీ కాలమే మూలం! *(మహాభారతం, మౌసల పర్వం)*

✦

*Leadership*

## 8. అవసరాన్నిబట్టి నాయకుడు అణిగి వుండాలి

**వెండి చెంచాలతో పుట్టినప్పటికీ, భిక్షమెత్తుకునేవారి జీవన స్థితిగతులు సహితం ఆకళింపు చేసుకొనడంలో మానవుని ఔన్నత్యం ప్రస్ఫుటిస్తుంది. అలాంటి ఆకళింపు చేసుకున్న ఉత్తమ మానవులు ద్వాపరయుగంనాటి పాండవులు.**

**వం**దలాది ఎకరాల వ్యవసాయ భూములున్న సుసంపన్నుడు శ్రీపాములపర్తి వెంకటనరసింహారావు. ఉన్న ఊళ్లో సుఖప్రదంగా జీవించారు. ఎప్పుడూ ఏదీ వెతుక్కోవలసిన అవసరం రాలేదు. రామా నందతీర్థస్వామి ప్రేరణతో రాజకీయాల్లోకి వచ్చారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో 1960 దశకం ద్వితీ యార్థంలో మంత్రి పదవులు అధిష్టించారు. 1971లో ముఖ్యమంత్రి అయ్యారు. గొప్ప భూసంస్కరణలు తీసుకువచ్చారు. ఉద్యమాల వల్ల ఇక్కడ పదవి కోల్పో యినా, కేంద్రంలో మంత్రి పదవులు వరించాయి. విదేశాంగశాఖ, మానవ వనరుల మంత్రిత్వశాఖ.. ఇలా ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి అత్యంత విశ్వసనీ యుడైన సలహాదారుగా ఎదిగారు. రాజీవ్‌గాంధీ హత్యా నంతర పరిణామాలతో ప్రధానమంత్రి అయ్యారు.

పూర్తిగా అయిదేళ్లపాటు పనిచేసిన తొలి నెహ్రూ కుటుంబేతర ప్రధానమంత్రిగా చరిత్రకెక్కారు. అనేక సంస్కరణలతో ఈ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దారు.

పదవి పోయాక (1996) కూడా చీకూ చింతా

లేకుండా పుస్తకాలు రాసుకుంటూ, ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుకుంటూ గడిపారు. చింతపడలేదు. మానసిక ప్రశాంతత కోల్పోలేదు. ఎదగగలిగిన మనిషికి పరిస్థితులు అనుకూలించనపుడు ఒదిగి ఉండడం కూడా తెలిస్తేనే కదా ప్రశాంతంగా జీవించగలడు!

✦✦✦

రాజసూయ యాగం చేసిన ఒక చక్రవర్తి యుధిష్ఠిరుడు. కానీ, కాలమహిమ వల్ల తన సోదరులతో, కష్టం అంటే తెలియని అర్ధాంగి ద్రౌపదితో సహా అజ్ఞాత వాసంలో వేరొకరి కొలువులో ఉద్యోగం చేయాల్సి వచ్చింది.

దీనికి ఎంతటి వినమ్రత ఉండాలి? వెండి చెంచాలతో పుట్టినప్పటికీ, భిక్షమెత్తు కునేవారి జీవన స్థితిగతులు సహితం ఆకళింపు చేసుకొనడంలో మానవుని ఔన్నత్యం ప్రస్ఫుటిస్తుంది. అలాంటి ఆకళింపు చేసుకున్న ఉత్తమ మానవులు ద్వాపర యుగంనాటి పాండవులు.

అరణ్యావాసం ముందువరకు ధర్మరాజు చక్రవర్తిగా వున్నాడు. అడుగులకు మడుగులొత్తే సేవకులు, ఆజ్ఞ జవదాటని విధేయులైన తమ్ముళ్లు, ధర్మం తప్పని భార్య పాంచాలి, ప్రజారంజకంగా పాలిస్తున్నాడంటూ ప్రజలు పలికిన జయ జయ ధ్వానాలు... ఎలాంటి జీవితం అది! అరణ్యావాసంలో కూడా సర్వస్వతంత్రమైన జీవితాన్నే గడిపాడు. నారదుడు, మార్కండేయుడు వంటి ఎంతోమంది మహర్షులు వచ్చి స్థైర్యాన్ని నింపే కథలు చెప్పి వెళ్లారు.

కాని, అజ్ఞాతవాసంలో విరాటరాజు కొలువులో ఓ ఉద్యోగం సంపాదించుకొని, ఏ క్షణంలో కూడా "తాము చక్రవర్తుల్లా బ్రతికిన వాళ్లం" అని తెలియకుండా, ఒదిగి ఒదిగి భృత్యుల్లా బ్రతికారు. బెంగపెట్టుకోలేదు, సిగ్గుపడలేదు.

**ఎలా? ఎలా?...**

అప్పుడు వాళ్ల పురోహితుడు ధౌమ్యుడు, ఒదిగి ఉండాల్సి వచ్చినప్పుడు కూడ మనోనిబ్బరం కోల్పోకుండా విజయవంతంగా ఆయా పాత్రల్లో ఎలా జీవించాలో పాండవులకు చెప్పాడు.

ఆ సందర్భంలో వ్యాసమహర్షి రచించిన ఓ నలభై శ్లోకాల సారాంశం ఇది –

1. ఓ రాజు మరో రాజు దగ్గర పనిచేయటం కష్టమని తెలుసుకోవాలి – దాన్ని తేలిగ్గా తీసుకోరాదు.

2. తన యజమానిని (రాజును) చూడటానికి ముందు ద్వారపాలకుని అనుమతి తీసుకోవాలి.
3. ఎంత చిన్న పనైనా రాజుకు చెప్పి చేయాలి.
4. రాజుగారి ముందు, ఆజ్ఞ వచ్చేవరకూ నిలుచునే వుండాలి.
5. అంతఃపురకాంతలతో అనవసరంగా ప్రసంగించరాదు.
6. రాజు అడగకుండా ఏ 'కర్తవ్యబోధ' చేయకూడదు.
7. రాజుగారు ద్వేషించేవాళ్లతో స్నేహం కూడదు.
8. పనిలో ఏమరుపాటు, గర్వం, కోపం లేకుండా వుండాలి.
9. యజమాని మాటను గౌరవిస్తూ మాట్లాడాలి.
10. రాజు ఎదుట పెద్ద ఆసనంపై కూర్చోకూడదు.
11. రాజుకు ఇష్టం లేని పనులు చేయరాదు.
12. రాజు దగ్గర చేతులు చాచటం, మోకాళ్లు చాచుకుని కూర్చోవటం, ఆవలించటం, ఉమ్మి వేయటం వంటి చేష్టలు చేయకూడదు.
13. రాజుతో సమానమైన వేషభూషణలు ధరించకూడదు.
14. రాజద్రవ్యం (ప్రభుత్వం సొమ్ము) కొద్దిగా కూడా  అపహరించ కూడదు.
15. రాజు ఇచ్చిన వస్త్రాదులను, ఆభరణాలను తరచూ ధరిస్తూండాలి– ప్రదర్శించాలి. తానున్న పరిస్థితిని బట్టి ప్రవర్తన వుండాలి... వయస్సు, విద్యార్హతలు కాదు. యజమానుల ముందు అణిగి మణిగి ఉండడం అవసరం. ఉన్నత అధికారుల ముందు 'కొండ అద్దమందు' లాగ వుండటం శ్రేయస్కరం. అనువుకాని చోట అధికులమనరాదు. (వేమన పద్యం).

నాయకుడు ఎప్పటికీ ఏకచ్ఛత్రాధిపతిగా ఉండిపోడు. తనకన్నా వయస్సులో చిన్నవాడైన నాయకునితో కలసి పనిచేయవలసి రావచ్చు. ప్రభుత్వ పదవి సమాప్తం అయ్యాక – ఓ సామాన్య కార్యకర్తగా, సామాన్యపౌరునిగా బ్రతకాల్సివస్తే బ్రతకగలగాలి. అందుకే "ఎంత ఎదిగినా, కాళ్లు నేలమీద ఉంటేనే కదా నిలబడగలిగాను" అన్న సత్యం మనసులో మెదులుతుంటే, విజ్ఞుడైన నాయకుడు పదవితో సంబంధం లేకుండా సంస్కారంతో వ్యవహరిస్తాడు. పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసంలో ఉన్న పాండవులు ఎన్నో నైపుణ్యాలు సంపాదించుకున్నారు. సమయం వచ్చినప్పుడు విజృంభించారు. వీరనాయకులుగా వాసికెక్కారు.

Discipline

## 9. దండః సుగుణః భవేత్

రాజధర్మంలో సామ, దాన, భేద, దండోపాయాలని నాలుగు విధానాలు ఉన్నాయి. అందులో తొలి మూడూ పనికి రానప్పుడు 'దండమే' శరణ్యం, సర్వోచితం కూడా.

ఇప్పుడిప్పుడు స్కూల్లో టీచర్ చేతిలో 'బెత్తం' మాయమైందిగానీ, మునుపు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల చేతిలో ఓ దండం (బెత్తం) తప్పక వుండేది.

అది అలంకారప్రాయమే కాదు – అనేక సందర్భాలలో దాన్ని ఉపయోగించటమే కాదు – 'శివధనుర్భంగాల్లా' బెత్తాలు విరిగిపోయిన, అల్లరిపిల్లల నడ్డి వాచిపోయిన ఘటనలు మునుపటి తరం వారు ఎన్నో చూసి వుంటారు. క్రమశిక్షణ కోసం దండన అవసరం.

ఇటీవల భారత ప్రభుత్వం రోడ్ రవాణా రాకపోకల సూత్రాల గీత దాటిన వారికి భారీగా 'వడ్డన' చేసింది కూడా అందుకే. జరిమానా భయంతో వాహనదారులు దారికొస్తారని చేసిన 'దండ' ప్రయోగం!

'దండన' అంటే శిక్ష – Punishment.

✦ ✦ ✦

ఆ మధ్య 'నిర్భయ కేసు' దేశాన్ని అతలాకుతలం చేసింది. నిర్భయను క్రూరంగా హింసించి చంపిన నేరస్థులకు శిక్ష అమలు పరిచేందుకు న్యాయస్థానాలలో దీర్ఘవాదోపవాదాలు జరిగాయి.

ఘటన నుంచి శిక్షపడేదాకా ఎన్నో ఊహించని మలుపులు తిరిగిన కేసు అది. చట్టంలోని బలహీనతలను స్పష్టం చేసిన కేసు కూడా అదే. అందులో ఒక దోషి తాను బాలుడు – 'మైనర్' – అనే నెపంతో శిక్ష నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నం చేశాడు. దోషి మైనర్ కాదని, విచారణ సమయంలోనే సర్వోన్నత న్యాయస్థానం నిర్ధారించింది. రాజ్యాంగంలో ఉన్న వెసులుబాటును ఉపయోగించి, పౌరహక్కుల నెపంతో కొన్ని శక్తులు కొత్త యుక్తులను ఉపయోగించటం ప్రారంభించారు.

దోషులు రాష్ట్రపతి క్షమాభిక్షని అర్థించటంతో కథ మరో మలుపు తిరిగింది. నిశితంగా పరిశీలించిన రాష్ట్రపతి కార్యాలయం ఆ అభ్యర్థనను అనుగ్రహించ లేదు. శిక్ష అమలుపరచబడింది. దండనకున్న శక్తి అలాంటిది. కృత్రిమంగా సృష్టించిన అవరోధాలను సర్వోన్నత న్యాయస్థానం అధిగమించి ఎవ్వరి ప్రభావాలకు లొంగకుండా, దండం అమలుపరచిన తీరుకు ప్రజలు ఆనందపడ్డారు.

✦✦✦

రెండు దశాబ్దాల క్రితం ఓ కేసు మన దేశంలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. అది గుంటూరులో ప్రయాణీకులతో వున్న ఓ బస్సు దహనం కేసు. ఇద్దరు ముద్దాయిలపై సమగ్ర విచారణ చేసిన సుప్రీంకోర్టు ఉరిశిక్షను ఖాయపరిచింది. ఆ తర్వాత వారు రాష్ట్రపతిని క్షమాభిక్ష కోసం అభ్యర్థించారు. రాష్ట్రపతి కార్యాలయం సమగ్రంగా పరిశీలించాక క్షమాభిక్షకు అర్హత లేని కేసుగా పరిగణించాక దాన్ని నిరాకరించారు. కథ అంతటితో అయిపోలేదు–ఇంతవరకు సంప్రదాయంగా వస్తున్న విధానాలకు విరుద్ధంగా తదుపరి వచ్చిన రాష్ట్రపతి క్షమాభిక్షను ఆమోదించారు. దోషుల ఎడల అనుకూల అంశం ఏమి గోచరించిందో?

"క్షమాభిక్షను ఈ కారణాలవల్ల ప్రదానం చేసాము" అన్న విషయం ఎక్కడా ఉల్లేఖించలేదు. బస్సు దహనంలో ప్రాణాలు కోల్పోయిన ఆ నలభై మందిలో తప్పించుకునే శక్తి లేనివారు... శిశువులు, స్త్రీలు, వృద్ధులు, అంగవైకల్యం ఉన్నవారు ఉన్నారు. "నలభై మందికి జీవించే హక్కును కాలరాసిన ఇద్దరు దోషులకు భారతీయ న్యాయ వ్యవస్థ జీవించే హక్కు ప్రసాదించింది" అని దండన విధానం ఆక్షేపణకు గురైంది.

✦✦✦

రాజధర్మంలో సామ, దాన, భేద, దండోపాయాలని నాలుగు విధానాలు ఉన్నాయి. అందులో తొలి మూడూ పనికి రానప్పుడు 'దండమే' శరణ్యం, సర్వోచితం కూడా. సామ, దాన, భేద దండోపాయాలను ఎక్కడ ఏది ఉపయోగించాలో వాల్మీకి రామాయణంలో హనుమంతుడు ఇలా వివరించాడు.

శ్లో॥ **న సామ రక్షస్సు గుణాయ కల్పతే**
**న దానమర్థోపచితేషు యుజ్యతే ।**
**న భేదసాధ్యా బలదర్పితా జనాః**
**పరాక్రమస్త్వేవ మమేహ రోచతే ॥** (సుందరకాండ 41/3)

*రాక్షసుల విషయంలో సామోపాయం కుదరదు. ధనవంతులపై దానోపాయం పనిచేయకపోవచ్చు. బలంతో గర్వించి ఉన్న వాళ్ల విషయంలో భేదోపాయం సరి పడదు. అందుచేత ఇప్పుడు పరాక్రమాన్ని చూపే ఉపాయం (దండోపాయం) ఒక్కటే సమంజసం అని తోస్తోంది.*

"అసలు 'దండన' విధించకపోతే సమాజంలో మత్స్య న్యాయం ప్రబలుతుంది. దండధరుడు లేకపోతే చిన్నచేపల్ని పెద్ద చేపలు మ్రింగేస్తాయి" అని అర్థశాస్త్రవేత్త చాణక్యుడు హెచ్చరించాడు. (బలహీనులను బలవంతులు మోసం చేయటం, వారి ఆస్తులను కాజేయటం వంటి వాటిని 'మత్స్యన్యాయం'తో పోలుస్తారు. సముద్రంలో వున్న పెద్ద చేపలకు చిన్న చిన్న చేపలే ఆహారం కదా! వాటిని అడ్డు కొనే వారెవరు?) బలహీనుడి రక్షణకై 'దండం' ఉండాలని కౌటిల్యుడు గట్టిగా నిర్దేశించాడు.

**అప్రణీతో హి మాత్స్యన్యాయముద్భావయతి ।**
**బలీయాన్ అబలం హి గ్రసతే దండధరాऽభావే ॥**

*(కౌటిల్యుని అర్థశాస్త్రం - ప్రథమ ప్రకరణం - చతుర్థాధ్యాయం)*

అందుకే 'పరిపాలకుడు లేని రాజ్యం ఉండకూడదని' అన్ని దేశాలు అనాదిగా పాటిస్తూన్న ఆచారం. రాజు చనిపోయాడని ప్రకటించగానే, కొత్త రాజుని నియ మించే ఆచారానికి కారణం ఇదే. దశరథుని మరణాంతరం కొత్త రాజుని ప్రతిష్ఠించక పోతే అరాచక పరిస్థితి ఏర్పడి, దేశంలో 'మత్స్యన్యాయం ప్రబలుతుంది' అని వసిష్ఠ మహర్షి నిర్దేశించినట్లు వాల్మీకి రామాయణంలో చెప్పారు.

మహాభారతం (శాంతిపర్వం) లో అర్జునుడు 'దండం' గురించి ధర్మరాజుకు గుర్తు చేస్తూ ఇలా అంటాడు.

"రాజా! ధర్మాన్ని, అర్థాన్ని, కామాన్ని (వీటిని త్రివర్గలంటారు) రక్షించేది దండమే!" "ప్రజలను వశంలో వుంచుకోవటానికి దండాన్ని మించిన సాధనం లేదు". "దండం అనే ఆయుధాన్ని ధరించిన వారికే బలం" అని రాజనీతిని ఎరిగినవారు చెప్పేమాట! ప్రజలంతా క్షేమంగా ఉండాలంటే పాలకుడు మంచివాడై, గట్టివాడై ఉండాలనేది నిజమే కానీ పాలకుడు అవసరమైనచోట 'దండ' న్యాయాన్ని కూడా ఉపయోగించి ప్రజారక్షణ చేయాలి. ప్రజలంతా క్షేమంగా వుండాలంటే పాలకుడు ఉండాలి.

సమర్థవంతమైన 'నాయకుడు' లేనినాడు ప్రజల సంపదకు ప్రాణాలకు రక్షణ వుండదు. దండధారి అయిన రాజు అవసరాన్ని మహాభారతంలో ఇలా చెప్పారు.

శ్లో॥ **రాజానం ప్రథమం విందేత్ తతో భార్యాం తతో ధనమ్ ।**
**రాజన్యసతి లోకస్య కుతో భార్యా కుతో ధనమ్ ॥**

*(మహాభారతం, శాంతిపర్వం 57-41)*

*ముందుగా రాజును ఏర్పరచుకోవాలి. ఆ తర్వాతనే పెండ్లాడినా, ధనం సంపాదించినా కూడా. రక్షణ కల్పించలేని రాజు, రక్షించలేని ప్రభుత్వం ఉంటే భార్యా, ధనాలకు రక్షణ ఎక్కడ ఉంది?*

✦✦✦

**మాతృభూమి ముక్కలైంది...**

అరాచకం - పాలకుడు లేని రాజ్యం - అంటే ఎలా ఉంటుందో 1947వ సంవత్సరం నాటి అఖండ భారత విభజన సమయంలో మనదేశ ప్రజలు అనుభవించారు. మత్స్యన్యాయం అంటే ఏమిటో తెలిసింది. లక్షలమంది ప్రాణాలు, మానాలు బుగ్గి అయిపోయాయి. ఇళ్లు, వాకిళ్లు, సంపత్తి వదులుకొని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని కొత్తగా ఏర్పడిన పాకిస్థాన్ నుండి పారిపోయి అవశేష భారత్‌కి వచ్చే శారు. ఎన్ని ఏళ్లయినా ఆరని అగ్ని అది. మానని గాయాలు అవి.

అసమర్థులైన నాయకులు తమ చేతిలోని దండాన్ని సరిగ్గా ఉపయోగించని కారణాన దేశ విభజన సమయంలో హిందువులు ఇలా కకావికలయ్యారు.

దండనీతిలో జరిగే కాలయాపన అనేక అనుమానాలకు తావిస్తుంది. ఒక్కోసారి

విశ్వాసం కూడా సన్నగిల్లవచ్చు. అదే సందర్భంలో రాజు దగ్గర భద్రంగా ఉన్న దండనీతిని ప్రజలు చేతుల్లోకి తీసుకొనే ప్రమాదం లేకపోలేదు.

✦✦✦

మను ధర్మశాస్త్రంలో దండభయం వల్ల వచ్చే లాభం ఇలా తెలియజేశాడు.

శ్లో॥ **సర్వో దండజితో లోకః దుర్లభో హి శుచిర్నరః ।**
**దండస్య హి భయాత్సర్వం జగద్భోగాయ కల్పతే ॥**

*(మనుధర్మశాస్త్రం 7వ అధ్యాయం, 22వ శ్లోకం)*

*ఈ లోకమంతా దండముతో నియంత్రితమై ఉన్నది. దండనం లేకుండా సన్మార్గులు జీవించటం దుర్లభం. దండ భయం వల్లనే ఈ జగమంతా స్వేచ్ఛగా భోగాలను, సుఖాలనూ అనుభవించగలుగుతున్నది.*

రాజుల కర్తవ్యం దండనం! న్యాయాన్ని వ్యవస్థీకరించటం కోసం పాపపు పనులు చేసిన దుష్టులను శిక్షించకపోతే, ఆ పాపం దేశాన్ని పాలించే నాయకునికి వచ్చి చేరుతుంది (రాజా రాష్ట్రకృతం పాపం). అందుకని దండించవలసిన వారిని తప్పని సరిగా వెంటనే దండించాలి.

దండం ప్రాముఖ్యం గురించి చెప్పిన మనువు మరో ముఖ్య హెచ్చరిక చేశాడు.

శ్లో॥ **అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాంశ్చై వాప్యదండయన్ ।**
**అయశో మహదాప్నోతి నరకం చైవ గచ్ఛతి ॥** (మనుస్మృతి *8-128)*

*"పాలకుడు దండించవలసిన వారిని దండించకపోయినా, దండింప కూడని వారిని దండించినా అపకీర్తిని, నరకాన్ని పొందుతాడు."*

"మానవునిలో సహజంగా ఉండే స్వార్థపరత్వాన్ని నియంత్రించే ప్రధాన ఉపాయం దండం. ఏ విధమైన పక్షపాతం లేనివిధంగా దండన విధించాలి" అన్నాడు ఆచార్య చాణక్యుడు.

కౌరవులతో సంధి ప్రస్తావన కోసం బయలుదేరుతున్న శ్రీకృష్ణునితో ద్రౌపది ఇలా చెప్పింది.

శ్లో॥ **యథాఽవధే వధ్యమానే భవేద్ దోషో జనార్దన ।**
**న వధ్యస్యావధే దృష్ట ఇతి ధర్మవిదో విదుః ॥**

*(మహాభారతం, ఉద్యోగపర్వం: 82/18)*

ఓ కృష్ణా! చంపకూడని వానిని చంపటం ఎంత తప్పో - చంపదగిన వాడిని రక్షించటం కూడా అంతే తప్పు.

శ్లో॥ **దండో హి కేవలో లోకం పరం చేమం చ రక్షతి।**
**రాజ్ఞా పుత్రే చ శత్రౌ చ యథాదోషం సమం ధృతః॥**

శత్రువు విషయంలోనైనా, తన పుత్రుని విషయంలోనైనా ఏవిధమైన పక్షపాత బుద్ధిలేకుండా, చేసిన తప్పుని బట్టి శిక్షించే రాజుకు ఇహలోకంలో కీర్తి, తదుపరి మోక్షం లభిస్తాయి.

✦✦✦

దండం అమలు చేయాలంటే నాయకునికి ఎందరో సహాయకులు కావాలి. ఎటువంటివారిని తన పక్షాన నియమించుకోవాలో మనువు ఇలా వివరించారు.

"శుచిమంతుడు (ధనలోభం లేనివాడు), సత్యసంధుడు (అబద్ధమాడనివాడు) శాస్త్రానుసారి (వేదశాస్త్రాలను అనుసరించి జీవనం సాగించేవాడు), జ్ఞానవంతుడు (ధర్మం, ధర్మ సూక్ష్మం రెండూ తెలిసినవాడు) మొదలగు వారిని తన బృందంలో ఉంచుకొని దండాన్ని అమలుపరచాలి". (7/30-32)

అలాగే, శత్రు దేశాలు చేసిన అకృత్యాలకు దీటైన జవాబు చెప్పినప్పుడే శత్రుపక్షం బెదురుతుంది.

"శత్రువుల దౌర్బల్యాల్ని పసిగట్టి అదను చూసి పరాక్రమించాలి. ఎప్పుడూ పాలకుడు పరాక్రమ ప్రదర్శన చేస్తుండాలి. "నిత్యముద్యత దండః" రాజు ఎప్పుడూ దండోపాయానికి సిద్ధంగా వుండాలి." తెలివైన పాలకుని ఆలోచన ఇలా ఉంటుంది.

దండం పాలకుని చేతిలో ఉండవలసిన ఆయుధం, సాధనం. ఆ ఆయుధాన్ని ఉపయోగించే అర్హత పాలకునికి తప్ప అన్యులకు లేదు.

✦✦✦

పాలకుడు ఎప్పటికీ 'మృదువు'గా ఉండకూడదు. తీవ్రంగా కూడా ఉండకూడదు. వసంత ఋతువులో సూర్యునివలె చల్లగానూ కాకుండా, భరించలేని వేడిగానూ కాకుండా ఉండాలి.

కార్యాలయంలో అనేకమందిచేత పని చేయించవలసిన అధికారంలో వున్న

నాయకుడు, సమయాన్ని బట్టి కన్నెర్ర చేయాలి. పనిచేయనివారిని ప్రశ్నించాలి. ఎల్లప్పుడూ  క్షమిస్తే నాయకుడిని అనుచరులు చులకనగా చూస్తారు.

వ్యాసమహర్షి అటువంటి నాయకుడిని  'ధర్మవిరోధి' అన్నాడు. అటువంటి నాయకుడు తన పదవికి న్యాయం చేయలేడు.

శ్లో॥ **మృదుర్హి రాజా సతతం లంఘ్యో భవతి సర్వశః ।**
**తీక్ష్ణాచ్చోద్విజతే లోకః తస్మాదుభయమాశ్రయ ॥**

*(మహాభారతం, శాంతిపర్వం–56/21)*

*ఎల్లప్పుడూ మృదువుగా ప్రవర్తించే రాజును భటులు కూడా ఉల్లంఘిస్తారు. అలా అని తీవ్రంగా ఉంటే లోకం భయపడుతుంది.*

అందుకని రాజు రెండు విధాలుగా, సమయానుకూలంగా ప్రవర్తించాలి.

"రాజు విధించే దండన మంచిదేగాని, మోతాదు హెచ్చితే వికటిస్తుంది" అంటూ ధర్మరాజును హెచ్చరించాడు నారదమహర్షి!

శ్లో॥ **కచ్చిత్ త్వాం నాఽవజానంతి యాజకాః పతితం యథా ।**
**ఉగ్రప్రతిగ్రహీతారం కామయానమివ స్త్రియః ॥**

*(మహాభారతం, సభాపర్వం– 5/46)*

*కామాతురుడై విచ్చలవిడిగా తిరుగుతున్న పతిని స్త్రీలు ఎలా వదిలివేస్తారో, పతితుడైన యజమానిని సేవకుడు ఎలా విడిచిపెట్టిపోతాడో అదేతీరుగా మితిమీరి, ఉగ్రమైన శిక్షలు వేసిన రాజుని ప్రజలు అవమానిస్తారు. అలా నిన్ను ప్రజలు అవమానించటం లేదు.. కదా! అని నారదమహర్షి ధర్మరాజుని ప్రశ్నించాడు.*

శ్లో॥ **కచ్చిన్నోగ్రేణ దండేన భృశముద్విజసే ప్రజాః ।**
**రాష్ట్రం తవానుశాసంతి మంత్రిణో భరతర్షభ ॥**

*(మహాభారతం, సభాపర్వం – 5/45)*

*భరతశ్రేష్ఠుడైన ధర్మరాజా! కఠిన శిక్షలతో నీవు ప్రజలను బాధించటం లేదు కదా!  అని నారద మహర్షి ధర్మరాజును ప్రశ్నించాడు.*

ఈ సూత్రాలన్నీ వర్తమాన సమాజంలోని నాయకులకు కూడా అన్వయం అవుతున్నాయి.

**రాజులు లేని రాజ్యాన్ని చూశాం**

కృతయుగంలో రాజ్యం, రాజు, రాజ్యాధికారం, దండన విధానం లేకుండేది. నేరం చేసేవాడే లేనప్పుడు దండించే అవకాశం ఏముంటుంది? అందరూ కలసిమెలసి ఉంటారని వర్ణించబడింది. కానీ, ఇది దేని ఆధారంగా నడిచింది?

ఇదంతా ధర్మం ప్రకారమే జరిగిందని సమాధానమిచ్చారు పెద్దలు.

ధర్మం సహాయంతోనే ఎలాంటి బాహ్య నియంత్రణ లేకుండా, ఎలాంటి అనుమానాలు లేకుండా ప్రేమతో కలసిమెలసి ఉంటారు. సమస్త ప్రపంచాన్ని ఓ ఇల్లుగా భావించి మనుష్యులంతా సుఖశాంతులతో జీవితాన్ని గడుపగలరు.

ఈ కల్పన మన దేశంలో అతి ప్రాచీన కాలం నుండి వస్తూ ఉంది. ఇందుకోసం మన ప్రాచీన గ్రంథాలు, మన పూర్వీకుల ఉదాహరణలున్నాయి.

అసలు రాజు అనే శబ్దం ఎలా పుట్టింది?... అన్న ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్మ పితామహుడు 'కృతయుగం'లో పరిస్థితి ఎలా ఉండేదో ఇలా వివరించాడు:

శ్లో॥ **న వై రాజ్యం న రాజాஉసీత్ న చ దండో న దాండికః ।**
**ధర్మేణైవ ప్రజాస్సర్వాః రక్షంతి స్మ పరస్పరమ్ ॥**

(మహాభారతం, శాంతిపర్వం 59/14)

*మొదట రాజ్యంలేదు. రాజూ లేడు. దండం లేదు. దండించే వాడు లేడు. ప్రజలందరూ ధర్మం ఆధారంగా ఒకరినొకరు రక్షించుకొనేవారు.*

యుగాలు మారాయి. నరులకు మోహం, కామం, రాగం ఆవేశించి చేయదగినవి, చేయకూడనివి ఏవో తెలియకుండా తయారయ్యారు. ఇది మాట్లాడవచ్చు.. ఇది మాట్లాడకూడదు.. ఇది తినదగినది.. ఇది తినరానిది.. ఇది తప్పు.. ఇది ఒప్పు.. అనే భేదం లేకుండా అన్నీ చేస్తుండటంతో సమాజం అల్లకల్లోలం అయిపోయింది.

శ్లో॥ **నష్టే బ్రాహ్మణి ధర్మే చ దేవాంస్త్రాసః సమావిశత్ ।**
**తే త్రస్తా నరశార్దూల బ్రాహ్మణం శరణం యయుః ॥**

(మహాభారతం, శాంతిపర్వం 59/22)

*వేదం, ధర్మం నశించడంతో దేవతలకు భయం కలిగింది. దేవతలు బ్రహ్మదేవుణ్ణి ఆశ్రయించారు.*

బ్రహ్మ తన బుద్ధి నుంచి 'నీతిశాస్త్రాన్ని' లక్ష అధ్యాయాలతో అందించాడు. అదే తొలి పాలనా పథం!

అందులో ఈ విషయాలు సంపూర్ణంగా చెప్పబడ్డాయి.

1. మంత్రుల రక్షణ
2. రాజదూత లక్షణం
3. రాజపుత్రుని లక్షణం
4. గూఢచారుల నియామకం
5. సామ, దాన, భేద, దండోపాయాలనే నాలుగు ఉపాయాలు, ఉపేక్ష అనే ఐదవ ఉపాయం.

నీతి శాస్త్రంలో పాలనకు అవసరమైన నాలుగు విద్యలు విస్తారంగా వర్ణింపబడ్డాయి.

శ్లో॥ **త్రయీ చాన్వీక్షకీ చైవ వార్తా చ భరతర్షభ ।**
**దండనీతిశ్చ విపులా విద్యాస్తత్ర నిదర్శితా ॥**

*1. త్రయి (వేదాధ్యయనం)*
*2. అన్వీక్షకి (లౌకిక విషయ జ్ఞానం, యోగం, సాంఖ్యం)*
*3. వార్తా (వ్యవసాయం, పశుపాలనం, వర్తకం)*
*4. దండనీతి (అతి మృదువు, అతి తీక్షణత్వం లేని దండన)*

బ్రహ్మ 'నీతిశాస్త్రం' అందించగా, దానిని అనుసరించి పాలించేందుకు విష్ణువు 'వేనుడు' అనే పాలకుడిని నియమించారు. వేనుడి కుమారుడే పృథు చక్రవర్తి!

ఇలా పరంపరాగతంగా రాజ్యపాలన సాగుతూ వస్తోన్న విషయాన్ని భీష్ముడు తెలియచేసాడు. ✦

నేటి మన విద్యావిధానం ఏ మాత్రమూ భారతీయత లేనిది కావడం చేత జీవిత సౌధానికి పునాదియైన బాల్యం భారతీయత లేనిదైతే, జాతి మొత్తం మాత్రం భారతీయత ఏ విధంగా కలిగి ఉండగలదు? బాల్యావస్థలో సంప్రదాయం, సంస్కృతి, ధర్మస్వరూపం బోధపడేటట్లు చేస్తే తరువాత ఎటువంటి వృత్తి విద్యను తీసుకున్నా ఆయా వృత్తులను సుశిక్షితుడైన ఉత్తముడిగా అనుసరిస్తాడు. పూర్వకాలం నాటి గురుకుల వాసం నేడు కూడా నూతన విధానాలతో తీర్చిదిద్దుకోవడానికి మనం యోచించాలి. *– సద్గురు కందుకూరి శివానందమూర్తి గారు*

## శీఘ్ర న్యాయం

**న్యా**యస్థానంలో ఉన్న కేసులను ఏళ్ల తరబడి తేల్చకుండా నాన్చడం ప్రజలకు అన్యాయం చేయటమే. కాలాతీతమైన న్యాయ పరిష్కారం న్యాయపరమైన హక్కుల్ని కాదనటమే కదా! (Justice delayed is justice denied) న్యాయస్థానాలపై పౌరులకు విశ్వాసం పెరగాలంటే వ్యాజ్యాలను (కేసులను) త్వరితగతిని పరిష్కరించాలి!

దీనిపై ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు తన కౌండిన్య స్మృతిలో ఇలా సలహా ఇచ్చారు :

**శ్లో ॥ క్లేశో మహాన్ విలంబే స్యాత్ ప్రజానాం న్యాయనిర్ణయే ।**
**గరిష్ఠం కాలమానం స్యాద్ ద్విమాసం న తతోఽధికం ॥**

*(కౌండిన్య స్మృతిః-475)*

*సకాలంలో న్యాయంచేకూర్చకుంటే పౌరులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటారు. అందుకని కేవలం రెండు నెలల్లో తీర్పుచెప్పే విధంగా న్యాయవ్యవస్థను ప్రతిష్ఠ చేయాలి.*

**శ్లో ॥ యే వా మాసద్వయాదర్వాక్ అశక్తా న్యాయనిర్ణయే ।**
**అధికారీ సహాయశ్చ తస్థానేఽన్యాన్ నియోజయేత్ ॥**

*(కౌండిన్య స్మృతిః-477)*

*న్యాయాధీశులు వారి సహాయకులు రెండు నెలల్లో కేసును పరిష్కరించలేకుంటే వారిని తొలగించి, వేరే ప్రతిభావంతులైన మరో న్యాయాధీశునికి వ్యాజ్యాన్ని అప్పగించాలి.*

**శ్లో ॥ పక్షపాతధియోత్కోచైర్ద్వేషేణాలస్యతోఽపి వా ।**
**విలంబహేతవో న్యాయే దండ్యా ఏవాధికారిణః ॥**

*(కౌండిన్య స్మృతిః-479)*

*పక్షపాతబుద్ధితో, లంచగొండితనంతో, శతృత్వంతో, లేదా సోమరితనంతో తీర్పు చెప్పే అధికారులను తప్పక శిక్షించాలి.*

**శ్లో ॥ న దండయతి యే దుష్టాన్ పాలకాస్తే పరోక్షతః ।**
**దండయతి జనాన్ సాధూన్ తత్ క్లేశానాం వివర్ధనాత్ ॥**

*(కౌండిన్య స్మృతిః-479)*

*పాలకులు (స్వార్థంతోనో, పక్షపాతబుద్ధితోనో) దుష్టులను (క్రూరులను) శిక్షించకుండా, సాధువులు, ధర్మపరులు చట్టానికి లోబడి ఉండేవారిని ఇక్కట్ల పాలు చేస్తున్నారు. అటువంటివారు శిక్షార్హులు !*



**ఆ**ర్థిక వ్యవహారాల నిర్వహణలో ఉన్నత స్థాయి అధికారులు పొరబాటు చేస్తే శివాజీ వారికి తీవ్రమైన శిక్షలు వేసేవారు.

ఒకసారి ఆయన తన దేశ్‌ముఖ్‌లు, దేశ కులకర్ణి, మహాజన్ (అప్పట్లో వున్న రెవెన్యూ బాధ్యతలు) తదితర అధికారులందరిని పన్వేల్ దగ్గర ఉన్న ప్రచలగఢ్ కోటకు రప్పించి రాజ్యపు బడ్జెట్ తయారు చేయిస్తున్నారు.

ఈ సమయంలోనే చేవుల్ (మూర్తజాబాద్) దేశ కులకర్ణి అయిన అప్పాజీ తన అధీనంలోని గ్రామాల నుంచి వసూలు చేసిన పన్నుల లెక్కలను సమర్పించ లేదని చెప్పారు. అంతేకాక ఆయన సరిగ్గా పన్నులు వసూలు చేయలేదని కూడా వెల్లడైంది.

అంతటి ఉన్నతాధికారి నిర్లక్ష్యాన్ని శివాజీ సహించలేకపోయారు. ఆయన అప్పాజీని తీవ్రంగా విమర్శించారు.

"ఇంత ఉన్నతమైన దేశకులకర్ణి పదవిలో ఉంటూ కూడా మీరు ఖాతాలు సరిగ్గా నిర్వహించలేదు. మీకిచ్చిన బాధ్యతను నిర్వర్తించలేకపోయారు" అన్నారు. శివాజీ అతని నేరాన్ని పట్టించుకోకుండా వదిలేయలేదు. అది రాజ్యానికి ద్రోహంగా భావించారు. అందుకే తీవ్రమైన శిక్ష కూడా వేశారు.

అప్పాజీకి భారీగా జరిమానా వేసి, ఆయనను పదవినుంచి తొలగించారు. ఆయన స్థానంలో ఆబాజీ మహాదేవ్‌ను నియమించారు.

*Ethics & Values*

## 10. సంపదకు సార్థకత

> **న్యాయంగా సంపాదించిన ధనంతోనే తనను, తన కుటుంబాన్ని పోషించుకోవాలి. అన్యాయంగా సంపాదించిన ధనంతో ఎవడు జీవిస్తుంటాడో వాడిని సమాజం బహిష్కరిస్తుంది.**

హైదరాబాద్‌లోని ఒక కస్టమ్స్ సీనియర్ అధికారిణి ఇంటిమీద సిబిఐ వారు 1990వ దశకం చివర్లో దాడి చేశారు. ఉద్యోగరీత్యా న్యాయబద్ధంగా సంపాదించ గలిగినదానికన్నా అనేకరెట్లు ఆదాయాన్ని ఆమె సంపా దించినట్లు ఆధారాలు దొరికాయి. అన్నింటికీ మించి ఆమె ఇంట్లో బీరువా లాకర్‌లో దాదాపు రెండు కోట్ల రూపాయల కరెన్సీ నోట్ల కట్టలు కనుగొన్నారు.

కర్ణాటకకు చెందిన శాసనసభ్యుడైన ఒక వ్యాపార వేత్తను అక్రమ గనుల తవ్వకాల అభియోగంపై సిబిఐ అరెస్టు చేసింది. రిమాండుకు పంపించింది. అతన్ని బెయిలుమీద విడుదల చేయటానికి ఏడు కోట్ల రూపా యలు లంచం తీసుకున్నాడన్న ఆరోపణల మీద ఒక న్యాయమూర్తిని కూడా సిబిఐ అరెస్టు చేసింది.

ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఇందుకు భిన్నంగా ఉండేవాళ్లు కూడా ఉన్నారు.

ఒక ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలం పనిచేశారు. ఆయన జిల్లాలకు క్యాంప్‌లకు వెళితే, తన ఫలహారం, భోజనాలు తన ఖర్చుతోనే జరగాలని

పట్టుబట్టేవాడు. ఏ రోజూ క్రింది సిబ్బందిచేత ఖర్చు పెట్టించలేదు. జిల్లాల్లో కలెక్టరుగా పనిచేసినప్పుడు కూడా రెవెన్యూ సిబ్బందిని తన సొంత అవసరాలకి వాడుకోలేదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసినా అలాగే ఉన్నారు.

2010 అక్టోబరులో హైదరాబాద్‌లో ఆయన స్వర్గస్థులైతే, అనేక స్వచ్ఛంద సంస్థలవారు వచ్చి అంత్యక్రియలకు హాజరయి నివాళులర్పించారు. అన్నింటికీ మించి, విజయవాడ, కాకినాడ వంటి ప్రదేశాలలో ప్రజలు చందాలు వేసుకొని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నారు. మరణించాక కూడా అంతగా ప్రజల మనసుల్లో అలా నిలిచిపోవడానికి కారణం నిజాయితీగా బ్రతకడం. వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం అమలు, మనుష్యులు మరుగుదొడ్లను శుభ్రం చేసే పద్ధతిని నిర్మూలింపజేయడం, ఏజెన్సీలో నివసిస్తున్న వనవాసీ బంధువుల అభివృద్ధికి బాటలు వేయడం వంటి అసాధారణ కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వ సేవకుడు. “సివిల్ సర్వెంట్ ప్రజల కోసం జీవించాలి” అన్నది ఆయన జీవన స్ఫూర్తి. ఆయన పేరు ఎస్.ఆర్. శంకరన్!

కోట్లు సంపాదించడంకోసం అడ్డదారులు త్రొక్కి, బంధువులు, స్నేహితులు, సేవకులు అంతా తమ అవినీతి గురించి తమ వెనకాల కథలు కథలుగా చెప్పుకుంటుంటే.. అది ఘనమైన జీవితమా? ‘అవినీతిపరుల వారసులు’ అన్న ముద్రను తరతరాల వారికి సంక్రమింపజేయటం వంశప్రతిష్ఠను నిలబెట్టే విషయమా? లేక, బ్రతుకు చాలించాక ‘ఇలాంటి మహాత్ములు మళ్లీ మళ్లీ పుట్టాలి’ అనిపించేటట్లు జీవించటమే నిజమైన జీవనమా? వారసులు కూడా ఘనంగా చెప్పుకొని, గర్వంగా తలెత్తుకుని తిరిగేలా చేయడమే ఘనమైన జీవితం!

✦✦✦

**అందరికీ ఆదర్శంగా..**

రాజకీయ క్షేత్రంలో వుండి, తాను సంపాదించినదంతా ప్రజలకోసం ఖర్చుపెట్టిన రాజకీయ నాయకుడు శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు. 1904లో లండన్‌లో బారిష్టర్ చదవటానికి వెళ్లారు. 1907 నుంచి మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ధర్మాత్మునిగా పేరు తెచ్చుకొన్నారు. సంపాదనంతా బ్రిటన్ వ్యతిరేక స్వాతంత్ర్య ఉద్యమం కోసం, సమాజ హితం కోసం వెచ్చించారు.

ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వహించిన వ్యక్తి అతి సామాన్యునిగా జీవించారు. జీవిత చరమాంకంలో పేదరికాన్ని ఆనందంగా అనుభవించారు.

ధర్మబద్ధంగా ధన సంపాదన చేసి, వదాన్యుని(దాత) గా పేరుగాంచిన– శ్రీ జి.పుల్లారెడ్డి, విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ నాయకులు. భాగ్యనగరంలో వారు స్థాపించిన పుల్లారెడ్డి స్వీట్స్ ద్వారా వీరు ప్రసిద్ధులు. ఇటీవలికాలం వరకూ మన కళ్లముందు కదలాడిన ఈ మహనీయుడు, సంపదమీద వ్యామోహంతో సంపాదించినవారు కాదు. అసంఖ్యాకమైన ధర్మకార్యాలకు తన సంపదను వితరణ చేశారు. తన సంపాదనతో విద్యాసంస్థలు నెలకొల్పారు. ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి దాని ద్వారా ధార్మిక, సేవాకార్యక్రమాలకు శాశ్వత వితరణకై వీలు కల్పించారు.

✦✦✦

మన శాస్త్రాలు ఎన్నడూ ధన సంపాదనను వ్యతిరేకించలేదు, వద్దనలేదు. "అర్థకామాలను ధర్మబద్ధంగా సంపాదించు, అనుభవించు, ఆనందించు" అంటున్నాయి సనాతన ధర్మశాస్త్రాలు. అర్థ కామాలను ధర్మమోక్షాల మధ్య బంధించారు మన ఋషులు.

శ్లో॥ **న్యాయోపార్జితవిత్తేన, కర్తవ్యం హ్యాత్మరక్షణం ।**
**అన్యాయేన తు యో జీవేత్, సర్వకర్మబహిష్కృతః ॥**

(పరాశరస్మృతిః 12–43)

*న్యాయంగా సంపాదించిన ధనంతోనే తనను తన కుటుంబాన్ని పోషించుకోవాలి. అన్యాయంగా సంపాదించిన ధనంతో ఎవడు జీవిస్తుంటాడో వాడిని సమాజం బహిష్కరిస్తుంది.*

ధనం అంటే కేవలం డబ్బు అనుకోరాదు. ధనం –అనేకవిధాలు – అవి గోధనం (పూర్వకాలంలో గోవులే ధనంగా భావించేవారు. – ఎన్ని ఆవులుంటే అంత గొప్ప). సేవక ధనం – ఎందరు ఉద్యోగులు ఉంటే అంత పెద్ద సంస్థ – ఇవి కాక అతిథి ధనం, స్నేహితులనే ధనం ఇలా ఎన్నో వున్నాయి. నాయకుడు అన్ని ధనాలతో పుష్టిగా ఉండాలి.

**"గురుః శిష్య గణేన భాసతే – సజ్జనః బంధుమిత్ర వర్గేణ భాసతే"** ఎంత ఎక్కువ మందితో తాను గుర్తింపబడతాడో అంత గొప్పవాడు.

"ధనంలేని వ్యక్తుల ఆలోచనలు, సంస్థల పనులు, ప్రభుత్వం ద్వారా ప్రజల కోసం ఉద్దేశించిన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అన్నీ ఆదాయంతో ముడిపడినవే. ధనం లేకుంటే ఇవన్నీ ఎండాకాలంలో వాగుల్లాగ ఎండి పోతాయి" అంటుంది మహాభారతం.

శ్లో॥ **ధర్మః కామశ్చ స్వర్గశ్చ హర్షః క్రోధః శ్రుతం దమః ।**
**అర్థాదేతాని సర్వాణి ప్రవర్తంతే నరాధిప ॥**

*– రాజా! ధర్మం చేయాలన్నా, కోరికలు తీర్చుకోవాలన్నా, స్వర్గసుఖాలు పొందాలన్నా, మనం హర్షాన్ని వ్యక్తం చేయాలనుకున్నా, కోపం ప్రదర్శించాలన్నా, వేదాధ్యయనం చేయాలనుకున్నా, దమం (ఇంద్రియ నిగ్రహాది క్లేశసహనం) ఆచరించాలన్నా డబ్బుతోనే సాధ్యం. డబ్బు లేకపోతే ధర్మకార్యాలు, పుణ్యకార్యాలు చేయలేరు.*

శివాజీ సన్నిహిత సహచరుడైన రామచంద్రపంత్ వర్ణించిన చతుర్ధ రాజ శాసనంలో రాజ్యానికి డబ్బు అవసరాన్ని ఇలా చెప్పాడు.

"ఆదాయ వ్యయాలను పరిగణించి అందుకు అనుగుణంగా రాజు తన ఖజానాను పెంచుకుంటూ ఉండాలి. ఆర్థికరంగం రాజ్యానికి ఆయువుపట్టు. అవసరాలు వచ్చినప్పుడు, అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు తగినంత ధనం ఉంటే కష్టాల నుంచి గట్టెక్కవచ్చు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని పాలకుడు నిరంతరం రాజ్యాన్ని కాపాడుకుంటూ ఉండాలి. శివాజీ స్వరాజ్యాన్ని ప్రారంభించేనాటికి ఆయనకు పెద్దగా ఖజానా అన్నదే లేదు. కానీ ఆయన ఈ ప్రపంచాన్ని వదలి వెళ్లేనాటికి శివాజీ ఖజానాలో తొమ్మిది కోట్ల రూపాయలు ఉండేవి" (ఆ కాలానికి

ప్రతి మానవుడు పాటించవలసిన ఎన్నో సామాన్య ధర్మాలు మన ప్రాచీన వాఙ్మయాదులలో అడుగడుగునా కనబడుతున్నాయి. ఇంతకుమించిన నైతిక–ధార్మిక ప్రవృత్తి ఏముంటుంది? ఇట్టి పరిస్థితుల్లో భారతీయులకు 'ఎథిక్స్' విషయంలో అంతగా శ్రద్ధ ఉన్నట్లు లేదని అక్కడక్కడ వ్రాసిన కొందరు పాశ్చాత్యుల మాటలు ఎంత హాస్యాస్పదమైనవో, ఎంత అసూయభరితమైనవో, అజ్ఞాన విలసితాలో వేరుగా చెప్పనవసరం లేదు.

అది చాలా గొప్ప విషయం).పరిపాలనా సామర్థ్యానికి గీటురాయి ఇది.

ప్రజలకు సంతృప్తి కలిగించటం, అవినీతిలేని పరిపాలన ఏర్పరచటం, పారదర్శకత విస్తరించటం వంటి పరిణామాల ప్రాతిపదికగా పాలకుల స్వభావాన్ని వ్యక్తిత్వాలను అంచనా వేయవచ్చు.

**ఏది శుచిత్వం?**

శుచిత్వం అంటే మనలో చాలా మంది పరిశుభ్రంగా మూడుసార్లు స్నానాలు చేస్తూ, సబ్బువంటి వాటితో శుద్ధి చేసుకోవటం అనుకొంటాం. కానీ, మనువు ఇలా చెప్పాడు.

శ్లో॥ **సర్వేషామపి శౌచానాం అర్థశౌచం పరం స్మృతమ్ ।**
**యోఽర్థే శుచిర్హి స శుచిః న మృదాది శుచిః శుచిః ॥**

(మనుస్మృతిః – 5/106)

*అన్ని శౌచాలలోకి అర్థశౌచమే గొప్పదైన శౌచం. ఎవడైతే ఆర్థిక వ్యవహారాలలో శుచిగా ఉంటాడో, అంటే ఆర్థికపరమైన అంశాలలో అవినీతి పరుడు కాడో అతడే నిజమైన శుచిమంతుడు. అంతే తప్ప నీరు, మట్టి మొదలగువాటితో శరీరాన్ని శుభ్రం చేసుకున్న వాడు శుచి కాదు.*

అర్థశౌచానికి ఛత్రపతి శివాజీ చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. ఒకసారి శివాజీ తన సైన్యాన్ని తనిఖీ చేస్తుండగా ఒక అధికారి యుద్ధంలో గాయపడిన ఓ గుర్రం కుంటిదైపోయిందని, దాన్ని అమ్మేందుకు అనుమతి కావాలని కోరాడు. శివాజీ అందుకు అనుమతి ఇచ్చారు. కొద్ది నెలల తరువాత ఆ అధికారి వేరొక పనిమీద శివాజీని కలిశాడు. ఆయన్ని చూడగానే శివాజీ ఆ "గుర్రాన్ని అమ్మేశారా?" అన్న విషయాన్ని అడిగారు. తాను అమ్మినట్టు ఆ అధికారి చెప్పగానే "గుర్రం అమ్మగా వచ్చిన ధనాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేశారా?" అని ఆయన మరో ప్రశ్న వేశారు. ఇలా ఆర్థిక రంగంలో అతి చిన్న చిన్న విషయాలను కూడా పర్యవేక్షించడం శివాజీ ప్రత్యేకత.

అందుకే ఛత్రపతి శివాజీ ఆర్థిక క్రమశిక్షణకు, నిజాయితీకి నిదర్శనంగా చరిత్రలో నిలిచిపోయారు.

✦

Leadership

## 11. నాయకత్వం – ప్రజాసంబంధాలు

నాయకుడికి ఉండాల్సిన లక్షణం కృతజ్ఞత. తల్లిదండ్రులను ఖైదు చేసిన కంసునివలె, ఔరంగజేబు వలె వుంటే చరిత్ర క్షమించదు. గద్దెనెక్కిన నాయకుడు తనకు మునుపు పరిచయమున్న మేధావుల్ని, ప్రతిష్టిత వ్యక్తుల్ని, పరిచయస్థుల్ని గుర్తు పెట్టుకొని పలకరిస్తూ వుండాలి.

**సాం**దీపని మహర్షి ఆశ్రమంలో శ్రీకృష్ణుడు, సుదాముడు కలిసి చదువుకున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు. సుదాముడు బ్రహ్మవేత్త, కడు బీద బ్రాహ్మణుడు. చిరిగిన బట్టలు కట్టుకోవడం వల్ల అతనిని 'కుచేలుడు' అని పిలిచేవారు. పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే, భార్య ఒత్తిడి మేరకు కృష్ణుణ్ణి కలసి సహాయం అర్థించాలని ద్వారక వెళ్లాడు.

శ్రీకృష్ణుడు సాదరంగా సుదామునికి స్వాగతం పలికాడు. తన అంతఃపురానికి తీసుకెళ్లి, అర్ఘ్యపాద్యాదులతో అర్చించాడు. రుక్మిణి వింజామర వీచింది.

సుదాముడు తెచ్చిన అటుకుల మూటను చూసి, ఆనందభరితుడై గుప్పెడు తీసుకొని నోట్లో వేసుకొన్నాడు. అంతే! అక్కడ సుదాముని కుటుంబానికి సకల సంపదలు వచ్చేశాయి. సుదాముడు సంకోచం కొద్దీ కృష్ణుడిని ఎలాంటి సహాయం అడగలేదు. అయినప్పటికి మిత్రుని స్థితిని గ్రహించి అతనికి సముచిత సంపదను ప్రసాదించటం శ్రీకృష్ణుని ఔదార్యం. మిత్రుల మధ్య ప్రేమకు శ్రీకృష్ణ సుదాములు చారిత్రక

జీవన రూపాలు. ద్రుపద ద్రోణుల మైత్రి దీనికి వ్యతిరేక దృష్టాంతం. మిత్రులు కృష్ణ సుదాముల వలె ఉండాలి. ద్రుపద ద్రోణులవలె ఉండరాదు.

✦✦✦

ప్రధానమంత్రి పదవి నుంచి దిగిపోయాక పి.వి. నరసింహారావుగారు ప్రజాకవి కాళోజీ నారాయణరావు సంస్మరణ సభకు హైదరాబాద్ వచ్చారు.

ఆ సభలో కాళోజీ గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు:

“నాకు చిరకాల మిత్రుడు కాళోజీ. నేను ప్రధానమంత్రిగా ఉండగా నాకు ఒక లేఖ ఇలా రాశాడు – ‘నువ్వు రాష్ట్రంలో ఉన్నప్పుడు మనం ప్రజా సమస్యలు, పరిష్కార విధానాల గురించి చాలా మాట్లాడుకునేవాళ్లం. ఇప్పుడు ఫలానా విషయంలో నీ ప్రభుత్వ విధానం అందుకు విరుద్ధంగా ఎందుకు ఉంది? నీవు మారిపోయావా?’ అని. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్నప్పటికీ, నాకు అతను కేవలం మిత్రుడే కాదు, బాధ్యతగల పౌరుడు కూడా. అందుకే నేను రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆహ్వానించి, వారితో మాట్లాడాను. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అను గుణంగా మన విధానాలు రూపొందకపోతే వచ్చే నష్టం ఏమిటో, మారితే వచ్చే ప్రయోజనం ఏమిటో వివరించాను. ఒప్పించాను. ‘అధికారంలో ఉన్నాను కదా, ఈ లేఖకి జవాబిచ్చేదేంటి’ అని అనుకోలేకపోయాను. ప్రజల శ్రేయస్సు పట్ల ఎంతో ఆర్తితో నా మిత్రుడు రాశాడు. అదే నన్ను కదిలించింది”.

పి.వి. నరసింహారావు గారు రాష్ట్రంలో ఎప్పుడు ఎక్కడ పర్యటనకు వెళ్లినా పాత కార్యకర్తలందర్నీ గుర్తించి అభిమానంగా పలకరించేవారు. ఆయన పరిచితు లెవ్వరిని కదిలించినా ఇప్పటికీ ఆయన గురించి ఉన్నతంగా మాట్లాడతారు. మానవ సంబంధాలు ఎంత విలువైనవి!

✦✦✦

ఇలాంటిదే మరో సంఘటన 2020 ఏప్రిల్ నెలలో జరిగింది. అవి కొవిడ్–19 మహమ్మారి తన విస్తృత, వికృతరూపం చూపిస్తున్న రోజులు.

చైనాలోని వూహాన్‌లో ప్రారంభమైన వైరస్ వ్యాధి ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలకు విస్తరించింది. వేలాదిమంది ప్రాణాలను బలికొంది. భారత నాయకత్వం అనేక దేశాల నుంచి తన పౌరులని ప్రత్యేక విమానాలద్వారా తీసుకొచ్చి, వారి వారి ఇళ్లకు క్షేమంగా చేర్చింది. అదే సమయంలో వూహాన్‌లో చిక్కుబడిన 112

మంది భారతీయులు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

వారిని తీసుకొచ్చే సాహసం ఎవరు చేస్తారు? ఆ నగరం పేరు వింటేనే ప్రపంచం వణికిపోతోంది. మరి ఏ వైద్యబృందం అక్కడికి వెళ్తుంది? ఆ సమయంలో భారత వైమానిక దళానికి చెందిన, మెడికల్ అసిస్టెంట్‌గా ఘజియాబాద్‌లో పనిచేస్తున్న సార్జెంట్ డాక్టర్ ఫర్వేజ్ ధాకా అనే సాహసి ముందుకొచ్చాడు. అతని సారథ్యంలో వైద్యబృందం వూహాన్ వెళ్లింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, జీవితం మీద ఆశతో ఎదురుచూస్తున్న 112 మంది భారతీయుల్ని సురక్షితంగా భారతదేశానికి చేర్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోది ఆ సాహస వైద్యునికి ప్రత్యేకంగా ఫోన్ చేసి అభినందించారు. ఆయన ద్వారా ప్రయాణీకుల మానసిక స్థితిగతులను, డా॥ఫర్వేజ్ కుటుంబసభ్యుల ప్రతిస్పందనను గురించి అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ నాయకులు ఇలా వ్యవహరిస్తారు.

✦✦✦

నాయకుడికి ఉండాల్సిన లక్షణం కృతజ్ఞత. తల్లిదండ్రులను ఖైదు చేసిన కంసుని లాగా, ఔరంగజేబు లాగా వుంటే చరిత్ర క్షమించదు. గద్దెనెక్కిన నాయకుడు తనకు మునుపు పరిచయమున్న మేధావుల్ని, ప్రతిష్టిత వ్యక్తుల్ని, పరిచయస్థుల్ని గుర్తు పెట్టుకొని పలకరిస్తూ వుండాలి. దేశానికి సేవ చేస్తున్న వారిని గుర్తిస్తూ ఉండాలి. ఉన్న స్థితినుంచి, ఉన్నత స్థితికి చేరగానే అయినవారిని, అందుకు సహకరించిన వారిని మరవటం కృతఘ్నత.

“తనకు వచ్చిన పదవి, లభించిన ఉన్నత స్థితి తన కళ్లను నెత్తిమీదకి తేకూడదు. తరచూ గమనించుకొంటూ ముందుకు వెళ్లాలి” అంటోంది రాజనీతి శాస్త్రం.

ప్రజాసేవలో ఉన్న నాయకుడు తన ప్రజలందరి పట్ల ఆదరణ కలిగి వుండాలి. ముఖ్యంగా తనకు సాయపడిన కార్యకర్తలను మరచిపోరాదు. ధర్మ శాస్త్రం ఇలా చెప్పింది. “ఆపదలో వున్నప్పుడు మనకు ధైర్యం ఇచ్చి భయాన్ని పోగొట్టినవారిని, విద్య నేర్పిన గురువును, తనకు ఉపనయనం చేసిన వారిని, మంత్రోపదేశం చేసినవారిని ఆకలితో ఉన్నప్పుడు భోజనం పెట్టినవారిని, కన్యాదానం చేసినవారిని, పుచ్చుకొన్నవారినీ, మనకు (ఇతర) దానాలిచ్చినవారిని తండ్రితో సమానంగా గౌరవించాలి”.

✦✦✦

అయిన వారిని నిర్లక్ష్యం చేయటం తగదని చెప్తూ శ్రీరామచంద్రుడు భరతుణ్ణి ఇలా అడిగాడు.

శ్లో॥ **కచ్చిద్దేవాన్ పితౄన్ మాతౄన్ గురూన్ పితృసమానపి ।**
**వృద్ధాంశ్చ తాత వైద్యాంశ్చ బ్రాహ్మణాంశ్చాభిమన్యసే ॥**

(శ్రీమద్రామాయణం, అయోధ్యాకాండం–100/13)

*ఓ భరతా! నువ్వు దేవతలను, తల్లిదండ్రులను, తండ్రితో సమానమైన వారిని, వైద్యులను, విద్యాధికులైన బ్రాహ్మణులను గౌరవిస్తున్నావు కదా!*

అధికార దర్పంతో కులదేవతలకు పూజలు మాని, నాస్తికులమని ప్రచారం చేసుకునే దుర్మార్గులైన వర్తమాన నాయకులను నిరసిస్తూ చెప్పిన శ్లోకం ఇది. తిరుపతిలోని ఏడుకొండలూ వెంకన్న సొంతం కావన్న నాయకమ్మన్యులను, సాత్వికులైన ధర్మాచార్యులను నగర బహిష్కరణలకు గురిచేసి వారికి వ్యతిరేకంగా అబద్ధపు అభియోగాలను మోపే వర్తమాన పాలకులని గుర్తు తెచ్చే శ్లోకం ఇది.

గురువులైన మఠాధిపతులను, పీఠాధిపతులను అవమానించి, వారి పట్ల దుష్కార్యాలను చేసిన వారిని, తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో పడవేసి, పట్టించుకోని వారినీ నిందించే శ్లోకం ఇది.

తన తల్లిదండ్రులను తనవారిగా చెప్పుకోవడానికి సంకోచించి, తండ్రిని తోటమాలిగా పరిచయం చేసిన నడమంత్రపు సిరి అధికారులకు చెంపదెబ్బ లాంటిది ఈ శ్లోకార్థం. సమాజాన్ని నడిపించే నాయకుడు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకి తోలితే అదేమి ఆదర్శం? సమాజానికి తప్పుడు సందేశం వెళ్తుంది కదా! నాయకుడు సమాజం పట్ల కృతజ్ఞతతో వ్యవహరించాలని నిర్దేశిస్తూ నారదమహర్షి, ధర్మరాజును ఇలా ప్రశ్నించాడు..

శ్లో॥ **కచ్చిత్ కృతం విజానీషే కర్తారం చ ప్రశంససి।**
**సతాం మధ్యే మహారాజ సత్కరోషి చ పూజయన్॥**

(మహాభారతం – సభాపర్వం–5/120)

*మహారాజా! ఉపకారం చేసినవారిని మరచిపోవడం లేదు కదా! ఈ విధంగా నీకు మేలు చేసిన వారిని సజ్జనుల సమక్షంలో ప్రశంసిస్తూ నీవు కృతజ్ఞతతో సత్కరిస్తున్నావా?*

✦✦✦

ఛత్రపతి శివాజీ ఏలుబడిలో ప్రజాసంబంధాలు, పరిచయాలు వంటివాటికి శివాజీ వ్యక్తిగత వ్యవహార శైలి ఆదర్శవంతమైన నిదర్శనం. ఈ విషయంలో ఫ్రెంచి యాత్రికుడు రెవరెండ్ జీన్ ఎస్కోలియేట్ ఇలా వ్రాశాడు. “ఆయన కళ్లు మెరుస్తూ ఉండేవి. ఆయన ముఖంలో అనునిత్యం ఒక చిరునవ్వు తాండవించేది. ఆయన ప్రజలను సంబోధిస్తూంటే ప్రతి వ్యక్తికీ శివాజీ తనతో మాట్లాడుతున్నట్టు, తన వైపే చూస్తున్నట్టు అనిపించేది”.

ప్రతి యుద్ధానికి ముందూ, యుద్ధం తరువాత శివాజీ తన సైనికులను వ్యక్తిగతంగా కలిసేవారు. క్రమశిక్షణ విషయంలో ఎంత కఠోరంగా ఉండేవారో గాయపడిన సైనికుల విషయంలో అంతే మృదువుగా వ్యవహరించేవారు. అఫ్జల్ ఖాన్‌ను వధించిన తరువాత శివాజీ గురించి ఆయన ఆస్థానంలోని ఒక వ్యక్తి ఇలా వ్రాశాడు. “యుద్ధం పూర్తి కాగానే శివాజీ కోట నుంచి కిందకు దిగి వచ్చి తన సైన్యంలోని వారందరినీ కలిశారు. అంతేకాదు అఫ్జల్ ఖాన్ సైన్యంలో మిగిలిన వారిని కూడా కలిశారు. చనిపోయిన సైనికుల కుటుంబాలలో సామర్థ్యం ఉన్న వారిని సైన్యంలో నియమించుకున్నారు. పురుష సంతానం లేకుండా యుద్ధంలో అమరులైన సైనికుల భార్యలకు సగం జీతం అందేలా ఆదేశాలు జారీ చేశారు.

✦✦✦

“రాజా పితృ సమానః” అని శాస్త్రం చెప్పింది – అంటే రాజు తన ప్రజలపట్ల పితృ వాత్సల్యంతో ప్రవర్తించాలి, పాలించాలి. తన ప్రజలందరూ తన కుటుంబ మేనని భావించి, తన సొంత సంతానంతో ఎలా ప్రవర్తిస్తాడో అలాగే ప్రజలలో వారి వారి తప్పొప్పులను తూకంవేసి, నచ్చజెప్పి సరిదిద్ది, అవసరమైతే దండించి కూడా ప్రగతి పథంలో రాజ్యాన్ని నడిపించాలి.

అలాగే జనులందరూ కూడా రాజుని తండ్రివలె భావించాలి. రాజు మాటను జవదాటకూడదు (పితృవాక్య పరిపాలన). తాను పితృ వాత్సల్యం చూపిస్తున్నాడు, అధికార పౌరుషాన్ని కాదు–అనే భావనని, జనులలో విశ్వాసాన్ని కలిగించవలసిన భాధ్యత రాజుదే!

ఇప్పటికాలంలో ‘రాజు’ అంటే నాయకుడు, అధికారి అని అన్వయించుకోవాలి!

✦

## ఆదర్శ నాయకులు

**ఒ**క ఉత్తమ నాయకుడు తన జాతిని ఏ దిశగా నడిపించాలీ అన్న విషయంపై స్పష్టత కలిగి ఉండాలి.

అలా స్పష్టత లేని నాయకుడు ప్రజలకు హాని చేస్తాడే తప్ప మేలు చేయలేడు.

"ప్రస్తుత పరిస్థితులను మించి బంగారు భవిష్యత్తును నిర్మిస్తాను" అన్న తాపత్రయంతో మంచి నాయకుడు ముందుకు వస్తాడు.

దేశాభివృద్ధి విషయంలో నాయకునికి ముందు ఓ స్వప్నం ఉండాలి. దాన్ని సాకారం చేసుకునేందుకు ఏవిధంగా వ్యవహరించాలో స్పష్టత ఉండాలి. దాని రూపకల్పనలో స్వార్థం లేకుండా ఉండాలి.

'మనస్సులో ఒకటి, మాటలో ఒకటి, ఆచరణలో వేరొకటి' అనే దుష్టబుద్ధులు గలవారు పాలకులయితే ఆ దేశానికి తీవ్రమైన నష్టం కలుగుతుంది.

నాయకులు ప్రజలకు ఏది మంచి చేస్తుందో దానిని తెలిసుకుని వ్యవహరించాలి. ప్రజా క్షేమమే పరమావధిగా జీవించిన నాయకుల పేర్లే శాశ్వతంగా నిలిచిపోతాయి. జాతి దశ, దిశ మార్చినవారు చిరస్మరణీయులవుతారు.

భవిష్యత్ నిర్మాణంపై స్పష్టత ఉన్న నాయకులు అరుదుగా ఉంటారు.

వారే లోకప్రియులవుతారు.

ఆ విధంగా ఉండనివారు తాత్కాలికంగా వినిపించే గ్రామఫోన్ పాటలాగ కాసేపు వినిపించి మరుగున పడిపోతారు. మన సంస్కృతి, వారసత్వాలను పరిరక్షిస్తూ, అందులోని అంశాలు వర్తమాన పరిస్థితులకు ఎలా ఉపయోగిస్తాయో తెలియజెప్పిన వారు మాత్రమే ఆదర్శ నాయకులుగా రాణిస్తారు, చరిత్రలో చిరస్థాయిగా ఉంటారు.

**– ఎల్.వి. సుబ్రమణ్యం**

ఐఎఎస్ (రిటైర్డ్)

(ఒక ప్రసంగం నుంచి)

*Leadership*

## 12. ఉద్యోగులపై అపేక్ష ఉండాలి

**నేతలు తనతో పనిచేసేవారి ఎడల ప్రేమతో వ్యవహరించాలి. వారిపై అసూయ పడకూడదు. ప్రతిదానికి విసుక్కోవటం, కసురుకోవటం కూడదు. క్షమలేని నాయకుని దగ్గర కార్యకర్తలు పనిచేయలేరు.**

**ప**విత్ర ప్రయాగరాజ్‌లో 2019 సంవత్సర ఆరంభంలో జరిగిన కుంభమేళాలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దాదాపు 25 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారు. త్రివేణి సంగమంలో జరిగిన ఈ కార్యక్రమ విజయానికి తోడ్పడిన వారిలో ప్రముఖులు పారిశుద్ధ్య (సఫాయి) కార్మికులు, రక్షక భటులు, నావికులు, వేలాది మంది ప్రభుత్వేతర సంస్థల స్వయం సేవకబృందాలు. మేళా పూర్తి అయ్యాక వీరందరికీ కృతజ్ఞత తెలిపే కార్యక్రమం ప్రయాగ్‌లో ఏర్పాటు చేయబడింది.

'స్వచ్ఛ్ కుంభ్ – స్వచ్ఛ్ ఆభార్' అనే కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోది పాల్గొన్నారు. వీరందరికీ కృతజ్ఞత ప్రకటించారు. పారిశుద్ధ్య పనుల్లో పనిచేసినవారికి గౌరవం ప్రకటించేందుకు కొందరి కార్మికుల పాదాలను ప్రధానమంత్రి కడిగిన దృశ్యం ఎందరికో ఆశ్చర్యాన్ని కలిగించింది. స్ఫూర్తిని కలిగించింది. ఒక ఆదర్శ నాయకుడుగా భారత ప్రధానిని అందరూ అభివర్ణించారు.

✦✦✦

నాయకునికి ఉండాల్సిన ముఖ్య గుణం తనకోసం పనిచేసేవారిని తన పిల్లలుగా భావించటం, వారి బాగోగులు చూసుకోవటం. వారికి ఇచ్చే వేతనాల విషయంలో శ్రద్ధ వహించటం. ఉద్యోగికి జీతం ఇవ్వటంలో ఆలస్యం చేస్తే వారి కుటుంబంపై, వారిపై ఆధారపడిన అనేక కుటుంబాలపై ఆ ప్రభావం పడుతుంది. ఇది నాయకునికి చెడ్డపేరును తెచ్చిపెడుతుంది.

శ్రీరామచంద్రుడు తన తమ్ముడు భరతునికి చెప్పిన రాజధర్మాలలో ఒకటి – "మన క్రింద పని చేసేవారిని ఉపేక్షించవద్దు" అని.

శ్లో॥ **కాలాతిక్రమణాచ్చైవ భక్త వేతనయోర్భృతాః ।**
**భర్తుః కుప్యంతి దుష్యంతి సోఽనర్థః సుమహాన్ స్మృతః ॥**

(*అయోధ్యాకాండము, 100/33*)

*భటులకు ఇచ్చే జీతభత్యాల విషయంలో ఆలస్యం చేయకూడదు. కాలాతిక్రమణ జరిగితే ఉద్యోగస్థులు రాజును కోపంతో నిందిస్తారు. ఇది చాలా అనర్థాలకు దారి తీస్తుంది.*

✦✦✦

శ్రీరామచంద్రుడు రావణుణ్ణి సంహరించాక లోకాలన్నీ సంతోషించాయి. ఇంద్రుడు ప్రత్యేక విమానంలో వచ్చి అభినందించాడు. ఇంద్రుడు శ్రీరామచంద్రుణ్ణి రెండు వరాలు కోరుకోమన్నాడు. శ్రీరాముడు ఏమి వరం కోరాడు?

తనకోసం యుద్ధంలో పాల్గొని మరణించిన వానరులను బ్రతికించమని కోరు కున్నాడు; వానరాలు, గోలాంగూలాలు (కొండ ముచ్చులు), భల్లూకాలు (ఎలుగు బంట్లు) ఎక్కడెక్కడుంటాయో అక్కడ అన్ని కాలాలలోనూ మంచి మంచి పళ్లు ఉండాలని, నిర్మలమైన నీరు లభించే నదులు ప్రవహించాలని శ్రీరాముడు కోరు కొన్నాడు. (సీతాఫలాలు, రామఫలాలు, లక్ష్మణఫలాలు అలాగే సృష్టించ బడ్డాయని అంటుంటారు). ఎంత గొప్ప ఆదర్శం ఇది!

✦✦✦

నేతలు తనతో పనిచేసేవారి ఎడల ప్రేమతో వ్యవహరించాలి. వారిపై అసూయ పడకూడదు. ప్రతిదానికి విసుక్కోవటం, కసురుకోవటం కూడదు. క్షమలేని నాయకుని దగ్గర కార్యకర్తలు పనిచేయలేరు.

రాజకీయ క్షేత్రాల్లోనే కానక్కర్లేదు, ఉద్యోగ రంగంలో కూడా, ఉదాహరణకు ఓ

బ్యాంక్‌లో కాని, మరో భారీ వ్యాపార సంస్థలో కాని... ఓ అధ్యక్షుడు, అధికారి, బాస్... వచ్చి నీ నెత్తిమీద కూర్చుంటే... అతగాడికి, నీ అంత తెలివి లేకుంటే... ప్రతిదానికి కసురుకొంటుంటే. "నిల్చుంటే తప్పు, కూర్చుంటే తప్పు"గా వ్యవహరిస్తూంటే.... నీపై అసూయపడుతూంటే...??? ఎంత కష్టం??"

భర్తృహరి వ్రాసిన ఈ శ్లోకంలో ఇదే విషయాన్ని వ్యంగ్యంగా చెప్పారు -

శ్లో॥ **మౌనాన్మూకః (మూర్ఖః), ప్రవచనపటుః వాచకో జల్పకో వా,**
**ధృష్టః పార్శ్వే వసతి నియతం, దూరతశ్చాప్రగల్భః ।**
**క్షాంత్యా భీరుర్యది న సహతే ప్రాయశో నాభిజాతః**
**సేవాధర్మః పరమగహనో యోగినామప్యగమ్యః ॥**

*యజమానితో చనువు తీసుకొని మాటలాడాం అనుకోండి. 'వాగుడుకాయి' అంటారు. మౌనంగా వున్నామా? మూగవాడు (మూర్ఖుడు)గా ముద్రవేస్తారు. ఓర్చుకొని ఉంటే పిరికివాడంటారు - ఎదురు జవాబు చెప్తే అసహనం అంటగడ్తారు. దగ్గరగా ఉంటే పొగరుబోతంటారు-దూరదూరంగా ఉందామంటే 'చేతకానివాడు' గా నిందిస్తారు. సేవాధర్మమనేది చాలా లోతైన, గాఢమైన భావన. యోగులు సహితం అర్థం చేసుకోలేనిది.*

సేవలు చేసి మెప్పు పొందటం యోగులైన వారికి కూడా దుర్లభం. సేవకుడు ఎలా ప్రవర్తించినా (కొందరు) యజమానులకు తప్పు గానే తోస్తుంది! నిజమైన నాయకుడు ఇలాంటి యజమాని వలె ప్రవర్తించరాదు.

✦✦✦

తనకోసం శత యోజన పర్యంత సముద్రాన్ని దాటివచ్చి, శ్రీరాముని గురించిన శుభ సమాచారాన్ని ఇచ్చిన హనుమపై సీతమ్మకు పుత్రవాత్సల్యం కలిగింది. హనుమను వీలైతే ఇంకొక రోజు ఉండమని అడుగుతుంది సీతమ్మ.

శ్లో॥ **యది వా మన్యసే వీర వసైకాహమరిన్దమ ।**
**కస్మింశ్చిత్సంవృతే దేశే విశ్రాన్తః శ్వో గమిష్యసి ॥**

*(సుందరకాండము, 39/19)*

*ఓ వీరుడా! నీకు అంగీకారం అయితే ఒక్కరోజు పాటు ఏదైనా రహస్యమైన ప్రదేశంలో ఉండి, విశ్రాంతి తీసుకొని రేపు వెళ్లవచ్చు కదా!*

ఎంతో ఆప్యాయత వున్నవారే ఈ విధంగా మాట్లాడతారు.

✦✦✦

**నాయకుడు ఆదర్శ కార్యకర్తల భుజం తట్టాలి.**

నాయకుడు తనవద్ద పనిచేస్తున్న వ్యక్తుల నీతి నిజాయితీలను గుర్తించి వారిని మెచ్చుకోవాలి, వారిని సత్కరించాలి. అలాగే క్రమశిక్షణ లేనివారిని ఏరి పారేయాలి! దేశ హితం, యజమాని హితం, సంస్థ హితం కోసం ఒళ్లు వంచి, చెమటోడ్చి పనిచేసేవారికి 'గుర్తింపు' ఇచ్చినవాడే దూరదృష్టి గల నాయకుడు. అప్పుడే కార్యకర్తలు నిలిచి ఉంటారు. మహాభారతంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు.

శ్లో॥ **అభిప్రాయం యో విదిత్వా తు భర్తుః**
**సర్వాణి కార్యాణి కరోత్యతంద్రీ ।**
**వక్తా హితానామనురక్త ఆర్యః**
**శక్తిజ్ఞ ఆత్మేవ హి సోఽనుకంప్యః ॥** *(ఉద్యోగపర్వం,37/25)*

*నాయకుని (యజమాని) అభిప్రాయం తెలుసుకొని, ఏమరుపాటు లేకుండా అన్ని పనులు చేసేవారిని, హితవుగా సంభాషించే ఉద్యోగుల్ని, రాజు (యజమాని) ఎడల భక్తి, మంచి నడవడిక కలవారిని, తన శక్తిని ఎరిగినవారిని పాలకుడు ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలి.*

✦

శ్లో॥ **యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః**
**స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే.** (భగవద్గీత 3.21)

*ఉత్తముడైన వ్యక్తి చేసే పనులను ఇతరులు కూడా చేస్తారు. అతడు ప్రమాణంగా గ్రహించిన దానినే సమాజం కూడా అనుసరిస్తుంది.*

ఇలాంటి ఉత్తమమైన వ్యక్తి దేశానికో, ప్రాంతానికో నాయకునిగా, లేక ఓ సంస్థకు అధిపతిగా ఉండవచ్చు. లోకమంటే ప్రజలు. తనతో పనిచేసే ఉద్యోగులకి నాయకుడు ఆదర్శంగా నిలవాలి. ప్రజలు తనను ఆదర్శంగా స్వీకరించేలా ప్రవర్తించాలి. పర్యవేక్షకుడు (సూపర్‌వైజర్) అనే పదవిలో వున్నవాడే కార్యాలయానికి ఆలస్యంగా వస్తే? క్రమశిక్షణను ఉల్లంఘిస్తే? కంచే చేను మేస్తే? అందుకని నాయకుడు, గురువులు, మేధావులు, తల్లిదండ్రులు తమను చూసి అనుసరించే వారుంటారనే స్పృహ కలిగి వుండాలి.

*Planning & Strategy*

## 13. ముందుచూపు అనివార్యం

**మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. దాన్ని సరైన సమయంలో నిర్మించుకొనే తెలివి కలిగి ఉండాలి. నాయకుడు వర్తమానంలో ఉంటూనే 'భవిష్యత్'ను వీక్షించాలి.**

**ధ**ర్మప్రధానంగా పాలన జరుగుతున్న రోజుల్లో జరిగిన ఓ కథ ఇది.

ధర్మప్రస్థ అనే పేరుగల రాజ్యం ఉండేది. పేరుకు తగ్గట్టే రాజు, ప్రజలు ధర్మ ప్రవర్తన కలిగి ఉండేవారు. ఐదు సంవత్సరాలకోసారి రాజును ఎన్నుకోవటం, వారి పదవీకాలం పూర్తి అవగానే, ఆ రాజును పూర్ణా నది అవతల ఉన్న క్రూరమృగాలతో ఉండే ఓ అడవికి సకల సైనిక లాంఛనాలతో సాగనంపడం అక్కడి ప్రజల ఆచారం. తర్వాత వారు ఏమై పోతారనేది ఎవరికీ పట్టదు. నదిని దాటించేటప్పుడు పదవీ కాలం ముగిసిన ఆ పూర్వ రాజులు ఎంతో దుఃఖించేవారు. వారి దుఃఖం చూసి పడవలో నదిని దాటించే సరంగు వారిపై ఎంతో సానుభూతి చూపించేవాడు.

సరంగు ఇంతకుముందు ఎనిమిదిమంది రాజుల్ని చూశాడు. కానీ ఈ తొమ్మిదో రాజు నవ్వుతూ, తుళ్లుతూ ఉత్సాహంగా అడవికి వెళ్తున్నాడు.

ఎప్పుడెప్పుడు అవతలి గట్టుకి వెళ్తానా అన్నట్లుగా అతడి మానసిక స్థితి ఉండటం సరంగుకు ఆశ్చర్యాన్ని

కల్గించింది. తొమ్మిదవ రాజుని ఈ విషయాన్ని అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పాడు. "నాకు పదవీప్రమాణం రోజునే ఇది ఐదేళ్ల వైభోగమని తెలుసును. అందుకని ఐదు సంవత్సరముల తర్వాత జీవితం గురించి నా ప్రయత్నం ప్రారంభం చేసుకొన్నాను. నది అవతల ఓ చిన్న గ్రామాన్ని నిర్మించాను. అక్కడున్న ప్రజలు నా రాక కోసం ఎదురు చూస్తున్నారు" అన్నాడు.

రాజు చెప్పినట్లే వందలాది మంది ప్రజలు నదీతీరంలో కొత్త రాజుకి స్వాగతం పలికేందుకు నిల్చి ఉండటం పడవ సరంగు చూశాడు.

**ముందు చూపు ముఖ్యం**

"మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. దాన్ని సరైన సమయంలో నిర్మించుకొనే తెలివి కలిగి ఉండు" అని ప్రబోధించే కథ ఇది.

నాయకుడు వర్తమానంలో ఉంటూనే 'భవిష్యత్'ను వీక్షించాలి.

రాబోయే రోజులలో తన పరిపాలనను సుగమం చేసుకోవాలంటే ఈ దృష్టి అవసరం. కనీసం రాబోయే మూడు నెలలపాటు మన 'యోజన' ఏమిటో నాయకుడు ఆలోచించాలి. దేశ పరిపాలకులు కావచ్చు, సంస్థల నిర్వాహకులు కావచ్చు. భవిష్యత్తులో విజయాలు సాధించటానికి తగినంత ముందుగా పథకాలను రూపొందించుకోవాలి.

మహాభారతంలో విదురుడు ధర్మరాజుకు ఉపదేశం ఇస్తూ, "రేపటి పని ఈ రోజు చేయాలి. మధ్యాహ్నం చేయాల్సిన పని ప్రొద్దునే చేయాలి" అన్నాడు. మంచి భవిష్యత్ కోసం ఈ విధమైన ఆలోచన అవసరం.

శ్లో॥ **దివసేనైవ తత్‌కుర్యాత్ యేన రాత్రౌ సుఖం వసేత్ ।**
**అష్టమాసేన తత్ కుర్యాత్ యేన వర్షాః సుఖం వసేత్ ॥**

*(మహాభారతం-ఉద్యోగపర్వం,36/67)*

*ఏ పని చేస్తే రాత్రి సుఖంగా గడపవచ్చునో, ఆ పనిని పగటి పూటే పూర్తి చేయాలి! నాలుగు నెలల వర్షాకాలంలో సుఖంగా గడిపేటట్లు మిగిలిన ఎనిమిది నెలలలో పనులు పూర్తి చేసుకోవాలి!*

వృద్ధాప్యంలో సుఖంగా వుండాలంటే యౌవనంలో కష్టపడాలి. సంపాదించాలి. దాచుకోవాలి. ఈ జన్మతోనే నీ పనులు పూర్తి కావు. అందుకని వచ్చే జన్మకోసం (లేదా మరణాంతర సుఖంకోసం) ఏం చెయ్యాలో ఈ జన్మలోనే చెయ్యాలి. ఇదే భారతీయుల కర్మయోగం.

*Execution*

## 14. విజయపథంలో జారుడు మెట్లు

**పరస్త్రీలపై వ్యామోహం, అనవసరంగా వేటాడటం, జూదం, మద్యపానం, కఠినంగా మాట్లాడటం, కఠినమైన శిక్షలు విధించటం, డబ్బు వృథాగా ఖర్చు చెయ్యడం అనే ఏడు దుర్గుణాలను పాలకుడు (నాయకుడు) ఎల్లప్పుడు విడిచి పెట్టాలి.**

**రా**జు అంటే పాలకుడు.

రాజు అంటే ఓ నాయకుడు. ఓ సంస్థకు అధిపతి. ఓ కుటుంబానికి పెద్ద. ఓ సంస్థకు కార్యదర్శి, ఓ పార్టీ అధ్యక్షుడు... కళాకారుడు, మేధావి, పండితుడు...

వివిధ రంగాలలోని ప్రముఖులు, వీరిలో ఎవరైనా విజయం సాధించాలంటే దుర్గుణాలకు దూరంగా ఉండాలి. వ్యసనాలకు బానిసలైన నాయకులు, చలన చిత్ర కళాకారులు తదితరులు సర్వనాశనమైన ఉదాహరణలు కోకొల్లలు.

విచక్షణ లేని 'వేట' ఓ భయంకరమైన వ్యసనం.

అకారణంగా, వినోదం కొరకు అడవులలోని సహజ రక్షకులైన మృగాలను చంపే వ్యసనం. ఇది ప్రకృతి హితానికి విరుద్ధం. ధనమదంతో, అధికార గర్వంతో వేటాడే మనస్తత్వం పనికి రాదు. అనవసరమైనవారికి ఆయుధం చేతిలో ఉంటే (ఈ రోజుల్లో తుపాకీ) అనేక దురాలోచనలు వచ్చే అవకాశం ఉంది.

ఓ వ్యక్తి తన దగ్గరున్న పదునైన, విలువైన కత్తిని ఓ సాధువు దగ్గర దాచి ఉంచమని ఇచ్చాడట. తీర్థయాత్రకు

వెళ్లి వచ్చాక తిరిగి తీసుకొంటానని చెప్పాడట. ఆ వ్యక్తి తిరిగి వచ్చాక చూస్తే ఆ సాధువు కాస్తా దుర్మార్గునిగా మారిపోయాడట. జంతువులను చంపటంతో పాటు, తనకు కిట్టనివారిని పొడిచి చంపే రాక్షస ప్రవృత్తిని అలవాటు చేసుకొన్నాడట. సంయమనం లేనివారి చేత ఆయుధాలు ఉంటే ఇలానే జరుగుతుంది.

మద్యపానాన్ని విలాసం కోసం, సరదాకోసం మొదలెట్టి వ్యసనంగా మార్చుకొని ప్రాణాలు పోగొట్టుకొన్న దౌర్భాగ్యులెందరో ఉన్నారు. అందుకని నాయకులు ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి.

శ్లో॥ **సప్తదోషాః సదా రాజ్ఞా హాతవ్యా వ్యసనోదయాః ।**
**ప్రాయశో యైర్వినశ్యంతి కృతమూలా అపీశ్వరాః ॥**

శ్లో॥ **స్త్రియోఽక్షా మృగయా పానం వాక్పారుష్యం చ పంచమమ్ ।**
**మహచ్చ దండపారుష్యమ్ అర్థదూషణమేవ చ ॥**

(మహాభారతం – ఉద్యోగపర్వం–33/91–92))

*పరస్త్రీలపై వ్యామోహం, అనవసరంగా వేటాడటం, జూదం, మద్యపానం, కఠినంగా మాట్లాడటం, కఠినమైన శిక్షలు విధించటం, డబ్బు వృథాగా ఖర్చు చెయ్యడం అనే ఏడు దుర్గుణాలను పాలకుడు (నాయకుడు) ఎల్లప్పుడు విడిచి పెట్టాలి. ప్రతిష్ఠను దెబ్బతీసే ఈ తప్పులు ఎంత అనుభవజ్ఞులనైనా, ఎంతటి సమర్థవంతులనైనా క్రిందికి జార్చేస్తాయి.*

విజయం సాధించే కోరిక ఉన్నవాళ్లు వర్జించాల్సిన మరో పది అవలక్షణాలను (దశ వర్గం పేరిట) మనువు వర్ణించాడు.

శ్లో॥ **మృగయాక్షో దివాస్వాపః పరివాదః స్త్రియో మదః।**
**తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః॥**

(మనుధర్మశాస్త్రం – 7/47)

*విచక్షణ లేకుండా వేటాడటం, జూదం, పగటి నిద్ర, ఇతరులను నిందించటం, స్త్రీ వ్యామోహం, (మద్యపానాదులను సేవించటం వల్ల వచ్చే) మదం, తౌర్యత్రికం అనబడే మూడు వ్యసనాలు –నృత్య, గీత, వాద్యాలపై మితిమీరిన ప్రీతి– వ్యర్థంగా తిరగటం అనే ఈ పది కామజ వ్యసనాలకు లోబడిన వ్యక్తి విజయానికి దూరం అవుతాడు.*

ఇవి కాక మరో ఈ క్రింది 'కార్యవ్యసనాలు' విజయపథంలో జారుడు మెట్లు:

శ్లో॥ **వస్తుష్వశక్యేషు సముద్యమశ్చ**
**శక్యేషు మోహాదసముద్యమశ్చ ।**
**శక్యేషు కాలేషు సముద్యమశ్చ**
**త్రిధైవ కార్యవ్యసనం వదన్తి ॥** *(కామందక నీతిశాస్త్రం)*

*తానుగా చేయలేని పనులను నెత్తిన వేసుకోవటం, చాలా తేలికగా చేయగలిగిన పనులను ప్రారంభించకపోవటం, సరైన సమయంలో పనులు చేపట్టకపోవటం అనేవి కార్యవ్యసనాలు.*

అందువల్ల విజయం సాధించదలచే నాయకులు వివిధ వ్యసనాలకు దూరంగా ఉండాలి. ✦

**పదవిని దుర్వినియోగం చేసే పాలకులకు మేలుకొలుపు.**

**అ**నుకోకుండా లభించిన దేవేంద్ర పదవి నహుషుణ్ణి గర్వోన్నతుణ్ని చేసింది. కాలం అంతా వివిధ భోగాలతో గడపడం ప్రారంభించాడు. తలపొగరుతో ఇంద్రుని భార్య శచీదేవిని ఆశించాడు. "యుక్తం కాదు" అని దేవతలు చెప్పినా, వాళ్ళని ఎదురు ప్రశ్న వేశాడు. బృహస్పతి సలహా మేరకు శచీదేవి నహుషుణ్ణి కలసి, "నాకు కొంతకాలం గడువు ఇయ్యి" అని కోరింది.

కాలమే ఏదో ప్రతిక్రియ చూపుతుంది కదా! ఆ అమ్మవారి దయవల్ల ఇంద్రుని జాడ తెలిసింది. శచీదేవి తనకి నహుషుని వల్ల వచ్చిన పరాభవం గురించి చెప్పింది.

నహుషుని తపో శక్తిని నశింపచేసే ఉపాయాన్ని ఇంద్రుడు ఆలోచించాడు. దాని ప్రకారం శచీదేవి నహుషుని దగ్గరకు వెళ్ళి "ఋషులందరిచేత పల్లకీ మోయించుకొని దానిలో ఎక్కిరా! నన్ను వశం చేసుకో" అని ఆహ్వానించింది.

కళ్ళు నెత్తికెక్కిన నహుషుడు ఆనందపరవశుడు అయ్యాడు. ఋషులు మోస్తూండగా పల్లకీ ఎక్కి బయలుదేరాడు. మధ్య దారిలో జరిగిన వాగ్వాదం కారణంగా అగస్త్యుని శిరస్సుపై తన్నాడు.

అంతే! ఆ మహర్షి "నీవు పదివేల సంవత్సరాలు సర్పంగా పడి ఉండు" అని శపించాడు. నహుషుడు పదవి పోగొట్టుకొని సర్పమైపోయాడు.

తనకు లభించిన పదవిని దుర్వినియోగంచేసే పాలకులకు మేలుకొలుపు ఈ కథ. **(మహాభారతం)**

## వ్యసనపరుడైతే పతనమే !!

**సీ**తమ్మ జాడ కనుక్కోవటానికి వెళ్ళిన హనుమ, వెళ్ళిన పని పూర్తి చేసు కొన్నాడు.

"చూసి రమ్మంటే కాల్చి వచ్చాడనే" సామెత మాదిరి అశోకవనాన్ని ధ్వంసం చేసి, ఎదురొచ్చిన రాక్షసులను సంహరించాడు. ఇంద్రజిత్తుతో చేసిన భీకర యుద్ధంలో 'బ్రహ్మాస్త్రం' చే కట్టుపడ్డాడు. మూర్ఖులైన రాక్షసులు హనుమని నారచీరలతో కట్టారు. ఆ కారణంగా బ్రహ్మాస్త్రం విడిచి పోయింది.

రావణున్ని చూడదలచిన హనుమ, బంధింపబడిన వాడిలాగా ప్రవర్తించి రావణుణ్ని కొలువుకి వెళ్ళాడు.

సింహాసనంపై కూర్చొని ఉన్న రావణుణ్ని తేజస్సును చూసి ఆశ్చర్యపడి, మనస్సులో ఇలా అనుకొన్నాడు.

**శ్లో ॥ అహో రూపమహో ధైర్యమహో సత్త్వ మహోద్యుతిః ।**
**అహో రాక్షసరాజ్యస్య సర్వలక్షణయుక్తతా ॥**

*(సుందరకాండ 49/17)*

*ఆహా ! ఏమి ఈ రావణుని రూపము ! ఏమి ధైర్యము ! ఏమి బలము ! ఏమి కాంతి! ఏమి సర్వలక్షణ సంపన్నత్వం! అని ఆశ్చర్యపడ్డాడు. రావణుడు సీతమ్మ ఎడల చేసిన అపచారం తలుచుకొని, రావణుని శీలభ్రష్టత్వం గురించి ఆలోచించి, జాలిపడ్డాడు. ఇలా అనుకొన్నాడు.*

**శ్లో ॥ యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః ।**
**స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా ॥**

*(సుందరకాండ 49/18)*

*రావణునిలో ఈ అధర్మగుణమే లేకపోయి ఉంటే ఇంద్రునితో సహా దేవలోకానికే ప్రభువు అయ్యేవాడు.*

ఎంతటి దైవభక్తుడైనా రావణుడు తన క్రూరకర్మలతో అందరినీ హింసించే ప్రవృత్తి కలవాడు. సకల లోకాల్ని భయపెట్టే దుష్టస్వభావుడు, వ్యసనపరుడు, ఎంతటి తేజో సంపన్నుడైనా వ్యసనపరుడైతే పతనమే !!

Teamwork

## 15. విడగొట్టే వారుంటారు జాగ్రత్త!

ఇద్దరు నాయకులు విజయం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాక వాళ్లలో మనఃస్పర్థలు రాకూడదు. 'వారి మనస్పర్థల్ని పెంచి, విడగొట్టి, దాన్ని ఆధారంగా సొమ్ము చేసుకొనే వారుంటారు జాగ్రత్త పడమ'ని నీతి శాస్త్రం హెచ్చరిస్తోంది.

**అ**నగనగా ఓ అడవి. ఆ అడవిలో ఓ నక్క ఉండేది. పూర్వజన్మ సంస్కారం వల్ల మాంసం తినేది కాదు. కేవలం చెట్టుక్రింద పడిన ఫలాలనే తినేది.

ఓ సందర్భంలో ఈ నక్కకు పులితో స్నేహం అయ్యింది. నక్క చెప్పే కథలు, హితవచనాలతో పులికి నక్కపై గౌరవభావం రోజు రోజుకీ పెరిగింది. నక్కను తన మంత్రిగా నియమించింది. వీరిద్దరి స్నేహాన్ని చూసి తోటి నక్కలు ఓర్చుకోలేక పోయాయి. లేనిపోని నేరాలు చెప్పి పులి మనస్సుని పాడుచేసాయి.

పులికి ఆ నక్కపై కోపాన్ని తెప్పించాయి. కోపంతో పులి గాండ్రించింది. పులి అరుపులు అడవి అంతా ప్రతిధ్వనించాయి.

"ఆ నక్కను పట్టుకొని వధించండి" అని పులి శాసించింది.

పులి తల్లి ఈ విషయం అంతా విన్నది. కొడుకు, అసూయాపరుల మాటలు విని నక్కకు హాని చేస్తున్నాడని తెలుసుకుంది. కొడుకు దగ్గరకు వేగంగా వచ్చింది.

"నాయనా! చెప్పుడు మాటలు వినకు. ఆ నక్క మంచిది. నీకు హితం చెప్పింది. అసూయపరులు అబద్ధపు మాటలు పుట్టిస్తారు. రాజుగా ఈ విషయం నువ్వు తెలుసుకోకపోతే ఎలాగ? తొందరపడకు" అని హితవు పలికింది తల్లి పులి.

పులి వెంటనే నక్కకు విధించిన శిక్షను రద్దు చేసింది. కాని, పులికి ఉన్న చంచలబుద్ధి చూసి పరితాపం చెందిన నక్క ప్రాయోపవేశం చేసి తన శరీరాన్ని విడిచిపెట్టింది.

ధర్మరాజు అడిగిన ఓ ప్రశ్నకు జవాబుగా ఈ కథను చెప్పాడు భీష్ముడు.

"క్రూరులు సౌమ్యంగాను, సౌమ్యులు క్రూరంగానూ కనిపిస్తూ ఉంటారు, వీరి నిజ స్వరూపాలను ఎలా తెలుసుకోవాలి?" అని ధర్మరాజు ప్రశ్న.

(మహాభారతంలోని శాంతిపర్వంలోని 111వ అధ్యాయంలో 'వ్యాఘ్రగోమాయు సంవాదం' నుంచి)

✦✦✦

**మనఃస్పర్థలు రాకూడదు..**

పక్షులు పట్టేవాడు (బోయ) నేలమీద వల పరిచాడు. ఎప్పుడూ కలిసిమెలసి తిరిగే రెండు పక్షులు ఆ వలలో చిక్కుకున్నాయి. ఆ రెండు పక్షులు కలిసి ఎగిరి ఆ వలని ఆకాశమార్గంలో తీసికొనిపోతున్నాయి.

ఆశ్చర్యపోయిన ఆ బోయ, నేలమీద పరుగెడుతూ వాటిని వెంబడించాడు. అలా చాలా దూరం వెంబడిస్తున్న బోయను చూసి, ఓ ముని "అవి ఆకాశంలో ఎగురుతూంటే నువ్వు ఇలా నేలమీద పరుగెత్తి ఏమి ప్రయోజనం?" అన్నాడు.

అప్పుడు అతడు, "నిజమే, ఇవి రెండూ కలిసి నా వలను ఎత్తుకుపోతున్నాయి. కాస్సేపటికి అవి తగవులాడుకోకపోవా? అప్పుడు నాకు దొరకకపోవా?" అన్నాడు బోయవాడు. అతడు అనుకొన్నట్లే, వాటిమధ్య కలహం ఏర్పడి క్రిందబడ్డాయి. బోయవాడి చేతికి చిక్కాయి.

మహాభారతంలో విదురుడు చెప్పిన కథ ఇది.

ఇద్దరు నాయకులు విజయం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాక వాళ్లలో మనఃస్పర్థలు రాకూడదు. 'వారి మనస్పర్థల్ని పెంచి, విడగొట్టి, దాన్ని ఆధారంగా సొమ్ము చేసుకొనే వారుంటారు జాగ్రత్త పడమ'ని నీతి శాస్త్రం హెచ్చరిస్తోంది.

**విభజించి పాలించమనే దుర్నీతి**

అఖండ భారత విభజనకు బ్రిటన్ దురాక్రమణదారులు పన్నిన పన్నాగంలో కాంగ్రెస్ ఉద్యమ నేతలు చిక్కుకుపోవటం సమర్థ నాయకత్వ లోపానికి అతి ప్రసిద్ధ నిదర్శనం.

క్రీ.శ. 1857 నుంచి దాదాపు ముప్పయి ఏళ్ళపాటు ముస్లిం నాయకులు కూడా హైందవ జాతీయులతో కలిసి బ్రిటన్ వ్యతిరేక విధానాన్ని అవలంబించారు.

కానీ ఆ తరువాత సయ్యద్ అహ్మద్ లాంటివారికి 'సర్' బిరుదును ఇవ్వడం ద్వారా బ్రిటన్ సామ్రాజ్యవాదులు జాతీయ ప్రధాన స్రవంతి నుంచి ఇస్లాం మతస్థులను వేరుచేయటానికి వీలుగా వారి మనస్సులలో విషబీజాలు నాటారు.

ఈ అంకురార్పణకు పరాకాష్ఠ 1947 నాటి అఖండ భారత విభజన.

విషబీజం విషవృక్షంగా ఎదగటం కాంగ్రెస్ ఉద్యమ నాయకుల వైఫల్యానికి నిదర్శనం. 'సర్' సయ్యద్ అహ్మద్ ఆలీఘడ్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ఆరంభం.

అఖండ భారత విభజన ఈ విషవ్యూహ విజయానికి పరాకాష్ఠ.

బ్రిటన్‌వారి 'విభజించు–పాలించు' వ్యూహం గురించి ఇస్లాం మత నాయకులకు వివరించటంలో కాంగ్రెసు ఉద్యమ నాయకులు విఫలమయ్యారు.

పంచతంత్ర కథలలో ఇలాంటి మిత్రభేదాలవల్ల జరిగే అనర్థాల గురించి అనేక ఘటనలు ఉన్నాయి. కరటకుడు, దమనకుడు అనే గుంటనక్కల మాయాజాలంలో చిక్కుకొన్న మృగరాజు (సింహం) తన మంత్రి అయిన సంజీవకుడిని దూరం చేసుకున్నాడు.

ప్రస్తుత సమాజంలో కూడా ఇలాంటి గుంటనక్కల వంటివారు తరచుగా తటస్థపడుతుంటారు.

రాజకీయ సంస్థలలో, వాణిజ్య సంస్థలలో, స్వచ్ఛంద సంస్థలలో, కార్యాలయాలలో, విశ్వవిద్యాలయాలలో నాయకుల మధ్య నాయకులకూ, అనుచరులకూ మధ్య తగాదాలు కల్పించి, వారిని విడగొట్టే 'కరటక– దమనకుల' పట్ల అప్రమత్తత అవసరం.

చెప్పుడు మాటలు వింటే చెడిపోవటం తప్పదన్నది చారిత్రక పాఠం. ✦

## నన్ను ప్రభావితం చేసిన పుస్తకాలు...

**ఎ**యిర్‌ఫోర్స్ పైలట్ అవ్వాలనే నా కల నెరవేరలేదు. నాలాగే అనేకమంది తాము ఎంచుకొన్న లక్ష్యాలకు ఏవో అడ్డంకులొచ్చి వేరే మార్గానికి మరలవలసి రావచ్చు ! అప్పుడు మన లక్ష్యాలను గురించి పునరాలోచించాలి. మరో మార్గాన్ని అన్వేషించాలి.

జీవితంలో ఎదురయ్యే ప్రతి పరాజయమూ మన వ్యక్తిత్వంలో ఒక్కొక్క లక్షణాన్ని వెలికితీస్తుంది. అడ్డంకులను ఎదుర్కొనే సమయంలో మనలో మనకి తెలియకుండా దాగి ఉన్న ధైర్యం బయటికి వస్తుంది.

మనకేదైనా పరాజయం ఎదురైనప్పుడే మనలో ఉండే ఈ గుణాల గురించి మనకి తెలుస్తుంది.

ఈ ధైర్య సాహసాలను వెతుక్కుంటూ జీవితం కొనసాగించాలి.

నేను అనేక పుస్తకాలు చదివాను. అయితే నాపై ప్రభావం చూపించిన, నాకత్యంత ప్రియమైన పుస్తకాలు మూడు ఉన్నాయి.

1) లైట్స్ ఫ్రమ్ మెనీ లాంప్స్ (Lights from Many Lamps) భిన్న రచయితలు వ్రాసిన స్ఫూర్తిదాయకమైన రచనలను డా॥ రిలియన్ ఐచ్లర్ వాట్సన్ సంపాదకత్వం వహించిన పుస్తకం. నేను విచారగ్రస్తుడనైనప్పుడు నాకు సాంత్వన నిచ్చే పుస్తకం ఇది.

2) 2000 సంవత్సరాల క్రితం తిరువళ్ళువార్ రచించిన 'తిరుక్కురళ్' నన్ను ప్రభావితం చేసిన రెండవ పుస్తకం. ఇందులో 1330 ద్విపదలున్నాయి. నాకొక ప్రవర్తనా నియమావళి ఇచ్చిన పుస్తకం ఇది.

3) అలెక్సిస్ కొరెల్ వ్రాసిన 'మ్యాన్ ది అన్‌నోన్' (Man the unknown) ముఖ్యంగా వైద్యశాస్త్రం చదవాలనుకున్నవారు చదవవలసిన పుస్తకం.

"మనకి అధికార పదవులు వస్తే మనం విజయ శిఖరాలను అందుకొన్నామని అనుకుంటాం. కానీ అప్పుడే మన ఆకాశ హర్మ్యాల నిర్మాణానికి రాళ్ళెత్తిన ప్రజా సమూహాన్ని గురించి ఆలోచించాలి. అనేకమంది త్యాగాలను గుర్తించాలి."

**– డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్**

(నా జీవన గమనం నుంచి)

*Communication &*
*Inter personal relationship*

## 16. మాటల నేర్పరి కావాలి!

నాయకుడు అందరికీ ఇష్టుడు అవ్వాలంటే, విజయాలు సాధించాలంటే, స్నేహితులను, అభిమానులను సంపాదించాలంటే ఉండాల్సిన లక్షణం మధురంగా మాట్లాడటం!

**వ్య**క్తిత్వ వికాసం (పర్సనాలిటి డెవలప్‌మెంటు) పేరిట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించటం ఇప్పుడు పరిపాటి అయ్యింది. పనికొచ్చే విషయాలేవీ తమ తమ తరగతి పాఠ్యపుస్తకాల ద్వారా లభించటం లేదు అనటానికి ఇదో ఉదాహరణ.

జాతీయ ఇతిహాస (చరిత్ర) మహాకావ్యాలైన రామాయణ, మహాభారత గ్రంథాలకు – నేటి యువతరం ఆమడదూరంలో ఉంది. దీనికి ప్రధానకారణాలు రెండు. ఒకటి మన దేశానికి దాపురించిన మిథ్యా లౌకికవాదం.

రెండవది స్వాతంత్ర్యం తర్వాత మతోన్మాదుల చేతుల్లోనూ, వామపక్ష కుహనా మేధావుల చేతుల్లోనూ విద్యాదేవి బంధింపబడి ఉండటం.

రామాయణ భారతాలలోనూ, పంచతంత్రంలోనూ ఉన్న వివిధ పాత్రలు, అందులో పేర్కొనబడిన కథలు విద్యార్థులకు ఎలా మెలగాలి?, 'ఎలా మాట్లాడాలి, ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు!– అన్న విషయాలను చెబుతున్నాయి.

కానీ... విద్యావిధాన నిర్వాహకులు వీటిని, ఇలాంటి వాటిని, విద్యార్థుల కళ్లలో పడనిస్తే కదా..!

వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణంలో ఆరంభంలోనే రామునికి ఉన్న అనేక మంచి గుణాలను వివరించారు. ముఖ్యంగా రాముని సర్వశాస్త్రార్థ తత్వజ్ఞతను, ఉచితజ్ఞతను నారదమహర్షి అభివర్ణించాడు.

ఉచితజ్ఞత అంటే ఔచిత్యం–సమయానికి సందర్భానికి తగినట్లు మాట్లాడటం. అలా మాట్లాడటం ఓ కళ! ఇది సహజగుణంగా వ్యక్తుల్లో బీజప్రాయంగా ఉండి పెరిగిన వాతావరణం కారణంగా, నిరంతర అభ్యాసం కారణంగా వికసిస్తుంది.

నాయకునికి ఉండాల్సిన లక్షణాలలో ముఖ్యమైనది నలుగురినీ ఆకట్టుకొనేలా మాట్లాడి తనతో అందరినీ కలుపుకుంటూ పోవడం. రాముణ్ణి స్మితభాషి – చిరునవ్వుతో మాట్లాడేవాడని, పూర్వభాషి – ఇతరులను తానే ముందుగా పలక రించేవాడని –వాల్మీకి వర్ణించాడు. ఈ గుణమే అయోధ్య ప్రజలను, ఋషులను, వానరులను, ఆకర్షించింది.

విభీషణుడు శరణాగతుడై వచ్చినప్పుడు ఆతని గుణాలను శ్రీరాముడు మొదటి చూపులోనే గ్రహించాడు. అందరి అభిప్రాయాలు విన్నాక, శ్రీరాముడు విభీషణుణ్ణి స్నేహితునిగా స్వీకరించటమేకాక, లంకా రాజ్యానికి రాజుగా అభిషిక్తుడిని చేశాడు.

విభీషణుడు చెప్పిన మాటలు విని శ్రీరాముడు "కళ్లతో త్రాగుతున్నట్లు ప్రేమ పూర్వకంగా చూశాడు" అని మహర్షి వాల్మీకి వర్ణించాడు.(ఐ–కాంటక్ట్)

ఇదే అభివ్యక్తీకరణ కౌశల్యం. అంటే! అలాంటి వచో కౌశల్యం ఉన్న రఘు రాముడే మెచ్చుకొన్న విలక్షణ వాగ్విదాంవరుడు (మాట్లాడటంలో శ్రేష్ఠుడు) ఆంజనేయస్వామి.

శ్రీరాముడు ఆంజనేయస్వామిని పిలిచినప్పుడు ఉపయోగించిన విశేషణాలలో ముఖ్యమైనది "మాటలలో నేర్పుగల ఓ హనుమంతుడా!" అన్నది.

చేసిన తొలి సంభాషణతోనే రాముడు హనుమంతునిపై మంచి అభిప్రాయం ఏర్పరచుకొన్నాడు.

సుగ్రీవుని దూతగా సన్న్యాసి రూపంలో రామలక్ష్మణులను దర్శించి, మృదువుగా, మనోహరమైన మాటలతో ఆంజనేయుడు సంభాషణ మొదలుపెట్టాడు.

హనుమంతుని సంభాషణ ప్రారంభంలోనే వారిద్దర్నీ ఆకర్షించింది.

"మీరు రాజర్షులలాగ ఉన్నారు, దేవతలలాగ ఉన్నారంటూ" ప్రారంభించాడు తన ప్రసంగాన్ని–

వాల్మీకి మహర్షి కూడా హనుమంతుణ్ణి "వాక్యజ్ఞః (మాటలు తెలిసినవాడు); వాక్యకుశలః (మాటలలో నేర్పరి)" అంటూ మెచ్చుకొన్నాడు.

సన్న్యాసి వేషంలో వున్న హనుమంతుడు చెప్పిన మాటలను శ్రీరాముడు 'అవాక్కయి' విన్నాడు. ఆంజనేయస్వామికున్న మాటలాడే 'విద్య'ను మెచ్చుకుంటూ లక్ష్మణునితో ఇలా అన్నాడు.

శ్లో॥ **అవిస్తరమ్ అసందిగ్ధమ్ అవిలంబితమ్ అవ్యథమ్ ।**
**ఉరస్థః కంఠగం వాక్యం వర్తతే మధ్యమస్వరమ్ ॥**

*(కిష్కింధకాండ 3వ సర్గ : 31)*

*"హనుమంతుని మాటలో అనవసరపు పొడిగింపు లేదు. చెప్పిన విషయంలో సందేహానికి తావు లేదు. ఉచ్చారణలో తొందర లేదు. మాట్లాడటంలో అతనికి 'కష్టం' – వినేవారికి ఇబ్బందీ రెండూ లేవు. హనుమంతుని వాక్కు వక్షస్థలం నుంచి కంఠాన్ని చేరగా, (మధురంగా) మధ్యమ స్వరంలో మాట్లాడాడు" అని రాముడు లక్ష్మణునికి చెప్పినట్లు వాల్మీకి వివరించాడు.*

✦ వేదాలను చదివినవాడే ఈ విధంగా మాట్లాడగలడు.

✦ అపశబ్దం లేకుండా ఇంతసేపు మాట్లాడగలిగాడంటే వ్యాకరణ విద్వాంసుడై వుంటాడు.

✦ ఉచ్చారణలో తడబడకుండా సంభాషిస్తున్నాడు.

✦ మొహంలో, కళ్లలో, నుదుటిమీద, కనుబొమ్మలలో ఏ విధమైన వికారం లేకుండా మాట్లాడుతున్నాడు –

అంటూ శ్రీరాముడు ప్రశంసించాడు. హనుమంతుని ఈ వాగ్విద్య (ప్రసంగించే నైపుణ్యం) తరతరాల ప్రజలకు స్ఫూర్తిదాయకమయింది.

శ్రీరాముడు శత్రుసంహారం చేసాక, హనుమంతుడు సీతాదేవి దగ్గరకువెళ్లి విజయ వార్తను వినిపించాడు. ఆ ప్రియవార్తను సంక్షిప్తంగా వివరించాక సీతామాత హనుమంతుణ్ణి మెచ్చుకొని ఇలా అంటుంది.

"వెండిగాని, బంగారంగాని, వివిధ రత్నాలు గాని, త్రిలోక సామ్రాజ్యంగాని నీ మాటలకు సరి కావు" అని ప్రశంసించింది.

సీతామాత హనుమంతుని 'వాక్పటుత' (Communication Skill) ఈ విధంగా మెచ్చుకొన్నది.

శ్లో॥ **అతి లక్షణసంపన్నం మాధుర్యగుణభూషితమ్ ।**
**బుద్ధ్యా వ్యష్టాఙ్గయా యుక్తం త్వమేవార్హసి భాషితుమ్ ॥**

(రామాయణం, యుద్ధకాండ - 113/26)

*మంచి ఉచ్చారణతో, తియ్యగా, అలంకారాలతో అష్టాంగయుక్తంగా మాట్లాడటంలో నువ్వే తగినవాడివి.*

అలంకారాలు అంటే పోల్చిచెప్పటం వంటి ఉపమాలంకారాది సాహిత్య ప్రక్రియలు.

పై శ్లోకంలో సీతమ్మ ప్రస్తావించిన అష్టాంగాల (ఎనిమిది గుణాల)ను భాష్య కారులు ఇలా వివరించారు.

శ్లో॥ **శుశ్రూషా శ్రవణం చైవ గ్రహణం ధారణం తథా ।**
**ఊహాఽపోహోఽర్థవిజ్ఞానం తత్త్వజ్ఞానం చ ధీగుణాః ॥**

(బాలానందినీ వ్యాఖ్య)

- ✦ *ఇతరులు చెప్పేదానిని వినాలని కోరిక ఉండటం*
- ✦ *ఇతరులకు వినాలనే ఆసక్తి కలిగేలా మాట్లాడటం*
- ✦ *ఇతరులు చెప్పేది వినటం*
- ✦ *విన్నది అర్థం చేసుకోవటం*
- ✦ *విన్నాక జ్ఞాపకం ఉంచుకోవటం*
- ✦ *చెప్పని విషయాన్ని కూడా ఊహించుకుని గ్రహించగలగటం*
- ✦ *అవసరం లేని విషయాలను వదిలివేయటం*
- ✦ *యథార్థాన్ని ప్రతిపాదించటం*

ఇలా ఓ వక్తకు ఉండాల్సిన లక్షణాలను సీతాదేవి చెప్పి, హనుమంతుని మాటలలో ఈ లక్షణాలున్నట్లుగా మెచ్చుకొన్నది.

నాయకుడు అందరికీ ఇష్టుడు అవ్వాలంటే, విజయాలు సాధించాలంటే,

స్నేహితులను, అభిమానులను సంపాదించాలంటే ఉండాల్సిన లక్షణం మధురంగా మాట్లాడటం!

ప్రియంగా మాట్లాడేవానికి ఏమి లభిస్తుంది? ఆలోచించి పనిచేసేవాడు ఏమి పొందుతాడు? చాలామంది స్నేహితులు ఉన్నవారు ఏమి సాధిస్తారు? తనకు నిర్దేశించిన పనిని చక్కగా నిర్వహించేవాడు (ధర్మరతః) ఏ గతిని పొందుతాడు?

మహాభారతంలో మానవ సంబంధాల గురించి ఒక యక్షుడు అడిగిన పై ప్రశ్నకు ధర్మరాజు ఇలా జవాబు చెప్పాడు.

శ్లో॥ **ప్రియవచన వాదీ ప్రియో భవతి విమృశితకార్యకరోఽధికం జయతి।**
**బహుమిత్రకరః సుఖం వసతే యశ్చ ధర్మరతః స గతిం లభతే॥**

*(వనపర్వం 313/113)*

*ప్రియంగా మాట్లాడేవారు అందరికీ ఇష్టుడవుతారు. ఆలోచించి పనిచేసేవారు ఎక్కువ విజయాలు పొందుతారు వారికి. ఎక్కువ మిత్రులు ఏర్పడతారు. ఇలా బహుమిత్రులు గలవారు సుఖపడతారు. ధర్మాసక్తి ఉన్నవారు సద్గతులు పొందుతారు.*

✦✦✦

**మాటలు బాణాల కన్నా పదునైనవి**

అనుశాసన పర్వంలో 'మాటలాడటం గురించి' భీష్ముడు ఇలా చెప్పాడు.

"క్రూరంగా మాట్లాడరాదు !

ఇతరులు ఉద్వేగానికి లోనయ్యేలా కరకు మాట పలుకరాదు.

గొడ్డలి నరికివేసిన చెట్టు చిగురిస్తుంది. కానీ, పరుషమైన వాక్కు అనే శస్త్రం చేసిన గాయం చెరిగిపోదు.

శ్లో॥ **కర్ణినాలీకనారాచాన్ నిర్హరంతి శరీరతః ।**
**వాక్ శల్యస్తు న నిర్హర్తుం శక్యో హృదిశయో హి సః ॥**

(అనుశాసనం 104 - 34)

*శరీరంలో గ్రుచ్చుకొన్న (రకరకాల) బాణాలను యుక్తి చేత తొలగించవచ్చు. కానీ మనస్సులో గ్రుచ్చుకొన్న 'మాట' అనే బాణాన్ని తొలగించలేము.*

ఇదే భావం ఈ ప్రసిద్ధ పద్యంలో ఇలా వివరించబడింది.

**తనువున విరిగిన యలుగుల**
**ననువునఁ బుచ్చంగ వచ్చు నతి నిష్ఠురతన్**
**మనమున నాటిన మాటల**
**వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా !**

(ఆంధ్ర మహా భారతం–ఉద్యోగ పర్వం)

*మంచి మాట – సిసలైన అలంకారం.*

*ఉత్తమ నాయక లక్షణం – మధురంగా మాటలాడటం...!. మనిషికి మధురంగా మాట్లాడటమే అలంకారం అని ప్రవచించిన ఈ ప్రసిద్ధ శ్లోకం – భర్తృహరి ప్రణీతం !*

శ్లో॥ **కేయురాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్వలాః ।**
**న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజా: ।**
**వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే ।**
**క్షీయంతే ఖలు భూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్ ॥**

*మనిషికి బంగారు భుజకీర్తులు, ముత్యాల హారాలు అలంకారాలు కావు. పరిమళజలస్నానాలు, సుగంధపు పూతలు, పరిమళ పుష్పాలు అలంకారాలు కావు. పవిత్రమైన వాక్కు ఒక్కటే మానవునికి అసలైన అలంకారం. తక్కిన అలంకారాలన్నీ నశించిపోయేవే !*

**ఇరువైపులా పదును..**

హనుమంతుడు మాట్లాడిన మాటలలో ధర్మం, రాజభక్తి, వినయం తొణికిసలాడాయి. అది ఆయన గొప్ప గుణం.

కేవలం గొప్పగా ఉపన్యాసం ఇస్తే చాలదు. ఆ మాటలు ధర్మపరంగా ఉండాలి. 'అర్బన్ నక్సల్స్' అని పిలవబడే కొందరు బీభత్సకారులు తమ వక్తృత్వ నైపుణ్యం ద్వారా ఎందరో విద్యార్థుల్ని ఆకర్షించి తప్పుడు మార్గంలో పెట్టి దేశ ద్రోహ చర్యలకు ఉసిగొల్పడం వింటున్నాం.

దీన్ని నిపుణతగా భావించరాదు.

ఎందుకంటే ఈ అర్బన్ నక్సల్స్ చర్యలు జాతీయ హితానికి, జన జీవన ప్రయోజనాలకు విరుద్ధమైనవి.

**హనుమంతుని సమయస్ఫూర్తి**

రామకార్యంపై హనుమంతుడు లంకకు వెళ్లి సీతమ్మ జాడను తెలుసుకొని విజయవంతుడైనాడు. జాంబవంతుడిని, అంగదాదులను కలుసుకోవాలనే ఉత్సాహంతో హనుమంతుడు వాయువేగంతో తిరిగి బయలుదేరాడు.

సముద్రపు ఉత్తర తీరంలో తనకోసం ఆతురతతో తన బృందంలోని సభ్యులు ఎదురు చూస్తున్నారు. సీతాదేవి ఆచూకీ కోసం పరితపిస్తూ, దైన్యం చెందిన మనస్సులతో ఉన్న వారిని ఎలా సంతోష పెట్టాలి? ఈ శుభవార్తను ఎలా తెలియజేయాలి? వెళ్లిన కార్యం సఫలం అయ్యిందనే సమాచారం తనకన్నా ముందు చేర్చాలని భావించాడు హనుమంతుడు. తన బృందంలో ఉన్న వారి మనస్సుల్లో ఏ విధమైన ఒత్తిడి ఉన్నా తొలగి పోవాలని హనుమంతుడు పెద్దగా జయనాదం చేసాడు. అది వినగానే జాంబవంతుడికి అర్థం అయిపోయింది. "హనుమంతుడు కార్యం సఫలం చేసుకొని వస్తున్నాడు" అని. ఈ కారణం వల్ల హనుమంతుని రాకకు ముందే, విజయోత్సవం మొదలైపోయింది. అందరూ పూలు-పండ్లు, తీసుకొచ్చి, తయారుగా ఉన్నారు. హనుమంతుడు రానే వచ్చాడు!

**"దృష్టా సా జనకాత్మజా"** - "చూశాను సీతను" అనటంలోనే హనుమంతుని ఉచితజ్ఞత, వక్తృత్వ పటిమ తెలుస్తున్నాయి. "సీతను చూశాను" అనటానికి, "చూశాను సీతను" అన్నమాటకు, ఉన్న భేదాన్ని మానసిక శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఆతృతతో ఉన్నవారికి "సీత"తో వాక్యం ప్రారంభిస్తే సీతకు ఏమైందోననే చింత మనస్సులో కలిగే అవకాశం ఉంటుంది. శ్రీరాముని దగ్గరకు వెళ్లినప్పుడు కూడా ఆంజనేయుడు ఎలా మాట్లాడాడో వాల్మీకి మహర్షి ఇలా తెలియజేశాడు.

శ్లో॥ **దృష్టా దేవేతి హనుమద్వదనాదమృతోపమమ్**
**ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః ॥**

(సుందరకాండ 64/37)

*"చూసితిని సీతను" అని హనుమంతుని నోటి నుంచి వచ్చిన వచనాన్ని లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు విని ఆనందభరితుడయ్యాడు.*

వినేవారికి మానసికమైన ఒత్తిడి కలిగించకుండా ప్రియంగా మాట్లాడటం ఓ శాస్త్రం. ఓ కళ! ఆ కళ హనుమంతుడి ఈ ఉదంతం నుంచి నేర్చుకోవచ్చు.

**ఎలా మాట్లాడాలి ?**

శ్రీరామ కార్యం కోసం వానర వీరుడైన హనుమ లంకానగరం చేరి, ఎంతో శ్రమించి సీతాదేవిని దర్శించాడు. అంతటితో అతని బాధ్యత పూర్తికాలేదు. ప్రభువు ఇచ్చిన ముద్రిక (ఉంగరం) సీతమ్మకి ఇవ్వాలి. ఆమెతో సంభాషించాలి.

సీతాదేవితో సంభాషణ ఎలా ప్రారంభం చెయ్యాలి? ఏ భాషలో మాట్లాడాలి అన్న విషయమై ఎంతో ఆలోచించాడు. సీతమ్మ తన మాటలు విని భయపడ కూడదు. తాను అక్కడ కాపలా ఉన్న రాక్షసుల కళ్ళబడకూడదు. ఎలా? ఎలా? ఎలా మాటలు ప్రారంభించాలి ?

వాల్మీకి ఈ ఘట్టాన్ని అద్భుతంగా వర్ణించాడు.

శ్లో॥ **ఇతి స బహువిధం మహానుభావో**
**జగతి పతేః ప్రమదామవేక్షమాణః ।**
**మధురమవితథం జగాద వాక్యం**
**ద్రుమవిటపాన్తరమాస్థితో హనూమాన్ ॥** *(సుందరకాండ 30/44)*

*మహానుభావుడైన హనుమ చెట్టుకొమ్మల మధ్య దాగి ఉండి, శ్రీరామపత్ని అయిన సీతను దూరం నుంచి చూస్తూ మధురములు, వ్యర్థములు కానివి, బహు విధములు అయిన మాటలు పలికాడు. హనుమంతుడు ఎంతో ఆలోచించి, దశరథునితో మొదలుపెట్టి, రామకథను చెప్పి, సీతాదేవికి నమ్మకాన్ని కలిగించాడు.*

*రాముని కథ అంతా చెప్పిన తరువాత మాత్రమే రాముడిచ్చిన ఉంగరాన్ని సీతాదేవికి ఇచ్చాడు. ఇది బుద్ధిమంతుడైన హనుమ ఆలోచన!*

ఉంగరాన్ని సీతమ్మకు ఇస్తూ ఇలా అన్నాడు..

శ్లో॥ **ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా ।**
**సమాశ్వసిహి భద్రం తే క్షీణ దుఃఖఫలాహ్యాసి ॥**

*(సుందరకాండ,35/3)*

*మహాత్ముడైన రాముడిచ్చిన ఈ ఉంగరాన్ని నీ నమ్మకం కోసం తీసుకొని వచ్చాను. నీకు మంచి జరుగుతుంది. నీ కష్టం తొలగిపోయే సమయం వచ్చింది.*

శ్రీరాముడు పంపించిన ఉంగరం చూసుకొని సీతమ్మ మురిసిపోయింది. రామదూతపై పూర్తి నమ్మకం కలిగింది. హనుమపై మాతృవాత్సల్యంతో అనేక విధాలుగా ప్రశంసించింది.

"ఓ! వానరోత్తమా! నీవే పరాక్రమవంతుడవు. నీవే సమర్థుడవు, నీవే బుద్ధిశాలివి"

అంటూ, "నీవు సామాన్య వానరానివి కావు, నిన్ను పరీక్షించకుండా, రాముడు నా దగ్గరకు పంపించి ఉండడు కదా!" అని పొగడ్తలతో ఆశీస్సులందించింది.

ఇక తర్వాత కథ తెలిసినదే! దూతగా వెళ్ళినవాడు ఎలా మాట్లాడాలో, ఎలా కార్యసాధన చేసుకొని రావాలో తెలియజేసే అద్భుత సంఘటన ఇది.

ఈ కాలంలో 'దూత' అంటే ఒక రాయబారి, ఓ సంస్థకి ప్రతినిధి (రిప్రజెంటేటివ్), మధ్యవర్తి (లయజన్, ఏజెంటు, మీడియేటర్).

వృత్తి, వ్యాపారాల్లో ఉన్నవారు ఎలా మాటలు ప్రారంభించాలో తమని తాము ఎలా ఆవిష్కరించుకోవాలో, ఎలా తాము పనిచేసే సంస్థపై విశ్వాసాన్ని పెంచి, ఎలా విజయం సాధించాలో విశదీకరించే పాఠం ఈ సంఘటన.

ఇటువంటి సందర్భం మన వృత్తి, వ్యాపారాల్లోనే కాదు వ్యక్తిగత వ్యవహారాల్లోను చాలా సమయాల్లో ఎదరవుతూంటుంది. కొత్తవారిని తొలిసారిగా కలిసేటప్పుడు, ముఖ్యమైన వ్యాపార సంబంధ లావాదేవీలు (నెగొషియేషన్స్) కోసం కూర్చొనే టప్పుడు, ఉద్యోగం కోసం సాక్షాత్కారం (ఇంటర్వ్యూ) కోసం వెళ్ళినప్పుడు.. ఎలా మాటలు ప్రారంభించాలి? ఏం మాట్లాడాలి? ఎలాంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది? వాటికి జవాబు ఎలా చెప్పాలి? అనేక జటిల సందర్భాలలో పై పాఠం ఎంతో ఉపకరిస్తుంది.

ఓ 'ఇంటర్వ్యూ'కి సంబంధించిన పూర్తి చిత్రం మన మనోఫలకం మీద మెదలాలి. ఇందుకు సంబంధించిన 'అభ్యాసం' ఇంట్లో అద్దం ముందు కూర్చొని ఒకటికి రెండుసార్లు చెయ్యాలి. విజయవంతమైన, ఫలవంతమైన 'సంభాషణ' కోసం అభ్యసించే శాస్త్రీయ పద్ధతి ఇది. వ్యక్తిగత జీవితంలో మనం అందరం తెల్లవారి లేచినప్పటి నుంచి, నిద్రపోయేదాకా ఎందరినో కలుస్తాం, మాట్లాడతాం. కుటుంబ సభ్యులతో, ప్రక్కింటివారితో, కూరలమ్మేవారితో ఎలా మాట్లాడాలి?... మర్యాదగా ఎలా వ్యవహరించాలి? మాట్లాడడం ఒక కళ. అందులోనూ బాగా మాట్లాడటం అద్భుతమే. సంస్కృత వాఙ్మయంలోని ఈ శ్లోకం 'తియ్యగా' మాట్లాడమని హితవు పలుకుతోంది.

శ్లో॥ **ప్రియవాక్య ప్రదానేన సర్వే తుష్యంతి జంతవః ।**
**తస్మాత్ తదేవ వక్తవ్యం! వచనే కా దరిద్రతా ॥** *(చాణక్యనీతి)*

*ప్రియంగా మాట్లాడితే అందరూ సంతోషిస్తారు. అందుకని అందరితోనూ ప్రియం కలిగించేలా మాట్లాడాలి. మాటలకు కొదవ ఏముంది ?*

✦

*Talent Management*

## 17. మంచివాళ్లను ఆకర్షించాలి

తమ సంస్థలలో ఉన్నవారిని గుర్తించి, వారికి సముచిత స్థానం కల్పించాలి. ప్రత్యర్థి సంస్థలలో ఉన్న ప్రతిభావంతులను సహితం తమవైపు ఆకర్షించుకోగలగాలి. రాజకీయ రంగానికి ఇతర సామాజిక రంగాలకు వర్తించగల విజయసూత్రం ఇది.

**అ**నగనగా ఓ పెద్ద రాష్ట్రం.... అక్కడ ఇరవై సంవత్సరాల నుంచి ఓ జాతీయ పార్టీ రాజ్య మేలుతోంది. ఎన్నికలొచ్చాయి... మరో జాతీయ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. ఓ యువనేతను బరిలోకి దించింది. విజయం సాధించింది.

అతనే ముఖ్యమంత్రి అని అందరూ ఆశించారు. ఆ యువకుడు కూడా అదే ఆశించాడు. అధిష్ఠానం కృతఘ్నుతను చూపింది. వేరే ముఖ్యమంత్రి వచ్చాడు. కొంతకాలం తర్వాత ఆ యువకుడు మరో జాతీయ పార్టీలోకి వెళ్ళాడు.

✦✦✦

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జాతీయ పార్టీ (ఎ)కి చెందిన రాష్ట్ర నాయకుడు తన జాతీయ అధ్యక్షుల వారిని కలిసేందుకు వాళ్ల ఇంటికి వెళ్లాడు.

ఎన్నో ముఖ్య విషయాలను చర్చ చేయాలనుకొన్న అతని ఆశ నిరాశ అయ్యింది!

పెంపుడుకుక్కతో ఆడుకొంటూ, బిస్కెట్స్ తినిపిస్తూ ఉండిన ఆ జాతీయ నాయకుడు వచ్చిన వ్యక్తికీ ఆ

బిస్కెట్ ఇవ్వబోయాడట. గౌరవంగా పలకరించలేదు. ఎందుకు వచ్చాడోనని... ఆసక్తిగా అడగలేదు. అప్పుడేమైంది?

ఆ అవమానాన్ని సహించలేని, ఆ రాష్ట్రస్థాయి నాయకుడు మరో జాతీయ పార్టీ దగ్గరకు (బి) వెళ్ళాడు. ఆ పార్టీ అతనిని తనతో చేర్చుకొంది! విజయం సాధించింది.

✦✦✦

**అవసరాలు గుర్తించాలి**

'నాయకులకు నాలుగువైపులా కళ్ళు ఉండా'లంటారు ఓ కవి. చుట్టూ జరుగుతున్న విషయాలను పరిశీలించే విజ్ఞత, తెలివితేటలు విజయం అభిలషించేవారికి అవసరం. వివిధ రంగాలలో ఎవరున్నారు? వారి ప్రతిభా పాటవాలు, సమర్థత, కార్య కుశలత్వం ఏ స్థాయిలో ఉన్నాయి? అలాంటివారిని గుర్తించి తమ జట్టులో, తమ రాజకీయ సంస్థలో, తమ వాణిజ్య కలాపాలలో వారిని భాగస్వాములుగా చేర్చుకొనటం ద్వారా, సమాజ హితం– ప్రత్యేకించి తమ సంస్థకు ప్రయోజనం సాధించడానికి నాయకులు ప్రయత్నించాలి. ఇలాంటి ప్రతిభావంతులను ఉపయోగించుకోగలగడం నాయకుల లక్షణం. నాయకుడు ఆకర్షించి, తెచ్చుకోవలసిన వ్యక్తి తమ సంస్థలోనే గుర్తింపు లేకుండా ఉండవచ్చు, లేదా ప్రత్యర్థి సంస్థలో కూడా ఉండవచ్చు.

వారి ప్రతిభా విశేషాలు ఏమిటి? వారి బలహీనతలు ఏమిటి? ఇలాంటి విషయాలను నాయకులు పరికిస్తూనే ఉండాలి.

వాణిజ్య ప్రచార (మార్కెటింగ్) వృత్తిలో ఉన్న నాయకులు తమ ప్రత్యర్థి సంస్థ (కాంపిటీటివ్ కంపెనీ)లో ఉన్న వ్యక్తుల్ని, వారి కార్యకలాపాల్ని నిశితంగా పరిశోధిస్తూ ఉండాలి. అందులో తన సంస్థకు కావలసిన వ్యక్తిని తన వైపుకు తిప్పుకోవాలి.

'కామందక నీతిశాస్త్రం'లో సమర్థవంతమైన నాయకత్వం గురించి కవి ఈ ఆలోచనను ప్రతిపాదించాడు.

శ్లో॥ **అలబ్ధవేతనో లుబ్ధో మానీ చాఽ_ప్యవమానితః**
**క్రుద్ధశ్చ కోపితోఽ_కస్మాత్ తథాఽ_భీతాశ్చ భీషితః**
**యథాభిలషితైః కామైః భింద్యాదేతాం శ్చతుర్విధాన్ ॥**

(కామందకనీతిశాస్త్రం)

- *ప్రత్యర్థి వర్గంలో జీతాలు సరిగ్గా దొరక్క అసంతృప్తితో ఉన్నవారు.*
- *యజమానిచేత అవమానింపబడిన మానధనులు, ప్రతిభావంతులు.*
- *అకారణంగా యజమాని కోపానికి గురైనవారు.*
- *యజమాని బెదిరింపులకు లోనైన వారు, సుగుణవంతులైన, అభిమాన ధనులైన వారు.*

ఈ నాలుగు తరగతుల వారిని ఆకర్షించి తనకు అవసరమైనవారిని తనవైపు తిప్పుకోవటానికి నాయకుడు ప్రయత్నించాలి.

తమ సంస్థలలో ఉన్నవారిని గుర్తించి, వారికి సముచిత స్థానం కల్పించాలి. ప్రత్యర్థి సంస్థలలో ఉన్న ప్రతిభావంతులను సహితం తమవైపు ఆకర్షించుకోగలగాలి. రాజకీయ రంగానికి ఇతర సామాజిక రంగాలకు వర్తించగల విజయసూత్రం ఇది.

అసంతృప్తి వున్న వారిని 'తృప్తి' పరచి, తనతో చేర్చుకొని తన లక్ష్యాలను సాధించటం దీర్ఘదర్శి అయిన నాయకుని లక్షణం!

ముఖ్యంగా రాజకీయ పార్టీలు గానీ, మార్కెటింగ్ కంపెనీలుగానీ అసంతృప్తుల్ని 'తృప్తి' పరచటంలో దిట్టలుగా ఉండాలి.

"ఎవరూ కావాలని ఉద్యోగాలు మారరు. వాళ్లు బాస్‌లను–అధ్యక్షులను – యజమానులను మారుస్తారు" అన్నది నానుడి – "People never change their jobs - but they change their bosses"– అందుకని యుక్తి ఉన్న నాయకుడు కార్యకర్తలని పోగొట్టుకోవద్దని హితవు చెప్తుంది ఈ శ్లోకం.

ఇంక్రిమెంట్లు, ప్రమోషన్స్ ఆశించేవారిపై 'శీత'కన్ను వేయద్దు. వారిపై ఓ కన్నేసి ఉండాలంటారు శాస్త్రకారుడు. ✦

**విజయం కోరుకునే మనిషి ఈ ఆరు గుణాలను ఎప్పటికీ విడువరాదు.**

**శ్లో॥ షడేవ తు గుణాః పుంసా న హాతవ్యాః కదాచన ।**
**సత్యం దానం అనాలస్యం అనసూయా క్షమా ధృతిః॥**

*(ఉద్యోగ/33-81)*

*1. నిజమే చెప్పే లక్షణం, 2. దానం చేసే గుణం, 3. ఓర్పుగా ఉండటం, 4. ఇతరుల సంపదపై, ప్రజ్ఞపై అసూయ లేకపోవడం, 5. సోమరితనం లేకపోవడం, 6. ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవటం.*

*Strategy*

# 18. వినయం... విజయ రహస్యం

**విజయం కోసం అన్ని ప్రయత్నాలు చేయటం యుద్ధనీతి. నాయకునికి ఉండాల్సిన లక్షణం విజగీషు ప్రవృత్తి - అంటే గెలవాలనే కోరిక. యుద్ధం గెలవటంకోసమే! ఇది ధర్మరాజు నుంచి నేర్చుకోవలసిన పాఠం.**

**మ**హా భారత యుద్ధం ప్రారంభ ఘడియలు దగ్గరకు వచ్చాయి.

రెండు సేనలు ఎదురెదురుగా నిలుచుని ఉన్నాయి.

ప్రారంభ శంఖం కోసం ఎదురు చూస్తున్నారంతా!

అప్పుడే.. గీతోపదేశాన్ని పొందిన అర్జునుడు యుద్ధానికి సిద్ధమవుతున్నాడు.

ధర్మరాజుపై అందరి దృష్టి పడింది. తను కట్టుకొన్న కవచాన్ని విప్పేసుకున్నాడు. తన ఆయుధాలను రథంలో ఓ పక్కకి పెట్టేసాడు. వేగంగా.. రథం నుంచి కిందకి దూకాడు. పాదచారుడై శత్రుసేనవైపు వేగంగా అడుగులేస్తున్నాడు.

అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు - 'ఎందుకు? ఎందుకు?' అనుకుంటున్నారు. ఏ ప్రశ్నలకీ జవాబు ఇవ్వకుండా నడుస్తూనే ఉన్నాడు.

దుర్యోధనుని పక్షంలో వాళ్లు గుసగుసలాడుకుంటున్నారు.

"యుద్ధానికి భయపడి శరణుకోసం వస్తున్నాడు" అనుకొన్నారు కొందరు.

కృష్ణుడు ఒక్కడికే అర్థం అయింది– ధర్మరాజు చేయబోయే గొప్ప పని ఏమిటో.

ధర్మరాజు అడుగులు తాతగారైన భీష్మునివైపు వెళ్తున్నాయి. భీష్మణ్ని చూడగానే ధర్మరాజు చేతులు జోడించాడు. తాతగారి పాదాలపై పడి ఆశీస్సులను అర్థించాడు. భీష్మ పితామహుడు కరిగిపోయాడు. ఆనందబాష్పాలు రాల్చాడు. విజయం పొందమని ఆశీర్వదించాడు.

"ధర్మరాజా! నీవైపున యుద్ధం చేయమని కోరడం తప్ప, ఏదైనా కోరుకో" అన్నాడు.

భీష్మణ్ణి గెలవటం ఎవరితరం?

ధర్మరాజు మొహమాటం లేకుండా వరం అడిగాడు.

"నిన్ను యుద్ధంలో ఎలా జయించ గలుగుతాం?" అని ప్రశ్నించాడు.

భీష్ముడు ఓ నవ్వు నవ్వి, కొన్ని రోజుల తరువాత రమ్మన్నాడు. సెలవు తీసుకొని వెళ్తున్న ధర్మరాజుతో భీష్ముడు ఇలా అన్నాడు...

శ్లో॥ **యద్యేవం నాఽభిగచ్ఛేథాః యుధి మాం పృథివీపతే ।**
**శపేయం త్వాం మహారాజ పరాభావాయ భారత ॥**

*(భీష్మ పర్వం 43/38)*

*"ఓ ధర్మరాజా! నీవు ఇలాగ నా దగ్గరకు రాకపోయి ఉంటే నీకు అపజయం కలగాలని శపించి ఉండేవాణ్ణి!".*

ధర్మరాజు భీష్మణ్ణి కలిసాక, ద్రోణాచార్యునివైపు నడిచాడు. గురువుగారి పాదాలకు ప్రణామం చేసాడు. "యుద్ధంలో విజయం సాధించు" అని ద్రోణుడు ఆశీస్సులందించాడు. ప్రేమతో ధర్మజుణ్ని అక్కున చేర్చుకున్నాడు.

"వరం కోరుకో" అన్నాడు.

ధర్మరాజు ఏమీ మొహమాటపడకుండా.."నా హితం గురించి ఆలోచించి, మిమ్మల్ని ఎలా జయించవచ్చో చెప్పండి" అని అడిగాడు.

అందుకు ద్రోణుడు చిరునవ్వు నవ్వాడు. "నేను శస్త్రం విడువకుంటే ఎవ్వరూ నన్ను గెలవలేరు... కానీ ఏదైనా అప్రియమైన వార్త వింటే, నేను శస్త్రం విడుస్తాను. నాకు త్వరగా మరణం కలిగేటట్లు నీ తమ్ములతో కలసి ప్రయత్నించు" అని అన్నాడు ద్రోణుడు.

భీష్ముడు అన్నట్లే ద్రోణుడు కూడా ధర్మరాజుతో ఇలా అన్నాడు.

శ్లో॥ **యది మాం నాఽభిగచ్ఛేథాః యుద్ధాయ కృతనిశ్చయః ।**
**శపేయం త్వాం మహారాజ పరాభావాయ సర్వశః ॥**

(భీష్మపర్వం - 43/53)

*"ఓ మహారాజా! యుద్ధం నిశ్చయం అయ్యాక నీవు ఇలా నా దగ్గరకు రాకపోయి ఉంటే నీకు అన్నివిధాలా పరాభవం కలిగేలా శపించి ఉండేవాడిని".*

✦✦✦

ద్రోణదర్శనం తర్వాత ధర్మరాజు కృపాచార్యుని ఆశీస్సులు పొందాడు. "యుద్ధం చెయ్యి. విజయం పొందు." అని ఆశీర్వదిస్తూ, ధర్మరాజుతో "నీవు వచ్చినందుకు సంతోషిస్తున్నాను" అన్నాడు కృపాచార్యుడు. భీష్మ ద్రోణులన్నట్లే ఈయన కూడా ఇలా అన్నాడు–

శ్లో॥ **యది మాం నాఽభిగచ్ఛేథాః యుద్ధాయ కృతనిశ్చయః**
**శపేయం త్వాం మహారాజ పరాభావాయ సర్వశః॥**

(భీష్మపర్వం - 43/70)

*"యుద్ధం కోసం నిశ్చయించుకొన్నాక ఇలా నా దగ్గరకు రాకపోయి ఉంటే నీకు అన్నివిధాలా పరాజయం కలగాలని శపించేవాడిని".*

అక్కడ నుంచి శల్యుని దగ్గరకు వెళ్లాడు ధర్మరాజు. శల్యుడు పొంగిపోయాడు. వరం కోరుకోమన్నాడు. ధర్మరాజు ఆ అవకాశాన్ని కూడా జారవిడుచుకోలేదు. "రాబోయే యుద్ధంలో ఎప్పుడో ఒకప్పుడు నిన్ను కర్ణునిసారథిగా ఉండమంటారు. నువ్వు అంగీకరించు.

"నీవు కర్ణుడిని 'తేజోవధ' చేయాలి సుమా!" అని అడిగాడు.

శల్యుడు 'సరే! విజయోస్తు' అన్నాడు.

శల్యుడు కూడా భీష్మ, ద్రోణ, కృపులు అన్నట్లుగానే

శ్లో॥ **యది మాం నాఽభి గచ్ఛేథాః యుద్ధాయ కృతనిశ్చయః ।**
**శపేయం త్వాం మహారాజ పరాభావాయ భారత ॥**

(భీష్మపర్వం - 43/79)

*"మహారాజా! యుద్ధం నిశ్చయమైనాక, నా దగ్గరకు రాకపోయి ఉంటే నేను*

*నీకు పరాజయం కలగాలని శపించి ఉండేవాణ్ణి అన్నాడు.*

"యుద్ధం చెయ్యి. జయం పొందు" అని శల్యుడు ధర్మరాజుని ఆశీర్వదించి పంపాడు.

✦✦✦

**యతః కృష్ణః తతో జయః**

కౌరవసేనలో ఉన్నవీరుల్ని వారిసంఖ్యాబలాన్ని చూసి, ధర్మరాజుకి యుద్ధం నిశ్చయం అయినప్పటినుంచి ఆందోళనే. అర్జునుడు తన అన్నగారిని ఇలా అనునయించాడు.

శ్లో॥ **ఏవం రాజన్ విజానీహి ధ్రువోఽస్మాకం రణే జయః ।**
**యథా తు నారద: ప్రాహ యతః కృష్ణస్తతో జయః ॥**

*ఓరాజా! మనకు యుద్ధంలో జయం నిశ్చయం. నారదుడు చెప్పినట్లు ఎక్కడ కృష్ణుడుంటాడో అక్కడే జయం కలుగుతుంది.*

శ్లో॥ **గుణభూతో జయః కృష్ణే పృష్ఠతోఽభ్యేతి మాధవమ్ ।**
**తద్ యథా విజయశ్చాస్య సన్నతిశ్చాఽపరో గుణః ॥**

*విజయం కృష్ణుని గుణం. అది కృష్ణుని వెంట ఉంటుంది. విజయం వలెనే వినయం కూడా రెండో గుణం.*

"అందుకని నీవు ఏమాత్రం వ్యథచెందవలసిన పనిలేదు" అన్నాడు అర్జునుడు.

**ధర్మరాజు చతురత**

ధర్మరాజుకు పెద్దల ఎడల ఉన్న భక్తి, ధర్మరాజుకి ఉన్న సహజగుణమైన వినయం, మాటలాడటంలో అతనికున్న నేర్పరితనం, యుద్ధ విజయానికి పనికి వచ్చాయి. అందుకే ఆయనను 'మెత్తని పులి'✧ అని అంటారు.

భీష్ముడు, ద్రోణుడు ఇద్దరూ అజేయులే! వారి ఆశీస్సులు పాండవ విజయానికి తోడ్పడ్డాయి. ధర్మరాజు మొదట రోజునే పన్నిన ఈ వ్యూహం అనన్యసామాన్యం.

అందరి అనుమతి పొంది, యుద్ధాన్ని ఆరంభించటం పూర్తిగా ధర్మబద్ధం. అంతేకాదు ఒక చతురత, ఒక వ్యూహం. ధర్మజుని ఈ రాజనీతి మామూలు

---

✧ *ఈ మాటని ఆంధ్రమహాభారతంలో తిక్కనగారు వాడారు. చాలా మెత్తనివాడు ధర్మరాజు. ఆగ్రహిస్తే పులికంటే భయంకరుడు అనే అర్థం.*

తెలివి తేటలకు అందదు. ఇదేమీ చాటుమాటుగా జరుగుతున్నది కాదు. ఈ సంఘటన కేవలం రాజనీతి మాత్రమే కాదు. కొంత ఉదాత్తత, కొంత క్షుద్రత, కొంత స్వార్థపరత. ధర్మమనే గొడుగుల నీడ క్రింద అంతా ధర్మమే. ధర్మమున్న వైపు కృష్ణుడు, కృష్ణుడున్న వైపు గెలుపు. భీష్మ, ద్రోణాదులకు ఈ విషయం బాగా తెలుసు. ధర్మానికి తల ఒగ్గారు. భీష్ముడు పదిరోజుల పాటు యుద్ధం చేశాడు. అసాధారణమైన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. శ్రీకృష్ణునికే ఆగ్రహం తెప్పించాడు. చివరికి కృష్ణుడనే ధర్మబలం ముందు తలవంచాడు. చిట్టచివరకు తన మరణ రహస్యాన్ని స్వయంగా యుధిష్ఠిరునికి తెలియజేశాడు.

ఇంకా కొద్ది నిమిషాలలో యుద్ధం మొదలు కాబోతోందనగా ధర్మరాజు మరో వ్యూహం పన్నాడు. కౌరవపక్షంలో ఉన్నవారిలో ఎవరైనా రాదలచుకొంటే తన పక్షం వైపుకు రావచ్చుననే ఆహ్వానం పలికాడు. ధర్మరాజు ఆహ్వానం మేరకు యుయుత్సువు మాత్రం పాండవ పక్షానికి వచ్చాడు. విజయం కోసం అన్ని ప్రయత్నాలు చేయటం యుద్ధనీతి. నాయకునికి ఉండాల్సిన లక్షణం విజిగీషు ప్రవృత్తి – అంటే గెలవాలనే కోరిక. యుద్ధం గెలవటంకోసమే! ఇది ధర్మరాజు నుంచి నేర్చుకోవలసిన పాఠం. ✦

## యుద్ధ వ్యూహం

✦ యోగ్యుడైన నాయకుడు తప్పులు చేయకుండా ఉండటం వల్ల విజయం సాధిస్తాడు. మరో మాటలో చెప్పాలంటే అతను తప్పులు లేకుండా పనిచేయడమే అతనికి విజయాన్ని ఇస్తుంది.

✦ వంద యుద్ధాలను గెలవడం సామర్థ్యానికి ప్రతీక కాదు. యుద్ధం చేయకుండానే శత్రువును లొంగతీసుకోవడమే నిజమైన సామర్థ్యం.

✦ శత్రువు వ్యూహాన్ని నేరుగా దెబ్బతీయడమే అన్నిటికన్నా ముఖ్యం.

✦ యుద్ధ కళలో ఆరితేరిన నాయకుడు యుద్ధం చేయకుండానే శత్రువును ఓడిస్తాడు.

✦ నిపుణుడైనంత మాత్రాన యుద్ధంలో విజయం సాధించడానికి, ప్రపంచ ప్రఖ్యాతి పొందడానికి కావలసిన సామర్థ్యం ఉందని భావించనక్కర్లేదు.

*(చైనా యుద్ధ వ్యూహకర్త, సమర సేనాని సున్ జు వ్రాసిన "ది ఆర్ట్ ఆఫ్ వార్")*

Team Building

## 19. సముచిత - సహచర మండలి

**చెప్పిన మాట వినటం నాయకునికి ఉండాల్సిన ముఖ్యలక్షణం. 'విమర్శలను విని, తట్టుకొనే ఓర్పు, నేర్పు వుండాలి. అహంకారం వదలి నీకు నచ్చనిదయినా వినాలి. నీ మేలుకోరే వారు మాత్రమే కఠినమైనప్పటికి నీకు మంచిని కలిగించే సత్యాన్ని చెప్తారు కదా!' అని అర్థశాస్త్రం చెప్తోంది.**

**నా**యకుడు తనవల్ల తప్పులు జరగకుండా తగిన సలహాలు ఇచ్చే బృందాన్ని (గవర్నింగ్ కౌన్సిల్) ఏర్పాటు చేసుకోవాలి. "పొరపాటు జరగకుండా అవసరమైన మేరకు నన్ను హెచ్చరించండి! అని పాలకుడు సలహా దారులను ప్రార్థించాలి" అన్నాడు చాణక్యుడు.

శ్లో॥ **సహాయసాధ్యం రాజత్వం చక్రమేకం న వర్తతే।**

**కుర్వీత సచివాంస్తస్మాత్ తేషాం చ శృణుయాన్మతమ్॥**

*(అర్థశాస్త్రం - 7/3)*

"నాయకుడు ప్రమాదాల్లో పడకుండా, రహస్యంగా పొరపాట్లు చేయకుండా, సమయాన్ని వృథా చేయకుండా సలహాదారులు మార్గదర్శనం చేస్తూ ఉండాలి" అన్నది చాణక్యుని సూచన.

ఒంటి చక్రం ఉన్న బండి నడవని విధంగానే పాలకుడు ఒంటరిగా నడవలేడు. అందుకని సలహా బృందాన్ని సమకూర్చుకోవాలి. సమకూర్చుకొంటే చాలదు. "**తేషాంచ శృణుయాన్మతమ్**-వాళ్ల అభిప్రాయాన్ని

వినాలి", అని అన్నారు ఆచార్య చాణక్య.

పెద్ద పెద్ద పేరున్న వార్ని సలహాదారులుగా తీసుకొన్నప్పటికీ వారికి నిజం చెప్పే స్వాతంత్ర్యం ఇవ్వకుంటే ఏమి లాభం?

చెప్పిన మాట వినటం నాయకునికి ఉండాల్సిన ముఖ్యలక్షణం.

"విమర్శలను విని, తట్టుకొనే ఓర్పు, నేర్పు వుండాలి. అహంకారం వదలి నీకు నచ్చనిదైనా వినాలి. నీ మేలుకోరే వారు మాత్రమే కఠినమైనప్పటికి నీకు మంచిని కలిగించే సత్యాన్ని చెప్తారు కదా!" అని అర్థశాస్త్రం చెప్తోంది.

"ఏమీ సలహా ఇవ్వకుండా యజమాని అభిప్రాయాన్ని సమర్థిస్తున్నాం కాబట్టి మా పదవులు పదిలంగా ఉంటున్నాయి" అన్నారు ప్రభుత్వ సలహాదారునిగా ఉంటున్న ఓ పెద్దమనిషి. ఇదీ వర్తమాన దుస్థితి.

ఓ మాజీ పోలీసు అధికారిని, ఓ సంస్థకు సలహాదారునిగా ఉండమని అడిగారట. "ఉంటాను గానీ... నా సలహాలను పాటించకుంటే నేను ఊరుకోను" అని ఆయన అన్నారట. ఆ సంస్థవారు ఒకటి, రెండుసార్లు ఆలోచించి, ఆ ఆలోచనని ప్రక్కన పెట్టేసారట.

మంచి సలహాలను వినటానికి సాధారణంగా ఎవరూ సిద్ధంగా ఉండరు– అంటోంది మహాభారత, రామాయణాలలో వున్న ఈ శ్లోకం. మారీచుడు రావణునితో, విదురుడు ధృతరాష్ట్రునితో ఈ సత్యాన్ని ఇలా చెప్పారు.

శ్లో॥ **సులభాః పురుషా రాజన్! సతతం ప్రియవాదినః**

**అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః॥**

*(రామాయణం – అరణ్య 37/2) (మహాభారతం – ఉద్యోగ 37/15)*

రాజా! ఎల్లప్పుడు ప్రియంగా మాట్లాడేవారు తేలికగా దొరుకుతారు. అప్రియమైనా హితం చెప్పేవాడు, దాన్ని వినేవాడు దొరకడం దుర్లభం.

'ప్రియం' అంటే అప్పటికప్పుడు ఇష్టమైనదిగా అనిపించేది – 'హితం' అంటే చివరివరకు సుఖం కలిగించేది.

ఓ పాలకుని వద్ద ఉన్న సలహామండలి (ముఖ్యసలహాదారులు), గూఢచారులు నిజం చెప్పకుండా ఉండకూడదు. యజమానికి ఏది నచ్చుతుందో అది చెప్పటం కాక, ఏది మంచిదో అది మాత్రమే చెప్పగలిగి ఉండాలి, చెప్పాలి. అసత్యం

చెప్పటం, అన్యాయమని తెలిసినా 'తందానా' అంటూ వంత కలపడం కూడదు.

ఆంధ్రప్రదేశ్‌లో క్రీ.శ 1997లో ఇంటర్‌బోర్డులో ప్రశ్నాపత్రాలు లీకయ్యాయి. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి ఫోన్‌చేసి, ఇంటర్‌బోర్డు కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయమని ఆదేశించారు.

"ఆ అధికారి ఆ పోస్టులో ఆంధ్రప్రదేశ్‌లో చేరి రెండు మాసాలే అయింది కనుక అతణ్ణి బాధ్యుణ్ణి చేయలేను, అంతకన్నా నన్ను సస్పెండ్ చేయండి. మీకు మంచి పేరొస్తుంది" అన్నాడు ఆ ముఖ్యకార్యదర్శి.

ఇలాంటి అధికారులే నిజమైన సలహాదారులు.

పాలకున్ని మంచిమార్గంలో పెట్టడం మంత్రుల కర్తవ్యం. నాయకుని చుట్టూ చేరిన స్వార్థపరులైన భజనబృందం (కాకస్) చెప్పిన మాటలు విని చెడిపోయిన వారెందరో చరిత్రలో ఉన్నారు.

✦✦✦

**యువరాజును సరిచేసిన హనుమ**

నాయకుడు స్వతహాగా మంచివాడయినా, బుద్ధి బలం, శారీరక బలం కలవాడైనా ఒక్కో పరిస్థితిలో, ఒక్కో సమయంలో కర్తవ్యాన్ని మరచిపోతుంటాడు. ఆలోచనా శక్తిని కోల్పోతాడు. నిరాశకు లోనవుతాడు –ఉద్వేగ మనస్కుడవుతాడు. ఆత్మహత్యకు కూడా సిద్ధపడతాడు.

నాయకుని ప్రవర్తన, నిర్ణయం వల్ల కేవలం వ్యక్తిగతమైన పరిణామమే కాదు తనపై ఆధారపడిన వారిపై కూడా ఆ ప్రభావం ఉంటుంది. తనతో పని చేసే బృందంపై కూడా అయోమయ ఛాయలు క్రమ్ముకుంటాయి. అలాంటప్పుడు సరైన మంత్రి ఎవరైనా దగ్గర ఉండి సలహా ఇవ్వాలి. ఒక పెద్దమనిషి జోక్యం చేసుకోవాలి, అవివేకాన్ని తొలగించాలి.

ఇటువంటి పరిస్థితిని రామాయణంలో కిష్కింధాకాండలో వాల్మీకి ఇలా వర్ణించారు–

సీతాన్వేషణకై, సుగ్రీవుని ఆజ్ఞతో దక్షిణదిశకు వెళ్లవలసిన వానర బృందానికి యువరాజు అంగదుడు నాయకునిగా నియమింపబడ్డాడు. సీతమ్మను అపహరించిన రాక్షసుడు దక్షిణదిశగా వెళ్లాడని చూచాయగా శ్రీరామబృందానికి తెలుసు.

కాబట్టి దక్షిణంవైపు వెళ్ళే వారే విజయం సాధించుకొని రాగలరని అందరూ అనుకొంటున్నారు, శ్రీరాముడు కూడా తన ఉంగరాన్ని అంగదుని జట్టులోని హనుమంతునికే ఇచ్చాడు.

కానీ... ఏం జరిగింది? సుగ్రీవుడు ఇచ్చిన గడువు పూర్తి అయిపోయింది. కానీ సీత జాడను గురించిన సమాచారం ఏమీ దొరకలేదు. "గడువు దాటాక వచ్చిన వారికి మరణ శిక్షే!" అన్న 'సుగ్రీవాజ్ఞ' గుర్తుకొచ్చింది అంగదునికి.. విజయం సాధించి తీరుతామని భావించిన ఆ జట్టు నాయకుడు అంగదుడు నిరాశకు గురయ్యాడు.

తన బృందానికి ఇలా చెప్పాడు - "సీతాదేవి వృత్తాంతం తెలుసుకోకుండా, వెనక్కి వెళ్లితే, సుగ్రీవుడు మనల్ని చంపి తీరుతాడు. మొదటినుంచి అతనికి నాపై వైరం. రాముడు చెప్పబట్టి నన్ను యువరాజుని చేసాడు. ఏదోవంకని, మా పినతండ్రి నన్ను చంపాలనే ప్రయత్నిస్తూంటాడు. అందుకని తిరిగి కిష్కింధకు వెళ్లకుండా, శ్రీరామ, సుగ్రీవులకు కనిపించకుండా ఇక్కడనే, ఎక్కడైనా దాక్కొని శేష జీవితం గడపటం ఉత్తమ మార్గం." అని ప్రతిపాదించాడు.

తన బాబాయి-మహారాజు సుగ్రీవుణ్ణి నానా రకాలుగా నిందించాడు. తన బృందంలో ఉన్న వారికి కూడా 'నిరాశ' అనే విషాన్ని ఎక్కించాడు. యువరాజు గారి ప్రతిపాదనకు, బృందంలో ఉన్న యువతరం 'సై' అంది. మనకు అన్న పానాదులకు లోటులేని, ఈ మాయా బిలంలో ఉండిపోదాం. అని నిశ్చయించారు.

అలాంటి పరిస్థితుల్లోనే సరైన మంత్రి అవసరం. నాయకుని అవివేకాన్ని తొలగించే 'సలహాదారుడు' అవసరం! విజ్ఞుడు ఎవరైనా నాయకుడిని సరైన దారిలోకి పెట్ట వలసిన బాధ్యత చేపట్టాలి!

ఆ పని హనుమంతుడు చాలా చాకచక్యంతో నిర్వహించాడు. 'వినే స్వభావం' ఉన్న నాయకుడు అంగదుడు. కాబట్టి, ఏ ఉపాయాన్ని ప్రయోగించి, నచ్చచెప్పవచ్చో బుద్ధిమంతుడైన హనుమంతుడు ఆలోచన చేసాడు. భేదోపాయాన్ని ప్రయోగిస్తూ అంగదునితో ఇలా అన్నాడు హనుమ -

"అంగదా! చపలచిత్తులైన ఈ వానరులు నీతో ఎల్లకాలం ఉంటారని ఆశించకు. కొన్ని రోజుల్లోనే, నీ అనుయాయులకు వారి వారి కుటుంబం, భార్య బిడ్డలు

గుర్తుకు వస్తారు. అప్పుడు నిన్ను విడిచి తప్పక వెళ్లిపోతారు. నేను (హనుమంతుడు), జాంబవంతుడు, వానర వీరుడు సుహోత్రుడు నీ పక్షాన ఉండం. అంగదా! ఇదే చెప్తున్నాను! సుగ్రీవుని నుంచి మమ్మల్ని వేరు చేయలేవు." అంగదుడికి మరింత నచ్చచెప్పటం కోసం దండోపాయం ప్రయోగించాడు బృహస్పతి వంటి బుద్ధి కుశలత ఉన్న హనుమంతుడు.

"అంగదా! నువ్వు బిలంలో దాక్కుంటే లక్ష్మణుడు కనిపెట్టలేడని అనుకోకు. అతి తీవ్రమైన వేగవంతమైన లక్ష్మణ బాణాన్ని ఎదిరించటం నీకు శక్యం కాదు. అందువల్ల సుగ్రీవుని పై వ్యతిరేకత ప్రదర్శించకు. ధర్మాత్ముడైన సుగ్రీవుడు మనల్ని ఏమీ అనడు. నువ్వంటే సుగ్రీవునికి ఎంతో ప్రీతి." అని నచ్చచెప్పాడు.

రామకార్యం నెరవేర్చలేకపోయాననే అపరాధ భావన, ఆత్మన్యూనత అంగదునిపై ఆవరించింది. హనుమ నచ్చ చెప్పాక కూడా 'ఆత్మహత్య' వైపు మొగ్గు చూపాడు. దర్భలు పరచుకొని, తన బృందంతో సహ 'ప్రాయోపవేశం' కోసం పురికొల్పాడు.

పక్షిరాజు సంపాతి ద్వారా సీతాపహరణ గావించిన రావణుని ఆచూకీ తెలిశాకనే అంగదునిలో నిర్వేదం తగ్గింది. ఉండాలా–పోవాలా అన్నట్లున్న ఆ మనిషిలో మార్పు వచ్చింది. లక్ష్యసాధన కనుచూపు దూరంలో ఉందని తెలిశాక యువరాజు అయిన అంగదుడు నాయకత్వ లక్షణాలను పునఃప్రదర్శించాడు, భయపీడితులైన తన బృందానికి హితబోధ చేశాడు. "విషాదం వద్దు" అని నచ్చచెప్పాడు. ఇలా..

శ్లో॥ **న విషాదే మనః కార్యం విషాదో దోషవత్తరః ।**
**విషాదో హన్తి పురుషం బాలం క్రుద్ధ ఇవోరగః ॥**

(కిష్కింధా కాండము 64/11)

మనస్సులో విషాదం రానీయకూడదు. విషాదం చెడ్డది. కోపించిన పాము చిన్నపిల్లవాణ్ని చంపినట్లుగా విషాదం, మనిషిని చంపివేస్తుంది.

శ్లో॥ **యో విషాదం ప్రసహతే విక్రమే సముపస్థితే ।**
**తేజసా తస్య హీనస్య పురుషార్థో న సిధ్యతి ॥**

(కిష్కింధా కాండము 64/12)

పరాక్రమం చూపవలసిన సమయంలో విషాదానికి అవకాశాన్ని ఇచ్చే తేజో హీనులైనవారి పనులు ఏవీ సిద్ధించవు.

అంగదుని మాటలు విన్న తరువాత మిత్రబృందంలో ఉత్సాహం ఉరకలెత్తింది, విషాద ఛాయలు తొలగిపోయాయి. అంగదుడు పెద్దలతో చర్చ జరిపాడు. విజయం సాధించే మార్గం సుగమం అయ్యింది. హనుమంతుడు సాగరాన్ని లంఘించడానికి సిద్ధమవుతున్నాడు. అంగదునిలో మళ్లీ పూర్వపు ఉత్సాహం వచ్చింది. యువరాజు తన బృందంతో తీపికబురు కోసం వేచి ఉన్నాడు...

అంగదుడు ఆ తర్వాత కాలంలో రాముని తరఫున రాయబారిగా రావణుని కొలువుకి వెళ్లి, తన కర్తవ్యాన్ని అనితరసాధ్యంగా నెరవేర్చి, రాముని ప్రశంసలను పొందాడు.

ఈ సంఘటన ఇచ్చే సందేశం-

నాయకుడు తన బృందంలో బుద్ధిమంతులైన వారిని నియమించుకోవాలి!

తన మేలు కోరి చెప్పినవారి మాట వినాలి! తాత్కాలికంగా కలిగిన నిర్వేదన నుంచి బయటపడే ఆలోచనలను మొదలు పెట్టాలి. కర్తవ్యోన్ముఖుడు, కార్యోన్ముఖుడు అయిన నాయకుణ్ణి బృందం అంతా గౌరవిస్తుంది. ✦

## అందరితో కలసి...

నాయకుడు తాను వ్యక్తిగతంగా మంచిగా ఉంటే చాలదు. కలసి పనిచేసే, పనిచేయించే నైజం, నైపుణ్యత ఉండాలి.

బృందంలో, ఉద్యోగులలో వివిధ గుణాలు ఉన్న వారుంటారు. వివిధ స్థాయిల వాళ్లు ఉంటారు. "ఫలానా వాళ్లతో నేను కలసి పనిచేయను". "ఆయన ఉంటే నేను ఉండను" అనటం ఉత్తమ నాయకత్వ లక్షణం కాదు. బృందంలో ఉన్న సభ్యులకు ఎవరి అభిప్రాయం వారికుంటుంది. అందరి ఆలోచనలను గౌరవించాలి. మతభేదాలుండవచ్చు. కానీ మనలో భేదాలు లేకుండా, రాకుండా జాగ్రత్త పడాలి.

విరోధులను కూడా కలుపుకొనిపోయేవాడు మంచి నాయకుడు.

'అందరితో కలసి పనిచెయ్యాలి' - అంతేకాదు. పనిలో అందరినీ భాగస్వాములని చేయాలి. కనీసం అందరినీ కలుపుకు వెళ్తున్నాడన్న భావాన్ని అందరికి కలిగించగలిగి ఉండాలి.

*Communications &*
*Interpersonal relationship skills*

## 20. ఇలా ఉండాలి - అలా కాదు..

**గుణవంతుడయిన పరిపాలకునికి ఉండవలసిన ముప్పయి ఆరు లక్షణాలు కేవలం ఆనాటి రాజులకు మాత్రమే కాదు, నేటి పరిపాలకులకు, నాయకులకు, మంత్రులకు, కంపెనీ మేనేజర్లకు, కుటుంబ పెద్దలకు, కంపెనీ నిర్వాహకులకు... ఎవరికైనా ఉండవలసిన శుభ లక్షణాలు**

**వా**ల్మీకి మహర్షి నారద మహర్షిని ఒక ప్రశ్న వేశాడు.

ఇప్పుడు -వర్తమానంలో- భూలోకంలో ఈ పదహారు మంచి లక్షణాలున్న వారెవరైనా వున్నారా? అన్నది ఆ ప్రశ్న.

యుగాలకు పూర్వం అడిగిన ప్రశ్నలే అయినా వర్త మాన పాలకులలో మనం ఆశించే లక్షణాలను, సమన్వ యించుకొనేందుకు పనికొచ్చే ప్రశ్న ఇది.

నారదుడిని వాల్మీకి మహర్షి అడిగిన ప్రశ్న.

శ్లో॥ **కోఽన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్ ।**
**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ॥**

శ్లో॥ **చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః ।**
**విద్వాన్ కః కః సమర్థశ్చ కశ్చైకః ప్రియదర్శనః ॥**

శ్లో॥ **ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽన సూయకః ।**
**కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే ॥**

- (వాల్మీకి రామాయణం - బాలకాండ - 2-3-4)

*"ఇప్పుడు – భూలోకంలో ఈ పదహారు గుణాలున్నవారు ఎవరు?"*

*1. మంచి గుణము కలవాడు.*

*2. గొప్ప పరాక్రమము కలవాడు.*

*3. ధర్మము తెలిసినవాడు, ధర్మాన్ని ఆచరించేవాడు.*

*4. కృతజ్ఞుడు – చేసిన మేలు మరవనివాడు.*

*5. సత్యం మాట్లాడేవాడు.*

*6. దృఢమైన సంకల్పం ఉన్నవాడు.*

*7. మంచి నడవడిక కల్గినవాడు.*

*8. అన్ని ప్రాణులకు హితం చేకూర్చేవాడు.*

*9. అన్ని విషయాలపై పరిజ్ఞానం ఉన్నవాడు.*

*10. సామర్థ్యం కలవాడు, ఇతరులెవరూ చేయలేని పనులు చేయగలవాడు.*

*11. చూసేవారికి ఆనందాన్ని కలిగించేవాడు.*

*12. ధైర్యం కలవాడు.*

*13. కోపాన్ని జయించినవాడు.*

*14. ప్రశస్తమైన కాంతి కలవాడు.*

*15. అసూయలేనివాడు.*

*16. తాను కోపిస్తే లోకాన్నంతా భయపడేటట్లు చేసేవాడు.*

ఈ శుభ లక్షణాలన్నీ ఉన్న అత్యుత్తమ మానవుడు, వాల్మీకి సమకాలంలో జీవించిన రఘురాముడన్నది నారదమహర్షి సమాధానం.

నాయకులందరికీ ఆదర్శం రఘురాముడు. రామరాజ్య స్థాపన పాలకుల ఆదర్శ లక్ష్యం.

**ఎలాంటి నాయకుడు కావాలి ?**

మహాభారతంలోని శాంతిపర్వంలో భీష్ముడు తన మనుమడైన ధర్మరాజుకు మంచి పరిపాలకునికి వుండాల్సిన ముప్పయి ఆరు లక్షణాలను పేర్కొన్నాడు. గుణవంతుడయిన పరిపాలకునికి ఉండవలసిన ఈ లక్షణాలు కేవలం ఆనాటి రాజులకు మాత్రమే కాదు, నేటి పరిపాలకులకు, నాయకులకు, మంత్రులకు, కంపెనీ మేనేజర్లకు, కుటుంబ పెద్దలకు, కంపెనీ నిర్వాహకులకు... ఎవరికైనా

ఉండవలసిన శుభ లక్షణాలు ఇవి..

శ్లో॥ **చరేద్ధర్మానకటుకః ముంచేత్స్నేహం న చాస్తికః।**
**అనృశంసశ్చరేదర్థం చరేత్కామమనుద్ధతః ॥**

(మహాభారతం, శాంతిపర్వం - 70/3)

***1.*** *రాగద్వేషాలు లేకుండా ధర్మంగా ఉండాలి.* ***2.*** *ఆస్తికుడై ఉండాలి, స్నేహం వీడకూడదు.* ***3.*** *క్రూరత లేకుండా ధనం ఆర్జించాలి.* ***4.*** *ధర్మంగా కోర్కెలను తీర్చుకోవాలి.*

శ్లో॥ **ప్రియం బ్రూయాత్ అకృపణః శూరః స్యాదవికత్థనః।**
**దాతా నాపాత్రవర్షీ స్యాత్ ప్రగల్భః స్యాదనిష్ఠురః ॥**

(శాంతిపర్వం-70/4)

***5.*** *దైన్యం లేకుండా ప్రియంగా మాట్లాడే గుణం వుండాలి.* ***6.*** *శూరుడైనప్పటికీ ఆత్మస్తుతి చేసుకోరాదు.* ***7.*** *పాత్రత ఉన్నవారికి దానం చేసే గుణం కలిగి ఉండాలి.* ***8.*** *మృదుహృదయుడై, ప్రతిభగలవాడై ఉండాలి.*

శ్లో॥ **సందధీత న చానార్యైః విగృహ్ణీయాన్న బంధుభిః।**
**నాఽభక్తం చారయేచ్చారం కుర్యాత్కార్యమపీడయా॥**

(శాంతిపర్వం-70/5)

***9.*** *దుష్టజనసాంగత్యం కూడదు.* ***10.*** *బంధువులనుంచి విడిపోకూడదు.* ***11.*** *రాజభక్తి లేనివానిచేత గూఢచారి పనిచేయించరాదు.* ***12.*** *ఎవరినీ నొప్పించకుండా కార్యాన్ని సాధించాలి.*

శ్లో॥ **అర్థం బ్రూయాన్న చాసత్సు గుణాన్బ్రూయాన్న చాఽత్మనః।**
**ఆదద్యాన్న చ సాధుభ్యః నాసత్పురుషమాశ్రయేత్॥**

(శాంతిపర్వం-70/6)

***13.*** *ఇష్టమైనదాన్ని దుష్టుల దగ్గర చెప్పకూడదు.* ***14.*** *తన గుణగణాలు తాను చెప్పుకోరాదు.* ***15.*** *సజ్జనుల ధనం అపహరించరాదు.* ***16.*** *దుష్టుని ఆశ్రయించరాదు.*

శ్లో॥ **నా పరీక్ష్య నయేద్దండం న చ మంత్రం ప్రకాశయేత్ ।**
**విసృజేన్న చ లుబ్ధేభ్యః విశ్వసేన్నాపకారిషు ॥** (శాంతిపర్వం-70/7)

***17.*** *పరీక్షించకుండా దండింపకూడదు.* ***18.*** *రహస్యాలు బయటపెట్టరాదు.*
***19.*** *పిసినారులకు ధనం ఇవ్వరాదు.* ***20.*** *అపకారులను నమ్మరాదు.*

శ్లో॥ **అనీర్షుర్గుప్తదారః స్యాత్ చోక్షః స్యాదఘృణీ నృపః।**
**స్త్రియః సేవేత నాత్యర్థం మృష్టం భుంజీత నాహితమ్ ॥**

(శాంతిపర్వం–70/8)

***21.*** *అసూయ లేకుండా భార్యను రక్షించాలి.* ***22.*** *శుద్ధమనస్కుడై ఉండాలి. కాని దుష్టులను శిక్షించే విషయంలో నిర్దయుడు కావాలి.* ***23.*** *పరస్త్రీ వ్యామోహం ఉండరాదు.* ***24.*** *రుచికరమైన భోజనమే తినాలి, అహితమైనది తినరాదు.*

శ్లో॥ **అస్తబ్ధః పూజయేదన్యాన్ గురూన్ సేవేదమాయయా ।**
**అర్చేద్దేవానదంభేన శ్రియమిచ్ఛేదకుత్సితామ్ ॥**

(శాంతిపర్వం–70/9)

***25.*** *స్తబ్ధతలేకుండా, వినయంతో మాన్యులను పూజించాలి.* ***26.*** *గురువులను కపటం లేకుండా సేవించాలి* ***27.*** *ఆర్భాటం లేకుండా దైవాన్ని ఆరాధించాలి.* ***28.*** *అవినీతిమయంకాని ధనం కోరుకోవాలి.*

శ్లో॥ **సేవేత ప్రణయం హిత్వా దక్షః స్యాన్న త్వకాలవిత్ ।**
**సాంత్వయేన్న చ మోక్షాయ అనుగృహ్ణన్న చాక్షిపేత్ ॥**

(శాంతిపర్వం–70/10)

***29.*** *ప్రేమతో సేవించాలి.* ***30.*** *సమయం తెలిసి కార్యాచరణానికి పూనుకోవాలి.* ***31.*** *మృదుత్వం ఉండాలి కాని పలాయనవాదం పనికిరాదు.* ***32.*** *అనుగ్రహిస్తూ ఆక్షేపించరాదు.*

శ్లో॥ **ప్రహరేన్నత్వవిజ్ఞాయ హత్వా శత్రూన్నశోచయేత్ ।**
**క్రోధం కుర్యాత్ న చ అకస్మాత్ మృదుః స్యాత్ న అపకారిషు॥**

(శాంతిపర్వం–70/11)

***33.*** *తెలుసుకోకుండా దండింపరాదు.* ***34.*** *శత్రువును చంపినా వారి బంధువులను దుఃఖపెట్టరాదు.* ***35.*** *అకస్మాత్తుగా కోపం పొందకూడదు.* ***36.*** *అపకారులపట్ల మృదుత్వం పనికిరాదు.*

✦

## పాలకులు ఇలా ఉండరాదు...

**వాల్మీకి** మహర్షి రామాయణంలో రాముని ద్వారా పాలకునికి ఉండకూడని లక్షణాలను పేర్కొన్నారు. వీటిని 'రాజ దోషాలు'గా వర్ణించారు. ఈ పధ్నాలుగు లక్షణాలను గురించి శ్రీరాముడు తన తమ్ముడైన భరతునికి బోధించాడు.

**శ్లో॥ నాస్తిక్యమనృతం క్రోధం ప్రమాదం దీర్ఘసూత్రతామ్ ।**
**అదర్శనం జ్ఞానవతామాలస్యం పంచవృత్తి తామ్ ॥**

**శ్లో॥ ఏక చింతనమర్థానామనర్థజ్ఞైశ్చ మన్త్రణమ్ ।**
**నిశ్చితానామనారమ్భం మన్త్రస్యాపరిరక్షణమ్ ॥**

**శ్లో॥ మఙ్గలస్యాప్రయోగం చ ప్రత్యుత్థానం చ సర్వత: ।**
**కచ్చిత్త్వం వర్జయస్యేతాన్ రాజదోషాంశ్చతుర్దశ ॥**

*(రామాయణం–అయోధ్యాకాండ 100వ సర్గ 65,66,67)*

1. *దైవంపై నమ్మకం లేనివాడు మంచి పాలకుడు కాలేడు.*
2. *అబద్ధాలు ఆడేవాడు పాలకునిగా అనర్హుడు. అన్నమాటపై నిలబడాలి*
3. *నిగ్రహించుకోలేనంత పరమ కోపిష్టి మంచి నాయకుడు కాలేడు.*
4. *ఏమరుపాటుతో ఉండకూడదు. – ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి.*
5. *నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయకూడదు. వాయిదాలు ప్రమాదకరం.*
6. *సమాజంలో ఉన్న జ్ఞానవంతులైన వ్యక్తులను నిర్లక్ష్యం చేయకూడదు.*
7. *సోమరితనం ఉన్నవాడు మంచి నాయకుడు కానేరడు.*
8. *ఇంద్రియ లోలుడైనవాడు నాయకునిగా అనర్హుడు.*
9. *మంత్రులను నిర్లక్ష్యం చేసి వారితో చర్చించకుండా ఒక్కడే నిర్ణయం చేయకూడదు.*
10. *ప్రతిభలేని వారిని తన బృందంలోకి తీసుకొని–వాళ్లతో ఆలోచన చేయటం తప్పు.*
11. *నిశ్చయించిన పథకాలను వెంటనే ప్రారంభించక పోవటం – ప్రగతికి విఘాతం.*
12. *తన బృందం చేసిన రహస్య ఆలోచనలను బయటకు చెప్పకూడదు.*
13. *అశాస్త్రీయమైన, అమంగళమైన పనులు చేయకూడదు.*
14. *సరైన అంచనా లేకుండా ఒకేసారి అనేకమంది శత్రువులను ఎదుర్కోవటం తగదు.*

✦

*Leadership*

## 21. కార్యసాధనకు సజీవ స్ఫూర్తి

**ఈ కాలంలో అపర భగీరథునిగా చెప్పుకోదగ్గ వ్యక్తి శ్రీ ఏకనాథ్‌జీ రానడే! కన్యాకుమారిలోని శ్రీవివేకానంద శిలాస్మారక నిర్మాణం అనే గంగావతరణాన్ని గావించిన అపర భగీరథుడు! రూపం దాల్చిన ధ్యేయం. శ్రద్ధ, పట్టుదలకి మరోపేరు!**

**ఉ**న్నత లక్ష్యం కలిగివుండటం ఉత్తమ నాయకత్వ లక్షణం.

పనిని సాధించటం కోసం లక్ష్యం వైపు ముందుకు వెళ్లటం ముఖ్యం. దీనిపై లోతైన అధ్యయనం చేయాలి. కళ్లు మూసుకొంటే ఆ 'ప్రకల్పం'(ప్లాన్) కళ్లముందు కదలాలి, కనబడాలి! ఎవరు మనకు సమర్ధకులు – ఎవరు సహాయకులు? – ఎవరు వ్యతిరేకులు? అని ఆలోచించాలి!

వ్యతిరేకుల్ని అనుకూలురుగా ఎలా మలచుకోవాలి! ఎవరితో మొదలు పెట్టాలి? ఈ యోజన చాలా ముఖ్యం! ఏక కాలంలో అందర్నీ ఒప్పించలేమన్నది వాస్తవం!! అనుకూల వ్యక్తుల మనసులు గెలవాలి. శత్రువులని సహితం మిత్రులుగా మలచుకోవాలి. ఇలాంటి లక్ష్యసాధకులను సమాజంలో అరుదుగా చూస్తూంటాం. వారు సమాజానికి ఆదర్శ పురుషులు, స్ఫూర్తి ప్రదాతలు!!

ఇతిహాసంలో అటువంటి వ్యక్తి 'భగీరథుడు'గా పెద్దలు చెప్తారు.

ఈ కాలంలో అపర భగీరథునిగా చెప్పుకోదగ్గ వ్యక్తి శ్రీ ఏకనాథ్‌జీ రానడే! కన్యాకుమారిలోని శ్రీవివేకానంద శిలాస్మారక నిర్మాణం అనే గంగావతరణాన్ని గావించిన అపర భగీరథుడు! రూపం దాల్చిన ధ్యేయం. శ్రద్ధ, పట్టుదలకి మరోపేరు!

వివేకానందపై శ్రీరానడేకు ఉన్న అపరిమితమైన గౌరవానికి చిహ్నంగా భారత భూమి దక్షిణాగ్రంలో నిర్మించిన 50 అడుగుల ఎత్తైన స్వామి విగ్రహం ప్రపంచ వ్యాప్తంగా యాత్రికులకు స్ఫూర్తి కేంద్రమైంది. వివేకానంద శిలాస్మారక నిర్మాణ మహాయజ్ఞంలోని ఆటంకాలను -శ్రీ రానడే అధిగమించిన వైనాలు తెలుసుకోవటం కార్యకర్తలకు పాఠ్యాంశమే!

మహాభారతంలో వ్యాసమహర్షి అందించిన ఈ శ్లోకం కార్యకుశలత్వ లక్షణాలని వివరిస్తోంది.

శ్లో॥ **కచ్చిచ్ఛూరాః కృతప్రజ్ఞాః పంచ పంచస్వనుష్ఠితాః ।**
**క్షేమం కుర్వంతి సంహత్య రాజన్ జనపదే తవ ॥**

(సభాపర్వ, 5/81)

*"రాజా! నీ రాజ్యంలో వివిధ ప్రాంతాలలో శూరులు, వీరులు, బుద్ధిమంతులు, కార్యకుశలురు ఉన్నారా? వారు ఈ ఐదు లక్షణాలు కలిగి, రాజ్యానికి క్షేమం చేకూరుస్తున్నారా?" అని నారదమహర్షి ధర్మరాజును ప్రశ్నించాడు.*

**ఆ ఐదు లక్షణాలు ఇవి..**

**1.** పనిని ప్రారంభించే ముందు దానిని విశదంగా అధ్యయనం చేయాలి.

**2.** ఆ పనిని విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా శ్రేష్ఠులైన వ్యక్తుల సమీకరణ చేయాలి. పనికి కావలసిన ధన సేకరణ ప్రయత్నాలను కూడా కొనసాగించాలి.

**3.** ఏ పని ఏ కాల పరిమితుల్లో చేయాలి? ఏది ముందు? ఏది వెనుక? అనే యోజన చేయాలి.

**4.** ఏదైనా చిన్న సమస్య, ఆపద వస్తే దానికి విస్తృత ప్రచారం చేయకుండా పరిష్కరించి, ముందుకు వెళ్ళాలి.

**5.** కార్యసిద్ధి కోసం పరితపించాలి. విశ్రాంతి లేకుండా పరిశ్రమించాలి.

మహాభారతం చెప్పిన ఈ లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న ఒక వ్యక్తి –

శ్రీ ఏకనాథ్ రానడే రాష్ట్రీయ స్వయంసేవక సంఘ (ఆర్ఎస్ఎస్) ప్రచారక్! క్రీ॥ శ॥ 1963వ సంవత్సరంలో వీరికి వివేకానంద స్మారకాన్ని నిర్మించే బాధ్యత అప్పగించబడింది. ఈ తపఃశాలి రంగంలోకి దిగి పనిని విజయవంతం చేసిన ఘట్టాలు విజయ సాధనను ఆకాంక్షించే నాయకునికి స్ఫూర్తి పాఠాలు.

✦ పనిలోకి దిగేముందు అంతకుముందు జరిగిన కథను క్షుణ్ణంగా పరిశీలించారు శ్రీ రానడే.

✦ సమస్యలు, చిక్కుముళ్లు, మిత్రులు, శత్రువులు ఎవరో ఇట్టే గ్రహించారు. కళ్లముందు లక్ష్యం కదిలింది! ప్రజల స్వప్నం సాకారంగా ఆయనకు దర్శనం ఇచ్చింది. రూట్ మ్యాప్ ప్రత్యక్షమైంది.

✦ 1963 జూలై 22న బేలూరు మఠానికి వెళ్లి – అక్కణ్నుంచి పని ప్రారంభించారు. జిల్లా కమిటీ జాతీయస్థాయికి ఎదిగింది.

✦ అప్పటివరకూ వున్న కమిటీ సభ్యులనెవ్వరినీ తొలగించలేదు. కమిటీలో కొత్త పోస్టు... నిర్వాహక కార్యదర్శిగా శ్రీ రానడే బాధ్యతను స్వీకరించారు.

✦ 1963 ఆగష్టు 11 నాడు తొలిసారిగా కన్యాకుమారికి వెళ్లాక మరెన్నో విషయాలు అవగతం చేసుకొన్నారు.

✦ రాజకీయ కారణాలతో ఏర్పడిన రెండు ప్రధాన సమస్యలను ఒకదాని తర్వాత ఒకటి చాకచక్యంగా పరిష్కరించారు.

**చిక్కుముడులు విప్పే ఉపాయాలు**

ఒక్కో 'సమస్య'ను తీసుకొని, దాన్ని శ్రీ రానడే ఎలా పరిష్కరించారో తెలుసుకొని నాయకులు ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చు. సామదాన భేద దండోపాయాల్ని ఎప్పుడు ఎలా ఉపయోగించాలో విజయవంతమైన ఈ యోజన ద్వారా తెలుసుకోవచ్చు. ఈ బృహత్కార్యంలో పని ముందుకు సాగకుండా ఎదురైన ప్రధాన ఆటంకం – కేంద్ర మంత్రి హుమయూన్ కబీర్ ప్రకటన వల్ల కలిగింది. పర్యావరణ సంబంధితమైన అభ్యంతరం లేవదీశాడు ఇతడు –

"శిల సహజ సౌందర్యం దెబ్బ తింటుంది" అని. దానికి మద్రాసు ముఖ్యమంత్రి వంత పాడారు. ఈ అభ్యంతరాన్ని ఛేదిస్తేనే, మార్గం సుగమం అవుతుంది.

శ్రీ రానడే కేంద్ర మంత్రిని కలవాలని ప్రయత్నించారు. ఇంటర్వ్యూ లభించలేదు.

కార్యసాధకుడైన శ్రీ ఏకనాథ్‌జీ కొత్త వ్యూహంతో కలకత్తా వెళ్లారు. అది హుమయూన్ పార్లమెంటు నియోజకవర్గం. రామకృష్ణ మిషన్ ద్వారా అక్కడున్న పుర ప్రముఖులను, పత్రికా సంపాదకులను శ్రీ రానడే వ్యక్తిగతంగా కలిశారు. రంగాన్ని సిద్ధం చేశారు.

కలకత్తాలో పత్రికా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి జరిగిన కథ వివరించారు. భేదోపాయాన్ని వాడారు. ఇంకేముంది మర్నాడు పత్రికలన్నీ సంపాదకీయాలుగా, వ్యాసాలుగా వివేకానంద శిల గురించి ప్రచురించాయి.

కన్యాకుమారిలో వున్న ఆ శిలకున్న ప్రాధాన్యం, ఆ స్థలం వివేకానంద స్వామిని జాతీయ మహాపురుషునిగా ఎలా మార్చింది అని వ్రాస్తూ, "మనం ఎన్నుకొన్న మంత్రి హుమయూన్ 'మన' వివేకానందుని విషయంలో అభ్యంతరం పెట్టడం ఘోరం" అని పత్రికలు ఘోషించాయి. కథ కావలసిన మలుపు తిరిగింది. "వివేకానందస్వామి పట్లగాని ఆయన స్మారక నిర్మాణానికి గాని, నేను వ్యతిరేకిని కాను" అని హుమయూన్ కబీర్ స్వయంగా ప్రకటించి, ఏక్‌నాథ్‌జీని పిలిపించు కొన్నాడు. ఒక పెద్ద అడ్డంకి తొలగింది. ఇక తరువాత లక్ష్యం తమిళనాడు ముఖ్యమంత్రి భక్తవత్సలం గారు. వారిని కూడా దార్లోకి తేవాలి. లాల్‌బహదూర్ శాస్త్రిగారిని కలిసి, ఆయన సలహా మేరకు శ్రీ రానడే పార్లమెంటు సభ్యులను కలిశారు. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా అందరి మనస్సులు గెలిచారు. పార్లమెంటు సభ్యుల సంతకాలను సేకరించటం ఆరంభించారు. రెండు రోజులలో ఏకంగా 323 మంది సంతకాలతో – ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు అభ్యర్థన పత్రం (మెమోరాండం) సిద్ధమైంది.

అందులో అన్ని పార్టీల వారి సంతకాలున్నాయి. శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి మహానందంతో "రానడే! యావద్దేశం ఈ బృహత్ నిర్మాణాన్ని కోరుకుంటోంది. దీన్ని ఇప్పుడు ఎవ్వరూ ఆపలేరు" అని అభిప్రాయపడ్డారు. ఏక్‌నాథ్ జీ సామర్థ్యాన్ని వేనోళ్ల కొనియాడారు. ఓ సీనియర్ పార్లమెంటు సభ్యుని ద్వారా ఆ అభ్యర్థన పత్రం ప్రధాని నెహ్రూని చేరింది. శ్రీ ఏకనాథ్ రానడే రచించిన యోజన ప్రకారం పత్రికా విలేకర్లు ప్రధాని నెహ్రూని వివేకానంద స్మారకానికి సంబంధించిన విషయాన్ని గురించి ప్రశ్నించారు.

"భక్తవత్సలం గార్ని త్వరలో కలుస్తాను. ఆయనతో మాట్లాడతాను" అన్నారు నెహ్రూజీ. నెహ్రూ గారి ప్రకటన తర్వాత అంతవరకూ వివేకానంద స్మారకం అంటే వ్యతిరేకించే భక్తవత్సలం "వివేకానంద శిలపై చిన్న విగ్రహం ఉంచటానికి అనుమతి ఇస్తున్నాం" అని ప్రకటించారు. ముఖ్యమంత్రి భక్తవత్సలంతో రానడేజీ స్నేహం పెంచుకొన్నారు. ఇక స్మారకం కొలతల విషయంపై ఆంక్షలను జయించే పనిలో పడ్డారు.

"ఓ ఏడుగురు వ్యక్తులు స్మారకానికి సంబంధించిన తుది నిర్ణయం తీసుకొంటారు" అని భక్తవత్సలంగారితో చెప్పారు. ఆ ఏడుగురి పేర్లు విన్నాక మద్రాసు ముఖ్యమంత్రి మారు మాట్లాడలేకపోయారు.

అందులో కంచి పీఠం పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, రామకృష్ణ మిషన్ అధ్యక్షులు గౌరవనీయ శ్రీ మాధవానంద మహరాజ్, ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి, కేంద్ర మంత్రి శ్రీ ఎం.సి. చాగ్లా, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి హుమయూన్ కబీర్ పేర్లు ఉన్నాయి.

పరమాచార్య మాటంటే భక్తవత్సలం గారికి శిలాశాసనమే. ఇక కొలతలు నిలబడతాయా? – అప్పటినుంచి భక్తవత్సలంగారు సమితి కోర్కెలు అన్నీ అడిగిందే తడవుగా తీర్చేవారు.


మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా లభించేది.

ఈ పనికి సమాంతరంగా నిధి సేకరణ పనులను సమర్థవంతంగా నిర్వహించారు.

దానికోసం ఢిల్లీలో 1966 ఆగష్టులో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశ స్థలానికి వెళ్ళి అందరినీ కలిసారు రానడే జీ. రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ సహకరించాయి.

స్మారకం దగ్గర జరుగుతున్న రోజువారీ నిర్మాణ పనులను పరిశీలించటం, సమీక్షించటం, ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయటంతోపాటు జరగాల్సిన పనులు అన్నీ కాలానుగుణంగా జరుగుతున్నాయో లేదో స్వయంగా శ్రీ ఏక్‌నాథ్‌జీ పరిశీలించే వారు.

"ఒక్క రోజు ఆలస్యం అయినా సహించకూడదు" అనేవారు. పని చేసేవారిని ఆప్యాయంగా పలకరించేవారు. స్మారకం కొరకు పని చేసే కార్మికులు అందరికీ




బీమా చేయించారు. వారి భద్రత కోసం అనేక చర్యలను చేపట్టారు.

స్మారక ప్రారంభోత్సవం కోసం యోజన కూడా అద్వితీయంగా చేశారు. స్మారక కేంద్రాన్ని దర్శించటం కోసం ఒక్కో ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యక్తులకు నిర్దిష్టమైన తేదీలు కేటాయించారు.

ఏక్‌నాథ్ జీ దార్శనికతకు, నిర్వహణా కౌశల్యానికి, పథరచనకు, పని జరిపించే నేర్పుకు, ఆయన సౌందర్య దృష్టికి నిదర్శనంగా వివేకానంద శిలాకేంద్రం తయారైంది.

తనకు అప్పగించిన పనిలో కార్య సఫలతను సాధించిన కార్యకర్తగా శ్రీ ఏకనాథ్ జీ రానడే పేరు చిరస్థాయిగా నిలచింది.

1982 ఆగష్టు 22వ తేదీ నాడు పరమపదించేవరకూ ఓ ఆదర్శ కార్యకర్తగా వ్యవహరించారు. ('సేవ–సాధన' అనే పుస్తకంలో వారి ఉపన్యాసాలు స్ఫూర్తినిస్తూనే వున్నాయి.)

ఈ కర్మయోగి శ్రీ ఏకనాథ్‌జీ రానడే జీవిత చరిత్రను పరిశీలిస్తే మరో భగీరథుడుగా కనిపిస్తారు.

నాయకులు, కార్యకర్తలు నేర్చుకోవలసిన ఎన్నో పాఠాలను వీరి జీవితం మనకు అందిస్తుంది.

✦

*Discipline*

## 22. ఆరోగ్యం కాపాడుకోవాలి!

**రాజు (పాలకుడు) నియమిత సమయంలో భోజనం చేయాలి. ఆయన భోజన సమయాలను మార్చకూడదు. రాజు (అధికారి) మత్తు పదార్థాలు సేవించకూడదు. తన చుట్టూ ఉండేవారు కూడా ఇలాంటి పదార్థాలు సేవించకుండా చూడాలి.**

**నా**యకుడు పనుల్లో పడి తీరిక లేక తన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేసే ప్రమాదం ఉంది. సమయానికి తినక పోవటం, ఔషధాలు సమయానికి తీసుకోకపోవటం, వ్యాయామానికి (యోగాభ్యాసానికి) సమయం కేటా యించకపోవటం ప్రమాదకరం. ఇదే హెచ్చరికను మహాభారతంలో నారద మహర్షి ధర్మరాజుకు చేశాడు.

శారీరక, మానసిక ఆరోగ్యం సాధించాలని ఇలా హితవు చెప్పాడు–

శ్లో॥ **కచ్చిచ్ఛారీర మాబాధమ్ ఔషధైర్నియమేన వా।**
**మానసం వృద్ధసేవాభిః సదా పార్థాపకర్షసి॥**

(మహాభారతం, సభాపర్వం, 5/90)

*ఓ ధర్మరాజా! శరీరానికి ఏదైనా అనారోగ్యం వస్తే మందులు సేవిస్తున్నావు కదా! శాస్త్రం విధించిన ఉప వాస వ్రతాలు చేస్తూ (లంఖణం పరమౌషధం) ఆరోగ్యంగా ఉంటున్నావు కదా! పెద్దలను సేవించి మనస్సును సంతోషపరచుకొంటున్నావా?*

**"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం –**
**దేహే సరోగే తు న చార్థసిద్ధిః"**

*"శరీరం ఉంటేనేకదా! ఏ ధర్మకార్యమైనా చేయగలిగేది. ఆ శరీరమే రోగ భూయిష్టం అయితే ఆశయాలు ఎలా సిద్ధిస్తాయి?" అని ప్రశ్నిస్తున్నారు మన ఋషులు.*

అందుకోసం ఆరోగ్య సూత్రాలను ఏర్పాటు చేశారు. వాటిని ఆచరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నది వారి ఆకాంక్ష !

చరక సంహిత, సుశ్రుత సంహిత మొదలగు గ్రంథాలలో ఇటువంటి నియమాలు కనిపిస్తాయి.

ఉదయాన నిద్ర లేచాక చేసే వ్యాయామాలు, యోగాసనాలు, ప్రాణాయామాది ప్రక్రియలు నాయకుడి శరీరాన్ని దృఢంగా (ఫిట్‌గా) ఉంచగలుగుతాయి.

**అన్నం పరబ్రహ్మ స్వరూపం**

నాయకునికి తొలి హెచ్చరిక "శతం విహాయ భోక్తవ్యం".

అంటే వంద పనులున్నా ప్రక్కన పెట్టి సమయానికి భోజనం చేయమని. ఆకలిని ఆపుకోవద్దనే హితవు చెప్పిన వాక్యం అది.

మనం తినే ఆహారం విషయాలలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఆయుర్వేద గ్రంథాలలో ఇలా చెప్పారు.

శ్లో॥ **సుఖముచ్చైః సమాసీనః సమదేహోన్నతత్పరః**
**కాలే సామ్యం లఘు స్నిగ్ధం, క్షిప్రముష్ణం ద్రవోత్తరమ్ ।**
**బుభుక్షితోన్నఽమశ్నీయాత్, మాత్రావద్విగతాగమః**
**కాలే భుక్తం ప్రీణయతి సామ్యమన్నం న బాధతే ॥**

*– సుశ్రుత సంహిత 46–464*

*ఎత్తయిన పీటమీద, సుఖంగా కూర్చొని, సరైన సమయానికి ఆకలిని బట్టి తేలికైన, నేయితో కూడిన, వేడి అన్నాన్ని తినాలి. (ఘన పదార్థాలు ఆదిలో తినాలి. చారు, మజ్జిగ మొదలగు ద్రవపదార్థాలు చివరిలో తినాలి.)*

ఆకలి ఉన్నప్పుడే తినాలి. మితంగా, సులభంగా జీర్ణమయ్యేవి, సకాలంలో, శీఘ్రంగా తినాలి.

"అజల్పన్, అ హసన్ తన్మనా భుంజీథ" (చరకం) – అనవసర విషయాలు వాగకుండా, నవ్వకుండా, మనస్సు పెట్టి తినమని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది.

## వ్యాయామం

**వ్యా**యామం అతిగా చేయటం మంచిది కాదు. అలాగని పూర్తిగా మానడం కూడా మంచిది కాదు. శరీరానికి అలసట కలగక, ఉత్సాహంగా ఉన్నంతవరకు, నిత్యం సూర్య నమస్కారాలు చేయటం మంచి వ్యాయామం. ముఖ్యంగా మన ఆహారానికి తగినట్లుగా వ్యాయామం చేయటం అవసరం. వ్యాయామం ఎక్కువగా చేసి ఆహారం అల్పంగానో, నియమం పాటించ కుండానో తీసుకుంటే శరీరానికి మంచిది కాదు. అందుచేత సూర్య నమస్కారాలు ఎన్ని చేయాలనేది ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

**"జుగుప్సిత కథానైవ శృణుయాదపి వా వదేత్"** భోజన సమయంలో అసహ్య కరమైన కథాప్రసంగాలు చేయటం, వినడం కూడదని ఋషి శాసనం.

గత దశాబ్దికాలంలో ఎందరో ఉత్తమ నాయకులను దేశం కోల్పోయింది. వీరి అకాల మరణాలకు కారణం తమ ఆరోగ్యంపై అశ్రద్ధ అంటున్నారు విశ్లేషకులు. నాయకులు తప్పక తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. ✦

### ఆరోగ్యం కోసం ధ్యానం చేసే వారికి గీత చెప్పిన నియమాలు.

**శ్లో॥ నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్తమనశ్నతః ।**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥**

(భగవద్గీత 6/16)

*అర్జునా! అధికం ఆహారం తినే వారికి యోగం కుదరదు. పూర్తిగా ఏమీ ఆహారం తీసుకొనని వానికీ యోగం కుదరదు. ఎక్కువగా నిద్రపోయే వానికి యోగం కుదరదు. నిద్ర లేనివానికి యోగం కుదరదు.*

**శ్లో॥ యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥**

(భగవద్గీత 6/17)

*మితమైన ఆహారం, నడత కలవానికి, తగు విధంగా పనులు చేసే వానికీ, తగు విధంగా నిద్రించే వానికీ, మేల్కొనే వానికీ దుఃఖాన్ని పోగొట్టే యోగం లభిస్తుంది.*

Ethics & Values

## 23. రామరాజ్యం

> **ఆదర్శ పాలనకి రామరాజ్యాన్ని ఉదహరించటం పరిపాటి. శ్రీరాముడు పాలన ఎంత లోకప్రియమో ధర్మరాజు పాలన కూడా అంతే! "ధర్మరాజు ఏ రాజ్యంలో ఉంటే ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది" అన్నాడు భీష్ముడు.**

**చ**క్రవర్తులు ఎందరో పాలించిన పవిత్రభూమి 'భారతదేశం'. ఆ చక్రవర్తులు, రాజులు ఆదర్శమైన పాలన అందించారు.

వీరి ప్రజారంజక పాలనకి ఆదర్శం 'ధర్మం'. రాజ పురోహితులు వారికి నిరంతరం మార్గదర్శనం చేశారు. ధర్మ, అర్థ, కామాలను ఏ విధంగా అనుసరిస్తూ ఉండా లన్న విషయమై వారి పర్యవేక్షణ, మార్గదర్శనం ఆనాటి పాలకులకు నిరంతరం లభించేవి!

ప్రజాసేవయే ప్రథమం (People first)అనేది పూర్వ కాలంలో రాజులు నేర్చుకొన్న ప్రథమ పాఠం! ప్రజలకు పెద్దపీట అనే పాఠాన్ని జీర్ణించుకొని పాలన సాగిం చారు కాబట్టే, భారతీయ రాజులు ప్రజలను కన్నతండ్రి వలె పాలించారని అనేక గ్రంథాలలో చదువుతున్నాం.

**"ప్రవర్తతాం ప్రకృతిహితాయ పార్థివః"** (రాజులు ప్రజాహితకర కార్యములనే చేయుదురుగాక!) అని ఆశీస్సులందించారు కవులు. ధర్మంతో పాలించినవారు ఉత్తమలోకాలను, పుణ్యలోకాలను పొందుతారని పంచమవేదమైన మహాభారతం చెబుతోంది.

**రామరాజ్యం ఎలా ఉండేది?**

రామరాజ్యం ఆదర్శ పాలనకు ప్రతీకగా చెప్తారు. పాలకులందరికీ లక్ష్యం రామరాజ్య స్థాపన! ధర్మానుసార పాలనకు ఉదాహరణ!

✦ శ్రీరాముడు రాజ్యం చేస్తున్నప్పుడు ప్రజలకు మనోవ్యథలు లేవు. రోగాలు లేవు.
✦ అధర్మం అనే మాట రాముని పాలనలో లేదు.
✦ ప్రజలంతా ఒకరినొకరు రక్షించుకొనే సంయమనం పాటించేవారు.
✦ లోకంలో దొంగతనాలు లేవు.
✦ ఎవ్వరికీ ఏ అనర్థం కలుగలేదు.
✦ ఎవరికీ కూడా అకాల మరణాలు లేవు.
✦ ప్రజలకు వ్యాధుల భయం లేదు.
✦ ప్రజలకు క్రూర జంతువుల భయం లేదు.

**ద్వాపరంలోని రామరాజ్యం**

ఆదర్శపాలనకి రామరాజ్యాన్ని ఉదహరించటం పరిపాటి. శ్రీరాముడు పాలన ఎంత లోకప్రియమో ధర్మరాజు పాలన కూడా అంతే!

"ధర్మరాజు ఏ రాజ్యంలో ఉంటే ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది" అన్నాడు భీష్ముడు. ధర్మరాజు భార్య ద్రౌపదితోనూ, తమ్ముళ్లతోనూ అజ్ఞాతవాసాన్ని విరాటుని కొలువులో గడిపాడు. (అంతకుముందు అరణ్యవాసంలో ఉన్నప్పుడు ధర్మరాజు యక్షుని ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పి, 'అజ్ఞాతవాసంలో ఎవ్వరూ గుర్తు పట్టబోరు' అనే గొప్ప వరాన్ని యమధర్మరాజు ద్వారా పొందాడు.)

అసూయాగ్రస్తుడైన దుర్యోధనుడు, ఎలాగైనా పాండవుల అజ్ఞాతవాసం భగ్నం చేయాలనుకొంటూ, రకరకాల కుట్రలు చేస్తూ ఉన్నాడు. ఆ సభలో భీష్ముడు, యుధిష్ఠిరుని గొప్పతనాన్ని గురించి చాలాసేపు ప్రసంగించాడు.

**ధర్మజుని శ్రేష్ఠత్వం గురించి తెలియజేసిన విషయాలు :**

1. ధర్మరాజు నివసిస్తున్న నగరంలోగాని, గ్రామంలో గానీ అక్కడి పాలకులకు అశుభం కలగదు.
2. ఆ ప్రజలకు సహజంగానే మంచి లక్షణాలైన దానశీలం, ప్రియవాదిత్వం,

జితేంద్రియత్వం, ఔదార్యం, వినయం, లజ్జ, శీలం మొదలైన గుణాలు అలవడతాయి.

3. స్వయంగా ధర్మతత్పరులై , ఈర్ష్యాసూయలు లేక ఆనందంగా మెలిగే పౌరులు ఉంటారు.
4. ధర్మరాజున్న రాజ్యంలో భూమి సస్యశ్యామలంగా, క్షోభరహితంగా ఉండి మంచి పంటలు పండుతాయి. మంచిరుచికరమైన పళ్లు పండుతాయి.
5. అక్కడ గోసంపద అధికంగా ఉంటుంది. పశువులు ఆరోగ్యంగా ఉంటాయి.
6. పాండవులెక్కడ నివసిస్తారో, ఆ దేశంలో అకాల మరణాలుండవు.
7. ధర్మరాజున్నచోట సత్యమే పలికేవారు, దానంపై ఆసక్తి ఉన్నవారు, ధర్మాసక్తులైన పౌరులు ఉంటారు.

**కలియుగంలో రామరాజ్యం**

ఏనాటి నుంచో రామరాజ్యం గురించి వింటూ వస్తున్నాం. భగవాన్ శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పిన భగవద్గీతలో ఆదర్శ సుపరిపాలన సారరూపంలో ఇమిడి ఉంది. వీటి సాయంతో మనం తప్పొప్పులను, న్యాయాన్యాయాలను, నైతిక, అనైతికాలను గుర్తించవచ్చు. తన ప్రజల సమగ్రాభివృద్ధిలోనే పాలకుడి సామర్థ్యం ఉంటుందని చాణక్యుడు కూడా తన అర్థ శాస్త్రంలో పేర్కొన్నారు.

ఈ భావాలను శివాజీ అమలు చేసిన తీరు ఆచరణీయం, అనుసరణీయం, ఆయన వ్యక్తిత్వంలో గొప్ప పాలకుడి లక్షణాలన్నీ కలగలిసి ఉన్నాయి. ఆ వ్యక్తిత్వమే ప్రజలకు పరాయి పాలకుల నుంచి స్వాతంత్ర్యాన్ని అందించేలా ప్రేరణ ఇచ్చింది. అతని అనుచరులకు శత్రువులతో పోరాడే సామర్థ్యాన్ని ఇచ్చింది.

అదే సమయంలో శివాజీ తన ప్రజల సంక్షేమానికి కూడా పెద్దపీట వేశాడు. ఆయన ఎంత నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేశారంటే తన రాజ్యంలోని వనరులన్నిటినీ ప్రజలకు అంకితం చేశాడు. శివాజీకి అలాంటి రామరాజ్య ప్రేరణని ఇచ్చినవాడు అతని ఆధ్యాత్మిక గురువైన–హనుమదుపాసకుడు సమర్థ రామదాసు.

అందుకే ఆయన నిజమైన ప్రజానేతగా వాసి గాంచాడు. ✦

Ethics & Values

## 24. 'సన్' స్ట్రోక్

చందమామ కథల్లో ప్రజలను పీడించే రాజుగారి బామ్మర్ది గురించి చదివాం. వర్తమానంలో కూడా అనధికారంగా అధికారం చలాయించే ముఖ్యమంత్రి కొడుకు, అల్లుడు, భార్య, కుమార్తె... ఇలా ఎందరో స్వతంత్ర భారతదేశంలోని 'ప్రజాస్వామ్య' పాలనలో అవినీతిని పెంచి పోషించారు.

ప్రధానిగా ఉండిన సమయంలో ఇందిరాగాంధీ 1975, జూన్ 26 తేదీన అత్యవసర పరిస్థితి (ఎమర్జన్సీ) ప్రకటించింది. ఆ తరువాత రెండేళ్లపాటు 1977 మార్చి 21 వరకూ దేశంలో చీకటి రోజులు నడిచాయి. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు కారా గారాల్లో (జైళ్లలో) నిర్బంధానికి గురి అయ్యారు.

ఆ సమయంలో.. ఏవిధమైన రాజ్యాంగ బాధ్యత లేని ఓ యువకుడు, దేశంలో నానా ఆగడాలు చేశాడు. పోలీసు అధికారిగా, న్యాయమూర్తిగా, ప్రధానికే ప్రధాన సలహాదారుడుగా ప్రవర్తించాడు. రాష్ట్రపతిని రబ్బరు స్టాంపుగా చేశాడు. బలవంతపు కుటుంబ నియంత్ర ణలతో ప్రధానమంత్రికి, ప్రభుత్వానికి తలవంపులు తెచ్చాడు. ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తెచ్చిపెట్టాడు.

1977లో లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయానికి కారకుడయ్యాడు. అతనే సంజయ్‌గాంధీ – ఇందిరాగాంధీగారి కుమారుడు.

✦✦✦

చందమామ కథల్లో ప్రజలను పీడించే రాజుగారి బామ్మర్ది గురించి చదివాం. వర్తమానంలో కూడా అనధికారంగా అధికారం చలాయించే ముఖ్యమంత్రి కొడుకు, ముఖ్యమంత్రి అల్లుడు, ముఖ్యమంత్రి భార్య, మంత్రి కుమార్తె... ఇలా ఎందరో స్వతంత్ర భారతదేశంలోని 'ప్రజాస్వామ్య' పాలనలో అవినీతిని పెంచి పోషించారు. చరిత్రలో కుమారఘాతం –'సన్ స్ట్రోక్' – తగిలిన ధృతరాష్ట్రుడు చివరికి భారీ మూల్యాన్నే చెల్లించుకోవలసి వచ్చింది.

దుర్యోధనుడు జన్మిస్తూనే నక్కలా అరిచాడు (ఏడిచాడు). ఎన్నో అపశకునాలు కనిపించాయి. గాడిదలు, గ్రద్దలు, నక్కలు, పిల్లవాడితో కలసి మళ్లీ అరిచాయి.

ప్రకృతి శోకించింది. రాబోయే ఆపదను హెచ్చరించింది ప్రకృతి మాత. జ్యోతిష శాస్త్రవేత్తలు, విదురుడు భవిష్యత్తును దర్శించి చెప్పారు.

"ఈ బాలుడు వంశ నాశకుడు. ఇతనిని వదిలిపెట్టేస్తే మంచిది" అని సలహా చెప్పారు. ధృతరాష్ట్రునికి పుత్రవ్యామోహం అడ్డు వచ్చింది. తండ్రి రాజ్యకాంక్ష, తల్లి అసూయ కలసి పెరిగాడు. తోక, కుక్కను ఊపిన సామెత మాదిరి ఈ కుపుత్రుడు ధృతరాష్ట్రుని నడిపించాడు (ఆత్మహత్య బెదిరింపుతో). కురు వంశ నాశనానికి కారణం అయ్యాడు.

శ్లో॥ **త్యజేదేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్ ।**
**గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ ॥**

(ఆదిపర్వం, 114–38)

*ఒక వ్యక్తి స్వార్థానికి, కుటుంబ హితానికి మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు కుటుంబ శ్రేయస్సుకోసం ఆ వ్యక్తిని దూరం చెయ్యాలి. కుటుంబహితానికి, గ్రామహితానికి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు, గ్రామంకోసం కుటుంబాన్ని త్యాగం చెయ్యాలి. గ్రామానికి, విస్తృత సమాజానికీ మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు, సమాజంకోసం గ్రామాన్ని వదిలిపెట్టాలి. మోక్ష సాధనకు అడ్డు తగిలే భౌతికమైన ప్రతిదాన్నీ త్యజించాలి.*

నాయకునికి తలనొప్పులలో ముఖ్యమైనది బంధుగణంతో వస్తుంది. 2014వ సంవత్సరంలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాక తన తొలి మంత్రివర్గ సమావేశంలోనే మంత్రులందర్నీ హెచ్చరించారు.

"మీ ఆఫీసుల్లో, బంధువుల్ని, స్నేహితుల్ని పొరబాటునకూడా చేరనివ్వకండి" అని. నాయకుని పేరు ఉపయోగించి పెత్తనం చలాయించే వారితో జాగ్రత్తగా వ్యవహరించాలి అని మన ఋషులు ఎన్నడో హెచ్చరించారు.

ధర్మరాజును నారదమహర్షి ఈ విధంగా ప్రశ్నించాడు.

శ్లో॥ **కచ్చిన్న చౌరైర్లుబ్ధైర్వా కుమారైః స్త్రీబలేన వా ।**
**త్వయా వా పీడ్యతే రాష్ట్రం కచ్చిత్ తుష్టా కృషీవలాః ॥**

(మహాభారతం, సభాపర్వం - 5/77)

*దొంగల వల్లకానీ, ధనాశ గలవారి వల్లకానీ, నీ కుమారుల వల్లకానీ, బంధువులు, రాజస్త్రీల వల్లగానీ, నీవల్ల గానీ దేశానికి ఎటువంటి బాధ కలగటం లేదు కదా! నీ రాజ్యంలో వ్యవసాయదారులు సంతోషంగా ఉంటున్నారా?*

బెల్లం చుట్టూ ఈగలు మూగినట్లుగా, అధికారంలో వున్న వ్యక్తి చుట్టూ స్వార్థపరులు చేరుతారు. ఈ రాబందులు తన పేరు చెప్పుకొని 'వసూళ్ల సేవ' చేస్తున్నారని (X-tax వసూలు చేస్తున్నారని) 'రాజు' గారికి అంత సులభంగా తెలియదు. ఇలా ప్రజలను పీడిస్తున్న వాళ్లెవరో తెలుసుకోవాలి. తెలిశాక, ఉపేక్ష చేయకుండా వారికి 'తగిన స్థానాన్ని' చూపించాలి–అంటే తగిన దండన విధించాలి.

✦

### బంధువులను దూరంగా పెట్టడం

**రా**జు తన బంధువులు, సంబంధితులను కోట నిర్వహణ, పరిపాలన బాధ్యతలో నియమించరాదు. వారిని నియమించాలని సిఫార్సులు వచ్చినా వారిని దూరంగా ఉంచాలి. ఎందుకంటే వారు తప్పులు చేసినట్టయితే రాజు వారిని శిక్షించే విషయంలో తటపటాయించవలసి వస్తుంది. వారిని ఒకవేళ శిక్షించకపోతే మిగతా వారు కూడా ఈ అయోమయ స్థితి నుంచి లబ్ధి పొందుతారు. ఇది శాంతి భద్రతల పరిస్థితిని దెబ్బతీస్తుంది. ఇది చివరికి రాజు, రాజ్యం పతనమయ్యే పరిస్థితికి దారి తీస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదేశాలను పాటించే విషయంలో ఎలాంటి మినహాయింపులు, రాయితీలు ఉండకూడదు.

రాజ్యంలోని కోటలే ఆ రాజ్య రక్షణకు ప్రధాన సాధనాలు.

*(శివాజీ సన్నిహిత సహచరుడు శ్రీ రామచంద్ర పంథ్ రూపొందించిన రాజశాసనం)*

*Time Management*

## 25. బంగారు గంట

**అందంగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని అందరికీ ఉంటుంది. కానీ... అందుకు కావలసిన ఆచరణ కూడా ఉండాలి కదా! అర్థరాత్రి ఆహారం తినటం, తేదీ మారాక గానీ నిద్రపోకపోవటం, ఆలస్యంగా లేవటం ఆరోగ్యానికి మంచిది కాదు.**

**స**ంస్కృత భాష అభ్యసించాలని ఉందా?

సంగీతసాధన చేయాలని ఉందా?

మీ అభిమాన రచయిత వ్రాసిన గ్రంథం చదవాలని ఉందా?

మీరు ఇవ్వబోయే ఉపన్యాసాలకు మెరుగు దిద్దుకోవాలని ఉందా?

ప్రమోషన్ పరీక్షలకు సీరియస్‌గా తయారవ్వాలని ఉందా?

కరస్పాండెన్స్ కోర్సుద్వారా పీ.జీ. చేయాలని ఉందా?

నిన్న చెప్పిన పాఠం నెమరు వేసుకోవాలని ఉందా?

ఈవేళ మీరు పాఠశాలలో చెప్పాల్సిన పాఠానికై తయారవ్వాలా?.... వీటన్నిటికీ... మనందరి దగ్గర ఉన్న జవాబు... "అవునండీ. కానీ... సమయం లేదు!" అని కదా!... దానికి ఉన్న ఒకే ఒక పరిష్కారం పొద్దున్నే మేలుకోవటం! ఎందుకంటే? సూర్యోదయానికి కనీసం గంటన్నర ముందు–అంటే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేచినట్లయితే ఎంతో ప్రశాంతంగా ధ్యానం చేసుకోవచ్చు.

పొద్దున్నే లేవటం ఆరోగ్య చిహ్నం....పొద్దున్నే లేవటం తెలివైనవారి లక్షణం... పొద్దున్నే లేవటం మీ జీవితాన్నే మార్చేస్తుంది...పొద్దున్నే లేవటం మీ ఆరోగ్యాన్ని దార్లో పెడుతుంది... మీరో వ్యాపారవేత్త అయితే... లాభాలు, విజయాలు మీ సొంతం.

ఆయుర్వేద గ్రంథం అయిన చరక సంహితలో ఈ "స్వర్ణ సమయం" గురించిన విషయాన్ని ఇలా చెప్పారు.

శ్లో॥ **బ్రాహ్మే ముహూర్తే ఉత్తిష్ఠేత్ స్వస్థో రక్షార్థమాయుషః ।**
**శరీరచింతాం నిర్వర్త్య కృతశౌచవిధిస్తతః ॥**

(అష్టాంగ హృదయం, సూత్రస్థానం 2/1)

*బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రనుండి మేల్కొని ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి. శరీర చింతలను పోగొట్టుకొని శుచిగా తయారవ్వాలి.*

బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేచిన వాళ్లు ఏం సాధించకుండా ఉండగలరు?

వేకువఝామున నిద్రలేచి, జీవితాన్ని విజయ పథంలోకి తిప్పుకున్న ప్రముఖు లెందరో ఉన్నారు. ఎనిమిదికో, తొమ్మిదికో లేచి, జిమ్ములో రెండు గంటలు గడిపే కన్నా.... సూర్యోదయానికి ముందు నిద్రలేచి వ్యాయామం చేయటం శ్రేయస్కరం!

మన కుటుంబాలలో వయోవృద్ధుల జీవన శైలిని గమనించండి!

ఎప్పుడు పడుకుంటారు? ఎప్పుడు లేస్తారు? రాత్రి తొందరగా నిద్రపోవటం, వేకువనే నిద్ర లేవటం (Early to bed Early to rise) వారి ఆరోగ్య రహస్యం. రోగ నిరోధక శక్తి పెరగటానికి ముఖ్య కారణం అదే అంటోంది వైద్యశాస్త్రం. ప్రసిద్ధులైన ఎందరో వ్యక్తుల సమయసారిణి చాలా క్రమబద్ధంగా ఉంటోంది.

ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారతరత్న పురస్కార గ్రహీత డా॥ మోక్షగుండం విశ్వేశ్వరయ్య (1860 – 1962) వంద సంవత్సరాలు పైగా జీవించారు. పాతిక సంవత్సరా లప్పుడు ఎలాంటి సమయసారిణి అనుసరించేవారో, తొమ్మిదవ దశకంలో కూడా అలాగే అనుసరించేవారు. అందంగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని అందరికీ ఉంటుంది. కానీ అందుకు కావలసిన ఆచరణ కూడా ఉండాలి కదా! అర్ధరాత్రి ఆహారం తినటం, తేదీ మారాక గానీ నిద్రపోకపోవటం, ఆలస్యంగా లేవటం ఆరోగ్యానికి మంచిది కాదు.

**విజయాన్ని కోరుకొనేవారు సమయాన్ని సంపాదించుకోవాలి! ఎలా?**

సమయ సంపాదనకి ఓ చిట్కా ఉందంటారు కెనడాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత రచయిత రాబిన్ శర్మ. ఆయన వ్రాసిన 'ద ఫైవ్ ఏఎమ్ క్లబ్ (The 5 AM Club.. Own Your Morning. Elevate Your Life) పుస్తకంలో.

ఈ పుస్తకం వేలాది కాపీలు అమ్ముడవుతోంది. ఎందరికో స్ఫూర్తినిచ్చింది! ప్రసిద్ధి చెందిన ఆటగాళ్లు, సినిమా నటీనటులు, వ్యాపారవేత్తలు ఈ పుస్తకాన్ని మెచ్చుకున్నారు.

**ఇంతకీ ఆయన చెప్పిన చిట్కా ఏమిటి?**

"పొద్దున్నే ఒక గంట ముందు లేచి మీ దినచర్యను ప్రారంభించండి".

'5 ఏఎమ్' క్లబ్‌లో చేరండి అనే సందేశం ఇస్తుంది ఆ పుస్తకం.

ప్రొద్దునే ఏం చేయాలో అని కొందరికి అనుమానం వస్తుంది.

ఏం చేయలేము? అన్నది అనుభవజ్ఞుల ప్రశ్న.

"మీరు కలలు కంటున్న లక్ష్యాలను చేరాలంటే ఒక గంట దానికోసం వెచ్చిస్తే సాధిస్తావ్" అంటారు రచయిత రాబిన్ శర్మ. దీనినే గోల్డెన్ అవర్ (సువర్ణ కాలం) అంటారు. ఒక్క గంట ముందు లేచి మీకున్న ముఖ్య పనులకోసం ఆ గంటను కేటాయించండి. అప్పుడు మీ జీవితం ఎంత తృప్తిగా ఉంటుందో మీరే గమనించండి. అందుకోసం పెందరాళే పడుకొని బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేచి ఆయువుని, ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి అని మన భారతీయ ఋషులు ప్రవచించారు. (బ్రాహ్మీ ముహూర్తం అంటే తెల్లవారుఝామున 4-5 గంటల మధ్య).

✦✦✦

మహాభారతంలో ధర్మరాజుకు సదాచార వ్రతాన్ని బోధిస్తూ భీష్ముడు ఏమేమి ఆచరిస్తే మానవుడు ఆరోగ్యవంతుడు కాగలడో వివరిస్తూ సూర్యోదయానికి పూర్వమే నిద్ర లేవడానికి ఉన్న ప్రాముఖ్యతను ఇలా వివరించాడు.

శ్లో॥ **బ్రాహ్మీ ముహూర్తే బుధ్యేత ధర్మార్థౌ చాఽనుచింతయేత్ ।**
**ఉత్థాయాచమ్య తిష్ఠేత పూర్వాం సంధ్యాం కృతాంజలిః ॥**

(మహాభారతం-అనుశాసనిక పర్వం 104-116)

*బ్రాహ్మీముహూర్తంలో నిద్ర లేవాలి. చేయవలసిన పనులను గురించి ఆలో*

*బ్రాహ్మీ ముహూర్తంలో వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. చెవులకింపయిన పక్షుల కిలకిలా రావాలు తప్ప శబ్ద కాలుష్యం ఉండదు. మలయమారుతం - చల్లని గాలి వీస్తూ ఉంటుంది. రాత్రి సుఖంగా నిద్రించి, సరిపడ విశ్రాంతి తీసుకొని లేచినవారికి మనస్సుకు, శరీరానికి బలం చేకూరుతుంది. ఆ సమయంలో ఎవరూ ఆటంకపరచరు కాబట్టి ఆ రోజు చేయవలసిన పనులను గురించిన ఆలోచన చేయటంలో గానీ, ధ్యానంలో గానీ గడపవచ్చు. ఒక మంచి లక్ష్యం కోసం పనిచేస్తున్న వారు, ఆధ్యాత్మిక రంగంలో పురోగమించే కాంక్ష ఉన్నవారు ఈ ప్రశాంతతను బాగా ఉపయోగించుకోవచ్చు. రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి కావలసిన శక్తి ఇలాగే లభిస్తుంది.*

*సోమరితనం వల్లనో, అతినిద్ర వల్లనో, సూర్యోదయం తరువాత నిద్ర లేచేవాళ్ళు ఈ సుందర దృశ్యాన్ని చూడలేకపోతారు. ఈ ప్రయోజనాలను పొందలేకపోతారు.*

*చించాలి. పక్క మీద నుండి లేచి, కొంచెం నీళ్ళు తాగి, చేతులు జోడించి నమస్కరించి తన పనులకు ఉపక్రమించాలి.*

పాలకుడు ఒక రోజు ఎలా గడపాలోనన్న విషయాన్ని నారద మహర్షి ధర్మరాజుకు బోధన ఇలా చేశాడు.

శ్లో॥ **క్వచ్చిద్ద్వౌ పథమౌ యామౌ రాత్రేః సుప్త్వా విశాంపతే ।**
**సంచితయసి ధర్మార్థౌ యామ ఉత్థాయ పశ్చిమే ॥**

(శ్రీమహాభారతం, సభాపర్వం, 5/86)

*ఓ రాజా! నీవు రాత్రిళ్లు మొదటి జాములోను (యామం), రెండవ జాములోను బాగా నిద్రపోయి, చివరి యామంలో నిద్రనుండి మేలుకొని ధర్మార్థాల గురించి ఆలోచిస్తున్నావా?*

శ్లో॥ **కచ్చిదర్థయసే నిత్యం మనుష్యాన్ సమలం కృతః ।**
**ఉత్థాయ కాలే కాలజ్ఞైః సహ పాండవ మంత్రిభిః ॥**

(శ్రీమహాభారతం, సభాపర్వం 5/87)

*పాండు నందనా! నీవు ప్రతిరోజు ప్రభాత కాలంలోనే నిద్ర నుంచి మేలుకొని, తయారయ్యి, దేశకాలాలకు అనుగుణంగా మంత్రులతో కూర్చొని నీ దర్శనం కోసం వచ్చిన పౌరులను కలిసి, వాళ్ల కోర్కెలను నెరవేరుస్తున్నావా?* ✦

*Discipline*

## 26. నిద్రను జోకొడితేనే...

> విజ్ఞుడైన నాయకుడు శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో అంతసేపే నిద్ర పోతాడు. వివేకం లేనివాడు నిద్రకు బానిసైపోతాడు. అలాంటివాళ్లు నాయకులుగా దీర్ఘకాలం మనలేరు.

క్రీ.శ. 1997 సంవత్సరం నాటి మాట. ఆ కాలంలో పార్లమెంటులో చాలా ముఖ్యమైన విషయంపై చర్చ జరుగుతోంది. దేశాన్నేలుతుండిన ప్రధాని నిద్రపోతున్న దృశ్యం అందరి కళ్లల్లో పడింది. ఇలా కునికిపాట్లు పడుతుండే నాయకులను లోకం యద్దేవా చేస్తుంది.

మరో ఘటన..రాత్రివేళలో ఆపద వచ్చిన ఓ పౌరుడు సహాయం కోసం స్థానిక నాయకుడికి సూర్యోదయం దాకా వేచి ఉండి ఫోన్ చేశాడు. నాయకుడు నిద్ర పోతూనే ఉన్నాడు. మళ్లీ తొమ్మిది గంటలకు ఫోన్ చేస్తే... 'నిద్ర పోతున్నాడని' కుటుంబసభ్యులు జవాబు చెప్పారు. మళ్లీ పది గంటలకు చేసినా అదే పరిస్థితి!

నిద్ర ఎంతైనా అవసరం. అయినా నాయకుడు నిద్రకు వశుడు కాకూడదు. పొద్దుపోగానే భోజనాదులు పూర్తి చేసుకొని, అర్ధరాత్రి వరకు మేలుకొని ఉండ కుండా పెందరాళే పడుకోవాలి, ఉదయం పెందరాళే నిద్రలేవాలి.

రాజకీయ క్షేత్రంలో ఎదగాలనుకొన్న వ్యక్తి సూర్యుడి కన్నా ముందే లేచి, తయారయ్యే అలవాటు చేసు

కోవాలి. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఏ క్షణంలోనైనా అవసరం ఉన్నవారు, ఆర్తులైనవారు తనను సంప్రదించవచ్చుననే విశ్వాసాన్ని నాయకుడు ప్రజలకు కలిగించాలి. నియోజకవర్గంలో ఎవరికైనా ఏదైనా సమస్య ఉత్పన్నమైతే "మైహూఁన" (నేనున్నానుగా) అని ఓదార్చడానికి ఉరికేవాడే నిజమైన నాయకుడు.

లోకం లేవకముందే లేచి 'సదా మీ సేవలో' అంటూ మా నాయకుడు ఉంటారనే పేరును తెచ్చుకోవాలి. కాలకృత్యాలు, పూజాపునస్కారాలు ముగించుకొని సిద్ధంగా ఉండాలంటే రాత్రి త్వరగా నిద్రపోవాలి.

నిద్రకు బానిస కావద్దని శ్రీరామచంద్రుడు భరతునితో ఇలా అన్నాడు.

శ్లో॥ **కచ్చిన్నిద్రావశం నైషీః కచ్చిత్కాలే ప్రబుధ్యసే ।**
**కచ్చిచ్చాఽపరరాత్రేషు చింతయస్యర్థనైపుణమ్ ॥**

(రామాయణం, అయోధ్యా కాండ – 100/17)

*నీవు నిద్రకు వశుడవు అవటం లేదుకదా! సరియైన కాలంలో మేల్కొంటున్నావు కదా! చేయాల్సిన పనులను గురించి తెల్లవారు జామున ఆలోచిస్తున్నావు కదా!*

పెందరాళే నిద్ర లేచినవాళ్లు ఎన్నో పనులు చేసుకోవచ్చు. ప్రకృతి ప్రశాంతంగా వున్న సమయంలో లేచి, ఆ రోజుకి చేయాల్సిన పనులు, వాటిలో ముఖ్యమైనవి, ముందు చేయాల్సినవి ఓ జాబితాగా రాసుకుంటే పని సులభమవుతుంది.

తెలుగువారి అభిమాన నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, సినిమా పరిశ్రమలో ఉన్నప్పటినుంచి, బ్రాహ్మీ ముహూర్తం కన్నా ముందే లేచేవారని ప్రసిద్ధి. అదే అలవాటు వారు ముఖ్యమంత్రి అయ్యాక కూడా కొనసాగింది. అధికారులు ఆశ్చర్యపోయేలా వారు తెల్లవారు జామున నాలుగు గంటలకే తయారయ్యి కూర్చునేవారట. పాలనా సంబంధమైన చర్చలు, నిర్ణయాలు అన్నీ ఆ సమయంలో జరిగేవట.

విజ్ఞుడైన నాయకుడు శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో అంతసేపే నిద్ర పోతాడు. వివేకం లేనివాడు నిద్రకు బానిసైపోతాడు. అలాంటివాళ్లు నాయకులుగా దీర్ఘకాలం మనలేరు. అతినిద్ర బద్ధకాన్ని పెంచుతుంది. అతినిద్ర ఆలోచనలలో చురుకుతనాన్ని, వాడిని తగ్గిస్తుంది. అతినిద్ర అభిమానుల్ని దూరం చేస్తుంది.

✦

*Ethics & Values*

## 27. నాయకునికి గీతాపాఠం

**భగవద్గీతలో పదహారవ అధ్యాయంలో తొలి మూడు శ్లోకాలు ఉత్తమ నాయకునిగా తనను తాను మలచుకునేందుకు ప్రేరణ ఇచ్చేవి. ఇందులో భగవంతుడు అందించిన ఇరవై ఆరు ఉత్తమ లక్షణాలు మానవులందరికి ఉండతగినవి.**

శ్రీమద్భగవద్గీతలోని భిన్నభిన్న అధ్యాయాలలో గీతా చార్యులు ఉపదేశించిన అనేక విషయాలు సంస్కార వికాస పాఠాలుగా ఎందరో ఆధునిక మేధావులు వర్ణిస్తున్నారు.

మనస్సును నిగ్రహించుకునే చిట్కాలు, కార్యసాధనకై విజయ రహస్యాలు, నిత్య జీవితంలో వచ్చే సమస్యలకు పరిష్కారాలు, యువతను దారిలో పెట్టే పద్ధతులు, వారిలో ఆత్మ స్థైర్యాన్ని, క్రమశిక్షణను పెంచే సాధనాలు ఎన్నో భగవద్గీతలో ఉన్నాయి.

"గీతలోని ప్రతీ శ్లోకము కూడా ఒక మహామంత్రమే" అంటారు పెద్దలు. కొన్ని శ్లోకాలు నిత్యం అను సంధానం చేసుకొని తమతమ నాయకత్వ లక్షణాలకి మెరుగు దిద్దుకోవటానికి ఉపయోగించేవి.

పదహారవ అధ్యాయంలో తొలి మూడు శ్లోకాలు ఉత్తమ నాయకునిగా తనను తాను మలచుకునేందుకు ప్రేరణ ఇచ్చేవి.

ఇందులో భగవంతుడు అందించిన ఇరవై ఆరు ఉత్తమ లక్షణాలు మానవులందరికి ఉండతగినవి.

మనందరం ప్రయత్న పూర్వకంగా అలవర్చుకొని, అనుసరించతగినవి. ముఖ్యంగా ఉన్నత బాధ్యతలున్న వ్యక్తులకు ఒక కార్యసూచి (చెక్‌లిస్టు) వంటిది. స్వయం నియంత్రణ కలిగించేవి.

శ్లో॥ **అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥**

శ్లో॥ **అహింసా సత్యమక్రోధః త్యాగశ్శాన్తిరపైశునమ్ ।**
**దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥**

శ్లో॥ **తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా ।**
**భవన్తి సమ్పదం దైవీమభిజాతస్య భారత ॥** (భగవద్గీత 16/1,2,3)

1. *తాను ధైర్యంతో ఉండి, అనుచరులకు అభయమివ్వటం.*
2. *సత్వగుణం కలిగి ఉండటం.*
3. *ధర్మజ్ఞానం కలిగి ఉండటం, సమాజాన్ని ధర్మపథంలో నడిపించడం.*
4. *యోగ్యులైన వారికి తప్పని సరిగా, అవసరమైన సహాయం అందించటం.*
5. *స్వార్థపరమైన కోరికలను నిగ్రహించుకోవటం.*
6. *విధిగా పూజాదికాలను నిర్వర్తించటం.*
7. *తనకోసం సమాజ హితం కోసం సత్యజ్ఞాన అన్వేషణ చేయటం.*
8. *సమాజ క్షేమం కోసం సర్వదా తీవ్ర పరిశ్రమ చేయటం.*
9. *దాంబికాలు ప్రదర్శించకుండా, ప్రతీ సామాన్యునికీ సులభంగా లభ్యమవటం.*
10. *మనసా, వాచా, కర్మణా హింస చేయకుండా ఉండటం.*
11. *త్రికరణ శుద్ధితో సత్య స్వరూపుడై ఉండటం.*
12. *కోపం మొదలైన ఆరు దుర్గుణాలను అదుపులో ఉంచుకోవటం.*
13. *సమాజ హితం కోసం తన సర్వస్వం పరిత్యాగం చేయగలిగి ఉండటం.*
14. *నిశ్చల మనస్సు కలిగి ఉండటం.*
15. *దుష్ప్రచారాలను, వదంతులను వ్యాప్తి చేయక, చాడీలు చెప్పక ఉండటం – వాటి ప్రభావానికి లొంగక పోవటం.*
16. *అర్హులైన వారిపై దయచూపటం.*
17. *ఏ విషయంలోనూ అతిగా లీనమై పోకుండా ఉండటం, దానివల్ల*

అనవసరంగా ప్రభావితులు కాకుండా ఉండటం.

18. తనను ఆశ్రయించిన వారి బాధలను వాళ్ళ కోణంలో చూసే (Empathy) మనస్సు కలిగిఉండటం.
19. సిగ్గుతో తలవంపులు తెచ్చేపనులు తాను చేయకుండా, చేసేవారినీ కూడా నివారించటం.
20. ఏదైనా సత్కార్యం (మంచిపని) చేసేటప్పుడు అవసరమా? లేక అనవసరమా? అనే మనోచపలం (ఊగిసలాట) లేకుండటం.
21. పలు సమస్యలను పరిష్కరించే జ్ఞానం కలిగియుండి తేజస్విగా ప్రకాశించటం.
22. భూమాత లాగ ఓర్పు, సహనం, క్షమాగుణం కలిగి ఉండటం.
23. దీర్ఘకాల ధారణశక్తి (Memory) కలిగి ఉండటం.
24. శుచి, శుభ్రత, క్రమశిక్షణలతో వ్యవహరించటం.
25. ఎవరికీ ద్రోహం తలపెట్టకుండా ఉండటం, తనకు, సమాజానికి ద్రోహం తలపెట్టిన వారిని సహించక ఉండటం.
26. తనకు తాను చాలా గొప్పవాడినని భావించుకొంటూ, అహంకారంతో వ్యవహరించకుండా ఉండటం.

ఈ ఇరవైఆరు లక్షణాలను విశ్లేషించి చూసుకుంటే సంస్కారాలు వికసిస్తాయి. అలాంటి సంస్కారవంతులు ఉత్తమ నాయకులుగా ఎదుగుతారు" అన్నది గీతాచార్యుని సందేశం.

✦

**ఆచరణ వేదాంతం**

శ్లో॥ **ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।**
**సుఖం వా యదివా దుఃఖం స యోగీ పరమో మతః॥**(భగవద్గీత 6/32)

*అర్జునా! తననే ఉదాహరణంగా తీసికొని ఎవడు సుఖాన్ని గాని, దుఃఖాన్ని గాని అందరి విషయంలో ఒకే విధంగా చూస్తాడో అతడే పరమ యోగి అని నా (పరమాత్మ) అభిప్రాయం. నేను నాకు సుఖం కావాలని కోరుకొన్నట్లే, ఇతరులూ కోరుకొంటారు. నాకు దుఃఖం కలగకూడదని, నేను అనుకొన్నట్లే ఇతరులు అనుకొంటారు– అనే విషయం మరచిపోకుండా వ్యవహరించాలి.*

*ఇది గీత నేర్పుతోన్న ఆచరణ వేదాంతం !!*

*Team Building*

## 28. ఋగ్వేదం అందించిన విజయ రహస్యం

**ఋగ్వేద మంత్రాలలో చెప్పిన సమైక్య సూత్రబద్ధులైన సహచరుల సహకారంతో విజయం సాధించటానికి నాయకుడు శ్రమించాలి. ఇదే ఆ ఐకమత్య మంత్రం.**

**క**లిసి పనిచేసే ధోరణిని వృద్ధి చేసుకొమ్మని హితవు పలికే మంత్రాలు ఋగ్వేదంలో కనిపిస్తాయి.

పదవ మండలంలోని 191వ సూక్తంలో ఉన్న ఈ మంత్రాన్ని ఐకమత్య సూక్తం, సౌమనస్య సూక్తం, సంజ్ఞాన సూక్తం అనే పేర్లతో పిలుస్తారు.

సమస్త ప్రాణులలో ఐకమత్యం నిర్మాణం చేయటం ఈ మంత్రోచ్చారణకు లక్ష్యం.

భగవంతుడు ఒక బృందాన్ని ఉద్దేశించి చెప్పిన హితవుగా భావించదగిన మంత్రం.

కొన్ని సంస్థలు, రాజకీయ పార్టీలు, వ్యాపార సంస్థలు మఖలో పుట్టి పుబ్బలో కనుమరుగవుతూంటాయి. దానికి కారణాలు అనేకం.

✦ బృందంలో ఉన్న సభ్యుల ఆలోచన ఒకే లక్ష్యబద్ధం కాకపోవటం,

✦ సభ్యులందరి హృదయస్పందన ఒకటిగా లేకపోవటం.

✦ సంస్థాగత ప్రగతి అందరి సమష్టి బాధ్యత అని గ్రహించకపోవటం.

ఈ మూడు కారణాల వలన అనుకొన్న లక్ష్యం సాధించలేకపోతున్నారు.

విధానసభలలో సభ్యులు తగవులాడుకొంటున్నా, వ్యాపార సంస్థలలో భాగ స్వాముల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోతున్నా అందుకు కారణం ఈ ఋగ్వేద మంత్ర స్ఫూర్తిని సక్రమంగా అనుసంధానం చేసుకోలేకపోవటమే.

అందువల్ల ఋగ్వేద మంత్రాలలో చెప్పిన సమైక్య సూత్రబద్ధులైన సహచరుల సహకారంతో విజయం సాధించటానికి నాయకుడు శ్రమించాలి.

ఇదే ఆ ఐకమత్య మంత్రం.

**సంగచ్ఛధ్వం సంవదధ్వం సంవో మనాంసి జానతామ్ ।**
**దేవా భాగం యథాపూర్వే సంజానానా ఉపాసతే ॥**
**సమానో మంత్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్।**
**సమానం మంత్రమభిమంత్రయే వః సమానేన వో హవిషా జుహోమి॥**
**సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః ।**
**సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి ॥**
**ఓం శాంతిః శాంతిశ్శాంతిః**

*"ఒకరితో ఒకరు కలుస్తూ ఉండండి; మాట్లాడుకొనండి; మీ మనస్సులలోని ఆలోచనలన్నీ ఒకే విధంగా ఉండాలి.*

*పూర్వం దేవతలందరూ ఏ విధంగా ఐక్యమత్యంతో ఉండేవారో ఆ విధంగా ఉంటూ ఎవరి వాటాలు వాళ్లు అనుభవించండి.*

*మీ అందరి లక్ష్యాలు ఒకే విధంగా ఉండాలి. ఆలోచనలు ఒకే విధంగా ఉండాలి. మీ అందరికీ ఉపయోగించే లక్ష్యాన్ని మీ ముందు ఉంచుతున్నాను. మీ అందరికీ సంబంధించిన హోమద్రవ్యంతో హోమం చేస్తున్నాను.*

*మీ మనస్సులు ఒకే విధంగా ఉండి మీరందరూ సుఖంగా ఉందురుగాక!"*

**ఆధునిక అన్వయం**

పై మంత్రాల సారాంశము, భావనలు– మేనేజ్‌మెంట్ కోర్సులలో(MBA), Team Management, Coherent Leadership ఇత్యాది వివిధ పేర్లతో నేర్ప బడుతున్నాయి. తరువాత పుటలో పై మంత్రాల భావనాత్మక, సందర్భానుసార తెలుగు అనువాదంతో పాటు తరచుగా వాడే ఆంగ్ల పదాలు ఇవ్వబడ్డాయి.

✦

- ✦ కలసికట్టుగా ధర్మపథంలో నడవండి !

  – RIGHTEOUS CONDUCT

- ✦ ఏక కంఠంతో మాట్లాడండి !

  – CLARITY OF EXPRESSION

- ✦ సమాలోచన చేయండి !

  – UNITY OF THOUGHT

- ✦ దేవతల వలె భాగస్వామ్యంతో వ్యవహరించండి !

  – PROGRESSIVE PARTNERSHIP

- ✦ మనస్ఫూర్తిగా, చిత్తశుద్ధితో కలిసి మెలగండి !

  – CLARITY OF INTENT

- ✦ లక్ష్యసాధనలో ఏకాభిప్రాయం కలిగి ఉండండి !

  – COLLECTIVE COMMITMENT

- ✦ 'స' హృదయంతో 'సు' హృదయంతో స్పందించండి !

  – CORDIAL RELATIONSHIP

- ✦ సమభావంతో, సంకల్పబలంతో కార్యసిద్ధిని పొందండి !

  – UNITY OF ACTION

- ✦ ధర్మపథంలో నడచి, 'విజయపథాన్ని'
  పరస్పర సహకారంతో సాధించెదరు గాక!

  – VICTORY ON RIGHT PATH

*Leadership*

## 29. కోపానికి బ్రేకులు ఉండాలి

**దుఃఖం కారణంగా కోపం వచ్చినప్పుడు మనల్ని అనునయించి, నచ్చచెప్పి, కోపాగ్నిని చల్లార్చే నేస్తం దగ్గరుండటం అత్యంత అవసరం. లేకుంటే ఎన్నో అనర్థాలు జరుగుతాయి.**

**ఓ** గ్రామంలోని దేవాలయం దగ్గర ఓ పాము నివసిస్తూ ఉండేది.

యాత్రికులందరికీ భయం కలిగించేలా ప్రవర్తించేది. ఎవరో ఒకర్ని కాటు వేసేది.

ఆ గ్రామానికి తన యాత్రలో భాగంగా ఓ సాధువు వచ్చాడు. గ్రామస్థులు సర్పబాధని గురించి చెప్పారు.

అప్పుడు ఆ సాధువు తన మహిమతో పామును పిల్చాడు – మందలించాడు. సాధువుగా బ్రతకమని ఆదేశించారు.

అందుకు పాము అంగీకరించింది. మరి కొన్నాళ్లకు అదే గ్రామానికి విచ్చేసిన ఆ సాధువుకు పాము కళ్లపడింది.

గాయాలతో చిక్కి శల్యమైవుంది.

"స్వామీజీ! మీరు చెప్పినట్లే అహింసా వ్రతం పాటిస్తున్నాను. కానీ స్వామి! నన్ను అందరూ రాళ్లతో కొడుతున్నారు" అని తన బాధను వెళ్లబోసుకొంది. దానికి సాధువు "నిన్ను కరవవద్దని అన్నాను గాని, బుస కొట్టవద్దని అనలేదే – కోపాన్ని నటించు" అన్నాడు.

**రామునికి కోపం వచ్చింది..**

శ్రీరాముని గుణాల్లో 'జితక్రోధః'- కోపాన్ని జయించినవాడు- అంటూనే "కోపమొస్తే దేవతలే భయపడేటంతటివాడు"-అని వాల్మీకి అన్నాడు.

దీని అంతరార్థం - ధర్మగ్లాని కలిగించే అధర్మ శక్తుల పట్ల ఆగ్రహం చూపించాలి! మనోవికారం వల్ల పుట్టిన కోపాన్ని జయించాలి. శ్రీరాముడు సీతాపహరణం తర్వాత అడవి అంతా వెతుకుతూ, దుఃఖపడుతున్నాడు. సీతకు ఎవరు హాని తల పెట్టారో తెలియక అయోమయంలోపడి ఆగ్రహోదగ్రుడయ్యాడు.

"సీతాదేవిని క్షేమంగా నాకు అప్పగించకపోతే ఈ క్షణంలోనే నా పరాక్రమం చూపిస్తాను" అంటూ ఉగ్రుడయ్యాడు.

"ఇప్పుడే నా బాణాన్ని సంధించి, యక్షులను, గంధర్వులను, రాక్షసులను, మానవులను నశింపజేస్తాను. సూర్యచంద్రులు ఉదయించకుండా చేస్తాను. వాయువును స్తంభింపజేస్తాను. నదులను, సముద్రాలను ఇంకింపజేస్తాను. మూడు లోకాల రూపంలో ఉన్న ఈ జగత్తుని నశింపజేస్తాను".

ఎంతో రోషంతో, తీవ్రమైన కోపంతో మాట్లాడాడు శ్రీరాముడు.

"ఇంద్రియ నిగ్రహం కలిగినవాడై, దయాపరుడనై ఉండటం వల్ల నన్ను దేవతలు "పరాక్రమ శూన్యుడు అనుకొంటున్నారు" అని అన్నాడు.

మానవ సహజమైన కోపం ఆయననూ వరించింది. భూదేవితో సమానమైన ఓర్పు ఉన్న వారికే కాలాగ్నితో సమానమైన కోపం వస్తుంది. అటువంటి కోపాన్ని చూస్తే సముద్రుడు గడగడలాడాడు, సుగ్రీవుడు వణికిపోయాడు.

అంతకుముందు అనేకసార్లు తనకి వచ్చిన కోపాన్ని పోగొట్టిన అన్నగారైన రాముని కోపాన్ని చల్లార్చే పని ఈసారి లక్ష్మణునిపై పడింది!

రాముని కోపాన్ని శాంతింపజేయటానికి, ఓదార్చటానికి లక్ష్మణుడు చాలా చక్కగా మాట్లాడటం ఈ ఘట్టంలో వాల్మీకి వర్ణించాడు.

దేవేంద్రుడు యయాతిని స్వర్గలోకం నుంచి పడదోసిన కథను, వసిష్ఠ మహర్షి నూరుగురు పుత్రులు ఒకే రోజు విశ్వామిత్రునిచే చంపబడిన కథను గుర్తు చేశాడు లక్ష్మణుడు.

"అంతా దైవనిర్ణయం ప్రకారం జరుగుతుందనే ఎరుక నీ దుఃఖాన్ని దూరం

చేస్తుంది, ఏమిచేయాలో ఆలోచింపజేస్తుంది” అంటూ హితవు పలికాడు లక్ష్మణుడు.

శ్లో॥ **సుమహాన్త్యపి భూతాని దేవాశ్చ పురుషర్షభ ।**
**న దైవస్య ప్రముంచన్తి సర్వభూతాని దేహినః ॥**

(రామాయణం–అరణ్యకాండం, 66/11)

*ఓ పురుష శ్రేష్ఠుడా! చాలా గొప్పవైన పంచభూతాలు, దేవతలు, అన్ని ప్రాణులు, అందరు దేహధారులు ఎవరైనా దైవశక్తి నుంచి తప్పించుకోలేరు.*

మంచి మాట ఎవరు చెప్పినా గ్రహించే లక్షణమున్న రాముడు, తాను పెద్ద వాడినని అహంకరించక లక్ష్మణుడు చెప్పిన మాటలు గ్రహించాడు. కోపాన్ని ఉపసంహరించుకొన్నాడు.

**లక్ష్మణునికి కోపం వచ్చింది**

అంతకు ముందు అయోధ్యలో ఉండగా లక్ష్మణునికి తీవ్ర కోపం వచ్చింది.

రామ వనవాస వార్త విన్న కౌసల్య దుఃఖాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. తండ్రిపై తన ఆగ్రహాన్ని ప్రదర్శించాడు.

“రాముణ్ణి అన్యాయంగా, అకారణంగా అరణ్యానికి పంపిస్తున్న తండ్రి దశరథుడు మనకు శత్రువుగా ప్రవర్తిస్తున్నాడు. అతనిని బంధిస్తాను. అవసరమైతే వధిస్తాను. రాముణ్ణి రాజును చేస్తాను’ అంటూ ఊగిపోయాడు.

దీనికి జవాబుగా శ్రీరాముడు స్నేహపూర్వకంగా లక్ష్మణునితో మాట్లాడాడు “అరణ్యవాసానికి కారణం దైవ నిర్ణయమే” అని చెబుతూ ఇలా అన్నాడు.

శ్లో॥ **కశ్చ దైవేన సౌమిత్రో యోద్ధుముత్సహతే పుమాన్ ।**
**యస్య న గ్రహణం కించిత్ కర్మణోఽన్యత్ర దృశ్యతే ॥**

(అయోధ్యా కాండం: 22/21)

*“లక్ష్మణా! దైవం నడిపించునట్లుగా ప్రవర్తించటం తప్ప, దాన్ని నిగ్రహించటానికి వేరు ఉపాయం లేదు. దైవాన్ని ఎదుర్కోవటం ఎవరి శక్యం?”.*

“సుఖదుఃఖాలు, భయక్రోధాలు, లాభనష్టాలు, ఇవన్నీ దైవ ప్రేరితాలే! ప్రారంభించిన పనికి అడ్డుగా, ఊహించరాని విధంగా, అకస్మాత్తుగా ఏదైనా వచ్చిపడితే అది దైవ సంకల్పం అని తెలుసుకోవాలి” అని నచ్చచెప్పాడు.

లక్ష్మణుడు మెత్తబడ్డాడు. కోపాన్ని నిగ్రహించుకొన్నాడు.

దుఃఖం కారణంగా కోపం వచ్చినప్పుడు మనల్ని అనునయించి, నచ్చచెప్పి, కోపాగ్నిని చల్లార్చే నేస్తం దగ్గరుండటం అత్యంత అవసరం. లేకుంటే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. కోపంలో ఉన్న నాయకుడు తనకు నమ్మకస్థుడైన వానితో, హితైషితో ఆ దుఃఖాన్ని పంచుకొని, సలహా పొందాలి. కోపంలో ఆలోచన నశిస్తుంది. కోపం వచ్చిన సమయంలో ఉత్తరాలు వ్రాయటం, ఫోను చేయటం (మెసేజ్ పంపటం) వల్ల సమస్యలు జటిలమవుతాయి జాగ్రత్త!

✦✦✦

**నాయకుడు కోపాన్ని నిగ్రహించుకోవాలి.**

*మండుతున్న అగ్నిని నీటితో ఆర్పివేసినట్లు, పుట్టిన కోపాన్ని ఎవరు అణచు కొంటారో వారే ఉత్తమమైన నాయకులు.*

కోపాన్ని నిగ్రహించుకోకపోతే వచ్చే ప్రమాదాలను హనుమంతుడు రామాయణం లో ఇలా వివరించాడు.

శ్లో॥ **క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి**
**క్రుద్ధః పరుషయా వాచా నరః సాధూనధిక్షిపేత్ ॥**

(సుందరకాండం - 55/4)

*కోపించినవాడు ఏ విధమైన పాపం చేయటానికైనా సిద్ధపడతాడు. కోపించినవాడు పెద్దలు అని కూడా చూడకుండా వారిని చంపేస్తాడు. కోపించిన నరుడు సత్పురుషులను కూడా పరుషమైన మాటలతో దూషిస్తాడు.*

శ్లో॥ **వాచ్యా వాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్ ।**
**నాకార్యమస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్ ॥**

(సుందరకాండం - 55/5)

*మితిమీరి కోపించినవానికి ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో ఎప్పటికీ తెలియదు. కోపంతో ఉన్నవారు ఏ పని చేయాలో, ఏ పని చేయకూడదోనన్న విచక్షణ కోల్పోతారు.*

"అందుకని మంచి మనిషి ఓర్పు కలిగి ఉండాలి. పాము తన కుబుసాన్ని వదిలివేసే విధంగా పుట్టిన కోపాన్ని వదిలివేయాల"ని హనుమంతుడు చెప్పాడు.

✦✦✦

**కోపిష్టులలో రకాలు...**

కోపం ఎప్పుడు, ఎందుకు వస్తుంది? ఎవరైనా మనం అనుకొన్నట్లుగా నడవక పోయినా, అనుకొన్న ప్రణాళికకు నష్టం కల్గించినా, తనకు విరుద్ధంగా ప్రవర్తించినా, వారిపై కోపం వస్తుంది. (తప్పు చేసిన వారిని సరైనదారిలో పెట్టడమే లక్ష్యంగా ఉత్తములు కోపం ప్రదర్శిస్తారు.) వారికి కోపం వచ్చినా ఒక క్షణకాలమే ఉండి, మనస్సులోంచి వెళ్ళిపోతుంది.

కోపం ఎంతసేపు ఉంటుందో అన్నదాన్నిబట్టి మనుష్యుల వ్యక్తిత్వాలని కవి వర్గీకరించారు ఈ శ్లోకంలో..

**శ్లో ॥ ఉత్తమే తు క్షణం కోపో**
**మధ్యమే ఘటికాద్వయమ్ ।**
**అధమే స్యాదహోరాత్రం**
**పాపిష్ఠే మరణాన్తకమ్ ॥** – *భోజ చరిత్ర*

*ఉత్తములైన వారికి కోపం వచ్చినా క్షణకాలమే ఉండి తగ్గిపోతుంది. మధ్యములకు వచ్చిన కోపం రెండు ఘడియలు (ఘడియ అంటే 24 నిమిషాలు) అధములైన వారికి కోపం ఒక రాత్రి, ఒక పగలు ఉంటుంది. ఇక జీవితాంతం కోపాన్ని మనస్సులో ఉంచుకొనేవారు పాపిష్ఠులు, రాక్షస ప్రవృత్తి వారిది.*

✦

**వీడే అసలు శత్రువు**

ధర్మరాజును యక్షుడు ఇలా ప్రశ్నించాడు–

**కః శత్రుర్దుర్జయః** – మనుష్యులు జయించలేని శత్రువులెవరు?

యుధిష్ఠిరుడిలా జవాబు చెప్పాడు :–

**క్రోధః సుదుర్జయః** – క్రోధం జయింపలేనిశత్రువు.

“కోపాన్ని నటించాలి”

“కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి” అన్నారు పెద్దలు.

కోపాన్ని నిగ్రహించుకొనే అభ్యాసం చేసుకొంటూ ఉత్తములుగా జీవించటానికి ప్రయత్నించాలి.

*Strategy*

## 30. వీర సైనికుడా! విజయోస్తు

**సైనికులను రక్షించటం పాలకుల ప్రధాన బాధ్యతలలో ఒకటి. "దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించటానికి కూడా సిద్ధంగా ఉన్న సైనికుల జీత భత్యాలు సమయానికి అందేలా చూస్తున్నావా? వారి అవసరాలు తీరుస్తున్నావా?" అని ప్రశ్నించాడు నారదమహర్షి ధర్మరాజును.**

**అ**ది 2019వ సంవత్సరం.

ముప్పయి ఆరు సంవత్సరాల ఓ యువకుని పేరు మన దేశంలోనే కాదు, ప్రపంచమంతా మార్మోగి పోయింది.

అతడు భారత వైమానిక దళానికి చెందిన పైలట్‌గా సేవలు అందిస్తున్న 'వింగ్ కమాండర్'.

పాకిస్తాన్ దురాక్రమణను తిప్పికొట్టిన ధీరుడు. 2019వ సంవత్సరం ఫిబ్రవరి ఇరవై ఒకటవ తేదీన ఈ సాహసి 'మిగ్ 21' యుద్ధ విమానంలో శత్రువుల జెట్ విమానాన్ని తరుముతున్నాడు.

శత్రువు ఉపయోగించిన క్షిపణి (మిస్సైల్) మన విమానానికి తగిలింది. విమానాన్ని నడిపిస్తున్న ఆ సాహసవీరుడు పారాచూట్ ఆధారంగా నేలపై దిగాడు.

అది శత్రుదేశ భూభాగం. అక్కడున్న ఆకతాయి యువకులు ఈయన్ని శారీరకంగా హింసించారు. నానా దుర్భాషలాడారు. అయినా ఆ భారత వీరుడు చలించలేదు.

ఈ సాహస కార్యానికి సంబంధించిన దృశ్యమాధ్యమ

ప్రసారాలు బాగా ప్రచారం పొందాయి.

మన ప్రభుత్వానికి ఈయన వివరాలు తెలిశాయి.

యుద్ధఖైదీగా పట్టుబడినవారిని అప్పగించటం దౌత్య ధర్మం. కానీ పాకిస్థాన్ ఎన్నోసార్లు ఈ నియమాన్ని ఉల్లంఘించింది.

ఈ యుద్ధఖైదీని, ఈ వీరజవాన్‌ను విడిపించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం తెర వెనుక ఏం చేసిందో తెలియదు. శత్రుదేశం కక్కలేక మింగలేక అన్న పరిస్థితుల్లో ఆ వీరుణ్ణి విడిచిపెట్టింది.

అరవై గంటలలో విడిచిపెట్టాల్సిన పరిస్థితుల్ని మన దేశ నాయకత్వం కల్పించ గలిగింది.

శత్రువుల నిర్బంధం నుంచి మన వీరుడిని విముక్తం చేయగలిగిన మన ప్రభుత్వ విజయ వ్యూహం అభినందనీయం. తరతరాలకు మార్గదర్శకం.

క్షేమంగా భారత్ చేరిన ఆ యువకుణ్ణి 'వీర చక్ర'తో గౌరవించుకొన్నాం.

అతనే భారతీయుల గుండెల్లో సదా నిల్చి వుండే 'వింగ్ కమాండర్' అభినందన్ వర్ధమాన్.

2019 ఫిబ్రవరి రెండవ తేదీన పాక్ కబంధ హస్తాలనుంచి విముక్తుడయ్యాడు. మన దౌత్యబలం ధ్రువపడింది.

2019 మార్చి ఒకటవ తేదీ నాడు భారత్‌కి తిరిగి వచ్చాడు. ఈ సైనికుణ్ణి, ఈ వీరుణ్ణి రక్షించుకోవటం కోసం మన ప్రభుత్వం అమలు జరిపిన రణనీతి అభినందనీయం!!!

సైనికులను రక్షించటం పాలకుల ప్రధాన బాధ్యతలలో ఒకటి. "దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించటానికి కూడా సిద్ధంగా ఉన్న సైనికుల జీత భత్యాలు సమయానికి అందేలా చూస్తున్నావా? వారి అవసరాలు తీరుస్తున్నావా?" అని ప్రశ్నించాడు నారదమహర్షి ధర్మరాజును.

శ్లో॥ **కచ్చిత్ బలస్య తే ముఖ్యాః సర్వయుద్ధవిశారదాః ।**
**ధృష్టావదాతా విక్రాంతాః త్వయా సత్కృత్య మానితాః ॥**

(మహా భారతం, సభా పర్వం 5/48)

*నీ సైన్యంలో ప్రధానులైన దళపతులు నిర్భీతులై, యుద్ధ విశారదులై, నిష్కపటులై,*

*పరాక్రమవంతులై ఉన్నారా? యథోచిత సత్కారాలు చేసి వారిని గౌరవించి తృప్తిని కలిగిస్తున్నావా?*

శో॥ **కచ్చిత్ బలస్య భక్తం చ వేతనం చ యథోచితమ్ ।**
**సంప్రాప్తకాలే దాతవ్యం దదాసి న వికర్షసి ॥**

(మహాభారతం, సభా పర్వం 5/49)

*నీ సైన్యానికి యథోచితంగా భోజన సదుపాయం, వేతనం, సకాలానికి అందేటట్లు చేస్తున్నావా? వారి వేతనాలు అలస్యం కాకుండా, తక్కువ కాకుండా అంద జేస్తున్నావా?*



**భా**రత ప్రభుత్వం 2020–21 వార్షిక బడ్జెట్‌లో పదవీ విరమణ చేసిన సైనికుల కోసం రూ॥ 113,278 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది సైన్యం పొందే జీతాలకన్నా (రూ॥ 111,294 కోట్లు) ఎక్కువ.

పార్లమెంట్‌లో, 2016 నవంబర్‌లో అడిగిన ఓ ప్రశ్నకు జవాబుగా రక్షణ మంత్రి, పింఛను పొందుతున్న వ్యక్తుల సంఖ్య (చనిపోయిన సైనికుల కుటుంబ సభ్యులు మొదలైనవారు) ఇరవై లక్షల ఆరువేల మందిగా పేర్కొన్నారు. ఇది పనిచేస్తున్న పదిలక్షల మంది సైనికుల కంటే దాదాపు రెట్టింపు సంఖ్య. 'ఒకటే ర్యాంకు ఒకటే పింఛను' పథకం 2014లో అమలు పరచాక మాజీ సైనికుల పింఛను గణనీయంగా పెరిగింది.

# స్వధర్మం

**శ్లో॥ స్వధర్మాచరణం శక్త్యా విధర్మాచ్చ నివర్తనమ్ ।**
**దైవాల్లబ్దేన సంతోష ఆత్మవిచ్చరణార్చనమ్ ॥**

*(భాగవతం 3-28-2)*

*యథాశక్తి తన ధర్మాన్ని ఆచరించటం, అధర్మానికి దూరంగా ఉండటం, ప్రారబ్ధానుసారంగా లభించిన దానితో సంతృప్తిని చెందటం, ఆత్మ జ్ఞానుల పాదాలను పూజించటం అనే నాలుగూ ఉత్తమ మానవుని కర్తవ్యాలు.*

✦✦✦

*ప్రతి పౌరుడు తనకు నిర్దేశించిన కర్తవ్యాన్ని బాధ్యతతో చేసుకొంటూ పోవాలి.*

*తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమగా పెంచటం, వాళ్లకు విద్యాబుద్ధులను నేర్పించటం మొదలైనవి కర్తవ్యాలు.*

*భార్యాభర్తల మధ్య అనురాగం స్వధర్మం. భార్య కంట కన్నీరు పెట్టకుండా చూడటం భర్త ధర్మం. భర్తకు ప్రేమతో సహకరించటం భార్య ధర్మం.*

*హక్కుల పోరాటంలోపడి మనం స్వధర్మాన్ని విస్మరించరాదు.*

*ప్రతివ్యక్తికి తన స్థానాన్ని బట్టి తన ధర్మం తెలుస్తూనే ఉంటుంది.*

*సమాజధర్మం కూడా స్వధర్మమే. ఉద్యోగికి కార్యాలయాలలో నిర్దేశించిన పని భగవదారాధనే అని విస్మరించరాదు.*

*గృహస్థులకు మహాత్ములతోడి సంగం, వారి శుశ్రూష కూడా కర్తవ్యాలు.*

**- స్వామి తత్త్వవిదానంద సరస్వతి**

(భాగవత సప్తాహం)

## ఈ పుస్తక రచనలో ఉపకరించిన ప్రధాన గ్రంథాలు


1. **శ్రీమద్వాల్మీకి మహర్షి ప్రణీత శ్రీమద్రామాయణం**
   ఆచార్య శ్రీ  పుల్లెల శ్రీరామచంద్రుడుగారు రచించిన బాలానందినీ వ్యాఖ్యతో కూడినది. ఆర్ష విజ్ఞాన ట్రస్టు వారి ప్రచురణ (1998 – ద్వితీయ ముద్రణ)
2. **మహాభారత సారసంగ్రహం:** ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు (జయలక్ష్మీ పబ్లికేషన్ – 2012)
3. **కౌటిలీయమ్ అర్థశాస్త్రం – ఆంధ్ర వ్యాఖ్య బాలానందినీతో**
   వ్యాఖ్యాత ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు. (శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్ – 2016)
4. **Half - Lion**
   How PV Narasimha Rao Transformed India, Vinay Sita Pati
5. **శ్రీ మహాభారతము**
   (డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, డాక్టర్ సూరం శ్రీనివాసులు సంపాదకత్వంలో) గీతాప్రెస్, గోరఖ్‌పూర్‌చే ప్రచురించబడినది (2018).
6. **భాగవత సప్తాహం–స్వామి తత్త్వవిదానంద సరస్వతి – బ్రహ్మవిద్యా కుటీర్**
7. **శివాజీ – స్వరాజ్యం నుంచి సురాజ్యందాకా :** శ్రీ అనిల్ మాధవ ధవే హిందీ రచనకు శ్రీ రాకా సుధాకరరావు గారి అనువాదం, శివాజీ స్ఫూర్తి కేంద్ర ప్రచురణ, 2018.
8. **శ్రీవివేకానంద శిలాస్మారక నిర్మాణగాథ,** శ్రీమతి నివేదిత ఆంగ్ల రచనకు శ్రీ వి.వి.సుబ్రహ్మణ్యం అనువాదం, భారత్ ప్రకాశన్ ట్రస్ట్ ప్రచురణ (2013).
9. **...ఏష ధర్మః సనాతనః** – బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి రచన. ఋషిపీఠం ప్రచురణ (2012).
10. **కౌండిన్యస్మృతి.** – ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారి రచన, శ్రీ గోపాల్ ప్రచురణలు(2004)

## శాంతి మంత్రం

**స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం**
**న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।**
**గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం**
**లోకాః సమస్తాః సుఖినో భవన్తు ॥**

ప్రజలందరికి క్షేమం అగుగాక! రాజులు (పాలకులు) న్యాయసమ్మతమైన మార్గంచేత భూమండలాన్ని పాలింతురుగాక. గోవులకూ, బ్రాహ్మణులకూ నిత్యమూ శుభం కలుగుగాక! భూలోకమునకే కాదు అన్ని లోకాలకి సుఖం కలుగుగాక!

✦✦✦

**సర్వే భవంతు సుఖినః**
**సర్వే సంతు నిరామయాః ।**
**సర్వే భద్రాణి పశ్యంతు**
**మా కశ్చిద్దుఃఖభాగ్భవేత్ ॥**

*అందరూ సుఖంగా ఉండాలి – అందరూ ఆరోగ్యంగా ఉండాలి. అందరూ శుభాలనే చూడాలి. ఏ ఒక్కడు దుఃఖితుడు కాకూడదు.*

✦✦✦

**శ్లో॥ ప్రవర్తతాం ప్రకృతిహితాయ పార్థివః**
**సరస్వతీ శ్రుతిమహతాం మహీయతామ్ ।**
**మమాపి చ క్షపయతు నీలలోహితః**
**పునర్భవం పరిగతశక్తిరాత్మభూః ॥**

(అభిజ్ఞానశాకుంతలం 7/35)

*పాలకులు ప్రజాహితకరమైన పనులనే చేయుదురు గాక! భాషాజ్ఞాన సరస్వతి (సర్వత్ర) పూజింపబడుగాక! అర్ధనారీశ్వర స్వరూపుడైన పరమేశ్వరుడు నాకు జన్మరాహిత్యరూప మోక్షమును ప్రసాదించుగాక!*

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# విజయ పథం

మూల శాసనాలనుంచి మౌలిక విజయసూత్రాలు

సంకలనం-వ్యాఖ్యానం
బి.ఎస్.శర్మ


## నిశీథిలో సూర్యకిరణాలు

ఇందులో లౌక్యం వుంది...
ఇందులో రాజనీతి వుంది...
ఇందులో సనాతన ధర్మం వుంది...
ఇందులో కలియుగ న్యాయం వుంది...
ఇందులో హేతుబద్ధత వుంది...
ఇంకా
మనిషి మనస్సాక్షి (దాగి) వుంది.
ఒక్క వాక్యంలో చెప్పాలంటే...
దేశంలో
అనేక స్థాయిలలో
అనేక సంస్థలలో
అనేక ప్రభుత్వ యంత్రాంగాలలో వ్యవస్థలు
గమ్యం తెలియని
నిశీథిలో పయనించే
ఏ కాలంలోనయినా
వెలుగు చూపి మార్గదర్శనంచేసే
'సూర్యకిరణాల' వంటి
కాంతి పదాల సమాహారం
ఈ **'విజయపథం'**

**– వల్లీశ్వర్**

డైరక్టర్,'భారత్ టుడే'
*valliswarg@gmail.com*

సభక్తికంగా సమర్పిస్తున్న వారు :



శాంతా వసంతా ట్రస్టు
హైదరాబాద్